
సత్యమేవ జయతే
సాక్షి
WWW.SAKSHI.COM
పేజీలు: 14 వెల: ₹ 5.50
సంపుటి: 16 సంచిక: 39
సోమవారం 1-5-2023
SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL


'జల ప్రాజెక్టులపై జనం ఎన్నెన్నో ఆశలు పెట్టుకున్నారు. వాళ్ల నమ్మకం వమ్ము కాకుండా పనిచేయాలి'


ముంబై మిలమిల...
రాజస్తాన్‌పై 213 పరుగుల లక్ష్యాన్ని ఛేదించిన ముంబై ఇండియన్స్. - 12లో


హెల్త్ ప్లాన్.. ఇవి తెలిస్తే..
ఆరోగ్య బీమాలోని కీలకాంశాలపై ప్రత్యేక కథనం - 13లో


మాల్దీవులకు భారత్ కానుక
మిత్రదేశం మాల్దీవులకు భారత్ గస్తీ నౌక, ల్యాండింగ్ క్రాఫ్ట్‌లను కానుకగా అందించనుంది.
- వివరాలు 6లో


మా అన్నను చూసి నేర్చుకోండి
దేశం కోసం తూటాలకు ఎదురొడ్డటానికైనా సిద్ధంగా ఉన్న తన సోదరుడిని చూసి మోదీ నేర్చుకోవాలని ప్రియాంక సూచించారు.
- వివరాలు 6లో



బ్యాక్టీరియా మేఘాలు!
ప్రమాదకరమైన బ్యాక్టీరియాను మోసుకొచ్చే మేఘాలున్నాయని కెనడా, ఫ్రాన్స్ పరిశోధకులు చెబుతున్నారు.
- వివరాలు 6లో


నకిలీ వెబ్‌సైట్లు తొలగింపు
సైబరాబాద్ సైబర్ సెక్యూరిటీ పోలీసులు ఇప్పటివరకు 100కుపైగా నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌లను తొలగించారు.
- వివరాలు 14లో


ఆదివారం రాత్రి బాణాసంచా వెలుగుల్లో నూతన సచివాలయం

పునర్నిర్మాణ ప్రతీక

నూతన సచివాలయం ప్రారంభోత్సవంలో ముఖ్యమంత్రి కేసీఆర్


సచివాలయంలో ఫైల్‌పై తొలి సంతకం చేస్తున్న కేసీఆర్

చెరువుల పునరుద్ధరణ, కాళేశ్వరం, పాలమూరు, ఇతర ప్రాజెక్టులన్నీ తెలంగాణ పునర్నిర్మాణ ప్రతీకలే.. 2లో

వేసవిలోనూ మత్తడి దూకే చెరువులే సాక్ష్యం

- బీళ్లు పడ్డ భూములన్నీ ఇప్పుడు హరిత కాంతులు వెదజల్లుతున్నాయి
- శాంతిభద్రతలను కట్టుదిట్టం చేశాం.. మతకల్లోలాల ఊసే లేకుండా చేశాం
- తలసరి ఆదాయం, విద్యుత్ వినియోగంలో దేశంలోనే టాప్‌లో నిలిచాం
- పారిశ్రామిక విధానంతో రూ. లక్షల కోట్ల పెట్టుబడులు ఆకర్షిస్తున్నాం
- ఇదే కోవలో భవితకు బాటలు వేసుకుంటామని హామీ ఇస్తున్నానన్న సీఎం

6వ అంతస్తులో.. ఫైళ్లపై సంతకం

లక్కీ నంబర్ ఆనవాయితీని కొనసాగించిన సీఎం కేసీఆర్
- వివరాలు 2లో

మంత్రులు.. తొలి సంతకాలు
అట్టహాసంగా ప్రారంభోత్సవం 2లో



సాత్విక్-చిరాగ్ జోడీ కొత్త చరిత్ర

ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్ విభాగంలో తెలుగు తేజం సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి (భారత్) జోడీ స్వర్ణం నెగ్గింది. తద్వారా భారత్ నుంచి ఈ ఘనత సాధించిన తొలి జోడీగా కొత్త చరిత్ర సృష్టించింది. ఫైనల్లో సాత్విక్-చిరాగ్ 16-21, 21-17, 21-19తో ఒంగ్ యె సిన్-తియో ఈ యి (మలేసియా)లపై గెలిచారు. 1965లో దినేశ్ ఖన్నా పురుషుల సింగిల్స్‌లో భారత్‌కు పసిడి పతకం అందించాక... 58 ఏళ్ల సుదీర్ఘ నిరీక్షణ అనంతరం మళ్లీ ఈ మెగా ఈవెంట్‌లో భారత్‌కు బంగారు పతకం లభించడం విశేషం.
- వివరాలు 12లో

ప్రశ్నపత్రాలు అమ్ముకునుడే తెలంగాణ మోడలా?

పాలమూరు నిరుద్యోగ నిరసన సభలో టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి ఫైర్

- లక్షల మంది నిరుద్యోగుల జీవితాలను బలిపెట్టారు
- నిరుద్యోగ భృతి ఇస్తామన్న హామీనీ తుంగలో తొక్కారు
- ఉమ్మడి పాలమూరు జిల్లాను కేసీఆర్ అవమానించారని ధ్వజం

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: ''రాష్ట్రంలో దుర్మార్గ పరిస్థితులు దాపురించాయి. పదో తరగతి ప్రశ్నపత్రాలు వాట్సాప్‌లో ప్రత్యక్షమవుతున్నాయి. టీఎస్‌పీఎస్సీ ప్రశ్నపత్రాలు జిరాక్స్ సెంటర్లలో దొరుకుతున్నాయి. ఇన్నాళ్లూ భూములు, కాంట్రాక్టర్ల వద్ద కమీషన్లు కొల్లగొట్టారు. ఇప్పుడు లక్షలాది మంది నిరుద్యోగుల జీవితాలను బలిపెట్టి ప్రశ్నపత్రాలు అమ్ముకుంటున్నారు. ఇదేనా తెలంగాణ మోడల్?'' అని టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి ధ్వజమెత్తారు. ప్రశ్నపత్రాల లీకేజీకి కారణం సీఎం కేసీఆర్ కుమారుడు, మంత్రి కేటీఆర్ అని ఆరోపించారు. ఆదివారం మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో నిర్వహించిన నిరుద్యోగ నిరసన ర్యాలీలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. యువతకు ఉద్యోగం ఇవ్వకపోతే నిరుద్యోగ భృతి ఇస్తామని కేసీఆర్ గత ఎన్నికల్లో హామీ ఇచ్చారని గుర్తు చేశారు. ఇప్పటివరకు యువతకు ఉద్యోగాలు ఇవ్వలేదని, నిరుద్యోగ భృతీ ఇవ్వలేదని చెప్పారు. అలాంటి
మిగతా 5వ పేజీలో ▶


మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ నిర్వహించిన నిరుద్యోగ నిరసన ర్యాలీకి హాజరైన జనం



మన్ కీ బాత్... నా ఆధ్యాత్మిక ప్రయాణం

100వ ఎపిసోడ్‌లో మోదీ భావోద్వేగం

- ఆరాధన, వ్రతం, ప్రజలిచ్చిన ప్రసాదం
- ఢిల్లీ వచ్చిన తొలినాళ్లలో నాలో ఖాళీని భర్తీ చేసింది
- ప్రజల నుంచి దూరంగా లేనన్న భావన కలిగించింది

6లో

విష వాయువులు పీల్చి 11 మంది మృతి

మరో నలుగురికి తీవ్ర అస్వస్థత
లూథియానాలో విషాదం

- పారిశ్రామిక రసాయన వ్యర్థాలను నివాస ప్రాంతంలో పారబోసిన వ్యక్తి
- మృతుల కుటుంబాలకు రూ. 2 లక్షల చొప్పున పరిహారం ప్రకటించిన పంజాబ్ సర్కార్

- వివరాలు 6లో

ఇదండీ వరస



ఆందోళనలో అన్నదాత

రోజూ దంచి కొడుతున్న అకాల వర్షాలు

- పలు మార్కెట్ యార్డుల్లో కొట్టుకుపోయిన ధాన్యం కుప్పలు
- వర్షాలకు మొలకెత్తిన ధాన్యం
- భద్రాద్రి జిల్లాలో కొనుగోలు కేంద్రంలో చోటులేక శ్మశానంలో ధాన్యం ఆరబోత
- పిడుగుపాటుకు ఇద్దరు గొర్రెలకాపరుల మృతి

జగిత్యాల/పెద్దపల్లి/రాజన్నసిరిసిల్ల: వరుసగా కురుస్తున్న వర్షాలతో అన్నదాతలు పడుతున్న అవస్థలు అన్నీఇన్నీ కావు. చాలాచోట్ల ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వర్షానికి ధాన్యం కుప్పలు కొట్టుకుపోయాయి. ఏంచేయాలో రైతులకు పాలుపోవడంలేదు. జగిత్యాల జిల్లా మల్యాల మార్కెట్ యార్డులో విక్రయానికి సిద్ధంగా ఉంచిన ధాన్యం
మిగతా 3వ పేజీలో ▶

ఆదివారం కురిసిన భారీ వర్షానికి రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగిలోని కొనుగోలు కేంద్రంలో తడిసి ముద్దయిన వరిధాన్యం ▶



రాజధానిలో మళ్లీ కుండపోత

- ఆదివారం రాత్రి ఈదురుగాలులతో భారీ వాన
- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద విద్యుత్ తీగ తెగిపడి కానిస్టేబుల్ మృతి

3లో





ఆదివారం కొత్త సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా పూజ అనంతరం హారతి తీసుకుంటున్న సీఎం కేసీఆర్ • శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ • రిబ్బన్ కట్ చేస్తున్న కేసీఆర్. చిత్రంలో మంత్రి వేముల, సీఎస్ శాంతికుమారి తదితరులు

రాష్ట్ర పునర్నిర్మాణ ప్రతీక

నూతన సచివాలయం ప్రారంభోత్సవంలో సీఎం కేసీఆర్

- చెరువుల పునరుద్ధరణ, కాళేశ్వరం, పాలమూరు, ఇతర ప్రాజెక్టులన్నీ తెలంగాణ పునర్నిర్మాణ ప్రతీకలే..
- మండు వేసవిలో కూడా మత్తడి దూకే చెరువులే సాక్ష్యం
- బీళ్లు పడ్డ భూములన్నీ ఇప్పుడు హరిత కాంతులు వెదజల్లుతున్నాయి
- శాంతిభద్రతలను కట్టుదిట్టం చేశాం.. మతకల్లోలాల ఊసే లేకుండా చేశాం

సాక్షి, హైదరాబాద్: రాజధాని నగరం నడిబొడ్డున తలెత్తుకుని నిలిచిన కొత్త సచివాలయం తెలంగాణ పునర్నిర్మాణానికి ప్రతీక అని ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు పేర్కొన్నారు. అన్ని రంగాల్లో అభివృద్ధి సాధించి, అతి తక్కువ కాలంలోనే దేశానికే ఆదర్శంగా నిలవడమే.. తెలంగాణ సాధించిన ప్రగతి అన్నారు. హైదరాబాద్‌లో హుస్సేన్ సాగర్ తీరాన నూతనంగా నిర్మించిన డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ సచివాలయాన్ని సీఎం కేసీఆర్ ఆదివారం లాంఛనంగా ప్రారంభించారు. తర్వాత ఆయనతోపాటు మంత్రులు, ఉన్నతాధికారులు తమకు కేటాయించిన చాంబర్లలో ఆసీనులై.. కొత్త సచివాలయం నుంచి తొలి సంతకాలు చేశారు. అనంతరం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో సీఎం కేసీఆర్ మాట్లాడారు. ప్రసంగం సారాంశం ఆయన మాటల్లోనే..

''తెలంగాణ అవతరణకు ముందు అనేక వాదోపవాదాలు, అనేక చర్చలు చూశాం. తెలంగాణ అవతరించిన తర్వాత కూడా పునర్నిర్మాణం కోసం అంకితభావంతో అడుగులు వేస్తున్న సందర్భంలో.. తెలంగాణ భావాన్ని, అర్థాన్ని, పునర్నిర్మాణ కాంక్షను జీర్ణించుకోలేని కొందరు పిచ్చివాళ్లు కారుకూతలు కూశారు. ఉన్నయన్ని కూలగొట్టి కడతారా? మొత్తం తెలంగాణనే కూలగొట్టి మళ్లా కడతారా? అని కొందరు మరుగుజ్జులు చిల్లర వ్యాఖ్యలు చేశారు. అవేవీ పట్టించుకోకుండా ఈ రోజు ఆకాశమంత ఎత్తుకు ఎదిగింది తెలంగాణ రాష్ట్రం.

వేసవిలోనూ మత్తడి దూకే చెరువులతో..

పునర్నిర్మాణం అంటే ఏమిటో తెలియని మరుగుజ్జులు కొన్ని విషయాలు తెలుసుకోవాలి. సమైక్య పాలనలో చిక్కిశల్యమై శిథిలమై రంధ్రాలు పడి వచ్చిన కాస్త నీటిని కూడా కోల్పోయిన పరిస్థితుల్లో.. కాకతీయ రాజుల స్ఫూర్తితో మిషన్ కాకతీయ ద్వారా చెరువులన్నింటినీ పునరుద్ధరించుకోవడమే పునర్నిర్మాణం. నాడు సమైక్య రాష్ట్రంలో గోదావరిలో నీళ్లు ఎక్కడున్నాయో వెతుక్కునే పరిస్థితి. ఇప్పుడు ఎక్కడ చూసినా నీళ్లే. ప్రపంచంలోనే అతి పెద్ద లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టు కట్టుకున్నాం. ఇదీ పునర్నిర్మాణం. ఉప నదుల మీద, వాగుల మీద నిర్మించిన చెక్‌డ్యామ్‌లతో ఎక్కడ చూసినా నీళ్లే. ఏప్రిల్, మేలో కూడా చెరువులు మత్తడి దూకడమే పునర్నిర్మాణం. నాడు నెర్రెలుబారి బీళ్లుగా మారిన లక్షల ఎకరాల తెలంగాణ భూములు.. నేడు నిండుగా వెదజల్లుతున్న హరితకాంతులే తెలంగాణ పునర్నిర్మాణం. ఈ యాసంగిలో దేశంలో 94 లక్షల ఎకరాల్లో వరి వేస్తే.. అందులో 56లక్షల ఎకరాలు తెలంగాణలోనివే. తెలంగాణ పునర్నిర్మాణం అంటే ఒక కాళేశ్వరం, ఒక పాలమూరు, ఒక సీతారామ ప్రాజెక్టు.

దేశానికే ఆదర్శంగా వెలుగుతూ..

పరిపాలనా సంస్కరణలతో, ఆచరణాత్మకంగా 33 జిల్లాలతో అలరారుతూ దేశానికే ఆదర్శంగా తెలంగాణ వెలుగుతోంది. సమ్మిళిత అభివృద్ధి, సంక్షేమంతోపాటు పారిశ్రామిక విధానంతో లక్షల కోట్ల పెట్టుబడులను ఆకర్షిస్తూ దేశంలోనే అగ్రస్థానంలో ఉంది. ఇండస్ట్రియల్, ఐటీ విధానంలో బెంగళూరును కూడా దాటేసి తారాజువ్వలా దూసుకుపోతోంది.



సీఎం కేసీఆర్ వద్ద ఆశీస్సులు తీసుకుంటున్న మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి

మత కల్లోలాల ఊసే లేకుండా..

అరాచక శక్తులను అణచివేస్తూ.. శాంతి భద్రతలను కాపాడుతూ తెలంగాణ పోలీసులు దేశానికి మార్గదర్శకులుగా మారారు. గత పదేళ్లుగా తెలంగాణలో ఒక చిన్న మత కల్లోలం కూడా లేకుండా చేశాం. మహిళలకు భరోసానిస్తూ షీ టీమ్‌లు పనిచేస్తున్నాయి.

అంతర్జాతీయ స్థాయికి హైదరాబాద్

అంతర్జాతీయ నగరాలకు దీటుగా హైదరాబాద్.. ఎన్నో ఫ్లైఓవర్లు, అండర్ పాస్‌లు, ఎన్నోరకాల సౌకర్యాలతో ముందుకుపోతోంది. నలువైపులా సూపర్ స్పెషాలిటీ హాస్పిటళ్లు, అద్భుతమైన వరంగల్ హెల్త్ సిటీ.. ఇవన్నీ తెలంగాణ పునర్నిర్మాణానికి ప్రతీకలు. భూలోక వైకుంఠంగా యాదాద్రి ఆలయ పునర్నిర్మాణం జరిగింది.

మహనీయుడి స్ఫూర్తితో..

అంబేడ్కర్, గాంధీజీ చూపిన బాటలో పోరాడి తెలంగాణ సాధించుకున్నాం. ఆకాశమంత ఎత్తున అంబేడ్కర్ విగ్రహాన్ని ఆవిష్కరించుకున్నాం. సెక్రటేరియట్‌కు వచ్చే సీఎం, మంత్రులు, అధికారులందరికీ నిత్యం బాబాసాహెబ్ ఆదర్శాలు స్ఫురణకు రావాలని, అంకితభావంతో పనిచేయాలనే ఉద్దేశంతో సచివాలయానికి ఆయన పేరు పెట్టుకున్నాం. ఇదే కోవలో భవిష్యత్తుకు బాటలు వేసుకుంటామని అందరికీ హామీనిస్తున్నాం. తెలంగాణ సాధన పోరాటంలో అసువులు బాసిన వారికి అంజలి ఘటిస్తున్నాం'' అని సీఎం కేసీఆర్ పేర్కొన్నారు.

అభివృద్ధి కొలమానాల్లో మనమే టాప్

ప్రపంచంలో అభివృద్ధిని, పునర్నిర్మాణాన్ని కొలమానంగా తీసుకునే సూచికలు రెండే రెండు. ఒకటి తలసరి ఆదాయం (పర్‌క్యాపిటా ఇన్‌కమ్), రెండోది తలసరి విద్యుత్ వినియోగం (పర్ క్యాపిటా పవర్ యుటిలైజేషన్). ఇప్పుడు తెలంగాణ రూ.3,00,017 తలసరి ఆదాయంతో దేశంలోనే నంబర్ వన్‌గా ఉంది. ఒకనాడు సగటు తలసరి విద్యుత్ వినియోగం 1,100 యూనిట్లుగా ఉంటే.. నేడు 2,140 యూనిట్లతో దేశంలోనే అగ్రభాగానికి చేరింది. ఇదే తెలంగాణ పునర్నిర్మాణం. నిరాదరణకు గురైన వృద్ధులు, ఒంటరి మహిళలు, ఎందరో బాధితులు రూ.2,016 ఆసరా పింఛన్లు అందుకుంటూ చిరునవ్వుతో బతుకుతున్నారు. తెలంగాణ పునర్నిర్మాణంలో భాగంగా చేపట్టిన సచివాలయం అద్భుతంగా రూపుదిద్దుకుంది. ఈ నిర్మాణంలో పాలుపంచుకున్న వివిధ రాష్ట్రాల కూలీలు, కార్మికులకు తెలంగాణ ప్రజల తరఫున ధన్యవాదాలు.

అడవులను తిరిగి తెచ్చుకున్నాం

నాడు క్షీణించిపోయి ఆగమైన అడవులు ఇప్పుడు అటవీశాఖ పీసీసీఎఫ్‌లు, ఇతర అధికారుల పట్టుదల, కృషితో దేశంలోనే రికార్డు స్థాయిలో పునరుద్ధరణ అయ్యాయి. కోల్పోయిన అడవులను తిరిగి తెచ్చుకోడమే పునర్నిర్మాణం. వలసపోయిన పాలమూరు కూలీలంతా తిరిగొచ్చి సొంత పొలాల గట్ల మీద కూర్చుంటే.. ఇతర రాష్ట్రాల కూలీలు తెలంగాణ పొలాల్లో పనిచేస్తున్న దృశ్యాలే తెలంగాణ పునర్నిర్మాణం. ఒకనాడు దాహంతో అల్లాడి ఫ్లోరైడ్‌తో నడుం వంగి లక్షలాది మంది జీవితాలు కోల్పోయిన తెలంగాణలో మిషన్ భగీరథ ద్వారా ఇంటింటికీ నీరందిస్తున్నాం. హైదరాబాద్ బంజారాహిల్స్ ఏ నీళ్లు ఉంటాయో.. ఆదిలాబాద్ గోండు గూడెంలో అదే నీరందిస్తున్న మిషన్ భగీరథ తెలంగాణ పునర్నిర్మాణానికి ప్రతీక.

కరెంటు వెలుగులతో..

కరెంటు ఎప్పుడు పోతుందో, ఎప్పుడు వస్తుందో తెలియక.. పారిశ్రామికవేత్తల ధర్నాలు, ప్రజల గగ్గోలు, జనరేటర్లు, ఇన్వర్టర్లు, కన్వర్టర్లతో ఉన్న రాష్ట్రంలో.. ఇప్పుడు అవన్నీ మాయమయ్యాయి. తెలంగాణ కరెంటు వెలుగుజిలుగులతో విరాజిల్లుతోంది. నాడు పొలాల బోర్లు ఆన్ చేసుకునేందుకు అర్ధరాత్రి పొలాలకు వెళ్లి కరెంటు షాకులు, పాము, తేలు కాట్లతో చనిపోయిన రైతులు.. నేడు పొద్దున్నుంచి సాయంత్రం 6 గంటల దాకా పొలాలకు నీరు పారించుకొని.. దర్జాగా ఇంటికి వచ్చి కంటినిండా కునుకుతీస్తున్నారు. ఇదీ తెలంగాణ పునర్నిర్మాణం. గ్రామాలు, పట్టణాలు ఎంత అద్భుతంగా అలరారుతున్నాయో, ఎన్ని అవార్డులు సొంతం చేసుకుంటున్నాయో అందరికీ తెలుసు.

6వ అంతస్తులో.. 6 ఫైళ్లపై సంతకం

- లక్కీ నంబర్ ఆనవాయితీని కొనసాగించిన సీఎం కేసీఆర్
- దళితబంధు తదుపరి విడత అమలుపై తొలి సంతకం
- పోడు పట్టాలు, కేసీఆర్ కిట్స్, సీఎంఆర్ఎఫ్ పంపిణీ ఫైళ్లు క్లియర్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర కొత్త సచివాలయ భవనాన్ని సీఎం కేసీఆర్ ఆదివారం మధ్యాహ్నం 1.24 గంటల సమయంలో ప్రారంభించారు. తర్వాత 6వ అంతస్తులోని తన చాంబర్‌కు వెళ్లి సీట్లో ఆసీనులయ్యారు. ఈ సందర్భంగా తన సెంటిమెంట్ లక్కీ నంబర్ 6కు తగ్గట్టుగా 6 ఫైళ్లపై సంతకాలు చేశారు.

➡ 2023–24లో దళితబంధు పథకం అమలుకు సంబంధించిన ఫైల్‌పై సీఎం కేసీఆర్ తొలి సంతకం చేశారు. ఇప్పటికే పూర్తిస్థాయిలో అమలు చేసిన హుజూరాబాద్ మినహా రాష్ట్రంలోని మిగతా 118 నియోజకవర్గాల్లో ప్రతి నియోజకవర్గానికి 1,100 మంది చొప్పున లబ్ధిదారులకు ఈ పథకాన్ని వర్తింపచేసే ప్రతిపాదనలను ఆమోదించారు.

➡ పోడుభూముల పట్టాల పంపిణీకి సంబంధించిన ఫైలుపై రెండో సంతకం చేశారు. మే నెల నుంచి జిల్లాల వారీగా పోడు పట్టాల పంపిణీ చేపట్టనున్నారు. మొత్తంగా లక్షా 35 వేల మందికి దాదాపు 3.9 లక్షల ఎకరాలకు సంబంధించి పట్టాలు ఇవ్వనున్నారు.

➡ సీఎంఆర్ఎఫ్ నిధుల పంపిణీకి సంబంధించిన ఫైలుపై సీఎం మూడో సంతకం చేశారు.

➡ గర్భిణులకు పౌష్టికాహారం అందించే.. కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌కు సంబంధించిన ఫైలుపై నాలుగో సంతకం చేశారు. రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ చేపట్టనున్నారు. ఈ ఏడాది 6.84 లక్షల మంది గర్భిణులకు 13.08 లక్షల కిట్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో కిట్ విలువ రూ.రెండు వేలు. ఈ పథకానికి ప్రభుత్వం మొత్తం రూ.277 కోట్లు ఖర్చు చేయనుంది.

➡ రాష్ట్రంలో కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు సంబంధించిన ఫైలుపై సీఎం ఐదో సంతకం సంతకం చేశారు.

➡ పాలమూరు లిఫ్టు ఇరిగేషన్‌కు సంబంధించిన ఫైలుపై ఆరో సంతకం చేశారు. కరివెన, ఉద్దండాపూర్ రిజర్వాయర్ల నుంచి నారాయణపూర్, కొడంగల్, వికారాబాద్‌లకు తాగునీటిని సరఫరా చేసే కాల్వల పనులకు పరిపాలనా అనుమతులు జారీ చేశారు.



కొత్త చాంబర్‌లో సీఎం కేసీఆర్ సమక్షంలో ఫైల్‌పై తొలి సంతకం చేస్తున్న సీఎస్ శాంతికుమారి

అట్టహాసంగా ప్రారంభోత్సవం!

- ఉదయం సుదర్శన యాగంతో మొదలు
- మధ్యాహ్నం 1.25 గంటలకు శిలాఫలకం ఆవిష్కరణ, రిబ్బన్ కటింగ్
- 1.29 గంటలకు తన సీట్లో కూర్చున్న కేసీఆర్
- 2.30 గంటలకు సభ.. 25 నిమిషాల పాటు సీఎం ప్రసంగం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర నూతన సచివాలయం ప్రారంభోత్సవం ఆదివారం అట్టహాసంగా జరిగింది. ఉదయం 6 గంటల నుంచి మధ్యాహ్నం వరకు మంత్రి వేముల ప్రశాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో సుదర్శన యాగం, చండీయాగం, వాస్తుహోమం నిర్వహించారు. మధ్యాహ్నం 1.10 గంటలకు సీఎం కేసీఆర్ సచివాలయం ప్రాంగణంలోకి చేరుకున్నారు. ఆయనకు సీఎస్ శాంతి కుమారి, మంత్రి ప్రశాంత్ రెడ్డి పుష్పగుచ్ఛం ఇచ్చి స్వాగతం పలికారు. కేసీఆర్ 1.20 గంటలకు యాగశాలకు చేరుకున్నారు. చివరి ఘట్టమైన పూర్ణాహుతి నిర్వహించి, యజ్ఞ దేవుడికి పూజతో యాగాన్ని ముగించారు. పండితుల నుంచి వేదాశీర్వచనం స్వీకరించి సచివాలయ ప్రధాన ద్వారం వద్దకు చేరుకున్నారు. మధ్యాహ్నం 1.25 గంటలకు సచివాలయ ప్రారంభోత్సవ శిలాఫలకాన్ని సీఎం ఆవిష్కరించారు. సచివాలయ ప్రధాన ద్వారం వద్ద రిబ్బన్ కట్ చేసి ప్రారంభించారు. నేరుగా ఆరో అంతస్తులోని తన చాంబర్‌కు చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. తర్వాత వేదపండితుల మంత్రోచ్చారణ మధ్య 1.29 గంటలకు తన సీట్లో కూర్చున్నారు. ఆరు ఫైళ్లపై సంతకాలు చేశారు. తర్వాత కేసీఆర్ సీఎస్ శాంతికుమారి చాంబర్‌కు వెళ్లి అభినందించారు.

సభ అనంతరం సహపంక్తి భోజనం

మధ్యాహ్నం 2.30 గంటల సమయంలో సీఎం, మంత్రులు, అధికారులు, ప్రజాప్రతినిధులు అంతా సభా ప్రాంగణానికి చేరుకున్నారు. సీఎస్ శాంతి కుమారి స్వాగతోపన్యాసం చేశారు. కొత్త సచివాలయం దేశానికే దిక్సూచిగా వెలుగొందాలని ఆకాంక్షించారు. ఈ అద్భుతమైన సచివాలయంలో మొట్టమొదటి చీఫ్ సెక్రటరీగా పనిచేసే అవకాశం రావడం గొప్ప పురస్కారంగా భావిస్తున్నట్టు పేర్కొన్నారు. సీఎం ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులందరం చిత్తశుద్ధితో పనిచేస్తామన్నారు. ఇక మధ్యాహ్నం 2.42 గంటలకు ప్రసంగాన్ని ప్రారంభించిన సీఎం కేసీఆర్.. దాదాపు 25 నిమిషాల పాటు మాట్లాడారు. సభ ముగిశాక మంత్రులు, ప్రజాప్రతినిధులతో కలిసి సహపంక్తి భోజనం చేసిన కేసీఆర్.. 3.46 గంటలకు ప్రగతిభవన్‌కు వెళ్లిపోయారు.

నేడు కొత్త సచివాలయంలో సీఎం కేసీఆర్ తొలి సమీక్ష

పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై..

సాక్షి, హైదరాబాద్: పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల పథకంపై సీఎం కేసీఆర్ సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ తెలంగాణ రాష్ట్ర సచివాలయంలోని సమావేశమందిరంలో తొలి సమీక్ష నిర్వహించనున్నారు. కరివేన, ఉద్దండాపూర్ రిజర్వాయర్ల నుంచి నారాయణ్ పూర్, కొడంగల్, వికారాబాద్‌కు వెళ్లే తాగునీటి కాల్వల గురించి చర్చించనున్నారు. ఈ సమీక్షలో జిల్లా మంత్రులు ఎమ్మెల్యేలు, ఇరిగేషన్ శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి రజత్ కుమార్ పాల్గొననున్నారు.



కొత్త సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా వీఐపీ వాహనాల రద్దీ



కొత్త సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్. చిత్రంలో మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు తదితరులు

కొత్త చాంబర్‌లో వినోద్ బాధ్యతలు

సాక్షి, హైదరాబాద్: నూతన సచివాలయంలోని ఆరో అంతస్తులో తనకు కేటాయించిన ఎఫ్–26 చాంబర్‌లో రాష్ట్ర ప్రణాళిక సంఘం వైస్‌చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ బాధ్యతలు స్వీకరించారు. కుటుంబ సభ్యులతో కలిసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ప్రణాళిక శాఖకు సంబంధించిన ఫైలుపై ఆయన సంతకం చేశారు.

సీఎంకు యాదాద్రీశుడి ప్రసాదం



యాదాద్రి దేవస్థానం రూపొందించిన పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న సీఎం కేసీఆర్, చిత్రంలో మంత్రి జగదీశ్‌రెడ్డి, ఈఓ గీతారెడ్డి తదితరులు

యాదగిరిగుట్ట: తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయాన్ని ఆదివారం ప్రారంభించిన సీఎం కేసీఆర్‌ను వైటీడీఏ వైస్ చైర్మన్ కిషన్‌రావు, యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహస్వామి దేవస్థానం ఈవో గీతారెడ్డి కలిసి అభినందించారు. ఈ సందర్భంగా ఆయనకు యాదాద్రీశుడి లడ్డూ ప్రసాదం అందజేశారు. అనంతరం వైటీడీఏ, దేవస్థానం ఆధ్వర్యంలో రూపొందించిన యాదాద్రీశుడి ఆలయ పుస్తకాన్ని సీఎంతో ఆవిష్కరింపజేశారు. కార్యక్రమంలో సీఎస్ శాంతి కుమారి, మంత్రి జగదీశ్‌రెడ్డి ఉన్నారు.

మంత్రులు.. తొలి సంతకాలు

- కొత్త సచివాలయంలో ఫైళ్లను ఏరి కోరి తొలి సంతకాలు చేసిన అమాత్యులు
- తమ శాఖల అధికారులు, సిబ్బందితో అట్టహాసంగా కార్యక్రమం

సాక్షి, హైదరాబాద్: నూతన సచివాలయ ప్రారంభం అనంతరం మంత్రులు వారికి కేటాయించిన చాంబర్లకు చేరుకున్నారు. వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య తమకు కేటాయించిన సీట్లలో కూర్చున్నారు. సంబంధిత శాఖల ఉన్నతాధికారులు సిద్ధం చేసిన ఫైళ్లపై తొలి సంతకాలు చేశారు.

ఏ మంత్రి.. ఏ ఫైలుపై సంతకం చేశారంటే..

- **కేటీఆర్ (ఐటీ, పరిశ్రమలు, పట్టణాభివృద్ధి శాఖ):** డబుల్ బెడ్రూం ఇళ్ల కేటాయింపులకు సంబంధించిన ఫైలుపై తొలి సంతకం.
- **హరీశ్‌రావు (ఆర్థిక, వైద్యారోగ్య శాఖల మంత్రి):** రాష్ట్రంలోని బోధనాస్పత్రుల్లో 1,827 స్టాఫ్ నర్సు ఉద్యోగాల భర్తీ ఫైలుపై తొలి సంతకం. అకాల వర్షాలకు నష్టపోయిన రైతులకు సాయం కింద రూ.151.64 కోట్ల నిధుల విడుదల ఫైలుకూ క్లియరెన్స్.
- **గంగుల కమలాకర్ (పౌరసరఫరాల, బీసీ సంక్షేమ శాఖ):** అంగన్‌వాడీలకు పోషకాలతో కూడిన సన్నబియ్యం పంపిణీ ఫైలుపై తొలి సంతకం. బీసీ, ఎంబీసీ కార్పొరేషన్ల వార్షిక ప్రణాళికల ఫైలుపై మరో సంతకం.
- **తలసాని శ్రీనివాస్ యాదవ్ (పశుసంవర్థక, మత్స్య శాఖ):** ఉచిత చేపపిల్లల పంపిణీ ఫైలుపై తొలిసంతకం చేశారు. గొర్రెల పంపిణీ కోసం ఎన్‌సీడీసీ నిధుల విడుదల, రంగారెడ్డి జిల్లా తుక్కుగూడ సమీపంలో నిర్మిస్తున్న విజయ మెగా డెయిరీ పనులకు రూ.75కోట్ల గ్రాంటు విడుదల ఫైళ్లకు ఆమోదం.



కొత్త చాంబర్‌లో హరీశ్‌రావు తొలి సంతకం

- **సత్యవతి రాథోడ్ (గిరిజన, మహిళా, శిశు సంక్షేమ శాఖ):** అంగన్‌వాడీల్లో చిన్నారులు, గర్భిణులు, బాలింతలకు అందిస్తున్న సంపూర్ణ ఆహార పథకానికి ఇకపై బలవర్ధక సన్నబియ్యంతో కూడిన ఆహారాన్ని అందించే ఫైలుపై తొలి సంతకం.
- **మల్లారెడ్డి (కార్మిక, ఉపాధి కల్పన శాఖ):** కార్మిక దినోత్సవాన్ని పురస్కరించుకుని ఇవ్వనున్న శ్రమశక్తి అవార్డుల ఫైలుపై తొలి సంతకం.
- **కొప్పుల ఈశ్వర్ (ఎస్సీ అభివృద్ధి, మైనార్టీ సంక్షేమశాఖ):** దళితబంధు పథకం రెండో విడత లబ్ధిదారుల ఎంపిక ఫైలుపై తొలి సంతకం.
- **ఎర్రబెల్లి దయాకర్‌రావు (పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ):** రాష్ట్రంలో ఏర్పాటైన కొత్త మండలాల్లో ఐకేపీ భవన నిర్మాణాలకు సంబంధించిన ఫైల్‌పై తొలి సంతకం.
- **మహమూద్ అలీ (హోంమంత్రి):** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని మూడు కమిషనరేట్లలో జోన్ల పునర్వ్యవస్థీకరణ, కొత్త పోలీస్ స్టేషన్లలో పోస్టుల మంజూరు ఫైలుపై తొలి సంతకం.
- **శ్రీనివాస్‌గౌడ్ (ఎక్సైజ్, యువజన సర్వీసుల శాఖ):** రాష్ట్రంలో చీఫ్ మినిస్టర్ కప్ క్రీడాపోటీల నిర్వహణ ఫైలుపై తొలి సంతకం.
- **సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి (వ్యవసాయ, సహకార శాఖ):** రైతులకు రాయితీపై పచ్చిరొట్ట విత్తనాల పంపిణీ ఫైలుపై తొలి సంతకం. అసెంబ్లీ నియోజకవర్గాల్లో చెక్‌డ్యాంల నిర్మాణానికి సంబంధించిన ఫైలుపై రెండో సంతకం.
- **వేముల ప్రశాంత్‌రెడ్డి (రోడ్లు, భవనాల శాఖ):** రాష్ట్ర రహదారులు, భవనాల శాఖ పునర్వ్యవస్థీకరణ ఫైలుపై తొలి సంతకం.
- **జగదీశ్‌రెడ్డి (విద్యుత్ శాఖ):** వ్యవసాయానికి రూ.958.33 కోట్ల విద్యుత్ రాయితీ విడుదల ఫైలుపై తొలి సంతకం.
- **ఇంద్రకరణ్‌రెడ్డి (దేవాదాయ, న్యాయ, అటవీ, పర్యావరణ శాఖ):** గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని నాలుగు జిల్లాల్లో వంద ఆలయాలకు ధూప దీప నైవేద్య పథకం వర్తింపజేసే ఫైలుపై తొలి సంతకం. ప్రధాన దేవాలయాల్లో తృణధాన్యాలతో కూడిన ప్రసాదాన్ని అందుబాటులోకి తెచ్చే ఫైలుపై రెండో సంతకం.
- **సబితారెడ్డి (విద్యాశాఖ):** ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలల్లో 19,800 మంది టీచర్లకు రూ. 34.25 కోట్లతో ట్యాబ్‌లు అందజేసే ఫైలుపై తొలి సంతకం. 5వేల ప్రాథమిక పాఠశాలల్లో లైబ్రరీ కార్నర్‌ల ఏర్పాటు ఫైలుపై మరో సంతకం.
- **అజయ్‌కుమార్ (రవాణాశాఖ):** కొత్త జిల్లాల్లో రవాణాశాఖ కార్యాలయాల నిర్మాణానికి సంబంధించిన ఫైలుపై తొలి సంతకం.

యాదాద్రి ఆలయానికి భద్రత పెంపు

మే 2న విధుల్లో చేరనున్న 34మంది ఎస్పీఎఫ్ అధికారులు



యాదగిరిగుట్ట: ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన యాదాద్రి శ్రీలక్ష్మినరసింహస్వామి వారి ఆలయానికి భద్రత ను పెంచుతూ రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఇందుకు సంబంధించి ఉత్తర్వులు ఇటీవలనే ఆలయానికి అందినట్లు ఆలయ ఎస్పీఎఫ్ అధికారి ఒకరు ఆదివారం 'సాక్షి'కి వెల్లడించారు. భద్రత లోపంతో కొండపైన డ్రోన్ కెమెరాలు, ప్రధానాలయంలో సెల్‌ఫోన్లు భక్తులు తీసుకెళ్తున్న వైనంపై 'యాదాద్రి ఆలయానికి భద్రత ఏదీ..'అనే శీర్షికన ఏప్రిల్ 13న 'సాక్షి'దిన పత్రికలో జిల్లా పేజీల కథనం ప్రచురితమైంది. అంతేకాకుండా తిరుమల తిరుపతి ఆలయానికి ఎస్పీఎఫ్ తరహాలో భద్రత కావాలని అధికారులు రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరినట్లు తెలిసింది. ఇందులోభాగంగానే యాదాద్రి క్షేత్రానికి 34 మంది ఎస్పీఎఫ్ అధికారులను ఇటీవలనే నియమించినట్లు దేవస్థానం ఎస్పీఎఫ్ అధికారి వెల్లడించారు. ఇందులో ఐదుగురు ఏఎస్సైలు, 11మంది హెడ్ కానిస్టేబుళ్లు, 17 మంది కానిస్టేబుళ్లను నియమించింది. వీరు ఈనెల 2న విధుల్లో చేరనున్నారు. ప్రభుత్వం కేటాయించిన 34మందితో కలుపుకొని మొత్తంగా 45మంది ఎస్పీఎఫ్ అధికారులు దేవస్థానానికి భద్రత కల్పించనున్నారు.

యాదాద్రి జయంతి ఉత్సవాలకు సర్వం సిద్ధం

యాదాద్రి శ్రీలక్ష్మినరసింహస్వామి వారి ఆలయంలో మంగళవారం నుంచి 4వ తేదీ వరకు జరగను న్న శ్రీనృసింహ జయంతి ఉత్సవాలకు ఆలయ అధికారులు ఏర్పాట్లు ముమ్మరం చేశారు. ఇప్పటి కే విద్యుత్ దీపాలంకరణ చేపట్టిన అధికారులు, భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నారు. ఉత్తర రాజగోపురం ముందు గ్రీన్, రెడ్ మ్యాట్‌లను తీసుకురావడంతో పాటు ప్రచా రం కోసం కొండపైన సౌండ్ సిస్టమ్ ఏర్పాటు చేస్తున్నారు. ఆలయం తిరు, మాఢ వీధుల్లో దేవుళ్ల రూపంతో ఉన్న లైటింగ్ బోర్డులను బిగించే పనులను కార్మికులు చేపట్టారు. సోమవారం రాత్రి నాటికి పనులన్నీ పూర్తి కానున్నట్లు ఆచార్యులు, అధికారులు చెబుతున్నారు.

ఆర్టీసీ బస్సును ఢీకొన్న లారీ

22 మంది ప్రయాణికులకు గాయాలు



సింగరేణి(కొత్తగూడెం): బొగ్గు అన్‌లోడ్ చేసిన లారీ అతివేగంగా వచ్చి భద్రాచలం నుంచి గుంటూరు వెళ్తున్న భద్రాచలం డిపో బస్సును ఢీకొనడంతో 22 మంది ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ సంఘటన భద్రాద్రి కొత్తగూడెం జిల్లా కొత్తగూడెంలోని రుద్రంపూర్ కోల్ హ్యాండ్లింగ్ ప్లాంట్ (ఆర్‌సీహెచ్‌పీ) క్రాస్ రోడ్డు వద్ద ఆదివారం తెల్లవారుజామున జరిగింది. దీంతో బస్సు రెండు పల్టీలు కొట్టగా చాలా భాగాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ప్రమాద సమయంలో బస్సులో 51 మంది ప్రయాణికులుండగా 22 మంది గాయపడ్డారు. వీరిలో తొమ్మిది మందికి తీవ్ర గాయాలు కావడంతో కొత్తగూడెంలోని సింగరేణి ఆస్పత్రికి తరలించారు. కొందరికి కాళ్లు, చేతులు విరిగిపోయాయని వైద్యులు తెలిపారు. కాగా, అతివేగమే ప్రమాదానికి కారణమని స్థానికులు చెబుతున్నారు.

చెబుతున్నది ఎంత? కొంటున్నది ఎంత?

- ధాన్యం కొనుగోళ్లపై చర్చ కోసం మంత్రి గంగులకు పొన్నం సవాల్



సాక్షి, హైదరాబాద్: 'రాష్ట్రంలోని 11 జిల్లాల్లో ఒక్క మెట్రిక్ టన్ను ధాన్యమైనా కొనుగోలు చేశారా? మీరు చెప్పిన కొనుగోలు కేంద్రానికి వెళ్దాం. కొన్నామని మీరు చెపుతున్నది ఎంతో... అసలు కొంటున్నది ఎంతో తెలుస్తుంది. ధాన్యం కొనుగోళ్లపై బహిరంగ చర్చకు వస్తారా?'అని రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్‌కు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. మంత్రి చెబుతున్న ధాన్యం కొనుగోళ్ల వివరాలన్నీ అవాస్తవమేనన్నారు. ఏ జిల్లాలో ఎన్ని టన్నుల ధాన్యం కొన్నారనే వివరాలతో కూడిన పట్టికను ఆదివారం ఒక ప్రకటనలో విడుదల చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నామని మంత్రి చెపుతున్నారు కానీ, ఏప్రిల్ 27నాటికి కేవలం 4.81లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోళ్లు జరిగాయని తెలిపారు. 11 జిల్లాల్లో ఒక్క ధాన్యం గింజను కూడా కొనలేదని, ఆరు జిల్లాలో మెట్రిక్ టన్నులోపు, 8 జిల్లాల్లో 2వేల మెట్రిక్ టన్నుల లోపు కొనుగోలు చేశారన్నారు. పౌరసరఫరాల మంత్రి ప్రాతినిధ్యం వహిస్తోన్న కరీంనగర్ జిల్లాలో కేవలం 2,267 మెట్రిక్ టన్నులే కొన్నారని అధికారిక వెబ్‌సైట్ లెక్కలు చెబుతున్నాయని విమర్శించారు. గంగుల ఇప్పటికైనా అవాస్తవాలను చెప్పి రైతులను మభ్యపెట్టకుండా ఉండాలని హితవుపలికారు. వానతో నష్టపోయిన రైతులకు ఎకరానికి రూ.25వేల పరిహారమిచ్చి రైతుల పట్ల చిత్తశుద్ధి నిరూపించుకోవాలని పొన్నం ప్రభాకర్ డిమాండ్ చేశారు.





భద్రాద్రి జిల్లాలో వైకుంఠధామం ఆవరణలో నిల్వ చేసిన ధాన్యం, కామారెడ్డి జిల్లా బిచ్కుందలో కాలువలో కొట్టుకుపోయిన వడ్లు ఎత్తుతున్న మహిళా రైతు

ఆందోళనలో అన్నదాత

▶ మొదటి పేజీ తరువాయి

మొలకెత్తింది. వందల క్వింటాళ్ల మొలకెత్తడంతో అన్నదాతలు ఆవేదన చెందుతున్నారు. కథలాపూర్, జగిత్యాల రూరల్, మెట్‌పల్లి తదితర మండలాల్లో ఆదివారం కురిసిన వర్షానికి ధాన్యం తడిసింది. మామిడికాయలు రాలిపోయాయి. నువ్వు, మొక్కజొన్న పంటలు దెబ్బతిన్నాయి. పెద్దపల్లి జిల్లా పాలకుర్తి, రామగుండం, ఓదెల, ఎలిగేడు, జూలపల్లి తదితర మండలాల్లో ధాన్యం కుప్పలు కొట్టుకుపోయాయి. ధాన్యం తడవకుండా కాపాడుకునేందుకు రైతులు ఇబ్బందులు పడ్డారు. రాజన్న సిరిసిల్లజిల్లాలోని రుద్రంగి మండలంలో వడగళ్లవానకు కొనుగోలు కేంద్రంలోని ధాన్యం కొట్టుకుపోయింది. తంగళ్లపల్లి మండలం లక్ష్మీపూర్ కొనుగోలు కేంద్రంలో రైతు సిరికొంటి తిరుపతిరెడ్డికి చెందిన నాలుగు క్వింటాళ్ల ధాన్యం మొలకెత్తింది. బోయినపల్లి మండలం కొదురుపాక కొనుగోలు కేంద్రంలో ధాన్యం తడిసి ముద్దయింది.

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో...

ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచోట్ల ఈదురు గాలులు, ఉరుములు, మెరుపులతో వర్షం కురిసింది. నకిరేకల్, తిరుమలగిరి, రహీంఖాన్‌పేటలోని మార్కెట్లలో రైతులు ఆరబోసుకున్న ధాన్యం వరదనీటిలో కొట్టుకుపోయింది. గుండాలలో బండపై పోసిన ధాన్యం రామ సముద్రం చెరువులోకి కొట్టుకుపోయినట్లు రైతులు తెలిపారు. ఆత్మకూర్(ఎం) మండలం కేంద్రం పరిధిలోని రాయగిరి- మోత్కూర్ మెయిన్ రోడ్డుపై భారీ వృక్షం పడటంతో సుమారు గంటసేపు రాకపోకలు నిలిచిపోయాయి.

పిడుగుపాటుకు ఇద్దరు బలి


సైదులు (ఫైల్)


కుమార్ (ఫైల్)

అర్వపల్లి/కాల్వశ్రీరాంపూర్ (పెద్దపల్లి): ఆదివారం పిడుగుపాటుకు ఇద్దరు గొర్రెల కాపరులు మృతిచెందారు. సూర్యాపేట జిల్లా జాజిరెడ్డిగూడెం మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన వడకాల సైదులు (31) అడివెంల గ్రామంలో గొర్రెల కాపరిగా పనిచేస్తున్నాడు. ఆదివారం గొర్రెలు తోలుకొని అడివెంల స్టేజీ సమీపంలోని చేనులో మేపుతుండగా సైదులు పిడుగుపడి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. పెద్దపల్లి జిల్లా కాల్వశ్రీరాంపూర్ మండలం వెన్నంపల్లి గ్రామానికి చెందిన జంగం కుమార్ అలియాస్ కొమురయ్య ఆదివారం పక్క గ్రామమైన మంగపేట చెరువు వద్ద గొర్రెలను మేపుతున్నాడు. ఆ సమయంలో పిడుగుపడి అతను అక్కడికక్కడే మృతిచెందాడు. మృతుడికి తల్లి లస్మమ్మ, భార్య కోమల, ఇద్దరు కుమారులు, కూతురు ఉన్నారు. మండలంలోని అడ్డబోరుతండాకు చెందిన రైతు మంగ్యానాయక్ పంట పొలం వద్ద ఉన్న సమయంలో వడగళ్లు పడి తీవ్రంగా గాయపడ్డాడు.

శ్మశానంలోనూ ధాన్యం ఆరబోత

పాల్వంచరూరల్: ధాన్యం కొనుగోలు కేంద్రాలను ప్రభుత్వం ప్రారంభిస్తామని చెప్పినా పూర్తిస్థాయిలో అందుబాటులోకి రాలేదు. కొన్నిచోట్ల కొనుగోళ్లు జరుగుతున్నా మిల్లులకు తరలింపులో జాప్యం జరుగుతోంది. భద్రాద్రి కొత్తగూడెం జిల్లా పాల్వంచ మండలం సోములగూడెంలో కొనుగోలు కేంద్రం ప్రారంభించాల్సిన చోట రైతులు 20 రోజుల క్రితం ధాన్యం తెచ్చి ఆరబోశారు. ఎప్పటికప్పుడు కొనుగోళ్లు చేపట్టి ధాన్యాన్ని మిల్లులకు తరలిస్తే మిగతా రైతులకు చోటు దక్కేది. కానీ కొనుగోళ్లే మొదలు కాకపోవడంతో నిర్దేశిత ప్రాంతం నిండిపోగా.. ఆనుకుని ఉన్న శ్మశానం (వైకుంఠధామం) లోనూ ధాన్యం ఆరబోసి రాత్రింబవళ్లు కాపలా ఉంటున్నారు. ఆకాశం మేఘావృతం కావడమే కాక చిరుజల్లులు కురుస్తుండటంతో రైతులు అవస్థలు పడుతున్నారు.

ఉమ్మడి నిజామాబాద్ జిల్లాలో..

సాక్షి, కామారెడ్డి: కామారెడ్డి జిల్లాలోనూ భారీ వర్షం కురిసింది. బిచ్కుందలోని మార్కెట్ యార్డులో రైతులు ఆరబెట్టిన వరి ధాన్యం భారీవర్షానికి కొట్టుకుపోయి సమీపంలోని డ్రెయినేజీలో కలిసింది. ఐదుగురు రైతులకు సంబంధించిన సుమారు ఎనిమిది ట్రాక్టర్ల వడ్లు కొట్టుకుపోయాయి. వారం రోజులుగా వర్షాలు కురుస్తుండటంతో ధాన్యానికి మొలకలు వస్తున్నాయి. నిజామాబాద్ జిల్లా సిరికొండ మండలంలో 450 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అంచనా వేసింది.

ఇక అన్ని జిల్లాల్లో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ల పంపిణీ

- సంబంధిత ఫైల్‌పై సీఎం సంతకం
- రాష్ట్ర వ్యాప్తంగా లబ్ధి పొందనున్న 6.84 లక్షల మంది గర్భిణులు
- 13.08 లక్షల కిట్స్ పంపిణీ చేయాలని లక్ష్యం
- ఒక్కో కిట్ విలువ రూ. 2 వేలు.. మొత్తం రూ. 277 కోట్లు ఖర్చు
- ఉత్తర్వులు విడుదల చేసిన తెలంగాణ ప్రభుత్వం



కేసీఆర్ న్యూట్రిషన్ కిట్‌లో ఉండేవి ఇవే...
1. కిలో న్యూట్రిషన్ మిక్స్ పౌడర్
2. కిలో ఖర్జూర 3. ఐరన్ సిరప్ 3 బాటిల్స్
4. 500 గ్రాముల నెయ్యి 5. కప్పు
6. పల్లీ పట్టి 200 గ్రాములు
7. ప్లాస్టిక్ బాస్కెట్

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర వ్యాప్తంగా కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ కార్యక్రమాన్ని విస్తరించి అమలు చేసేందుకు తెలంగాణ ప్రభుత్వం సిద్ధమైంది. ఇందుకు సంబంధించిన ఫైలుపై ముఖ్యమంత్రి కేసీఆర్ నూతన సచివాలయం ప్రారంభం సందర్భంగా ఆదివారం సంతకం చేశారు. అనంతరం ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది.

- రక్తహీనత అధికంగా ఉన్న తొమ్మిది జిల్లాల్లో ప్రభుత్వం ఇప్పటికే న్యూట్రిషన్ కిట్ కార్యక్రమాన్ని విజయవంతంగా అమలు చేస్తున్న సంగతి తెలిసిందే. గత డిసెంబర్ 21న కామారెడ్డి కలెక్టరేట్ నుంచి వర్చువల్ మోడ్ లో రాష్ట్ర వ్యాప్తంగా 9 జిల్లాల్లో కేసీఆర్ న్యూట్రిషన్ కిట్ పంపిణీని స్పీకర్ పోచారం శ్రీనివాస్ రెడ్డి, వైద్య ఆరోగ్యశాఖ మంత్రి హరీశ్ రావు లాంఛనంగా ప్రారంభించారు. ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జయశంకర్ భూపాలపల్లి, జోగుళాంబ గద్వాల్, కామారెడ్డి, కొమురంభీం, ఆసిఫాబాద్, ములుగు, నాగర్ కర్నూల్, వికారాబాద్‌లో 1.25 లక్షల మంది గర్భిణులకు మొత్తంగా రెండున్నర లక్షల కిట్లు పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఇప్పుడు మిగతా 24 జిల్లాల్లోనూ కిట్ల పంపిణీని వైద్య ఆరోగ్య శాఖ ప్రారంభించనుంది. ప్రొటీన్లు, మినరల్స్, విటమిన్స్, ఐరన్‌లను పోషకాహారం ద్వారా అందించి రక్త హీనత తగ్గించడం, హిమోగ్లోబిన్ శాతం పెంచడం న్యూట్రిషన్ కిట్ల లక్ష్యం.

33 జిల్లాల్లో 6.84 లక్షల మంది గర్భిణులకు..

రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల్లో 6.84 లక్షల మంది గర్భిణులకు 1,046 కేంద్రాల ద్వారా మొత్తంగా 13.08 లక్షల కిట్ల పంపిణీ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ఒక్కో కిట్ విలువ రూ.2 వేలు కాగా, మొత్తం కిట్ల విలువ రూ. 277 కోట్లుగా ప్రభుత్వం అంచనా వేసింది. 14–26 వారాల మధ్య జరిగే రెండో ఏఎన్‌సీ చెకప్ సమయంలో ఒకసారి, 27–34 వారాల మధ్య చేసే మూడో ఏఎన్‌సీ చెకప్ సమయంలో రెండో సారి ఈ కిట్లు అందజేస్తారు. రక్త హీనత (ఎనీమియా) గర్భిణుల పాలిట శాపంగా మారుతోన్న నేపథ్యంలో ప్రసవాలు సంక్లిష్టంగా మారుతున్నాయి. ఎనీమియా నివారించడం వల్ల మాతృ మరణాలను గణనీయంగా తగ్గించవచ్చని అధ్యయనాలు స్పష్టం చేస్తున్నాయి. ఈ పథకాన్ని రాష్ట్రవ్యాప్తంగా విస్తరించే క్రమంలో సంబంధించిన ఫైలుపై సీఎం కేసీఆర్ సంతకం చేయడం సంతోషకరమని మంత్రి హరీశ్‌రావు ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

బీఆర్‌ఎస్ కార్యకర్తకు అండగా ఎంపీ కోమటిరెడ్డి

- అనారోగ్యంతో మృతి చెందిన గిరిజన యువకుడు



లాల్‌సింగ్ కుటుంబసభ్యులను ఓదారుస్తున్న ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి

తుంగతుర్తి: సూర్యాపేట జిల్లా తుంగతుర్తి మండల పరిధిలోని సింగారం తండాకు చెందిన బీఆర్‌ఎస్ కార్యకర్త పాతులోతు లాల్‌సింగ్‌నాయక్ ఆదివారం అనారోగ్యంతో మృతిచెందగా, అతడి కుటుంబానికి కాంగ్రెస్‌కు చెందిన భువనగిరి ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అండగా నిలిచారు. లాల్‌సింగ్‌నాయక్ ఇటీవల మెదడులో రక్తం గడ్డకట్టడంతో హైదరాబాద్‌లోని అపోలో ఆస్పత్రిలో చేరాడు. విషయం తెలుసుకున్న ఎంపీ కోమటిరెడ్డి అపోలో ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి అతనికి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. కాగా లాల్‌సింగ్ చికిత్స పొందుతూ ఆదివారం మృతిచెందడంతో ఆస్పత్రి బిల్లు రూ.5.80లక్షల కాగా అపోలో ఆస్పత్రి యాజమాన్యంతో మాట్లాడి తన సొంత డబ్బులు రూ.2.30లక్షలు చెల్లించారు. అనంతరం సింగారం తండాకు వచ్చి మృతుడి కుటుంబ సభ్యులను పరామర్శించారు. లాల్‌సింగ్ కుమారుడి చదువుకు అయ్యే ఖర్చును తానే భరిస్తానని హామీ ఇచ్చారు.

సచివాలయానికి సీఎం వస్తారని ఆశిస్తున్నా..

మోత్కూరు: రూ.వేలకోట్లు ఖర్చు చేసి నూత నంగా నిర్మించిన రాజభవనంలాంటి సచివాలయానికి సీఎం కేసీఆర్ రోజూ వస్తారని ఆశిస్తున్నామని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి అన్నారు. యాదాద్రి భువనగిరి జిల్లా మోత్కూరు మున్సిపాలిటీ పరిధిలోని కొండగడప గ్రామంలో ఆదివారం నిర్వహించిన బొడ్రాయి ప్రతిష్ఠ మహోత్సవానికి హాజరైన ఆయన విలేకరులతో మాట్లాడారు.

2.62 కోట్ల టన్నుల ధాన్యం!

- వరి ఉత్పాదకతపై ప్రభుత్వ అంచనా
- ఖరీఫ్‌లో 1.38 కోట్ల టన్నులు, రబీలో 1.24 కోట్ల టన్నులు
- దేశంలోనే మొదటి స్థానంలో తెలంగాణ?
- మొక్కజొన్న 28.80 లక్షల టన్నులు.. సోయాబీన్ 3.27 లక్షల టన్నులు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలో 2022–23 వానాకాలం, యాసంగి సీజన్లలో వరి ధాన్యం 2.62 కోట్ల టన్నులు ఉత్పత్తి అవుతుందని ప్రభుత్వం అంచనా వేసింది. అందులో వానాకాలం (ఖరీఫ్) సీజన్‌లో 1.38 కోట్ల టన్నులు, యాసంగిలో 1.24 కోట్ల టన్నులు అవుతుందని తెలిపింది. ఈ మేరకు మూడో ముందస్తు అంచనా నివేదికను విడుదల చేసింది. వివరాలను వ్యవసాయ శాఖ వర్గాలు ఆదివారం వెల్లడించాయి. వానాకాలం సీజన్‌లో 65 లక్షల ఎకరాల్లో వరి సాగైంది. ఉత్పాదకత ఎకరానికి 2,123 కిలోలు వచ్చింది. యాసంగిలో 56.45 లక్షల ఎకరాల్లో సాగైంది. ఉత్పాదకత 2,212 కిలోలు వచ్చింది. మొత్తంగా చూస్తే ఈ రెండు సీజన్లలో 1.21 కోట్ల ఎకరాల్లో వరి సాగు కాగా, ఎకరానికి 2,165 కిలోల ఉత్పాదకత వస్తుందని, 2.62 కోట్ల టన్నుల ధాన్యం ఉత్పత్తి అవుతుందని అంచనా వేసింది. అయితే గత నెల రోజుల కాలంలో వడగళ్లు, భారీ వర్షాలు, ఈదురుగాలులతో పెద్ద ఎత్తున వరి నేల రాలింది. గింజలు పొలాల్లోనే రాలిపోయాయి. కల్లాల్లో వరి ధాన్యం తడిసిపోయింది. దీంతో యాసంగి వరి ఉత్పత్తి తగ్గుతుందని చెబుతున్నారు. అదే జరిగితే తుది అంచనా నివేదికలో ధాన్యం ఉత్పత్తి మొత్తంలో కాస్త తగ్గుదల చోటు చేసుకునే అవకాశం ఉందని అంటున్నారు. కేంద్ర ప్రభుత్వం గత మార్చి 15వ తేదీన విడుదల చేసిన నివేదిక ప్రకారం.. తెలంగాణ వరి ఉత్పత్తిలో రెండో స్థానంలో ఉంది. అయితే తాజా ఉత్పత్తిని పరిగణనలోకి తీసుకుంటే దేశంలో ఇప్పుడు మన రాష్ట్రమే మొదటి స్థానంలో ఉంటుందన్న వాదనలు వినిపిస్తున్నాయి. ఏది ఏమైనా తుది అంచనా నివేదికలు, అధికారికంగా లెక్కలు వస్తేగానీ ఏదీ చెప్పలేమని అధికారులు అంటున్నారు.

పత్తి ఉత్పత్తి ఢమాల్..

కీలకమైన పత్తి ఉత్పత్తి ఈసారి ఢమాల్ అయింది. గతేడాది 46.25 లక్షల ఎకరాల్లో సాగు చేయగా, 69.46 లక్షల బేళ్ల ఉత్పత్తి వస్తుందని అంచనా వేశారు. కానీ ఈసారి 50 లక్షల ఎకరాల్లో సాగు చేసినా, కేవలం 58.54 లక్షల బేళ్ల ఉత్పత్తే జరిగింది.

పప్పు ధాన్యాల సాగు, ఉత్పత్తి అంచనా ఇలా..

పంట	ఎకరాలు	ఉత్పత్తి
కందులు	5.65 లక్షలు	1.83 లక్షల టన్నులు
మినుములు	.75 లక్షలు	.31 లక్షల టన్నులు
పెసర	.80 లక్షలు	.23 లక్షల టన్నులు
మొక్కజొన్న	12.69 లక్షలు	28.80 లక్షల టన్నులు
జొన్న	1.63 లక్షలు	.75 లక్షల టన్నులు
సోయాబీన్	5 లక్షలు	3.27 లక్షల టన్నులు
పసుపు	.56 లక్షలు	1.60 లక్షల టన్నులు
ఉల్లిగడ్డ	.16 లక్షలు	1.60 లక్షల టన్నులు

భారీ వర్షాలతో..

భారీ వర్షాల కారణంగా పత్తి లక్షలాది ఎకరాల్లో నాశనమైంది. దీంతో రైతులకు పెద్ద ఎత్తున నష్టం వాటిల్లింది. అనేకచోట్ల పత్తి రంగు మారింది. గతేడాది భారీగా ధర పలికిన పత్తికి, ఈసారి కూడా రికార్డు స్థాయిలోనే ధర ఉంటుందని అనుకున్నారు. కానీ ఆ మేరకు దక్కలేదు. దీంతో రైతుల వద్ద ఇంకా పత్తి ఉంది. దాన్ని అమ్ముకునేందుకు అష్టకష్టాలు పడుతున్నారు. ఇక ఈ ఏడాది రెండు సీజన్లలో పప్పు ధాన్యాల పంటలు 10.97 లక్షల ఎకరాల్లో సాగుచేశారు. మొత్తంగా 4.58 లక్షల టన్నుల వరకు ఉత్పత్తి వస్తుందని ప్రభుత్వం అంచనా వేసింది.



హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి కురిసిన భారీ వర్షానికి జలమయమైన ఎల్బీ నగర్ ప్రధాన రహదారి

రాజధానిలో మళ్లీ కుండపోత

- ఆదివారం రాత్రి ఈదురుగాలులతో భారీ వాన
- పొంగిపొర్లిన నాలాలు.. రోడ్లన్నీ జలమయం
- పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం
- జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ వద్ద విద్యుత్ తీగ తెగిపడి కానిస్టేబుల్ మృతి

నగరంలో వర్షపాతం ఇలా.. (సెం. మీలో)

ప్రాంతం	వర్షపాతం
ఖాజాగూడ	6.3
షేక్‌పేట	5.2
జూబ్లీహిల్స్	4.6
మాదాపూర్	4.5
సింగిరేణికాలనీ	4.1
అమీర్‌పేట	4.0
ఎంసీఆర్‌హెచ్‌ఆర్‌డీ	3.8

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర రాజధాని హైదరాబాద్‌లో ఆదివారం రాత్రి ఈదురుగాలులతో కుండపోత వానపడింది. సాయంత్రం నుంచి ఆకాశం మేఘావృతమై చిరుజల్లులు కురవగా.. రాత్రి 9 గంటల నుంచి ప్రాంతాల వారీగా భారీ వర్షం పడింది. దీనితో లోతట్టు ప్రాంతాలు మునిగాయి. రోడ్లన్నీ జలమయం అయ్యాయి. మోకాళ్లలోతు నీళ్లు చేరడంతో వాహనదారులు తీవ్రంగా ఇబ్బంది పడ్డారు. నాలాల వెంబడి వరద ఉధృతంగా ప్రవహించింది. ఎక్కడ గుంతలు ఉన్నాయో, మ్యాన్ హోల్స్ ఉన్నాయో తెలియక వాహనదారులు, పాదచారులు ఆందోళనకు లోనయ్యారు. కొన్ని ప్రాంతాల్లో చెట్లు కూలిపడ్డాయి. విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. శేరిలింగంపల్లి ఖాజాగూడలో అత్యధికంగా 6.3 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది. కుత్బుల్లాపూర్, బాలానగర్, జగద్గిరిగుట్ట, కూకట్‌పల్లి, కేపీహెచ్‌బీ, బాచుపల్లి, నిజాంపేట, హైదర్‌నగర్, సుచిత్ర, సూరారం, జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, దిల్‌సుఖ్‌నగర్ తదితర ప్రాంతాల్లో ఉరుములు మెరుపులతో వర్షం దంచి కొట్టింది. భారీ వర్షం నేపథ్యంలో జీహెచ్‌ఎంసీ అలర్ట్ ప్రకటించింది. ప్రజలెవరూ అత్యవసరమైతే తప్ప ఇళ్ల నుంచి బయటికి రావొద్దని సూచించింది. అధికార యంత్రాంగం, సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఆదేశించింది.

విద్యుత్ తీగ తెగిపడి కానిస్టేబుల్ మృతి



జూబ్లీహిల్స్‌లో రోడ్డుపై వీరాస్వామి మృతదేహం

భారీ వర్షం, ఈదురుగాలులతో జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్ ప్రాంతంలో విద్యుత్ తీగలు తెగిపడ్డాయి. ఆ ప్రాంతం మీదుగా బైక్‌పై వెళుతున్న గ్రేహౌండ్స్ కానిస్టేబుల్ వీరాస్వామి (40)పై ఆ తీగలు పడటంతో విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. హైదరాబాద్ శివార్లలోని గండిపేటలో నివసించే సోలెం వీరాస్వామి గ్రేహౌండ్స్ కానిస్టేబుల్‌గా పనిచేస్తున్నాడు. ఆదివారం రాత్రి 9.40 గంటల సమయంలో జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 1 నుంచి ఎన్టీఆర్ భవన్ వైపు వెళ్తున్నారు. అప్పటికే బలమైన ఈదురుగాలులతో కుండపోత వర్షం మొదలైంది. ఈ సమయంలో విద్యుత్ తీగ తెగి వీరాస్వామిపై పడింది. షాక్‌కు గురైన ఆయన బైక్‌పై నుంచి కిందపడి అపస్మారక స్థితిలో పడిపోయారు. సమాచారం అందుకున్న జూబ్లీహిల్స్ పెట్రోలింగ్ పోలీసులు వీరాస్వామిని వెంటనే ఆస్పత్రికి తరలించినా.. అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. వీరాస్వామి స్వస్థలం మహబూబాబాద్ జిల్లా గంగారం అని.. యూసఫ్‌గూడ బెటాలియన్‌లో మిత్రుడిని కలిసి వెళుతుండగా ప్రమాదానికి గురయ్యారని తెలిసింది.

ఈ రెండ్రోజులూ తక్కువ ఉష్ణోగ్రతలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంపై ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. సముద్రమట్టం నుంచి సగటున 1.5కి.మీ. ఎత్తులో ఉన్న ద్రోణి ప్రభావంతో రాష్ట్రంలో ఈ రెండ్రోజులు అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురుస్తాయని వాతావరణ శాఖ తెలిపింది. ఈ రెండ్రోజులు ఉష్ణోగ్రతలు కూడా తక్కువగా నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వెల్లడించింది. కొన్ని ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 32 డిగ్రీల సెల్సియస్ కంటే తక్కువగా నమోదు అవుతాయని వివరించింది. ఆదివారం రాష్ట్రంలో... గరిష్ట ఉష్ణోగ్రత ఖమ్మంలో 35.6 డిగ్రీల సెల్సియస్, కనిష్ట ఉష్ణోగ్రత ఆదిలాబాద్‌లో 19.7 డిగ్రీల సెల్సియస్‌గా నమోదయ్యింది.

తెలంగాణ, ఏపీల్లోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట, కనిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)

కేంద్రం	గరిష్టం	కనిష్టం	కేంద్రం	గరిష్టం	కనిష్టం
రెంటచింతల	39.4	26.2	రామగుండం	34.0	23.9
కడప	38.7	26.4	హనుమకొండ	33.0	22.0
విశాఖపట్నం	37.2	24.2	మెదక్	33.0	22.0
ఖమ్మం	35.6	28.4	నిజామాబాద్	32.5	22.6
నల్లగొండ	35.5	22.4	హైదరాబాద్	32.2	24.4
భద్రాచలం	35.2	24.5	తిరుపతి	32.0	25.0
మహబూబ్‌నగర్	34.4	23.9	హకీంపేట్	32.0	23.5
విజయవాడ	34.0	25.0	దుండిగల్	32.0	22.8
			ఆదిలాబాద్	30.3	19.7



తాళ్లను చేధించుకొని వస్తున్న గ్రామస్థులు

ఆయిల్ పరిశ్రమకు వ్యతిరేకంగా ఉద్యమం ఉధృతం

- బోనాలతో నిరసన తెలిపిన స్తంభంపల్లివాసులు
- అడ్డుకున్న పోలీసులు, తోసుకెళ్లిన గ్రామస్తులు
- పోలీసులు, గ్రామస్తుల మధ్య తోపులాట, ఘర్షణ

వెల్గటూర్(ధర్మపురి): జగిత్యాల జిల్లా వెల్గటూర్ మండలం స్తంభంపల్లి శివారులో స్థాపించనున్న ఇథనాల్ రైస్‌బ్రాన్ ఆయిల్ పరిశ్రమకు వ్యతిరేకంగా గ్రామస్తులు చేపట్టిన ఉద్యమం ఉధృతమవుతోంది. పరిశ్రమ ఏర్పాటుకు వ్యతిరేకంగా ఇప్పటికే నాలుగు గ్రామాల ప్రజలు తీర్మానాలు చేశారు. స్తంభంపల్లి గ్రామసర్పంచ్, ఎంపీటీసీల ఆధ్వర్యంలో గ్రామస్తులు ఆదివారం మైసమ్మ తల్లికి మొక్కులు చెల్లించుకున్నారు. కర్మాగారం ఆపేలా చూడాలని వేడుకున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఉదయం 6గంటలకే గ్రామంలో పికెట్ ఏర్పాటు చేశారు. ఇతర గ్రామాల ప్రజలను అనుమతించలేదు. మధ్యాహ్నం 12 గంటల సమయంలో బోనాలతో బయలు దేరిన స్తంభంపల్లి గ్రామస్తులను ఇథనాల్ ప్రతిపాదిత స్థలం నుంచి కాకుండా తాము సూచించిన దారిగుండా వెళ్లాలని చెప్పారు. అందుకు ససేమిరా అన్న గ్రామస్తులు.. ముందుగా అనుకున్న మార్గం నుంచే బోనాలతో వెళ్తుండగా పోలీసులు అడ్డుకున్నారు. అయినా ఆందోళనకారులు వెనక్కి తగ్గలేదు. దీంతో రెండు వర్గాల మధ్య తీవ్రవాగ్వాదం, ఘర్షణ, తోపులాట చోటుచేసుకుంది. ఘటనలో పలువురు మహిళలు కిందపడగా, వారికి స్వల్ప గాయాలయ్యాయి. గ్రామస్తులు చివరికి పోలీసులను తోసుకువెళ్లి పోచమ్మకు మొక్కులు చెల్లించుకున్నారు. ఈ సందర్భంగా డీసీసీ అధ్యక్షుడు అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ మాట్లాడుతూ, తెలంగాణ సంప్రదాయమైన మైసమ్మ తల్లికి బోనాలతో మొక్కులు చెల్లించుకోవడానికి వెళ్తే పోలీసులతో అడ్డుకోవడం శోచనీయమన్నారు. ఆరు గ్రామాల ప్రజలు తీవ్రంగా వ్యతిరేకిస్తున్న ఫ్యాక్టరీని అడ్డుకుని తీరుతామని హెచ్చరించారు.



చీకటికి భయపడే పిల్లాడిని మనం సులభంగా క్షమించవచ్చు; నిజమైన విషాదం ఎప్పుడంటే వెలుగును చూసి పెద్దవాళ్లు భయపడటం!

– ప్లేటో

సాక్షి

సోమవారం, 1 మే 2023

శ్రమో నమః

వందల కోట్ల చేతులు ప్రపంచమనే ఈ మహాయంత్రాన్ని పని చేయిస్తున్నాయి. పని అంటే కర్మ. కాలగతిలో కర్మ శబ్దం ఆ ప్రాథమికార్థపు నేల విడిచి విధిలిఖితమనే తాత్వికార్థపు గగనసీమను తాకింది. మనుగడకు అవసరమైన సాధారణ కర్మల స్థాయిని దాటి మతపరమైన తంతులతో సహా ఇతరేతర అర్థాలకు విస్తరించింది. కర్మలో శ్రమ ఉంటుంది, శ్రమలో కర్మ ఉంటుంది. రెండూ అన్యోన్యాశ్రితాలు. మళ్ళీ ప్రపంచాన్నే ఒక యాంత్రిక మహాశకటమనుకుంటే, దానిని ముందుకు నడిపించేది కోట్లాది జనాల శ్రమ ఇంధనమే. పుట్టిన ప్రతిజీవీ అంతో ఇంతో కర్మయోగే. అందరికీ వందనం.

వేదం కర్మవాదమే. అందులో కర్మ గురించిన ఉగ్గడింపే ఆద్యంతం వ్యాపించి ఉంటుంది. వేదకాలపు కర్మభావనలో హెచ్చుతగ్గుల వింగడింపు లేదు; దేవతలు, మనుషులన్న తారతమ్యం లేదు. సూర్యచంద్రులు, ఉషస్సు, అగ్ని సహా అందరూ క్రమం తప్పకుండా తమ విధ్యుక్త కర్మలను నిర్వహించవలసిందే. ఇంద్రుడు కర్మ చేతనే గొప్పవాడయ్యాడంటుంది వేదం. అతని చేతి వేళ్ళు అనేక వేల కర్మలను చేస్తూ ఉంటాయి. ఆహార పచనం, దేవతలకు హవ్యాన్ని అందించడంతో సహా అగ్ని బహువిధ కర్మదక్షుడు. అగ్నిని అనేక విధాలుగా వినియోగంలోకి తెచ్చిన కార్మిక నిపుణులు అంగిరసులు. సర్వకర్మకుశలురైన పుత్రపౌత్రులు కావాలని వేదజనం కోరుకుంటారు. కర్మనిరతిని ప్రకృతితో ముడిపెట్టి వేదం అందంగా చెబుతుంది. ''మనుషుల్లారా! నిద్రలేవండి, చీకట్లు తొలిగాయి, మన దేహాలకు ప్రాణం వచ్చింది, ఉష ఉదయించి సూర్యుని రాకను ప్రకటించింది, అన్నం సమృద్ధిగా దొరికే చోటుకి వెడదాం పదండి'' అని ఒక ఋక్కు చెబుతుంది. ఉష ఉదయించి మీ మీ వృత్తి వ్యాపారాల వైపు మిమ్మల్ని జాగృతం చేస్తోందని మరో ఋక్కు అంటుంది.


''జాలరి పగ్గం, సాలెల మగ్గం, శరీర కష్టం స్ఫురింపజేసే గొడ్డలి, రంపం, కొడవలి, నాగలి, సహస్ర వృత్తుల సమస్త చిహ్నా''ల స్మరణ ఆధునిక మహాకావ్యంలోనే కాదు; కవిత్వానికే ఆదిమమైన వేదంలోనూ కనిపిస్తుంది. త్వష్ట నిపుణుడైన లోహకార్మికుడు... స్వర్ణమయమై, వేయి అంచులు కలిగిన వజ్రాయుధాన్ని నిర్మించి ఇంద్రునికి ఇచ్చాడు. దేవతలతో సమానమైన గౌరవాన్ని పొందాడు. ఋభులనే అన్నదమ్ములు మానవులైనా లోహవిద్యలో త్వష్టను మించిన ప్రావీణ్యం చూపి దేవతలయ్యారు. మరుత్తులనే దేవతలు ప్రవాహానికి అడ్డుపడిన ఓ పర్వతాన్ని బద్దలుకొట్టి నీటికి దారి చేశారు. అశ్వినులు మనువుకి విత్తనాలిచ్చి వ్యవసాయం చేయించారు; వైద్యం చేసి ఎంతోమందికి ఆరోగ్యాన్ని, ఆయుష్షును ఇచ్చారు. క్షురకుడు కేశఖండన చేసినట్లుగా ఉష చీకట్లను ఉత్తరిస్తోందని ఒక ఋక్కు అంటుంది.

శ్రమ ఉచ్చమా, న్యూనమా అని చూడకుండా; శ్రామికుల మధ్య హెచ్చుతగ్గుల తేడా తేకుండా శ్రమను మాత్రమే గౌరవించిన దశ అది. ఇంద్రాదులు సమాజానికి ఏదో ఒక మేలు చేసే సేవకులు కనుకనే దేవతలయ్యారు. వేదకాలంలో అలాంటి సేవకులను పన్నెండుగురిని గుర్తించి పన్నిద్దరు ఆయగార్లు అన్నారు. శారీరక శ్రమను తక్కువ చేసి మేధోశ్రమను ఆకాశానికి ఎత్తడం ఆనాటికి లేదు. తిథివారనక్షత్రాలు చూసే వ్యక్తి కన్నా మృతపశువుల చర్మాన్ని ఒలిచే చర్మకారునికి ఎక్కువ ప్రతిఫలం ముట్టిన కాలం అది. కర్మ, కర్మఫలం రెండూ ఆనాడు సాముదాయికమే. చెరువుల వంటి నిర్మాణాలలో రాజు, రాజుగారి భార్యా కూడా మట్టితట్టలు మోసిన ఉదాహరణలు పురాచరిత్రలో కనిపిస్తాయి. అది పోయి చాకిరొకరిది, సౌఖ్యమొకరిదైన తర్వాతే పరిస్థితి తలకిందులైందని పండితులంటారు. అందరూ అన్నిరకాల పనులూ చేయడం పోయి వృత్తి విభజన రావడంతోనే వృత్తుల మధ్య, వ్యక్తుల మధ్య చిన్నా పెద్దా తారతమ్యాలూ పొటమరించాయి. ఇష్టపూర్వక కర్మ నిర్బంధకర్మగా మారి దుఃఖదాయిని అయింది. అప్పుడు కూడా వృత్తి నైపుణ్యంలో ఆనందాన్ని, తృప్తిని అనుభవించే అవకాశం ఎంతోకొంత ఉండేది. వృత్తిదారులు పారిశ్రామిక యంత్రంలోని పరికరాలుగా మారిపోవడంతోనే అదీ పోయింది. ఈ మార్పును కొడవటిగంటి కుటుంబరావు ఒక కథలో అద్భుతంగా చిత్రీకరిస్తారు.

ప్రకృతి సమవర్తి. శ్రుతిమించిన అసమానతలను ఆట్టే కాలం సహించదు, ఎప్పటికైనా కత్తెర వేసి సమతుల్యతను తెస్తుంది. అడుగంటిన శ్రమ విలువను, గౌరవాన్ని, తగిన ప్రతిఫలాన్ని ఉద్ధరించే ప్రయత్నం ఆధునిక కాలంలోనే మళ్ళీ ఊపందుకుంది. 'శ్రమ నిష్ఫలమై, జన నిష్ఠురమై నూతిని గోతిని వెదికే కార్మిక వీరుల కన్నుల నిండా కణకణమండే విలాపాగ్నులకు, గలగల తొణికే విషాదాశ్రులకు ఖరీదు కట్టే షరాబులు' ఉద్భవించారు. ఏ ఒకడి ఆస్తిహక్కైనా శ్రమపునాది మీదే ఆధారపడుతుందని జాన్ లాక్ అనే ఆర్థికవేత్త నొక్కిచెప్పి శ్రమకు తిరిగి పట్టం కట్టాడు. ఆడమ్ స్మిత్ అనే మరో ఆర్థికవేత్త విలువకు మూలం శ్రమేనన్నాడు. దాని ఆధారంగా డేవిడ్ రికార్డో అనే మరో ఆర్థికవేత్త శ్రమవిలువ సిద్ధాంతాన్ని ముందుకుతెచ్చాడు. కార్ల్ మార్క్స్ తాత్వికతకు అదే సారవంతమైన వనరు అయింది. శ్రమ విలువను తిరిగి గుర్తించడమే జరిగింది కానీ శ్రామికుని బతుకు బండి ఇంకా పూర్తిగా పట్టాలకెక్కలేదు. 'ఉందిలే మంచి కాలం ముందు ముందునా' అన్న కవి ఆకాంక్ష నెరవేరే రోజు ముందుకు జరుగుతూనే ఉంది. అయినా మనిషి నిత్య ఆశాజీవి కదా!

మనుషులు కాదోయ్ మాటలోయ్!

కామెంట్



కరణ్ థాపర్

దేశమంటే ఏమిటి? సరిహద్దులతో ఉండేదా? మనసులలో అడ్డుగోడలు లేని మనుషులతో నిండి ఉండేదా? లేక... జాతులు, మతాలు, భాషలు, సంప్రదాయాలు వేర్వేరుగా వేటికవిగా ఉండేదా? కలివిడిగా, కలబోతగా కట్టుబడి ఉండేదా? లేక ఒకే గతం, ఒకే వర్తమానం కలిగి ఉండి ఒకే విధమైన భవిష్యత్తును నిర్మించుకుంటూ ఉండేదా? దేశానికి ఎన్నో నిర్వచనాలు! భౌగోళికమైనవి, చారిత్రకమైనవి, సాంస్కృతికమైనవి. ఇవేవీ కాని ఒక వినూత్నమైన నిర్వచనాన్ని 'బిట్వీన్ హోప్ అండ్ డెస్పెయిర్' పుస్తక రచయిత రాజీవ్ భార్గవ ఇచ్చారు. ''దేశమంటే, సంభాషణలో ఉన్న మనుషులు'' అన్నారు భార్గవ ఈ పుస్తకంలో. మరి ఈ నిర్వచనం భారతదేశానికి కూడా వర్తిస్తుందా? తప్పకుండా వర్తిస్తుంది. అది మన దేశాన్ని గురించిన కచ్చితమైన అవగాహన!

ఇప్పటికే చదివి ఉండనందుకు చింతిస్తూ నేనొక పుస్తకం చదువుతూ ఉన్నాను. 'బిట్వీన్ హోప్ అండ్ డెస్పెర్' అనే పుస్తకం సమకాలీన భారతదేశంపై రాజీవ్ భార్గవ ప్రతిఫలింపజేసిన నైతికతల సమాహారం. వాటిలో కొన్ని నిస్సందేహంగా నిస్తేజమైనవి. అరకొరగా కొన్ని బహుశా అర్థంలేనివి. చాలావరకు మాత్రం లోతైనవీ, ఆలోచన రేకెత్తించేవీ. ముఖ్యంగా ఒకటైతే తన నవ్యత వల్ల నా ధ్యాసను తనపైకి మరల్చుకున్నది. ఇంకా చెప్పాలంటే, అది మన దేశం గురించి కచ్చితమైన అవగాహన.

పుస్తకంలో 'ఎ నేషన్ ఈజ్ ఎ పీపుల్ ఇన్ కాన్వర్సేషన్' అనే శీర్షికతో ఉన్న ఒక వ్యాసంలో... ''దేశం అంటే ఏమిటి?'' అనే ప్రశ్నకు సమాధానంగా, 'దేశమంటే సంభాషణలో ఉన్న ప్రజలు' అంటారు భార్గవ. మీరసలు ఊహించనే లేని భిన్నమైన జవాబు అది. దేశమంటే ఏమిటి అన్న ప్రశ్నకు స్కూల్లో మనకు నేర్పించిన జవాబు కచ్చితంగా ఇది మాత్రమైతే కాదు.

దేశాలను మనం జాతులు, భాషలు, మతాల వారీగా, ఇంకా... చారిత్రకంగా, భౌగోళికంగా, సాంస్కృతికంగా ఏర్పడిన మనుషుల సమూహంగా అవగాహన పరచుకున్నాం. కొన్నిసార్లు ఈ భిన్నత్వాల జోడీకి కూడా దేశం అనే ఏకరూపత స్థిరపడుతుంది. ఇందుకు స్ఫురించే ఉదాహరణలు... ఇజ్రాయిల్, కుర్దిస్తాన్, పాలస్తీనా, లిక్టన్‌స్టయిన్; జులు, బెర్బెర్ జాతులు, ఎస్కిమోలు, రెడ్ ఇండియన్‌లు, మావోరీలు. దేశాలన్నీ కూడా వీటిల్లో ఒకటీ లేదా అంతకంటే ఎక్కువగా వైవిధ్యాల కలబోత స్వభావాన్ని కలిగి ఉంటాయి.


భార్గవ ఒక దేశాన్ని చాలా భిన్నమైన కోణంలో చూస్తారు. ''అన్నిటికంటే వారి గతం, వర్తమానం, భవిష్యత్తులను గురించిన సాధారణ, లేదా అతివ్యాప్త ఆందోళనల వల్ల స్వీయ స్పృహతో జట్టు కట్టిన ప్రజాసమూహమే దేశం. ఆ ఏకతలోని చేతన జన్యుపరమైనది కాదు. ఆకాశం నుండి ఊడి పడినదీ కాదు. నోటితో, రాతలతో ఒకరితో ఒకరు మాట్లాడుకోవడం, ఒకరు చెప్పింది ఒకరు వినడం, ఒకరిని ఒకరు అర్థం చేసుకోవడం వల్ల వృద్ధి



చెందినది'' అంటారు. అందుకే భార్గవ, దేశమంటే సంభాషణలో ఉన్న ప్రజలు అన్నారు.

అయితే భారతదేశాన్ని అర్థం చేసుకోడానికి అది కచ్చితమైన ఉత్తమ నిర్వచనం అవుతుందా? లొడలొడమని కబుర్లు చెప్పడం, మాట్లాడటం, మాట్లాడేవాళ్లకు అంతరాయం కలిగించడం, కేకలు వేయడం, పెద్దగా అరవడం, విని వదిలేయడం, వినాలని పట్టుపట్టడం... ఇవేగా మనం ఎప్పుడూ చేసేది. ఇవన్నీ చేస్తున్నందుకు ఇంకెవరైనా అయితే మనల్ని 'టవర్ ఆఫ్ బాబెల్' అనేవారు. కానీ భార్గవ మన ఎడతెగని ఈ సంభాషణను మన జాతీయతలోని ప్రధానాంశంగా గుర్తించారు.

ఈ వినూత్న నిర్వచనాన్ని దాటి చూస్తే, ఆ వెనుక... నేడు మన దేశంలో ఏం జరుగుతోంది అనే విషయమై కలవరం కలిగించే ముఖ్యాంశాలు ఉండటం కనిపిస్తుంది. ''వార్తాపత్రికలు, ఆ తర్వాత టీవీ ఛానళ్లు ప్రేరేపించనిదే ప్రజల మధ్య సంభాషణలు ఉండటం లేదు. సమస్యలపై ఉమ్మడి ఆందోళనలు వృద్ధి చెందడం అన్నది కనిపించడం లేదు. కనుక దేశం అన్నదే లేదు'' అంటారు భార్గవ. అంటే, మనం ఒకరితో ఒకరం మాట్లాడుకోవడం లేదు. మీడియా ద్వారా మాత్రమే మాట్లాడుకుంటున్నాం. కనుక మన మీడియా ఆరోగ్యం –





రాజీవ్ భార్గవ

పారదర్శకత, నిష్పాక్షికత, వాక్‌స్వేచ్ఛా నిబద్ధత – మన జాతీయతకు ఎంతో కీలకమైనది. భార్గవ అడగని ఒక ప్రశ్న, ఆవేశాన్ని రేకెత్తించే ప్రశ్న... మనం వార్తాపత్రికను చేతిలోకి తీసుకున్న ప్రతిసారీ, లేదంటే వార్తా చానెల్‌ను పెట్టగానే తలెత్తుతుంది... భారతీయ మీడియా భారతదేశాన్ని అణగదొక్కుతోందా అని!

ఈ పుస్తకం మరొక ప్రశ్నను కూడా లేవనెత్తింది, బహుశా అది మరింతగా కలవరపెట్టే ప్రశ్న. మళ్లీ కూడా భార్గవ నేరుగా ప్రశ్నించడం లేదు. ప్రశ్న వైపుగా మనల్ని మళ్లిస్తున్నారు. ''ఒక దేశం అన్నది సంభాషించుకునే ప్రజా సమూహం అయినప్పుడు ఆ సంభాషణను ఎవరైనా అడ్డుకుంటే దేశాన్ని దెబ్బతీసినట్లు అవుతుంది'' అంటారు. ఈ వేలు ఎటువైపు చూపిస్తోందో నాకు తెలుసు. మీకూ తెలుసు. ఆ వేలు ఎవరి వైపు అయితే తిరిగి ఉందో వారికీ తెలుసు. ఇంతకన్నా వివరంగా చెప్పాల్సిన పని లేదని దీని అర్థం.

భార్గవ మరింత ముందుకు వెళ్లారు. సంభాషణను ఆపేయడం మాత్రమే మన దేశానికి ప్రమాదకరం కాదు. ''ఎట్టి పరిస్థితిలోనూ ప్రజల సంభాషణను ప్రభుత్వం లాగేసుకోకూడదు. ప్రజా సంభాషణను నిర్దేశించకూడదు. నియంత్రించకూడదు. సంభాషణలో ప్రభుత్వం కూడా ఒక భాగమే తప్ప తనే శాశ్వతంగా సంభాషణను నడపాలని చూడకూడదు. వాస్తవానికి సంభాషణకు అంతరాయం కలిగించే వారిని, నిరోధించే వారిని నియంత్రించడం ప్రభుత్వ విధి. దానినే దేశం ఆశిస్తోంది'' అంటారు భార్గవ. ఈ చివరి వాక్యం నాకు నచ్చింది. మన టెలివిజన్ యాంకర్లు చెప్పేది గుర్తొచ్చింది, వాళ్లు వేరే అర్థంలో చెప్పినప్పటికీ. భార్గవ వాళ్ల మాటల్ని వాళ్ల నెత్తిపైనే కుమ్మరించారు.

దేశం అంటే ఏమిటో భార్గవ ఇచ్చిన నిర్వచనంలోని అందం... వేర్వేరు జాతులు, మతాలు, భాషలు, ప్రాంతాలు, సంస్కృతులు, ఆహార సంప్రదాయాలు, భౌగోళికతలు, చారిత్రక నేపథ్యాలు కలిగివున్న వాళ్లంతా కలిసి ఉండటంలో ఉన్నప్పటికీ... ఈ వ్యత్యాసాలు కేవలం వివరణాత్మకమైనవి. అసలైనది ఏమంటే... కశ్మీర్ నుంచి కన్యాకుమారి వరకు, రాన్ ఆఫ్ కచ్ నుంచి అగర్తల వరకు మనం ఒకరితో ఒకరం సంభాషించుకుంటున్నాం. తగాదాలు ఉంటే ఉండొచ్చు. అంతరాయం కలిగించుకుంటూ ఉండొచ్చు. లేదంటే ఒక సుదీర్ఘ ప్రసంగానికి, పాండిత్యానికి, అజ్ఞానానికి, వట్టి సమాచారానికి, నీరసం కలిగించే మాటలకు చెవి ఒగ్గుతూ ఉండొచ్చు. ఇవేవీ కాదు, మనమైతే మాటల్లో ఉన్నాం. అదీ ముఖ్యం. ఈ సంభాషణ ఆగిపోతే ఏం జరుగుతుందన్నది ఆలోచించాల్సిన విషయం. భార్గవ చెప్పడం, దేశం 'విడివడడానికి' దారి ఏర్పడుతుందని! మన దేశం గురించే ఆయన చెబుతున్నారు.

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వెనక్కి నడుస్తోంది



నూతన విద్యా విధానంలో భాగంగా, డార్విన్ పరిణామ వాదాన్ని సైన్సు పాఠ్యపుస్తకాల్లోంచి తొలగిస్తున్నారు. హిందూ దశావతార సిద్ధాంతాన్ని విద్యార్థులు చదవాలని కేంద్ర ప్రభుత్వం కోరుకుంటోంది. ఇండియా నెమ్మదిగా పాకిస్తాన్ అడుగుజాడల్లో నడుస్తోంది.

– ఇంతియాజ్ మహమూద్, నాస్తికుడు

సులభతరం చేయలేరా?



చిన్న దేశమైన థాయ్‌లాండ్ కూడా భారత్ కంటే దాదాపు రెట్టింపు సంఖ్యలో అంతర్జాతీయ టూరిస్టులను ఆకర్షిస్తోంది. దీనికి చాలా కారణాలున్నాయి. కానీ పెద్ద కారణం ఏమంటే, సామాన్య ప్రయాణికులకు ఇండియా వీసా దొరకడం చాలా కష్టంగా మారిపోయింది. దీన్ని ఎందుకంత మిస్టరీగా మార్చేస్తున్నారు?

– తవ్లీన్ సింగ్, కాలమిస్ట్

మాట్లాడాల్సిన అంశం



హిజాబ్ ధరించనందుకు ఇరాన్ ప్రభుత్వం మహిళలను శిక్షిస్తోంది. మహిళలు నడిపే దుకాణాలు మూతపడ్డాయి. ఇదెంత సిగ్గుచేటు! ప్రపంచం తాలిబన్ గురించి ఆందోళన చెందింది. కానీ ఎవరూ ఎందుకు ఇరాన్‌లో ఇస్లామిక్ రాడికలిజం గురించి మాట్లాడటం లేదు?

– సంజుక్తా బసు, సంపాదకురాలు

ఇది యుద్ధమా?



రష్యా, ఉక్రెయిన్ పౌరుల్ని చంపుతోంది. ఇందులో పిల్లలు కూడా ఉన్నారు. ఇది యుద్ధం కాదు. ఇది తీవ్రవాదం.

– స్టీఫెన్ కింగ్, రచయిత

అసలైనది చూడాలి




ఒక ఆందోళనను స్వీయ ప్రయోజనాలు ఉన్నవాళ్లు హైజాక్ చేసినంత మాత్రాన, ఆ మొత్తం ఆందోళనే అర్థంలేనిది అయిపోదు.

– దివ్య, సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్

ఇన్‌బాక్స్

విశ్వదాత విశ్వఖ్యాతి

స్వాతంత్ర్య సమరయోధుడిగా, పాత్రికేయుడిగా, వ్యాపారవేత్తగా, రాజకీయ నేతగా, విద్యాదాతగా, వితరణ శీలిగా వినుతికెక్కిన విశ్వదాత.. కాశీనాథుని నాగేశ్వరరావు. ఆయన 1867 మే 1వ తేదీన కృష్ణా జిల్లా పామర్రు సమీప ఎలకుర్రు గ్రామంలో జన్మించారు. వివేకవర్ధని పత్రికలో కందుకూరి వీరేశలింగం రాసిన వ్యాసాలతో స్ఫూర్తి పొందారు. స్వాతంత్ర్యోద్యమ కాలంలో తెలుగువారికి సొంత భాషలో సమాచారం ఇవ్వాలనే లక్ష్యంతో 1908లో 'ఆంధ్రపత్రిక'ను బొంబాయి నుంచి వారపత్రికగా ప్రారంభించారు. మొదటి ప్రపంచ యుద్ధ సమయంలో విశ్వవ్యాప్తంగా జరుగుతున్న పరిణామాలను వెనువెంటనే అందించాలనే ఉద్దేశంతో 1914 ఏప్రిల్ 1న మద్రాసులో దినపత్రికను నెలకొల్పారు.



ఇవికాక సాహితీప్రియుల కోసం 'భారతి' పత్రికను తీసుకొచ్చారు. 1926లో 'ఆంధ్ర గ్రంథమాల' పేరిట ప్రచురణ సంస్థను స్థాపించి ఎందరో మహనీయుల పుస్తకాలను ప్రచురించారు. గ్రంథాలయ ఉద్యమానికి తన వంతు ఊపిరులూదారు. ఆ విధంగా తెలుగు భాషకు విశేష సేవలందించిన మహానుభావుడు నాగేశ్వరరావు పంతులు. తెలుగువారంతా కలిసి ఆయనను 'దేశోద్ధారక' బిరుదుతో సత్కరించారు.

1893లో 'అమృతాంజన్ లిమిటెడ్'ను స్థాపించి అమృతాంజనాన్ని ప్రజలకు అందించారు. కాశీనాథుని చేతికి ఎముకే లేదని చెప్పుకునేవారంటే అతిశయోక్తి కాదు. ఆయన దాతృత్వాన్ని చూసిన మహాత్మాగాంధీ 'విశ్వదాత'గా కితాబిచ్చారు. ఆ పేరుతోనే ఆయన కుటుంబీకులు ప్రతి ఏటా ఇప్పుడు ఓ అవార్డు ఇస్తున్నారు.

– చెన్నాప్రగడ వీఎన్నెస్ శర్మ, విశ్రాంత జర్నలిస్టు

(మే 1 కాశీనాథుని జయంతి, మే 3న 'విశ్వదాత' అవార్డుల ప్రదానోత్సవం)

పురోగమనమా? తిరోగమనమా?

అభిప్రాయం



జూలకంటి రంగారెడ్డి

మనది ప్రపంచంలోనే అతిపెద్ద ప్రజాస్వామ్య దేశం. ప్రజాస్వామ్యానికి ప్రతిపక్షమే కీలకం. కానీ ప్రతిపక్షాలు లేకుండా ఏకపక్ష పాలన చేయాలనుకుంటోంది కేంద్రంలోని మోదీ ప్రభుత్వం. తొమ్మిదేండ్ల కిందట అధికారంలోకి రాకముందు ప్రజా సంక్షేమమే లక్ష్యంగా, అవినీతికి తావు లేని పాలన అందిస్తామని నమ్మబలికిన బీజేపీ గద్దెనెక్కాక తన మాటలను పూర్తిగా విస్మరించింది. పేదలను కొట్టి పెద్దలకు పెట్టే చర్యలనే అమలు చేస్తున్నది. ఓవైపు కరెన్సీ విలువ పడిపోతున్నది. ద్రవ్యోల్బణం పెరిగిపోతున్నది. ఆర్థిక సంక్షోభం అలుముకుంటున్నది. జీడీపీ తలకిందులవుతున్నది. పరిశ్రమలు మూతపడుతున్నాయి. నిరుద్యోగం పెరిగిపోతున్నది. కార్పొరేట్ల సంపద మాత్రం లక్షల కోట్లకు పెరిగిపోతున్నది. మోదీని ప్రజలు ఎన్నుకున్నది తమ బతుకులను బాగు చేస్తాడనీ, ప్రజలందరినీ సోదర భావంతో కలిపి ఉంచుతాడనీ. కానీ ఇందుకు పూర్తి విరుద్ధంగా బీజేపీ ప్రభుత్వం వ్యవహ రిస్తోంది.

భిన్నత్వంలో ఏకత్వంగా సాగుతున్న ప్రజల్ని కులం పేర, మతం పేర చీల్చే ప్రయత్నాలు చేస్తున్నది. బీజేపీ దేశభక్తి పేరుతో బీజేపీ అనుసరిస్తున్న విధానాలను విమర్శించిన వారిని అక్రమ అరెస్టులు, కేసులతో జైళ్ల పాలు చేస్తూ భయాందోళనలు సృష్టిస్తోంది. నేరస్థులను చట్ట ప్రకారం కాకుండా... తాను అనుకున్న ప్రకారం శిక్షిస్తున్నది. అందులో భాగంగానే ఇటీవలి వరుస ఘటనలను చూడాలి. నిన్నగాక మొన్న ఉత్తరప్రదేశ్‌లో ప్రభుత్వాలే పెంచి పోషించిన నేరస్థులను పోలీసుల సమక్షంలోనే కాల్చివేసిన సంఘటన ఏం సంకేతాలనిస్తోంది? యూపీలో ఇప్పటివరకు యోగి పాలన... నేరచరిత్ర ఉందంటూ 233 మందిని ఎన్‌కౌంటర్ చేసింది. 4,484 మందిని నేరస్థుల పేరుతో కస్టడీలో మగ్గేలా చేసింది. తమ మాట వినని ప్రతిపక్షాలను, నాయకులను అక్రమ కేసులు పెట్టి ఈడీ, సీబీఐ సంస్థల ద్వారా లొంగ దీసుకుంటున్నది.

గవర్నర్లను రబ్బర్ స్టాంపులుగా వాడేస్తోంది. వారి మాటలకు విలువే ఇవ్వడం లేదు. ఇటీవల జమ్మూ కశ్మీర్ మాజీ గవర్నర్ సత్యపాల్ మాలిక్ మోదీ ప్రభుత్వంపై సంచలన ఆరోపణ చేశారు. పుల్వామా ఘటనకు కేంద్ర ప్రభుత్వం నిర్లక్ష్య వైఖరే కారణమని ఆయన 'వైర్', 'టెలిగ్రాఫ్'లకు ఇచ్చిన ఇంటర్వ్యూల్లో అన్నారు. తాను జమ్మూ కశ్మీర్‌లో పరిస్థితులను వివరించి సైన్యాన్ని తరలించడానికి విమానాలను ఉపయోగించాలని తెలిపినా... కేంద్ర ప్రభుత్వం పక్కన పెట్టిందని ఆయన ఆరోపించారు. కేంద్రం అసమర్థత, చేతకానితనం వల్లనే 40 మంది జవానులు మరణించారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. అంటే పుల్వామా ఘోరం మోదీ పాప ఫలితమేనన్న మాట!



మోదీ ప్రభుత్వం అంబేడ్కర్ పేరు జపిస్తూనే రాజ్యాంగాన్ని నీరు గారుస్తున్నది. దళితులపై, మైనార్టీలపై, మహిళలపై దాడులు, దౌర్జన్యాలు పెరుగుతున్నా మౌనం వహిస్తోంది. ఇటీవల గుజరాత్ రాష్ట్రంలో బిల్కిస్ బానోపై సామూహిక లైంగికదాడి కేసులో నిందితులు 11 మందిని ప్రభుత్వం విడుదల చేయటాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా తప్పు బట్టింది. బీజేపీ ప్రభుత్వాల నిర్వాకానికి ఇదొక ఉదాహరణ మాత్రమే!

మోదీ ప్రభుత్వం వచ్చిన తర్వాత క్రమక్రమంగా నష్టాల పేరుతో ప్రభుత్వ రంగ సంస్థలను మూసివేసే ప్రక్రియ ప్రారంభించింది. కారుచౌకగా వాటి అమ్మకాలకు తలుపులు తెరిచింది. గత ఏడు సంవత్సరాలుగా నిరాటంకంగా బీఎస్ఎన్ఎల్, ఇనుము ఉక్కు పరిశ్రమకు చెందిన ప్రభుత్వ రంగ సంస్థలను పారిశ్రామిక దిగ్గజాలకు కారుచౌకగా కట్టబెడుతున్నది. అందులో భాగంగానే ఎన్నో త్యాగాలతో సంపాదించుకున్న వైజాగ్ స్టీల్ ప్లాంట్ అమ్మకానికి తెరలేపింది. ఇప్పటికే రోడ్డున పడ్డ కార్మికులు ఉద్యమాలు చేస్తున్నా పట్టించుకునే పరిస్థితిలో లేదు మోదీ ప్రభుత్వం. ఇవేగాక సంస్కరణల పేరుతో రైతాంగానికి వ్యతిరేకంగా, కార్పొరేట్లకు అనుకూలంగా మూడు వ్యవసాయిక చట్టాలు తీసుకొచ్చి రైతులను అగచాట్ల పాలు చేసింది. దేశవ్యాప్తంగా తీవ్రమైన నిరసనలు వెల్లువెత్తడంతో వెనక్కితగ్గింది. కార్మిక చట్టాలను సవరణ పేరుతో నాలుగు కోడ్‌లుగా విభజించి పరిశ్రమల యాజమాన్యాలకు మేలు చేకూర్చింది. దీంతో ఏండ్లుగా పోరాడి సాధించుకున్న 8 గంటల పని విధానం కూడా 12 గంటలకు మార్చబడింది.

బీజేపీ పాలిత రాష్ట్రమైన గుజరాత్‌లో లక్ష కోట్ల రూపాయల స్కామ్ జరిగిందని వార్తలు వెల్లడిస్తున్నాయి. కాగ్ నివేదికలో ఈ విషయం బట్టబయలైంది. 2017 నుంచి 2022 మధ్యకాలంలో ఇతర రాష్ట్రాలకు నిధులు నిలుపుదల చేసి ఆర్థిక ఇబ్బందులకు గురి చేస్తూ ఉన్న కేంద్రం... ఇతర పద్దుల కింద రూ. 1.18 లక్షల కోట్ల ప్రజాధనం పంపిణీ పేరుతో అయినవాళ్లకు అందించింది. గ్రాంట్లకు సంబంధించిన వివరాలను గుజరాత్ రాష్ట్ర ప్రభుత్వం దాచిపెడుతోందని కాగ్ తన నివేదికలో ఆరోపించింది. మోదీ సొంత రాష్ట్రమైన గుజరాత్‌కు మాత్రం భారీగా నిధులను గ్రాంట్ల రూపంలో విడుదల చేస్తూ సహకారమందిస్తున్నది. కానీ, తనకు అననుకూలమైన రాష్ట్రాలకు ఆర్థికపరమైన చెల్లింపులలో మోకాలడ్డుతున్నది. అలా అన్యాయానికి గురవుతున్న రాష్ట్రాల్లో రాష్ట్రాలున్నాయి. తొమ్మిదేళ్ల కాలంలో ఏపీకి ముఖ్యమైన స్పెషల్ స్టేటస్‌కానీ, తెలంగాణకు అవసరమైన ప్రాజెక్టులను గానీ ఇవ్వకపోగా, రెండు రాష్ట్రాల మధ్య తగవులు పెడుతోంది మోదీ ప్రభుత్వం.

మోదీ ఈ తొమ్మిదేండ్ల పాలన తొంభై ఏండ్లు వెనక్కి నడిపించి దేశాన్ని అధోగతి పాలు చేసింది. మోదీ నియంతృత్వ పాలనకు చరమగీతం పాడటానికి జరుగుతున్న పోరాటంలో ప్రజలందరూ భాగస్వాములవ్వాలి. 'మోదీ హటావో,' 'కార్పొరేట్ హటావో' నినాదాలతో ముందుకు సాగాలి. ప్రజాస్వామ్యాన్నీ, లౌకిక రాజ్యాంగాన్నీ కాపాడుకోవాలి.

వ్యాసకర్త సీపీఎం తెలంగాణ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు

చూసే చూపులోనే...

ఓ ఆశ్రమంలో ఇద్దరు విద్యార్థుల మధ్య 'అందం అనేది మనం చూసే చూపును బట్టి ఉంటుంది' అనే విషయంపై చర్చ జరుగుతోంది. ఒక విద్యార్థి దీన్ని సమర్థిస్తుంటే... మరొక విద్యార్థి వ్యతిరేకిస్తున్నాడు. చివరికి ఇద్దరూ గురువు గారి దగ్గరకు వెళ్లి వాస్తవమేమిటో సెలవివ్వమన్నారు. గురువుగారు 'మన దృక్కోణాన్ని బట్టే అందం' అన్నారు. కానీ రెండో విద్యార్థి దాన్ని నిరూపించమని కోరాడు.

దాంతో గురువుగారు శిష్యులిద్దరినీ ఒక మురికి కాలువ దగ్గరకు తీసుకుపోయారు. ఇంతలో ఓ తండ్రీ – కొడుకూ పోతున్నారు. కాలువ నుంచి దుర్వాసన వస్తోంది. నీరు పరమ మురికిగా ఉంది. కొడుకు ఉన్నట్టుండి 'నాన్నా నాన్నా, అదిగో అక్కడ చూడండి, హరివిల్లు' అన్నాడు తండ్రితో. 'ఎక్కడరా హరివిల్లు? మురికి నీళ్ళు పారుతున్నాయి. నల్లగా ఉందా మురికినీరు. మురికి కాలువ మాత్రమే కనిపిస్తోంది' అన్నాడు తండ్రి.



జ్యోతిర్మయం

అయితే ఎవరో అజాగ్రత్తతో ఆ కాలువలో వంపిన నూనె... ఆ నీటి మీద విస్తరించి సూర్యుడి కిరణాలు సోకి సప్తవర్ణాల హరివిల్లులా కనిపిస్తోంది ఆ కుర్రాడికి. తండ్రికేమో మురికి నీరు మాత్రమే కనిపిస్తోంది. ఈ విషయాన్ని తన శిష్యులకు విశ్లేషిస్తూ ... 'ఇద్దరూ చూస్తున్నది కాలువలోకే. కానీ వారి చూసే చూపులో తేడా ఉంది కాబట్టి ఇద్దరికీ వేరు వేరు దృశ్యాలు కనిపించాయ'న్నారు గురువుగారు. 'కొందరికి ఎంత అందమైనదైనా అంద విహీనంగానే కనిపిస్తుంది. ఇంకొందరికి అతి సాధారణంగా కనిపించేదీ మహా సౌందర్యవంతంగా కనిపిస్తుంది. అలాగే ఒకరికి ఏదైతే మంచి అనిపిస్తుందో మరొకరికి అది చెడుగా అనిపించొచ్చు. ఒకరికి ఏది ఒప్పవుతుందో అది ఇంకొకరికి తప్పు కావచ్చు. చూసే దానిని బట్టీ, ఆలోచించే విధానాన్ని బట్టీ అంద వికారాలూ, మంచీ చెడులూ సాక్షాత్కరిస్తాయి. ఈ విషయంలో దృష్టితోపాటు మనసు కూడా తన వంతు పాత్ర పోషిస్తుంది' అంటూ విశ్లేషించారు గురువుగారు. శిష్యులు ఈ వివరణకు సంతోషిస్తూ ఆశ్రమానికి వెనుతిరిగారు.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, వసంత ఋతువు, వైశాఖ మాసం, **తిథి:** శు.ఏకాదశి రా.8.35 వరకు, తదుపరి ద్వాదశి, **నక్షత్రం:** పుబ్బ సా.4.34 వరకు, తదుపరి ఉత్తర, **వర్జ్యం:** రా.12.22 నుండి 2.06 వరకు, **దుర్ముహూర్తం:** ప.12.21 నుండి 1.11 వరకు, తదుపరి ప.2.54 నుండి 3.44 వరకు, **అమృతఘడియలు:** ఉ.9.34 నుండి 11.21 వరకు; **రాహుకాలం:** ఉ.7.30 నుండి 9.00 వరకు, **యమగండం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **సూర్యోదయం:** 5.39, **సూర్యాస్తమయం:** 6.15.

క్లుప్తంగా...

మంత్రులూ బానిస సంకెళ్లు తెంచుకోండి: నాగం

సాక్షి, నాగర్‌కర్నూల్: తెలంగాణ సచివాలయానికి అంబేడ్కర్ పేరు పెట్టినందుకైనా ఇకపై రాజ్యాంగబద్ధంగా పాలన సాగాలని కోరుకుంటున్నానని మాజీమంత్రి, కాంగ్రెస్ నేత నాగం జనార్దన్‌రెడ్డి పేర్కొన్నారు. ఆదివారం నాగర్‌కర్నూల్ జిల్లాకేంద్రంలో విలేకరులతో మాట్లాడుతూ... మంత్రులు బానిస సంకెళ్లు తెంచుకోవాలని, ఇక నుంచైనా సొంత నిర్ణయాలు తీసుకుంటూ ఆత్మగౌరవంతో బతకాలని, ఆఖరి సంతకాలైనా ప్రజలకు మేలు చేకూర్చేలా పెట్టాలని కోరారు. ఇప్పటినుంచి ప్రభుత్వ ఆదేశాలు ప్రగతి భవన్ నుంచి కాకుండా సచివాలయం నుంచి వస్తాయని ఆశిస్తున్నట్లు చెప్పారు. కొత్త సచివాలయం ప్రారంభోత్సవం సందర్భంగా మీడియాపై ఆంక్షలు విధించడం సరికాదని, పత్రికా స్వేచ్ఛను కాపాడాలని విజ్ఞప్తి చేశారు. సచివాలయం బీఆర్‌ఎస్‌దో, మరే పార్టీదో కాదని ప్రజలందరికీ చెందినదని చెప్పారు. నాగర్‌కర్నూల్‌లో నల్లమట్టి, ఇసుక అక్రమాలపై విచారణ జరిపించాలని కోరుతూ సీఎం కేసీఆర్‌కు లేఖ రాస్తున్నట్లు వివరించారు. కొత్త సచివాలయంలో సీఎం బాధ్యతలు స్వీకరించాక వచ్చిన మొదటి లేఖపై స్పందించాలని కోరారు.

సీపీఐ ఎన్నికల గుర్తు కంకి కొడవలే

రాష్ట్ర ఎన్నికల కమిషన్ నోటిఫికేషన్ ఇచ్చిందన్న కూనంనేని



సాక్షి, హైదరాబాద్: తెలంగాణలో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) గుర్తింపు కొనసాగిస్తున్నట్లుగా రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటించిందని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు తెలిపారు. కేరళ, మణిపూర్, తమిళనాడు రాష్ట్రాలతో పాటు తెలంగాణలోనూ రాష్ట్ర గుర్తింపును కొనసాగిస్తున్నట్లుగా ఆ నోటిఫికేషన్‌లో వెల్లడించినట్టు ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. 2018 ఎన్నికల నియమావళి ప్రకారం రాష్ట్రంలో పార్టీ నిర్మాణం, ఇతర అంశాలను పరిగణనలోకి తీసుకొని రాష్ట్రస్థాయి గుర్తింపును కొనసాగిస్తున్నట్లుగా, స్థానిక సంస్థలతోపాటు, రాష్ట్రంలో పార్టీ ప్రాతిపదికగా జరిగే అన్ని ఎన్నికల్లో 'కంకి కొడవలి'గుర్తును యథాతథంగా కొనసాగిస్తున్నట్లుగా ఈసీ తెలిపినట్లు కూనంనేని పేర్కొన్నారు.

పంట నష్టపోయిన రైతులకు పరిహారం ఎక్కడ?

- వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు షర్మిల
- ఎండకు సొమ్మసిల్లి పడిపోయిన షర్మిల



మొక్కజొన్న పంట నష్టపోయిన రైతుతో మాట్లాడుతున్న షర్మిల

కొణిజర్ల: పంట నష్టపోయిన రైతులకు ముఖ్యమంత్రి కె.చంద్రశేఖరరావు ఎకరాకు రూ.10 వేల చొప్పున్న ఇస్తానన్న డబ్బులు ఎక్కడ అని వైఎస్సార్‌టీపీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల ప్రశ్నించారు. ఖమ్మం జిల్లా కొణిజర్ల, బోనకల్ మండలాల్లో ఆదివారం ఆమె పర్యటించారు. కొణిజర్ల మండలం తుమ్మలపల్లిలో అకాల వర్షాలతో దెబ్బతిన్న పంటలను పరిశీలించారు. అనంతరం బోనకల్ మండలం లక్ష్మీపురంలో దెబ్బతిన్న మొక్కజొన్న పంటను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ...మార్చి 23న బోనకల్ మండలానికి వచ్చిన సీఎం కేసీఆర్ పంటలను పరిశీలించి ఎకరాకు రూ.10 వేలు ఇస్తామని ప్రకటించారని, ఆయన హైదరాబాద్ వెళ్లకముందే నిధులు విడుదలవుతాయని చెప్పారని ఇప్పటికీ రూపాయి కూడా జమకాలేదని విమర్శించారు. కేసీఆర్ ఇంకా ఇంటికి పోలేదేమోనని ఎద్దేవా చేశారు. సచివాలయ నిర్మాణానికి రూ.1,500 కోట్లు ఖర్చు చేశారని, సెక్రటేరియట్‌కే పోని కేసీఆర్‌కు ఈ భవనం ఎందుకని ప్రశ్నించారు.

సొమ్మసిల్లిన షర్మిల

పంటల పరిశీలనకు తుమ్మలపల్లికి చేరుకున్న షర్మిల మొక్కజొన్న చేనులో 10 నిమిషాల పాటు రైతులతో మాట్లాడారు. అనంతరం మీడియాతో మాట్లాడుతూ ఒక్కసారిగా సొమ్మసిల్లి కింద పడిపోవడంతో పక్కనే ఉన్న పార్టీ రాష్ట్ర మహిళా కోఆర్డినేటర్ గడిపల్లి కవిత పట్టుకున్నారు. షర్మిల వ్యక్తిగత భద్రతా సిబ్బంది, స్థానిక మహిళలు సపర్యలు చేయడంతో కోలుకుని తిరిగి ప్రసంగం కొనసాగించారు. ఆమె వెంట వైఎస్సార్‌టీపీ నాయకులు పిట్టా రాంరెడ్డి, దొంతమాల కిషోర్‌కుమార్, వాకా వీరారెడ్డి తదితరులు ఉన్నారు.

ఉద్యోగుల క్రమబద్ధీకరణపై హర్షం: బాలరాజు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వ శాఖల్లో కాంట్రాక్టు పద్ధతిలో పనిచేస్తున్న ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఫైలుపై సీఎం కేసీఆర్ సంతకం చేయడం పట్ల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల ఉపాధ్యాయ, ఉద్యోగ సంఘ అధ్యక్షులు సీహెచ్ బాలరాజు హర్షం వ్యక్తం చేశారు. ప్రస్తుతం 5వేల ఉద్యోగులకు మాత్రమే ఉత్తర్వులు వెలువడ్డాయని, మిగిలిన ఉద్యోగుల క్రమబద్ధీకరణ ఉత్తర్వులను వెంటనే విడుదల చేయాలని ఆయన కోరారు. ప్రభుత్వం ఈ అంశంపై వెంటనే చర్యలు తీసుకోవాలని విన్నవించారు.



దళిత శక్తి పార్టీ సభకు హాజరైన జనం



అభివాదం చేస్తున్న విశారదన్ మహరాజ్

రాజకీయ పార్టీగా దళిత శక్తి

- స్వరాజ్యంతోనే సమస్యలన్నింటికీ శాశ్వత పరిష్కారం
- పదివేల కి.మీ. స్వరాజ్య పాదయాత్ర ముగింపు సభలో విశారదన్ మహరాజ్
- భారీ వర్షంలోనూ రాత్రివరకు కొనసాగిన సభ

సాక్షి, రంగారెడ్డి జిల్లా: రాష్ట్రంలో మరో కొత్త పార్టీ... దళిత శక్తి పార్టీ (డీఎస్పీ) ఆవిర్భావమైంది. అట్టడుగు వర్గాలను రాజ్యాధికారంలో భాగం చేసేందుకు దళితశక్తి సంస్థను పార్టీగా మార్చుతున్నట్లు డీఎస్పీ వ్యవస్థాపకుడు డాక్టర్ విశారదన్ మహరాజ్ చెప్పారు. కాన్షీరాం ఇచ్చిన స్ఫూర్తితో ఇకపై తెలంగాణ గడ్డపై ప్రత్యక్ష రాజకీయ యుద్ధం చేయబోతున్నట్లు ప్రకటించారు. గ్రామస్థాయి నుంచి దేశస్థాయి వరకు అధికారం కోసం పోటీ పడబోతున్నట్లు చెప్పారు. తెలంగాణవ్యాప్తంగా పదివేల కిలోమీటర్ల పాదయాత్రను పూర్తి చేసుకుని ఆదివారం రాత్రి సరూర్‌నగర్ స్టేడియం వేదికగా బహిరంగ సభను ఏర్పాటు చేశారు. సుమారు పదివేల మంది కార్యకర్తలు ఈ సభకు హాజరయ్యారు. ఏకధాటిగా వర్షం కురుస్తున్నా.. లెక్కచేయకుండా కుర్చీలను తలపై పెట్టుకుని విశారదన్ మహరాజ్ ప్రసంగాన్ని చివరివరకు విన్నారు. జనాభాలో 90 శాతం ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ ఓట్లతో పదిశాతం అగ్ర వర్ణాలు రాజకీయం చేస్తున్నాయని, వారి ఆధిపత్యాన్ని ఇక ఏమాత్రం కొనసాగనివ్వబోమని ఆయన స్పష్టం చేశారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆలోచనా విధానాన్ని పునర్జీవింపజేసేందుకే ఆయన రాసిన రాజ్యాంగాన్ని చేతిలో పట్టుకుని 33 జిల్లాలు, 412 రోజులు, 10 వేల కిలోమీటర్లు.. పాదయాత్ర చేసినట్లు చెప్పారు. అధికారంతో పాటు రాజ్య సంపదను ప్రతి ఒక్కరికి పంచినప్పుడే ఘనరాజ్యానికి అర్థం ఉంటుందని, ఆ దిశగా డీఎస్పీ పనిచేస్తుందని విశారదన్ హామీ ఇచ్చారు. బీసీ సంఘం అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ.. వృత్తులు వేరైనా బహుజనుల రక్తం మాత్రం ఒక్కటేనన్నారు. వృత్తులుగా, కులాలుగా విడగొట్టబడిన వారంతా రాజ్యాధికారం కోసం ఒక్కటి కావాల్సిన అవసరం ఉందన్నారు. సభలో అఖిల భారత సంత్ మహరాజ్ అధ్యక్షుడు సద్గురుసంత్ సుఖ్‌దేవ్, డీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు హరీశ్‌గౌడ్, ప్రతినిధులు రమేష్‌బాబు, కృష్ణానాయక్, రాఘవేందర్ ముదిరాజ్, రాజు పూలమాల, అబ్దుల్‌రహీం, వినోద్ యాదవ్, తదితరులు పాల్గొన్నారు.

ప్రశ్నపత్రాలు అమ్ముకునుడే తెలంగాణ మోడలా?

▶ మొదటి పేజీ తరువాయి

కేసీఆర్ ఇప్పుడు అంబేడ్కర్ పేరుచెప్పి మళ్లీ ఓట్లు దండుకోవాలని చూస్తున్నారని మండిపడ్డారు.

పాలమూరును అవమానించారు

కల్వకుర్తి, జూరాల, నెట్టెంపాడు, కోయిల్‌సాగర్ ప్రాజెక్టులన్నీ కాంగ్రెస్ హయాంలో కట్టినవేనని రేవంత్ పేర్కొన్నారు. కేసీఆర్ కరీంనగర్ నుంచి పారిపోయి పాలమూరుకు వలస వస్తే ప్రజలు ఆదరించి ఎంపీగా గెలిపించారని.. కానీ కేసీఆర్ పాలమూరును అవమానించారని మండిపడ్డారు. తొమ్మిదేళ్లయినా పాలమూరు–రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టును ఎందుకు పూర్తి చేయలేదని నిలదీశారు. కాంగ్రెస్ హయాంలోనే మహబూబ్‌నగర్‌కు పాలమూరు యూనివర్సిటీ వచ్చిందన్నారు. రాష్ట్రంలో అభివృద్ధి నిధులన్నీ సిద్దిపేట, సిరిసిల్ల, గజ్వేల్‌కు తరలుతున్నాయని ఆరోపించారు.

అంబేడ్కర్ విగ్రహాన్ని తాకే అర్హత కూడా కేసీఆర్‌కు లేదు

కేసీఆర్ కుటుంబ సభ్యులుగానీ, బంధువులు కానీ తెలంగాణ కోసం ప్రాణాలు కోల్పోలేదని.. తెలంగాణ కోసం ప్రాణాలు ఇచ్చింది బడుగు, బలహీనవర్గాలకు చెందిన పేదింటి బిడ్డలేనని రేవంత్‌రెడ్డి పేర్కొన్నారు. సెక్రటేరియట్‌కు అంబేడ్కర్ పేరు పెట్టామని కేసీఆర్ గొప్పలు చెప్పుకుంటున్నారని.. మరి పంజాగుట్ట చౌరస్తాలో అంబేడ్కర్ విగ్రహం పెడతానని వి.హనుమంతరావు కోరితే ఎందుకు అనుమతించలేదని నిలదీశారు. మంత్రివర్గంలో ఒక్క మాదిగకు కూడా చోటు ఇవ్వలేదేమని ప్రశ్నించారు. అంబేడ్కర్ విగ్రహాన్ని తాకేందుకు కూడా కేసీఆర్‌కు అర్హతలేదని వ్యాఖ్యానించారు.

వనపర్తి సభతోనే తెలంగాణకు బీజం

కేవలం సీఎం కేసీఆర్, టీఆర్‌ఎస్ (బీఆర్‌ఎస్) పోరాటం చేస్తేనే తెలంగాణ రాలేదని రేవంత్‌రెడ్డి అన్నారు. 2000వ సంవత్సరంలో కాంగ్రెస్ నేత చిన్నారెడ్డి ఆధ్వర్యంలో 42మంది ఎమ్మెల్యేలు తెలంగాణ ఏర్పాటు చేయాలని సంతకాలు చేసి సోనియాగాంధీకి లేఖ ఇచ్చారని.. అదే మలిదశ ఉద్యమానికి బీజం వేసిందని చెప్పారు. అప్పుడు వనపర్తిలో సభపెడితే 50వేల మంది వచ్చారని.. దీన్ని గ్రహించిన కేసీఆర్ తెలంగాణ నినాదం ఎత్తుకున్నారని పేర్కొన్నారు. శ్రీకాంతాచారి, కృష్ణయ్య వంటివారు ప్రాణత్యాగాలు చేస్తే తెలంగాణ వచ్చిందన్నారు.



నిరుద్యోగ నిరసన ర్యాలీలో రేవంత్‌రెడ్డి, నాగం, సంపత్‌కుమార్ తదితరులు

మీ బిడ్డను సంపుకుంటారో.. సాదుకుంటారో..

పాలమూరు బిడ్డకు రాష్ట్ర కాంగ్రెస్ రథసారథిగా సోనియాగాంధీ అవకాశం ఇచ్చారని.. మీ బిడ్డను సంపుకుంటారో, సాదుకుంటారో మీరే ఆలోచించుకోవాలని ప్రజలకు రేవంత్‌రెడ్డి పిలుపునిచ్చారు. ఉమ్మడి జిల్లాలోని 14 ఎమ్మెల్యే, 2 ఎంపీ స్థానాల్లో కాంగ్రెస్ అభ్యర్థులను గెలిపించాలన్నారు. సరూర్‌నగర్‌లో విద్యార్థి నిరుద్యోగ, నిరసన ర్యాలీకి మే మొదటి వారంలో ప్రియాంకా గాంధీ వస్తున్నారని.. పాలమూరు నుంచి పెద్ద ఎత్తున తరలిరావాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నేతలు వీహెచ్, చిన్నారెడ్డి, నాగం జనార్దనరెడ్డి, రాములు నాయక్, మల్లురవి, సంపత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ప్రొటోకాల్ ఉల్లంఘించిన సీఎంవో

టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ ట్వీట్

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర నూతన సచివాలయ ప్రారంభోత్సవం అధికారిక కార్యక్రమమైనా ముఖ్యమంత్రి కార్యాలయం ఎక్కడా ప్రొటోకాల్ పాటించలేదని టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆదివారం ఆయన తన ట్విట్టర్‌లో పోస్టు చేశారు. 'కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడగానే తెలంగాణ సచివాలయం, అమరవీరుల స్తూపం, అంబేడ్కర్ విగ్రహ నిర్మాణంలో జరిగిన అవినీతి నిగ్గుతేల్చి దోషులను కఠినంగా శిక్షిస్తామని.. తన ట్వీట్‌లో రేవంత్ స్పష్టం చేశారు.

24న 'నావిక్‌–01' ఉపగ్రహ ప్రయోగం



నావిక్‌–01 ఉపగ్రహం

సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధనా సంస్థ (ఇస్రో) శ్రీహరికోటలోని సతీష్ ధావన్ స్పేస్ సెంటర్(షార్) నుంచి మే 24వ తేదీన జీఎస్‌ఎల్‌వీ–ఎఫ్12 రాకెట్ ద్వారా నావిక్–01 (ఐఆర్ ఎన్‌ఎస్‌ఎస్–1జే) అనే ఉపగ్రహాన్ని ప్రయోగించనుంది. షార్‌లోని రెండో ప్రయోగవేదిక నుంచి దీనిని నిర్వహించేందుకు మొదటి అసెంబ్లింగ్ బిల్డింగ్‌లో రాకెట్‌ను అనుసంధానం చేసే పనులు ప్రారంభించారు. షార్‌లో లాంచింగ్ వసతులు పెరిగిన తర్వాత నెలకు ఒక ప్రయోగం చేయాలని ఇస్రో శాస్త్రవేత్తలు నిర్ణయించారు. ఇందులో భాగంగా ఏప్రిల్ 22న పీఎస్‌ఎల్‌వీ సీ55ని ప్రయోగించారు. ఆ ప్రయోగం పూర్తయిన వెంటనే మే 24న జీఎస్‌ఎల్‌వీ ఎఫ్12 ద్వారా నావిక్–01 ఉపగ్రహ ప్రయోగానికి శాస్త్రవేత్తలు సిద్ధమవుతున్నారు. ఇండియన్ రీజనల్ నావిగేషన్ శాటిలైట్ సిస్టం (ఐఆర్‌ఎన్‌ఎస్‌ఎస్)ను బలోపేతం చేయడానికి ఈ ప్రయోగం చేస్తున్నారు.

ఈ శతాబ్దపు అద్భుత కట్టడం

సాక్షి, హైదరాబాద్: ముఖ్యమంత్రి కేసీఆర్ ఆదివారం ప్రారంభించిన తెలంగాణ రాష్ట్ర సచివాలయ భవనం రాష్ట్రంలో ఈ శతాబ్దపు అద్భుత కట్టడమని పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ అభివర్ణించారు. సీఎం కేసీఆర్ దార్శనికతకు ఈ భవనం నిలువెత్తు నిదర్శనమని ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కేంద్రం నిర్మిస్తున్న నూతన పార్లమెంట్ భవనం కంటే విశాలమైన సచివాలయ భవనంలో ఎన్నో అత్యాధునిక వసతులున్నాయని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి, మంత్రులు, కార్యదర్శులు, సిబ్బంది అంతా ఒకే భవనంలో పనిచేసేలా ఉన్న సచివాలయం.. తెలంగాణలో మినహా దేశంలో మరెక్కడా లేదని స్పష్టం చేశారు.

మండు వేసవిలో మెండుగా ముహూర్తాలు

రెండు నెలల్లో మొత్తం 24 శుభ ముహూర్తాలు

మే, జూన్ నెలల్లో మోగనున్న పెళ్లి బాజాలు • వివాహాలకు అనువైన తేదీలను ప్రకటించిన పండితులు



సాక్షి, అమరావతి: మండు వేసవిలో తెలుగు రాష్ట్రాల్లో పెళ్లి బాజాలు మోగనున్నాయి. మే, జూన్ నెలల్లో దాదాపు 24 శుభముహూర్తాలు ఉన్నట్టు పండితులు ప్రకటించారు. గత శుభకృతు నామ సంవత్సరం (2022–23)లో దాదాపు నాలుగు నెలల విరామం తర్వాత వచ్చిన శుభ ముహూర్తాలకు ఏపీ, తెలంగాణలో పెద్ద సంఖ్యలో వివాహాలు జరిగాయి. ఆ తర్వాత ఆగస్టు నుంచి నవంబర్ నెలాఖరు వరకు సరైన ముహూర్తాలు లేవు. మళ్లీ నవంబర్ 28 నుంచి డిసెంబర్ 12 వరకు పెళ్లిళ్లు జరిగాయి. డిసెంబర్ 16 నుంచి ఈ ఏడాది జనవరి 14 వరకు ధనుర్మాసం కావడంతో వివాహాలు చేయలేదు. జనవరి 19 నుంచి మార్చి 9 వరకు మొత్తం 18 శుభ ముహూర్తాలు వచ్చాయి. మళ్లీ నెల రోజుల విరామం తర్వాత తాజాగా మే నెలలో 6, 8, 9, 10, 11, 15, 16, 20, 21, 22, 27, 29, 30 తేదీలతో పాటు జూన్‌లో 1, 3, 5, 6, 7, 11, 12, 23, 24, 26, 27 తేదీల్లో శుభముహూర్తాలు ఉన్నాయని పండితులు ప్రకటించారు.

ఇప్పుడు కాకుంటే మరో 2 నెలలు బ్రేక్..

మే మాసం అంతా వరుసగా మంచి ముహూర్తాలున్నాయి. జూన్ నెలలో కూడా 18వ తేదీ వరకు అనువైన ముహూర్తాలు బాగానే ఉన్నాయి. 19వ తేదీ నుంచి ఆషాఢ మాసం మొదలుకానుండటంతో మళ్లీ శుభకార్యాలకు బ్రేక్ పడనుంది. ఆషాఢ మాసం జూలై 18 వరకు కొనసాగుతుంది. ఆ తర్వాత వచ్చే శ్రావణ మాసం, అధిక శ్రావణ మాసం ఆగస్టు 17 వరకు ఉంటుంది. దీంతో జూలై, ఆగస్టు నెలల్లో పెళ్లిళ్లకు బ్రేక్ పడుతుందని పండితులు చెబుతున్నారు.

వివాహాలకే.. గృహ ప్రవేశాలకు అనుకూలించవు

ప్రస్తుత వైశాఖం, జ్యేష్ఠ మాసాల్లో దాదాపు 25 మంచి ముహూర్తాలున్నాయి. వీటిలో చాలా ముహూర్తాలు పెళ్లిళ్లు, ఉపనయనాలకు బాగా అనుకూలిస్తాయి. మే 11 నుంచి 24వ తేదీ వరకు అగ్ని కార్తె ఉండటంతో ఆ సమయంలో వచ్చే ముహూర్తాలు గృహ ప్రవేశాలకు అనుకూలించవు. జూన్ నెలాఖరు వరకు ముహూర్తాలున్నప్పటికీ ఆషాఢం వస్తుంది. ఆ తర్వాత దాదాపు 2 నెలల పాటు ముహూర్తాలు ఉండవు. అందుకే మే, జూన్ నెల మొదట్లోనే వివాహాలు జరిపించేందుకు చాలా మంది ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

– కొత్తపల్లి సూర్యప్రకాశరావు, పురోహితుడు, భీమవరం

5,544 మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ

ఉత్తర్వులు విడుదల చేసిన ఆర్థిక శాఖ

- పేర్ల వారీగా నియామక ఉత్తర్వులు ఇవ్వాలని ఆయా శాఖలకు సూచన
- ఖాళీ పోస్టుల స్థానంలో రెగ్యులర్ ఉద్యోగులుగా నియమించాలని ఉత్తర్వులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని పలు ప్రభుత్వ శాఖల్లో ఉన్న 40 విభాగాల్లోని 5544 మంది కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణకు అనుమతినిస్తూ ఆర్థిక శాఖ ఉత్తర్వులు విడుదల చేసింది. కొత్త సచివాలయం ప్రారంభం సందర్భంగా కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణపై సీఎం కేసీఆర్ సంతకం చేసిన గంటల్లోనే ఇందుకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు కూడా వెలువడ్డాయి. ఈ మేరకు ఆర్థిక శాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఆదివారం జీవోనెం: 38 విడుదల చేశారు. ఈ ఉత్తర్వుల ప్రకారం కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ ప్రాతిపదికన నియమించనున్నారు. ఆయా శాఖల అధికారులు పంపిన ప్రతిపాదనల మేరకు శాఖల వారీగా ఇప్పటికే ప్రభుత్వం అనుమతించిన పోస్టుల్లో మాత్రమే రెగ్యులర్ చేసిన కాంట్రాక్టు ఉద్యోగులను నియమించాల్సి ఉంటుంది. ఇందు కోసం అన్ని శాఖల విభాగాధిపతులు క్రమబద్ధీకరణ పొందుతున్న కాంట్రాక్టు ఉద్యోగుల పేర్లతో విడివిడిగా ఉత్తర్వులు ఇవ్వాల్సి ఉంటుంది. ఈ క్రమంలో ఖాళీగా ఉన్న మంజూరీ పోస్టుల్లో మాత్రమే సదరు ఉద్యోగులను నియమించాలని, అర్హత ఉన్న సీనియర్ ఉద్యోగులకు అన్యాయం జరగకూడదని, క్రమబద్ధీకరణకు అవసరమైన సర్టిఫికెట్లను సమగ్రంగా పరిశీలించాలని కూడా ఈ ఉత్తర్వుల్లో పేర్కొన్నారు. నియామక ఉత్తర్వు అందజేసిన నాటి నుంచి ఈ క్రమబద్ధీకరణ అమలవుతుందని వెల్లడించారు. పౌరసరఫరాలు, అటవీ, సాధారణ పరిపాలన, ఉన్నత విద్య, వైద్య, ఆరోగ్యం, న్యాయశాఖ, కార్మిక, ఉపాధి, పంచాయతీరాజ్, రెవెన్యూ, స్త్రీ, శిశు సంక్షేమ శాఖల్లో 5,544 మంది కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరించారు.

పీఎం పనిచేస్తుంటే... మన సీఎం నిద్రపోతున్నారు!

బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ వ్యాఖ్య

- కుక్క కరిచినా, నాలాలో పడి ప్రాణాలు పోతున్నా సీఎం స్పందించరు
- ఒవైసీ కళ్లలో ఆనందం కోసమే కొత్త సచివాలయ నిర్మాణం



సాక్షి, హైదరాబాద్/బంజారాహిల్స్: దేశాభివృద్ధి కోసం ప్రధానమంత్రి నరేంద్ర మోదీ రోజంతా పని చేస్తుంటే... తెలంగాణలో మాత్రం ముఖ్యమంత్రి కేసీఆర్ నిద్రపోతున్నారని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్‌కుమార్ విమర్శించారు. ప్రధాని రోజుకు 18 గంటలు పనిచేస్తుంటే కేసీఆర్ రోజుకు నాలుగు గంటలు మాత్రమే పనిచేస్తున్నారని, మిగతా సమయమంతా పెగ్గులు, బాటిళ్లతో గడుపుతున్నారని తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. నాలాలో పడి చిన్నారి మరణించిన ఘటన తెలంగాణ ప్రజానీకాన్ని కలిచివేసిందని, కానీ సీఎం కేసీఆర్ మాత్రం కనీసంస్పందించలేదని దుయ్యబట్టారు. ఇటీవల విశ్వనగరంలో కుక్క కాటుతో ఓ చిన్నారి మరణించినా సీఎం స్పందించలేదన్నారు. ప్రధాని మోదీ మన్‌కీబాత్ వందో ఎపిసోడ్‌లో భాగంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో బండి మాట్లాడారు. నూతన సచివాలయ నిర్మాణంలో తెలంగాణ ప్రాశస్త్యం కనిపించడం లేదని, ఇతర రాష్ట్రాల్లో అక్కడి సంస్కృతి, సంప్రదాయాలు కనిపించేలా నిర్మాణాలు చేపడితే తెలంగాణలో మాత్రం ఒవైసీ కళ్లలో ఆనందం కోసమే నిర్మాణం చేసినట్లుందన్నారు. ఏ సర్వే చూసినా రాష్ట్రంలో బీజేపీ అధికారంలోకి రాబోతోందనే నివేదికలు వస్తున్నాయని, ప్రజలు మార్పు కోరుకుంటున్నారని చెప్పారు. రాష్ట్రంలో బీఆర్‌ఎస్, కాంగ్రెస్ కలిసి పోటీచేస్తాయని ప్రజలు అనుకుంటున్నారని, అందుకే కాంగ్రెస్‌కు ఎందుకు ఓటేయాలని ప్రశ్నిస్తున్నారన్నారు.

ఒంటరిగానే పోటీచేస్తాం...

బీజేపీ ఒంటరిగానే పోటీ చేసి అధికారంలోకి వస్తుందని బండి సంజయ్ ధీమా వ్యక్తంచేశారు. ఎమ్మెల్యేలు, మంత్రులు కమీషన్ల కక్కుర్తిలో మునిగితేలుతున్నారని, దళితబంధులో కొన్నేళ్లుగా కమీషన్లు తీసుకుంటుంటే సీఎంకు ఇప్పుడు గుర్తుకొచ్చిందా అని మండిపడ్డారు.

కొన్ని చానళ్ల తీరు మారాలి

కాచిగూడ: కేసీఆర్ పాలనకు చరమగీతం పాడేవరకు పోరాడాలని, మీకు అండగా బీజేపీ ఉంటుందని బండి సంజయ్ అన్నారు. ఆర్టీసీ కార్మిక సంఘ్ (బీఎంఎస్) ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఆర్టీసీ కార్మికుల ఆత్మీయ సమ్మేళనంలో ప్రసంగించారు. తాను సచివాలయంపై ఉన్న బానిస చిహ్నాలను తొలగిస్తానన్నానే తప్ప సచివాలయాన్ని కూలుస్తానని చెప్పలేదని, కొన్ని టీవీ చానళ్లు తప్పుడు ప్రచారం చేస్తున్నాయని, సరిదిద్దుకోవాలని హితవు పలికారు.

ప్రతి పేదవాడికీ ఇల్లు కావాలి

- వైట్‌హౌజ్ లాంటి బంగ్లాలు కాదు
- తెలంగాణ తెచ్చుకుంది పేదల కోసం
- ఆలేరులో జరిగిన కార్నర్ మీటింగ్‌లో భట్టి విక్రమార్క
- యాదాద్రి జిల్లాలో పీపుల్స్ మార్చ్ పాదయాత్ర



పెంబర్తి వద్ద తాటిముంజలు తింటున్న భట్టి, పక్కన పొన్నాల లక్ష్మయ్య

సాక్షి, యాదాద్రి, జనగామ: ప్రతి పేదవాడికి ఇల్లు కావాలని.. వైట్‌హౌజ్ లాంటి బంగ్లాలు కాదని సీఎల్పీ నేత భట్టి విక్రమార్క అన్నారు. దేశంలో అద్భుతంగా ఉండే పాలకుల ప్యాలెస్ కోసం తెలంగాణ తెచ్చుకోలేదని ఎద్దేవా చేశారు. భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర ఆదివారం 45వ రోజు యాదాద్రి భువనగిరి జిల్లాలోకి ప్రవేశించింది. జిల్లా సరిహద్దు ఆలేరు మండలంలో కాంగ్రెస్ శ్రేణులు ఘన స్వాగతం పలికాయి. సాయంత్రం ప్రారంభమైన పాదయాత్ర శ్రీనివాసపురం, పటేల్‌గూడెం, గుండ్లగూడెం మీదుగా ఆలేరు పట్టణానికి చేరుకుంది. ఆలేరులోని రైల్వేగేట్ వద్ద టీపీసీసీ ప్రధాన కార్యదర్శి బీర్ల అయిలయ్య అధ్యక్షతన జరిగిన కార్నర్ మీటింగ్‌లో ఆయన ప్రభుత్వంపై విమర్శలు గుప్పించారు. తెలంగాణ సంపద మొత్తం 4 కోట్ల మంది ప్రజలకు సమానంగా పంచుకోవడానికి తెచ్చుకుంటే దురదృష్టవశాత్తూ కేసీఆర్ కుటుంబంతో పాటు వారితో మమేకమైన వారు దోచుకుతింటున్నారని ఆరోపించారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలు, ఆలేరు మాజీ ఎమ్మెల్యే ఆరుట్ల కమలాదేవి ఈ ప్రాంతంలో భూములు పంచితే బీఆర్‌ఎస్ పార్టీ నుంచి గెలిచిన ఎమ్మెల్యే సునీతకు ప్రజల మీద కంటే భూములపైన, వెంచర్లపైన, భూకబ్జాలపైన ప్రేమ ఉన్నట్టు కనిపిస్తోందన్నారు. కార్యక్రమంలో డీసీసీ అధ్యక్షుడు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కె. నగేష్ తదితరులు పాల్గొన్నారు.

కొత్త సచివాలయం వల్ల ప్రజలకు ప్రయోజనమేమిటి?

పెంబర్తి కాకతీయ కళాతోరణం వద్ద టీపీసీసీ మాజీ అధ్యక్షుడు పొన్నాల లక్ష్మయ్యతో కలిసి ఆయన ఆదివారం మీడియాతో మాట్లాడారు. ప్రజల ఆకలి కేకలు పట్టించుకోకుండా.. ఇళ్లు లేక ప్రజలు, ఉద్యోగాలు లేక యువత అల్లాడిపోతుంటే ప్రభుత్వం కొత్త సచివాలయం నిర్మించడం వల్ల కలిగే ప్రయోజనమేమిటో చెప్పాలని డిమాండ్ చేశారు. విద్యార్థి, నిరుద్యోగుల ఉసురు ఈ ప్రభుత్వానికి తప్పకుండా తగులుతుందని శాపనార్థాలు పెట్టారు.

బీసీలు రాజ్యాధికారంలో వాటాకు ఉద్యమించాలి

సుందరయ్య విజ్ఞాన కేంద్రం: బీసీలు రాజ్యాధికారంలో వాటాకై ఉద్యమించాల్సిన అవసరం ఎంతైనా ఉందని ఎంపీ, బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు ఆర్. కృష్ణయ్య పిలుపునిచ్చారు. బీసీలకు ఇచ్చేది భిక్ష కాదని రాజ్యాధికారంలో వాటా అని ఆయన చెప్పారు. ఆదివారం సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో రాష్ట్ర బీసీ న్యాయవాదుల సంఘం ఆధ్వర్యంలో 'భారత రాజ్యాంగం–సామాజిక న్యాయం' అనే అంశంపై రాష్ట్రస్థాయి సదస్సు జరిగింది. ఈ సందర్భంగా ఆర్.కృష్ణయ్య మాట్లాడుతూ రాజకీయాల్లో విలువలు పడిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

బ్యాక్టీరియా మేఘాలు..!


చూడటానికి పక్షిలా కనిపిస్తున్న ఈ మేఘం నిజానికి పూర్తిగా బ్యాక్టీరియాతో నిండి ఉంది. ఇలాంటి బ్యాక్టీరియా యాంటీ బయాటిక్‌లకు కూడా లొంగదట

అల్లంత ఎత్తున సుదూరాలకు పయనం
యాంటీబయాటిక్స్‌కూ లొంగని లక్షణం
మనకు ముప్పు తక్కువేనంటున్న సైంటిస్టులు

ఆకాశంలో దట్టమైన నల్లటి మేఘాలు కమ్ముకుంటే? మామూలుగా అయితే వాన రాకడకు సూచిక. కానీ, జీవజలాన్ని కాక ప్రమాదకరమైన బ్యాక్టీరియాను మోసుకొచ్చే మేఘాలున్నాయని తెలుసా? నిజం. ఇలాంటి మేఘాలున్నాయని కెనడా, ఫ్రాన్స్ పరిశోధకులు చెబుతున్నారు. ఔషధాల శక్తిని తట్టుకొని మరీ నిక్షేపంగా జీవించే బ్యాక్టీరియా ఈ మేఘాల్లో నిండి ఉంటుందని, వాటితో పాటే అది సుదూర ప్రాంతాలకు ప్రయాణిస్తుందని తాజా అధ్యయనంలో గుర్తించారు. ఒక రకంగా చెప్పాలంటే ప్రపంచమంతటినీ చుట్టేస్తుందన్నమాట! ఈ అధ్యయనం వివరాలను సైన్స్ ఆఫ్ ద టోటల్ ఎన్విరాన్‌మెంట్ పత్రికలో ప్రచురించారు.

చూడటానికి పక్షిలా కనిపిస్తున్న ఈ మేఘం నిజానికి పూర్తిగా బ్యాక్టీరియాతో నిండి ఉంది. ఇలాంటి బ్యాక్టీరియా యాంటీ బయాటిక్‌లకు కూడా లొంగదట

కెనడాలో క్విబెక్ సిటీలోని లావల్ యూనివర్సిటీ, సెంట్రల్ ఫ్రాన్స్‌లోని క్లెర్మాంట్ అవెర్గిన్ యూనివర్సిటీకి చెందిన పరిశోధకులు మేఘాల నమూనాలను సేకరించి పరీక్షించారు.

ఈ మేఘాల్లో యాంటీబయాటిక్స్‌ను తట్టుకొనే జన్యువులతో కూడిన బ్యాక్టీరియా ఉన్నట్టు గుర్తించారు.

సముద్ర మట్టానికి 1,465 మీటర్ల(4,806 అడుగులు) ఎత్తులో ఉన్న మేఘాల నుంచి నమూనాలను సేకరించారు.

2019 సెప్టెంబర్ నుంచి 2021 అక్టోబర్ దాకా ఈ పరిశోధన నిర్వహించారు.

మిల్లీలీటర్ పరిమాణంలో 330 నుంచి ఏకంగా **30,000**కు పైగా బ్యాక్టీరియా ఉన్నట్టు తేలింది.

8,000
ఒక మిల్లీలీటర్ మేఘంలో సగటున ఉన్న బ్యాక్టీరియా సంఖ్య.

మేఘాల్లోని ఈ బ్యాక్టీరియాలో 29 ఉపవర్గాలకు చెందిన యాంటీబయాటిక్‌ను తట్టుకునే జన్యువులు ఉన్నట్టు గుర్తించారు.

ఈ బ్యాక్టీరియా సాధారణంగా మొక్కలపై, చెట్ల ఆకులపై, భూమిపై స్థావరం ఏర్పర్చుకుంటుందని సైంటిస్టు ఫ్లోరెంట్ రోసీ చెప్పారు.

చెట్లపై, భూమిలో ఉన్న బ్యాక్టీరియా గట్టి గాలుల ద్వారా వాతావరణంలోకి, అటునుంచి మేఘాల్లోకి చేరుతుంది. వాటితో పాటు సుదూరాలకు పయనిస్తుంది.

వర్షంగా కురిసిన చోట మేఘాల నుంచి భూమిపైకి చేరుతుంది.

మేఘాల ద్వారా ఇలా ఒక ప్రాంతం నుంచి మరో ప్రాంతానికి వ్యాప్తి చెందే బ్యాక్టీరియాతో మానవళి ఆరోగ్యానికి ఉన్న ముప్పుపై పూర్తిస్థాయి పరిశోధనలు జరగాల్సి ఉంది.

- ఈ బ్యాక్టీరియాలో 5 నుంచి 50 శాతం దాకా మాత్రమే క్రియాశీలకంగా ఉంటాయని సైంటిస్టులు చెబుతున్నారు. మేఘాల బ్యాక్టీరియా వల్ల మనుషులకు ముప్పు స్వల్పమేనని పరిశోధకురాలు ఫ్లోరెంట్ రోసీ అభిప్రాయపడ్డారు. 'వర్షంలో బయట నడవాలంటే భయపడాల్సిన అవసరం లేదన్నమాట' అంటూ చమత్కరించారు!
- మేఘాల్లోని బ్యాక్టీరియా జన్యువులు ఇతర బ్యాక్టీరియాతో కలుస్తాయా, లేదా అనే దానిపై ఇంకా స్పష్టత లేదని రోసీ వెల్లడించారు.
- డ్రగ్-రెసిస్టెంట్‌ను కలిగిన బ్యాక్టీరియాల మూలాలను కనుగొనేందుకు ఈ పరిశోధన దోహదపడుతుందని సైంటిస్టులు భావిస్తున్నారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

క్లుప్తంగా

చెవిలో సాలీడు గూడు

షాంఘై: చైనాలో ఓ మహిళ చెవి నొప్పితో ఆస్పత్రికెళ్లింది. పరీక్షించిన వైద్యులు చెవిలోపలి భాగంలో ఓ సాలీడు గూడు కట్టుకుని సంతానంతో సహా కాపురం ఉన్నట్లు తేల్చారు. సిచువాన్ ప్రావిన్స్ హుయిడాంగ్ కౌంటీ ఆస్పత్రికి సుమారు పది రోజుల క్రితం ఓ మహిళ వచ్చింది. కుడి చెవి నొప్పితోపాటు లోపలి నుంచి బెల్ కొడుతున్నట్లుగా శబ్దం వస్తోందంటూ వైద్యులకు తెలిపింది. ఎండోస్కోపీ పరీక్ష చేసిన వైద్యులు కర్ణభేరిలాంటి నిర్మాణాన్ని గుర్తించారు. కెమెరా అమర్చిన ప్రత్యేక పరికరాలను లోపలికి పంపించి చూడగా దాని వెనుక ఒక సాలీడు గూడు కనిపించింది. దీంతో,ఆశ్చర్యపోవడం వైద్యుల వంతైంది. వైద్య నిపుణులు ఆ గూడును బయటకు లాగగా దాంతోపాటు అందులోని సాలీడు, దాని పిల్లలు బయటకు వచ్చాయి. అయితే, ఈ సాలీడు విషపూరితమైంది కాకపోవడం సంతోషించాల్సిన విషయమని వైద్యులు తెలిపారు.

తుంటరి ఏనుగు చిక్కింది

ఇడుక్కి(కేరళ): రేషన్ దుకాణాల్లోకీ, ఇళ్లలోకీ చొరబడి బియ్యాన్ని బొక్కేస్తున్న ఏనుగు అరికొంబన్(25)ను ఎట్టకేలకు కేరళ అటవీ అధికారులు పట్టుకుని, మరో చోటుకు తీసుకెళ్లి వదిలేశారు. అరికొంబన్ ప్రస్తుతం సంపూర్ణ ఆరోగ్యంతో ఉందని, దానికి బిగించిన రేడియో కాలర్ ద్వారా టైగర్ రిజర్వులో ఎక్కడ ఉన్నదీ ఎప్పటికప్పుడు తెలుసుకోవచ్చునని అధికారులు తెలిపారు. అరికొంబన్ మళ్లీ జనావాసాల్లోకి వచ్చే అవకాశాలు మాత్రం లేవన్నారు. ఇడుక్కి జిల్లా చిన్నకనల్, సంతన్‌పర కొండ ప్రాంతాల్లోని నివాసాల్లో దాదాపు దశాబ్ద కాలంగా ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోందీ గజరాజు. బియ్యం మాత్రమే స్వాహా చేస్తున్న ఈ గజరాజుకు అరి కొంబన్(మలయాళంలో అరి అంటే బియ్యం, కొంబన్ అంటే ఏనుగు)గా పేరు వచ్చింది. అరికొంబన్‌ను ఏం చేయాలన్న అంశం పలు వివాదాలకు దారితీసింది. అరికొంబన్‌ను పట్టుకుని, శిక్షణ ఏనుగు(కుమ్కి)గా మార్చేందుకు చేసిన ప్రయత్నాలను కేరళ హైకోర్టు అడ్డుకుంది. హైకోర్టు ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ అరికొంబన్‌ను జనావాసాలకు దూరంగా పరాంబికులమ్ టైగర్ రిజర్వులో వదిలి వేయాలని సూచించింది. దీనిపైనా నిరసనలు వ్యక్తమయ్యాయి. చివరికి కేరళ ప్రభుత్వం సూచనలతో.. ఆ ఏనుగును వదిలి వేసే ప్రాంతాన్ని చివరి వరకు రహస్యంగా ఉంచాలన్న ప్రత్యామ్నాయం ఆచరణలోకి వచ్చింది. దీని ప్రకారం..అరికొంబన్‌కు మత్తిచ్చేందుకు శనివారం ఉదయం నుంచి ప్రయత్నాలు మొదలయ్యాయి. లాభం లేకపోవడంతో అరికొంబన్‌కు ప్రధాన పోటీదారుగా ఉన్న మరో ఏనుగును తీసుకొచ్చాక సాయంత్రానికి మత్తు ఇంజక్షన్ ఇవ్వడం సాధ్యపడింది. తర్వాత దట్టమైన అటవీ ప్రాంతానికి తరలించి ర్యాంప్ మీదుగా వదిలిపెట్టినట్టు అధికారులు తెలిపారు.

మన్ కీ బాత్... నా ఆధ్యాత్మిక ప్రయాణం

ఆరాధన, వ్రతం, ప్రజలిచ్చిన ప్రసాదం • 100వ ఎపిసోడ్‌లో మోదీ భావోద్వేగం

- ఢిల్లీ వచ్చిన తొలినాళ్లలో నాలో ఖాళీని భర్తీ చేసింది
- ప్రజల నుంచి దూరంగా లేనన్న భావన కలిగించింది

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీ 'మన్ కీ బాత్' కార్యక్రమం ఆదివారంతో 100 వారాలు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా దేశ ప్రజలనుద్దేశించి ఆయన ఉద్విగ్నంగా ప్రసంగించారు. ఈ కార్యక్రమాన్ని తనకు ఆధ్యాత్మిక ప్రయాణంగా అభివర్ణించారు. ''ఇది కేవలం కార్యక్రమం కాదు. నా విశ్వాసానికి సంబంధించిన అంశం. 2014లో ఢిల్లీ వచ్చాక నాలో ఉన్నట్టనిపించిన ఖాళీని భర్తీ చేసింది. కోట్లాది ప్రజలకు నా భావాలను తెలియజేసేందుకు ఉపయోగపడింది. ప్రజల నుంచి ఎప్పుడూ దూరంగా లేనన్న భావన కలిగించింది'' అంటూ మన్ కీ బాత్‌తో ముడిపడ్డ తన జ్ఞాపకాలు, అనుభవాలు, అనుభూతులను నెమరేసుకున్నారు. గత మన్ కీ బాత్‌ల్లో ప్రస్తావించిన పలువురు విశిష్ట వ్యక్తులతో ఈ సందర్భంగా ఫోన్‌లో మాట్లాడారు. గత ఎపిసోడ్లలో పాల్గొన్న ఆంధ్రప్రదేశ్‌లో విశాఖపట్నానికి చెందిన వెంకటేశ్ ప్రసాద్ ను ప్రస్తావించారు. మోదీ ఇంకా ఏం చెప్పారంటే...

ఇతరుల నుంచి ఎంతో నేర్చుకున్నా...

''2014 అక్టోబర్ 3న విజయ దశమి నాడు మన్ కీ బాత్‌కు శ్రీకారం చుట్టాం. ఇప్పుడదో పండుగలా మారింది. 100వ ఎపిసోడ్ సందర్భంగా శ్రోతల నుంచి వేలాది లేఖలందాయి. అవి భావోద్వేగాలకు గురిచేశాయి. కోట్లాది భారతీయుల మనసులో మాటకు, వారి భావాల వ్యక్తీకరణకు ప్రతిబింబం మన్ కీ బాత్. స్వచ్ఛ భారత్, ఆజాదీ కా అమృత్ మహోత్సవ్ వంటి వాటిని తొలుత మన్ కీ బాత్‌లోనే ప్రస్తావించాం. తర్వాత ప్రజా ఉద్యమాలుగా మారాయి. ఈ రేడియో కార్యక్రమం రాజకీయాలకతీతం. ఇతరుల నుంచి ఎన్నో విషయాలు నేర్చుకోవడానికి కీలక మాధ్యమంగా మారింది. శత్రువులైనా మంచి గుణాలను గౌరవించాలని నా గురువు లక్ష్మణ్‌రావు ఈనాందార్ చెప్పేవారు. ఇతరుల్లోని సద్గుణాలను ఆరాధించడంతో పాటు వారి నుంచి కొత్త విషయాలు నేర్చుకోవడానికి మన్ కీ బాత్ నాకో కసరత్తులా ఉపయోగపడింది. మన్ కీ బాత్ నిజానికి మౌన్ (నిశ్శబ్దం) కీ బాత్ అంటూ కాంగ్రెస్ ఎద్దేవా చేసింది. చైనాతో వివాదం, అదానీ అక్రమాలు, ఆర్థిక అసమానతలు, మహిళలపై అరాచకాల వంటి కీలకాంశాలను 100వ ఎపిసోడ్‌లో మోదీ ఎందుకు ప్రస్తావించలేదని ఆక్షేపించింది.

కేరళలోని కొచ్చిన్‌లో పెళ్లి వేడుకకు వచ్చిన అతిథులతో కలిసి మన్‌కీబాత్ 100వ ఎపిసోడ్ వింటున్న నూతన వధూవరులు



దేశ ప్రజలే నాకు సర్వస్వం

''గుజరాత్ సీఎంగా తరచూ ప్రజలను కలుస్తూ, మాట్లాడుతూ ఉండేవాన్ని. 2014లో ఢిల్లీకి చేరాక భిన్నమైన జీవితం, పని విధానం, బాధ్యతలు! చుట్టూ పటిష్ట భద్రత, సమయపరమైన పరిమితులు. ఇలా ప్రజలను కలవని రోజంటూ వస్తుందని అనుకోలేదు. నాకు సర్వస్వమైన దేశ ప్రజల నుంచి దూరంగా జీవించలేను. ఈ సవాలుకు మన్ కీ బాత్ పరిష్కార మార్గం చూపింది. ఇది నాకు ఒక ఆరాధన, ఒక వ్రతం. గుడికెళ్లి ప్రసాదం తెచ్చుకుంటాం. ప్రజలనే దేవుడి నుంచి నాకు లభించిన ప్రసాదం మన్ కీ బాత్. ప్రజాసేవ చేస్తూ స్ఫూర్తిదాయకమైన ప్రయాణం సాగిస్తున్న ఎంతోమంది గొప్ప వ్యక్తులు నాకు మార్గదర్శకులుగా మారారు. మన్ కీ బాత్‌లో గతంలో ప్రస్తావించిన వ్యక్తులంతా హీరోలే. వారే ఈ కార్యక్రమానికి జీవం పోశారు''

ఐరాస, విదేశాల్లోనూ...

న్యూయార్క్: అమెరికాలో న్యూయార్క్‌లోని ఐక్యరాజ్య సమితి ప్రధాన కార్యాలయంలో మన్ కీ బాత్ 100వ ఎడిషన్‌ను ప్రత్యక్ష ప్రసారం చేశారు. ఇదొక చరిత్రాత్మక సందర్భమని ఐరాసలో భారత శాశ్వత ప్రతినిధి రుచిరా కాంబోజ్ ట్వీట్ చేశారు. యునెస్కో డైరెక్టర్ జనరల్ ఆడ్రీ అజౌలే మన్ కీ బాత్‌పై ప్రశంసల వర్షం కురిపించారు. కార్యక్రమంలో ఆమె కూడా భాగస్వామి అయ్యారు. పలు దేశాల్లోని భారత రాయబార కార్యాలయాల్లో ప్రత్యక్ష ప్రసారం చేశారు. అమెరికా, బ్రిటన్, రష్యా, దక్షిణాఫ్రికా, చిలీ, మొరాకో, మెక్సికో, కాంగో, ఇరాక్, ఇండోనేషియా తదితర దేశాల్లో మన్ కీ బాత్‌కు విశేష స్పందన లభించింది.

దేశమంతటా...

- మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను బీజేపీ నేతలు, కార్యకర్తలు ఆదివారం దేశవ్యాప్తంగా పండుగలా జరిపారు.
- బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ముఖ్యమంత్రులు, గవర్నర్లు ప్రత్యేక కార్యక్రమాల్లో పాలు పంచుకున్నారు.
- ప్రత్యేక తెరలు ఏర్పాటు చేసి ప్రత్యక్షంగా వీక్షించారు.
- ''ఇది కేవలం రేడియో కార్యక్రమం కాదు. సామాజిక మార్పుకు చోదక శక్తి. మోదీ సందేశం యువతకు స్ఫూర్తినిస్తోంది'' అని అమిత్ షా కొనియాడారు.
- అమిత్ షా, రాజ్‌నాథ్‌సింగ్ సహా పలువురు కేంద్ర మంత్రులు భారత్‌లో, విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అమెరికాలో కార్యక్రమాన్ని వీక్షించారు.

పశ్చిమ బెంగాల్‌లో సౌత్ దినాజ్‌పూర్ జిల్లా బాలూర్ఘాట్‌లో పంటపొలాల్లో మన్‌కీ బాత్ వింటున్న రైతులు







ప్రయాగ్‌రాజ్‌లో అబ్బురపరచిన కాంతి వలయం

లక్నో: ఉత్తరప్రదేశ్‌లోని ప్రయాగ్‌రాజ్ పట్టణంలో ఆకాశంలో అద్భుత దృశ్యం సాక్షాత్కారించింది. శుక్రవారం సూర్యుడి చుట్టూ ఏర్పడిన కాంతి వలయం చూపరులను ఆశ్చర్యపర్చింది. కొన్ని గంటలపాటు కనిపించిన ఈ దృశ్యాన్ని జనం ఫోన్లలో బంధించారు. సూర్యుడి చుట్టూ ఏర్పడే కాంతి వలయాన్ని 'సన్ హాలో' అంటారు. వాతావరణంలో కాంతి వెదజల్లినట్లుగా మారినప్పుడు ఇలా రింగ్ లాంటి ఆకృతి ఏర్పడుతుంది. సూర్యుడి నుంచి వెలువడే కిరణాలు వాతావరణంలోని మంచు స్ఫటికాలను ఢీకొట్టినప్పుడు కాంతి వెదజల్లినట్లుగా మారుతుంది. అప్పుడు భానుడి చుట్టూ వలయాన్ని చూడొచ్చు. సాధారణ మేఘాల కంటే అధికంగా తెల్లగా, పలుచగా ఉండే సిరస్ మేఘాల్లో మంచు స్ఫటికాలు ఉంటాయి.

మాల్దీవులకు భారత్ గస్తీ నౌక, ల్యాండింగ్ క్రాఫ్ట్

న్యూఢిల్లీ: కీలకమైన మిత్రదేశమైన మాల్దీవులకు భారత్ గస్తీ నౌక, ల్యాండింగ్ క్రాఫ్టలను కానుకగా అందివ్వనుంది. మే ఒకటి నుంచి మూడో తేదీ వరకు రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాల్దీవుల్లో పర్యటించనున్నారు. ఈ సందర్భంగా వీటిని అందజేస్తారు. హిందూ మహాసముద్ర ప్రాంతంలో కొంతకాలంగా పెరుగుతున్న చైనా దూకుడుకు అడ్డుకట్ట వేసే దిశగా భారత్ తీసుకుంటున్న చర్యల్లో ఇది భాగమని చెబుతున్నారు. పర్యటనలో భాగంగా మాల్దీవుల అధ్యక్షుడు ఇబ్రహీం సోలిహ్, విదేశాంగ మంత్రి అబ్దుల్లా సాహిత్, రక్షణ మంత్రి మరియా దీదీతోనూ రాజ్‌నాథ్ చర్చలు జరుపుతారు.

అవును, శివుని కంఠంలో సర్పాన్నే!

ప్రజలను కాపాడుతూ ఉంటా: ఖర్గే విమర్శలపై మోదీ

కర్ణాటక ప్రచార సభలో కాంగ్రెస్, జేడీఎస్‌లపై ప్రధాని ధ్వజం



కోలారు: కాంగ్రెస్, జేడీ(ఎస్) కుటుంబ పాలనే కర్ణాటకలో రాజకీయ అస్థిరతకు కారణమంటూ ప్రధాని మోదీ ధ్వజమెత్తారు. అవి అవినీతిని పెంచి పోషించాయని, అస్థిరతను అవకాశంగా తీసుకుని రాష్ట్రాన్ని ఏటీఎంలా మార్చాయని మండిపడ్డారు. లూటీపైనే తప్ప అభివృద్ధిపై దృష్టి పెట్టలేదన్నారు. 'కాంగ్రెస్, జేడీ(ఎస్) నేతలు కర్ణాటకలో ప్రత్యర్థులుగా నటిస్తారు. ఢిల్లీలో మాత్రం కలిసే ఉంటారు. పార్లమెంటులో పరస్పరం సహాయం చేసుకుంటారు'' అన్నారు. మోదీ ఆదివారం రామనగర జిల్లాలో జేడీ(ఎస్) కంచుకోట అయిన చెన్నపట్నలో బహిరంగసభలో ప్రసంగించారు. ''జేడీ(ఎస్)కు పడే ప్రతి ఓటూ కాంగ్రెస్‌కు లబ్ధి చేకూర్చి రాష్ట్రాన్ని అస్థిరపరుస్తుంది. ఇక కాంగ్రెస్‌ది 85 శాతం కమిషన్ సర్కారు. ద్రోహానికి మరోపేరు. 2008లో తప్పుడు రుణమాఫీ తెచ్చింది. కాంగ్రెస్ నేతల సంబంధీకుల, అవినీతిపరుల రుణాలే మాఫీ అయ్యాయి. ఇదీ కాంగ్రెస్ ట్రాక్ రికార్డు'' అంటూ దుయ్యబట్టారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే తనను విషసర్పంతో పోల్చినందుకు తనకేమీ బాధ లేదని మోదీ అన్నారు. ''పాము శివుని మెడలో హారం. అవును. నేను ప్రజల మెడలో పామునే. వారిని రక్షిస్తూ ఉంటా'' అన్నారు.

మోదీ, రాహుల్‌ను చూసి నేర్చుకోండి!

మీది ఎంతసేపూ సానుభూతి యావే: ప్రియాంక ఎద్దేవా

జంఖాండీ: కాంగ్రెస్ నేతలు తనను 91 సార్లు దూషించారన్న ప్రధాని నరేంద్ర మోదీ వ్యాఖ్యలపై కాంగ్రెస్ నేత ప్రియాంకా గాంధీ వాద్రా స్పందించారు. ''వాటన్నింటినీ కలిపినా ఒక పేజీ అవుతాయేమో. కానీ మీరూ, బీజేపీ నేతలూ మా కుటుంబాన్ని తిట్టిన తిట్లన్నీ రాస్తే పుస్తకాలే కూడా చాలవు! ఆమె ఆదివారం కర్ణాటకలోని బాగల్‌కోటె జిల్లాలో బహిరంగ సభలో మాట్లాడారు. దేశం కోసం తూటాలకు ఎదురొడ్డటానికి సిద్ధంగా ఉన్న తన సోదరుడు రాహుల్ గాంధీని చూసి నేర్చుకోవాలని మోదీకి సలహా ఇచ్చారు. ''ప్రజాజీవితంలో ఉన్నవారు విమర్శలకు సిద్ధపడాలి. కాంగ్రెస్ తరఫున ప్రధానులుగా ఉన్న ఇందిరా గాంధీ, రాజీవ్‌గాంధీ దేశం కోసం తూటాలు తిన్నారు. కానీ ప్రజల కష్టాలను వినడానికి బదులు వారికి సొంత బాధలు చెప్పుకుంటూ సానుభూతి కోసం పాకులాడుతున్న మొట్టమొదటి ప్రధాని మోదీయే'' అంటూ ఎద్దేవా చేశారు.

విష వాయువులకు 11 మంది బలి

లూధియానా: పంజాబ్‌లోని లూధియానా పారిశ్రామిక ప్రాంతంలో విషాదం చోటుచేసుకుంది. విష వాయువులు పీల్చి 11 మంది చనిపోగా మరో నలుగురు తీవ్ర అస్వస్థతకు లోనయ్యారు. గియాస్‌పురా ప్రాంతం పారిశ్రామిక వాడలో ఆదివారం ఉదయం కిరాణా దుకాణం వద్దకు వచ్చిన కొందరు కార్మికులు స్పృహతప్పి పడిపోయారు. నలుగురు అక్కడికక్కడే తుదిశ్వాస విడిచారు. తర్వాత ఏడుగురు చనిపోయారు. నలుగురు తీవ్రంగా అస్వస్థతతో చికిత్స పొందుతున్నారు. సమీప పరిశ్రమలు వ్యర్థ రసాయనాలను మురుగు కాల్వలో పడబోయడంతో మీథేన్‌తో కలిసి విష వాయువులు వెలువడి ఉంటాయంటున్నారు.

ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టుల మృతి

కాళేశ్వరం: మహారాష్ట్రలో గడ్చిరోలి జిల్లా బాంబ్రాగాడ్ తాలూకా దామరంచ అటవీ ప్రాంతంలో ఆదివారం రాత్రి పోలీసులతో ఎదురుకాల్పుల్లో ముగ్గురు మావోయిస్టులు మృతి చెందినట్లు గడ్చిరోలి ఎస్పీ నీలోత్పల్ తెలిపారు. పెరిమిలి, అహేరి మావోయిస్టు దళాలు సమావేశమయ్యాయనే సమాచారంతో పోలీసులు కూంబింగ్ చేపట్టారు. ఈ సందర్భంగా జరిఎదురు కాల్పుల్లో పెరిమిలి దళం కమాండర్ బిట్లు మడావి, వాసు, అహేరి దళానికి చెందిన శ్రీకాంత్ మృతి చెందారు.

చార్లెస్–3 పట్టాభిషేకంలో... విశేషాలెన్నో!



బ్రిటన్ రాజుగా కింగ్ చార్లెస్–3కి మే 6న పట్టాభిషేకం జరగనుంది. ఆయనకు 74 ఏళ్లు. ఇప్పటి దాకా బ్రిటన్ ఏలికలుగా పట్టాభిషేకం చేసుకున్న వారిలో అత్యంత పెద్ద వయస్కుడు చార్లెసే! ఆయన వయసు మొదలుకుని కార్యక్రమపు ఖర్చు, అన్ని మతాల పెద్దలను భాగస్వాములను చేయడం దాకా ఎన్నో విశేషాలకు పట్టాభిషేక కార్యక్రమం వేదిక కానుంది...

- చారిత్రక వెస్ట్ మినిస్టర్స్ అబేలో పట్టాభిషేకం జరుగుతుంది. గత వెయ్యేళ్లుగా ఈ వేడుక ఇక్కడే జరుగుతూ వస్తోంది.
- ఉదయం 11కు కార్యక్రమం మొదలవుతుంది.
- చార్లెస్–3 సతీసమేతంగా బకింగ్‌హాం ప్యాలెస్ నుంచి చారిత్రక డైమండ్ జూబ్లీ రథంలో అట్టహాసంగా బయల్దేరతారు. రాణి ఎలిజబెత్–2 పాలనకు 60 ఏళ్లయిన సందర్భంగా 2012లో ఈ రథాన్ని ప్రత్యేకంగా తయారు చేశారు.

ఐదు దశల్లో...

- కార్యక్రమం ఐదు దశల్లో జరుగుతుంది. తొలుత ఆర్చిబిషప్ ఆఫ్ కాంటర్‌బరీ ముందుగా రాజును ప్రజలకు పరిచయం చేస్తారు. అనంతరం 'గాడ్ సేవ్ కింగ్ చార్లెస్' అంటూ ఆహూతుల ద్వారా గీతాలాపన జరుగుతుంది.
- మత గ్రంథంపై చార్లెస్ ప్రమాణం చేస్తారు. అనంతరం ఆయనను రాజుగా ప్రకటిస్తారు.
- తర్వాత కింగ్ ఎడ్వర్డ్ కుర్చీపై చార్లెస్ ఆసీనులవుతారు. పట్టాభిషేకానికి ఉపయోగించే ఈ కుర్చీ ఏకంగా 700 ఏళ్ల నాటిది. కింగ్ ఎడ్వర్డ్ నుంచి ఇప్పటిదాకా 26 మంది బ్రిటన్ ఏలికలు దీనిపై కూర్చునే పట్టం కట్టుకున్నారు. శిథిలావస్థకు చేరిన ఈ కుర్చీని పూర్తిస్థాయిలో రిపేరు చేశారు.
- తర్వాత అనూచానంగా వస్తున్న రాజ లాంఛనాలను ఒక్కొక్కటిగా చార్లెస్ అందుకుంటారు.
- వీటిలో కొన్నింటిని హిందూ, సిక్కు, ఇస్లాం తదితర మత పెద్దలు ఆయనకు అందజేయనుండటం విశేషం. హిందూ మతం తరఫున లార్డ్ నరేంద్ర బాహుబలి పటేల్ (84) చార్లెస్‌కు రాజ ముద్రిక అందజేస్తారు.
- తర్వాత కీలక ఘట్టం వస్తుంది. సంప్రదాయం ప్రకారం ప్రత్యేక వస్త్రపు ఆచ్ఛాదనలో ఆర్చిబిషప్ చేతుల మీదుగా చార్లెస్‌కు కిరీట ధారణ జరుగుతుంది. కిరీటం పరిమాణాన్ని చార్లెస్‌కు సరిపోయేలా ఇప్పటికే సరిచేశారు.
- ఈ ప్రత్యేక వస్త్రంపై భారత్‌తో పాటు కామన్వెల్త్ దేశాలన్నింటి పేర్లుంటాయని బకింగ్‌హాం ప్యాలెస్ ప్రకటించింది.
- తర్వాత యువరాజు విలియం రాజు ముందు మోకరిల్లుతారు. విధేయత ప్రకటిస్తూ ఆయన ముంజేతిని ముద్దాడతారు.
- తర్వాత సాదాసీదా కార్యక్రమంలో చార్లెస్ భార్య కెమిల్లాను రాణిగా ప్రకటించే తంతు ముగుస్తుంది.
- భారత మూలాలున్న హిందువు అయిన ప్రధాని రిషి సునాక్ ఈ సందర్భంగా పవిత్ర బైబిల్ పంక్తులు పఠించనుండటం విశేషం!
- చివరగా హిందూ, సిక్కు, ముస్లిం, బౌద్ధ, యూదు మత పెద్దల నుంచి చార్లెస్ శుభాకాంక్షలు అందుకుంటారు.

- సాక్షి, నేషనల్ డెస్క్

రూ.1,000 కోట్ల ఖర్చు

- ✔ పట్టాభిషేక మహోత్సవానికి దాదాపు రూ.1,000 కోట్ల దాకా వెచ్చిస్తున్నారు. సంప్రదాయం ప్రకారం ఈ ఖర్చంతటినీ బ్రిటన్ ప్రభుత్వమే భరిస్తోంది. దేశం మాంద్యం కోరల్లో చిక్కి అల్లాడుతున్న వేళ ఎందుకీ ఆడంబరమంటూ నిరసనలు వ్యక్తమవుతున్నాయి. అయితే కార్యక్రమ ప్రత్యక్ష ప్రసార హక్కులు తదితరాల ద్వారా అంతకంటే ఎక్కువే తిరిగొస్తుందని సమాచారం. ఈ కార్యక్రమం దేశ పర్యాటకానికి ఎంతో ఊపునిస్తుందని సర్కారు ఆశ పడుతోంది!
- ✔ బ్రిటన్ పౌరుల్లో ఏకంగా 52 శాతం మంది ఈ రాచరికపు సంప్రదాయం కొనసాగింపును వ్యతిరేకించినట్టు ఇటీవలి సర్వేలో తేలింది.

అభ్యంతరకరంగా కాళీమాత చిత్రం

ఉక్రెయిన్ రక్షణ శాఖ నిర్వాకం • వివాదం కావడంతో తొలగింపు

కీవ్: కాళీమాతను అభ్యంతరకరంగా చిత్రీకరిస్తూ ఉక్రెయిన్ రక్షణ మంత్రిత్వ శాఖ తన అధికారిక ట్విట్టర్ ఖాతాలో షేర్ చేసిన చిత్రం తీవ్ర వివాదానికి దారి తీసింది. దీనిపై పలువురు హిందువులు ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఆ ట్వీట్‌ను ఉక్రెయిన్ రక్షణ శాఖ వెంటనే తొలగించింది. రష్యాలోని చమురు ప్లాంట్ పేలి, అందులో నుంచి పొగ బదులుగా కాళిమాత ఉద్భవిస్తున్నట్లుగా ఈ చిత్రాన్ని సృష్టించారు. ఇది హాలీవుడ్ నటీమణి మార్లిన్ మన్రోను పోలి ఉండడం గమనార్హం. అంతేకాదు ఆ చిత్రానికి 'వర్క్ ఆఫ్ ఆర్ట్' అని క్యాప్షన్ కూడా ఇచ్చారు. కాళిమాత చిత్రాన్ని ట్విట్టర్ ఖాతా నుంచి ఉక్రెయిన్ రక్షణ శాఖ తొలగించినప్పటికీ దాని స్క్రీన్‌షాట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఉక్రెయిన్ ప్రభుత్వానికి హిందూఫోబియా సోకిందని పలువురు నెటిజన్లు విమర్శించారు. వెంటనే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ఈ విషయంలో జోక్యం చేసుకోవాలని భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్‌ను కోరారు. ఉక్రెయిన్–రష్యా యుద్ధంలో భారత ప్రభుత్వం తటస్థ వైఖరిని అవలంబిస్తున్న సంగతి తెలిసిందే. రష్యా చర్యలను భారత్ ఖండించకపోవడం ఉక్రెయిన్‌కు రుచించడం లేదు. అంతేకాకుండా రష్యా నుంచి భారత్ పెద్ద ఎత్తున చమురు దిగుమతి చేసుకుంటుండడం ఉక్రెయిన్‌కు కంటగింపుగా మారింది.


వస్త్రధారణకు లింగభేదం ఎందుకంటూ స్కర్టులు ధరించి ఢిల్లీ మెట్రో రైల్లో ప్రయాణిస్తున్న ఇద్దరు యువకులు



కరీంనగర్: హైదరాబాద్‌లోని నూతన సచివాలయంలోని తన చాంబర్‌లో ఫైల్‌ను అధికారులకు అందజేస్తున్న మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర సివిల్ సప్లయి కార్పొరేషన్ చైర్మన్ రవీందర్‌సింగ్.



సమస్యలు పరిష్కరించాలి

తమ సమస్యలు పరిష్కరించకుంటే మే నెలలో సమ్మె తప్పదని తెలంగాణ రేషన్ డీలర్ల సంఘం జేఏసీ చైర్మన్ నాయకోటి రాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. 8లో▸

గరిష్టం/కనిష్టం
31.0/22.0

వాతావరణం

ఆకాశం మేఘావృతమై ఉంటుంది. పగలు ఉక్కపోతగా ఉంటుంది. ఉరుములతో కూడిన వర్షం కురిసే అవకాశం ఉంది.

న్యూస్‌రీల్

పంట నష్టపరిహారం వెంటనే చెల్లించాలి



కార్యదర్శుల నిరసన దీక్షలో రాజేందర్

హుజూరాబాద్‌రూరల్: రైతుల పంటనష్టాన్ని అధికారులు పరిశీలించి నష్టపరిహారం చెల్లించాలని, పంచాయతీ కార్యదర్శుల సమస్యలను పరిష్కరించాలని బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, హుజూరాబాద్ ఎమ్మెల్యే ఈటల రాజేందర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయ ఆవరణలో పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన నిరసనదీక్షకు ఆదివారం మద్దతు తెలిపారు. అనంతరం పట్టణశివారులోని పలు రైస్‌మిల్లులను సందర్శించారు. ముఖ్యమంత్రి తన సొంత ప్రతిష్ట కోసమే కోట్లాది రూపాయలు ఖర్చు చేసి నూతన సచివాలయం నిర్మించారని దాని వల్ల ప్రజలకు ఏం ఉపయోగం లేదని, కేసీఆర్ ఈ మూడు,నాలుగు నెలలపాటు రోజూ ఆఫీస్‌కి వస్తారా? అని ప్రశ్నించారు. డివిజన్‌లో 40 రైసు మిల్లులు ఉండగా.. 25 మిల్లులకే అనుమతి ఇవ్వడంతో ఈ పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

కాంట్రాక్టు ఉద్యోగుల క్రమబద్ధీకరణ హర్షణీయం



క్షీరాభిషేకం చేస్తున్న కాంట్రాక్టు లెక్చరర్లు

కరీంనగర్: కాంట్రాక్టు ఉద్యోగులను క్రమబద్ధీకరిస్తూ ఆదివారం సీఎం కేసీఆర్ సంతకం చేయడం హర్షణీయమని, కాంట్రాక్టు లెక్చరర్ల సంఘం 475 రాష్ట్ర ఉపాధ్యక్షుడు లింగంపల్లి దేవేందర్ అన్నారు. ఈ సందర్భంగా తెలంగాణ చౌరస్తాలో కేసీఆర్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కాంట్రాక్టు ఉద్యోగులకు తెలంగాణ ఉద్యమ సమయంలో కేసీఆర్ ఇచ్చిన మాటను నిలబెట్టుకొని క్రమబద్ధీకరించారని గుర్తు చేశారు. కాంట్రాక్ట్ లెక్చరర్ల సంఘం పెద్దపల్లి, కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల అధ్యక్ష కార్యదర్శులు కే.సునీల్, ప్రేంసాగర్, జీ.రాజమహేందర్‌రెడ్డి, జక్కుల పవన్, కంకణాల శ్రీనివాస్, హెచ్.శ్రీనివాస్, ఉమాదేవి, తదితరులు పాల్గొన్నారు.

'ధాన్యం కొనుగోళ్లపై బహిరంగ చర్చకు సిద్ధమా?'

కరీంనగర్‌టౌన్: ధాన్యం కొనుగోళ్లపై మంత్రి గంగుల కమలాకర్‌కు మాజీ ఎంపీ పొన్నం ప్రభాకర్ సవాల్ విసిరారు. ధాన్యం కొనుగోళ్లలో మంత్రి గంగుల కమలాకర్ చెప్తున్నది అవాస్తవాలే అని ఆదివారం ఒక ప్రకటనలో విమర్శించారు. మంత్రి చెబుతున్నట్లు రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు జరగలేదని, 11 జిల్లాల్లో ఇప్పటి వరకు ఒక్క ధాన్యపు గింజ కొనుగోలు జరగలేదని, ఆరు జిల్లాల్లో ఒకమెట్రిక్ టన్ను లోపు కొనుగోలు జరిగిందని స్పష్టమవుతుందని తెలిపారు. మంత్రి ప్రాతినిథ్యం వహిస్తున్న కరీంనగర్ ఉమ్మడి జిల్లాలోనే దాదాపు నాలుగు లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం లభ్యమవుతుండగా, కేవలం 2,267 మెట్రిక్ టన్నుల ధాన్యం మాత్రమే కొనడం మంత్రి పాలనకు నిదర్శనమన్నారు. కొనుగోళ్ల విషయంలో బహిరంగ చర్చకు సిద్ధంగా ఉన్నానని సవాలు విసిరారు.

నేడు ప్రపంచ కార్మిక దినోత్సవం

- పనికిరాని చట్టాలు.. కానరాని కనీస వేతనాలు
- కార్మిక హక్కుల సాధనకు తప్పని పోరాటాలు
- శ్రమదోపిడీపై స్పందించని ప్రభుత్వాలు
- ఉమ్మడి జిల్లాలో కార్మికుల పరిస్థితి ఇదీ..





ఆగని వలసలు.. సాగని బతుకులు

కరీంనగర్: బుక్కెడు బువ్వ కోసం బతుకు పోరాటం.. కుటుంబపోషణకు ఆరాటం.. ఎండనకా.. వాననకా.. చలనకా.. రక్తాన్ని స్వేదంగా చిందించి పొద్దంతా శ్రమిస్తే వచ్చే కూలి ఒక్కపూట తిండికి సరిపోని పరిస్థితి. ఉన్న ఊరిలో ఉపాధి కరువై.. బతుకు బరువై తెలియని ప్రాంతానికి వలసవెళితే అక్కడా తప్పని శ్రమదోపిడీ. వేకువజాము నుంచి సందెవేళ దాకా శ్రమించినా కష్టాల ఊబినుంచి కార్మికులు బయటకు రాలేకపోతున్నారు. పాలకులు మారినా.. శ్రామికుల తలరాతలు మారడం లేదు. శ్రమకు తగ్గ ప్రతిఫలం లేక అర్ధాకలితో అలమటించే వారు కోకొల్లలు. ప్రభుత్వ, ప్రయివేటు సంస్థల్లో కనీస వేతన చట్టం, పనివేళలు బుట్టదాఖలు. ఉమ్మడి కరీంనగర్‌జిల్లా నుంచి వేలాది మంది కార్మికులు గల్ఫ్ దేశాలకు వలస వెళ్తుండగా.. జిల్లాకు సైతం వివిధ పనుల కోసం ఇతర రాష్ట్రాల వాళ్లు వస్తున్నారు. స్థానికంగా వేలాదిమంది వివిధ రంగాల్లో పనిచేస్తుండగా.. వచ్చే వేతనం అంతంతే.. నేడు మేడే సందర్భంగా ఉమ్మడి జిల్లాలో కార్మికుల జీవన పరిస్థితి, అభిప్రాయాలతో ప్రత్యేక కథనం..

వలస కార్మికుల పరిస్థితి అగమ్యగోచరం

కరీంనగర్ జిల్లాలో భవన నిర్మాణ, గ్రానైట్, తదితర రంగాల్లో 85వేల మందికిపైగా వలసకూలీలు ఉన్నారు. స్థానికులు 2లక్షలకు పైగానే ఉన్నారు. కార్మికశాఖ లెక్కల ప్రకారం ఇతర రాష్ట్రాలకు చెందిన కూలీలు ఆధార్, రేషన్ కార్డు, బ్యాంకు పాస్‌బుక్ ఉంటేనే జిల్లాలో కార్మికుడిగా గుర్తింపు పొందే అవకాశం ఉంది. వలస వచ్చే కార్మికులకు అలాంటి అవకాశాలు లేకపోవడంతో అనధికారికంగా ఏజెంట్ల వద్ద పనిచేస్తూ సంవత్సరానికి కాంట్రాక్టు మాట్లాడుకుని పొట్ట పోసుకుంటున్నారు. జిల్లాలో ఇటుకబట్టీల్లో ఒడిశా కార్మికులు 3వేల మందికిపైగా ఉన్నారు. ప్లంబర్, పీవోపీ పనుల కోసం రాజస్థాన్, ఉత్తరప్రదేశ్ కార్మికులు, లేబర్ పనుల కోసం ఛత్తీస్‌గఢ్, మహారాష్ట్రకు చెందినవారు 30వేల మందికిగాపైగా ఇక్కడ జీవనోపాధి పొందుతున్నారు. ఇంటి నిర్మాణ మేస్త్రీలుగా ఆంధ్రప్రదేశ్‌కు చెందినవారు పదివేల కుటుంబాలకు చెందిన వారు ఉన్నట్లు సమాచారం. జిల్లాలో 550కిపైగా గ్రానైట్ క్వారీల్లో తమిళనాడు, మధ్యప్రదేశ్, మహారాష్ట్రకు చెందిన వారితో పాటు స్థానికులు కూడా పదివేల మందివరకు పనిచేస్తున్నారు. అరకొర వేతనాలతో ఒకపూట పస్తులుండి కాలం వెళ్లదీస్తున్న కుటుంబాలెన్నో. కార్మికులకు సౌకర్యాలు కల్పించాలని గ్రానైట్‌వర్కర్స్ యూనియన్ చేస్తున్న పోరాటం నిరంతరం కొనసాగుతూనే ఉంది. వలస కార్మికులు పనిచేసే చోట ప్రమాదవశాత్తు మరణిస్తే అధికారికంగా ఎలాంటి సాయం అందడం లేదు.

నేడు ఎగరనున్న ఎర్రజెండా..

చికాగోలో 8 గంటల పని దినాన్ని కల్పించాలని కోరుతూ కార్మికులు 1848లో పెద్దఎత్తున ఆందోళన చేశారు. ప్రభుత్వం వారిపై కాల్పులు జరపగా ఏడుగురు చనిపోయారు. ఏ మాత్రం వెనక్కు తగ్గని కార్మికులు రక్తంతో తడిసిన వారి చొక్కాలనే జెండాలుగా చేసి మే 1న భారీ ప్రదర్శన నిర్వహించారు. వారి పోరాట ఫలితంగా రోజుకు 8గంటలు మాత్రమే పని సమయం నిర్ణయించారు. ఆ పోరాటంలో వీరమరణం పొందిన వారికి చిహ్నంగా ఏటా మే 1వ తేదీని మేడేగా ప్రకటించారు. మేడే సందర్భంగా సోమవారం ఉమ్మడి జిల్లాలోని వివిధ కార్మిక సంఘాలు, వామపక్షపార్టీల ఆధ్వర్యంలో వారివారి కార్యాలయాల్లో, పనిస్థలాల్లో జెండా ఆవిష్కరణలు, సభలు, సమావేశాలు అట్టహాసంగా నిర్వహించుకునేందుకు సిద్ధమవుతున్నారు.

చిన్న జిల్లా.. ఉపాధికి అడ్డా



సిరిసిల్లటౌన్: తెలంగాణాలోనే అతిచిన్న జిల్లాగా ఏర్పడిన రాజన్న సిరిసిల్ల శ్రామికుల ఉపాధికి అడ్డాగా మారింది. వ్యవసాయం, వస్త్రోత్పత్తి, హమాలీ తదితర రంగాల్లో మొత్తంగా 1.60లక్షల మంది రిజిష్టర్డ్ కార్మికులు పనిచేస్తున్నట్లు సమాచారం. వాస్తవానికి 2లక్షలకు పైగా కార్మికులు పనిచేస్తున్నారు. 2000 ఏడాదికి అంతకుముందు సిరిసిల్ల డివిజన్ (ప్రస్తుతం జిల్లా)లో కరువు కాటకాలతో ముంబయి, దుబాయ్ వలసలు వెళ్లారు. ప్రస్తుతం సిరిసిల్ల వస్త్ర పరిశ్రమకు రాష్ట్రసర్కారు ఆర్డర్లు, ఇతర రాష్ట్రాల ప్రభుత్వాలు, వివిధ కంపెనీల ఆర్డర్లు రావడంతో ఉపాధి పెరిగింది. ఫలితంగా ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికులు వస్త్రోత్పత్తిలో పనులు చేస్తూ ఉపాధి పొందుతున్నారు. జిల్లాలోని భవన నిర్మాణ రంగమూ విస్తరించడంతో కార్మికులకు డిమాండ్ పెరిగింది. భవననిర్మాణ రంగంలో స్థానికులు 42,000 మంది, వలస కార్మికులు 5వేల మంది పనిచేస్తున్నారు. చేనేతరంగంలో స్థానికులు 16వేల మంది, వలస కార్మికులు వెయ్యిమంది ఉన్నారు. హమాలీ రంగంలో స్థానికులు 6వేలు, 2వేల మంది వలస కార్మికులు ఉన్నారు.

రోజువారీ కూలీలుగా..



సుల్తానాబాద్/జ్యోతినగర్: పెద్దపల్లి జిల్లా ఎన్టీపీసీ రామగుండం పరిధిలో వందలాది మంది వలస కార్మికులు పనిచేస్తున్నారు. ఎన్టీపీసీ, ఆర్ఎఫ్‌సీఎల్, ఇతర పారిశ్రామిక ప్రాంతాల్లో రోజువారీ కూలీలుగా కొనసాగుతున్నారు. అత్యధికంగా రైస్‌మిల్లులు ఉన్న సుల్తానాబాద్, మంథని, కమాన్‌పూర్ ప్రాంతాల్లో బిహార్ కార్మికులు ఎక్కువగా పనిచేస్తున్నారు. జిల్లాలోని సుమారు 150 రైస్‌మిల్లుల్లో 7,500 మంది వరకు బిహారీలు ఉపాధి పొందుతున్నారు. రోజంతా కష్టపడితే వచ్చేది రూ.500 నుంచి రూ.వెయ్యి మాత్రమే. జిల్లాలోని ఇటుకబట్టీల్లో కార్మికుల పరిస్థితి అధ్వానం. 50కి పైగా ఇటుకబట్టీలు ఉండగా.. వందలాది మంది కార్మికులు పనిచేస్తున్నారు. ఒక్కోసారి వీరికి కనీసం తిండి పెట్టడంలేదని ఆందోళనకు దిగిన సందర్భాలు ఎన్నో. అధికారులు ఎన్నిచర్యలు తీసుకుంటున్నా.. యజమానులు ఇప్పటికీ వారిని బానిసల్లాగానే చూస్తుండడం ఆందోళనకరం.

వేతన ఒప్పందం ఏదీ?



గోదావరిఖని: 11వేజ్‌బోర్డు పూర్తిస్థాయి ఒప్పందం కోసం సింగరేణి కార్మికులు ఎదురు చూస్తున్నారు. జిల్లాలోని రామగుండం రీజియన్ ఆర్జీ–1,2,3 ఏరియాల్లో సుమారు 11,500మంది పనిచేస్తున్నారు. గత సమావేశంలో మూలవేతనంపై 19శాతం పెంచేందుకు యాజమాన్యం అంగీకరించింది. అయితే అలవెన్స్ పెంపుపై ఎలాంటి ఒప్పందం కుదరలేదు. ఏప్రిల్ 18న కోల్‌కత్తాలో జరిగిన జేబీసీసీఐ 11వ వేజ్ బోర్డు 9వ సమావేశంలో పలు అంశాలపై చర్చించారు. పూర్తిస్థాయి వేతన ఒప్పందం కోసం తిరిగి సమావేశం కావాలని నిర్ణయించాయి. మారుపేర్ల మార్పు, విజిలెన్స్ కేసుల క్లియరెన్స్, అండర్‌గ్రౌండ్‌లో అన్‌ఫిట్ అయిన కార్మికులు సర్ఫేస్‌లో అదే ఉద్యోగం ఇస్తూ వేజ్‌ప్రొటెక్షన్ తదితర డిమాండ్ల పరిష్కారంపై కార్మికులు ఎదురుచూస్తున్నారు. సింగరేణిలో కాంట్రాక్టు కార్మికులు శ్రమదోపిడీకి గురవుతున్నారు. కోలిండియా మాదిరిగా సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్టు కార్మికులకు కనీసవేతనాలు అందడం లేదు. జిల్లా పరిధిలోని సింగరేణిలో సుమారు నాలుగువేల మంది కాంట్రాక్టు కార్మికులు ఉన్నారు.

అటు నుంచి ఇటు.. ఇటు నుంచి అటు

కథలాపూర్(వేములవాడ): ఉన్న ఊరిలో సరైన ఉపాధిలేక పలువురు జిల్లా వాసులు ఉపాధిని వెతుక్కుంటూ అప్పులు చేసి వీసాలు కొనుగోలు చేసి ఇప్పటికీ గల్ఫ్ బాటపడుతున్నారు. అక్కడ సరైన ఉపాధి దొరక్కపోవడంతో అప్పు తీర్చేందుకు అరకొరవేతనాలతో కొందరు నెట్టుకొస్తుండగా.. మరికొందరు కొన్నిరోజులకే ఇంటిబాట పడుతున్నారు. ఇతర రాష్ట్రాల్లో పనులు లేక కూలీలు పనుల కోసం జగిత్యాల జిల్లాకు వస్తున్నారు. జిల్లాకు వలస వస్తున్న కూలీలు ఎక్కువగా కొనుగోలు కేంద్రాల్లో హమాలీలుగా, వరినాట్లు వేసేందుకు వస్తున్నారు. భవన నిర్మాణాల కోసం కూలీలు, మేస్త్రీలుగా ఎక్కువగా ఆంధ్రప్రదేశ్, మహారాష్ట్ర నుంచి వస్తున్నారు. జిల్లానుంచి లక్ష మందికి పైగా గల్ఫ్‌దేశాలకు ఉపాధికోసం వెళ్తుండగా.. ఇతర రాష్ట్రాల వాళ్లు దాదాపు 2,500 మంది ఇక్కడి పనిచేస్తున్నారు.

నేను రైతును.. గల్ఫ్‌బాట పట్టిన



నాలుగు ఎకరాల భూమిలో సాగుచేసిన. బోర్లు వేస్తే చుక్కనీరు రాలే. ఏళ్లుగా చూసిన ఏ ప్రాజెక్టు నీళ్లు మా శివారులకు చేరలే. వ్యవసాయం కోసం చేసిన అప్పులు తీరకపోవడంతో గల్ఫ్ బాట పట్టిన. దుబాయిలో వాహనాల తయారీ కంపెనీలో కార్మికుడిగా పనిలోచేరిన. పని కష్టమైనప్పటికి డబ్బుల కోసం కష్టాన్ని దిగమింగుకునే పరిస్థితి నెలకొంది. గది, భోజనాల ఖర్చులు పోను నెలకు రూ.12 వేలు మిగులుతున్నాయి. గల్ఫ్ వలస కార్మికులతోపాటు రైతులు, కార్మికుల సంక్షేమాల కోసం ప్రభుత్వాలు ఆలోచించాలి. – పిడుగు రమేశ్, తాండ్య్రాల, కథలాపూర్

పేర్లు నమోదు చేసుకోవాలి



ఇతరరాష్ట్రాల నుంచి జిల్లాకు వస్తున్న వలస కూలీలు ఆధార్, రేషన్‌కార్డు, బ్యాంక్ పాస్‌బుక్‌తో తాము పనిచేస్తున్న యాజమాని అనుమతి తో కార్మికశాఖ కార్యాలయంలో పేరు నమోదుచేసుకోవాలి. చాలా మంది వలస కూలీలు ఇతరత్రా పనుల కోసం వస్తూ ఏడాది కాంట్రాక్ట్ ముగియగానే వారి య జమాని ఇచ్చిన డబ్బులు తీసుకుని వెళ్లిపోతుంటారు. కార్మికశాఖ కార్యాలయంలో గుర్తింపు పొందినకార్డులు తీసుకున్న వారే ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులు.

– ఎస్.రమేశ్‌బాబు, ఉప కార్మిక కమిషనర్, కరీంనగర్

ఏడాదిలో ఎనిమిది నెలలు ఇక్కడే



మాది బిహార్. సుల్తానాబాద్‌లో రైస్‌మిల్ హమాలీగా పని చేస్తున్నా. వానాకాలం వేసవికాలం కలిపి ఎనిమిది నెలలు ఇక్కడ ఉపాధి దొరుకుతుంది. మిగితా నాలుగు నెలలు సైతం ఇక్కడే ఉండాలని యజమాని చెప్పినప్పటికీ భార్య, పిల్లల కోసం వెళ్లివస్తాం. వారానికోసారి ఇంటికి డబ్బులు పంపిస్తాను. – మంటూ చౌదరి, హమాలీ

క్యాంపులో ఉంటూ..



మా రాష్ట్రం నుంచి వచ్చినవాం ఇక్కడ క్యాంపులో ఉంటాం. కంపెనీ వాహనంలోనే ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టుకు వెళ్లి పనులు చేసి వస్తాం. నేను ఫిట్టర్‌గా పని చేస్తాను. వలస కార్మికులకు కొంతఎక్కువ మొత్తంలో జీతం చెల్లించాలి. ప్రత్యే క చట్టం చేసి వేతనాలు పెంచేవిధంగా ప్రభుత్వాలు చర్యలు తీసుకోవాలి.

– రాజన్, ఎన్టీపీసీ తెలంగాణ ప్రాజెక్టు, బిహార్

సిరిసిల్లలో ఎక్కువ కూలి



మాది కామారెడ్డి జిల్లా భవానిపేట.ఎనిమిదేళ్లుగా సిరిసిల్లకు వచ్చి భవన నిర్మాణ కార్మికుడిగా చేస్తున్నా. మా ఏరియాలో ఒక్క రోజుకు రూ.600కూలీ వస్తుంది. ఇక్కడ రూ.800 ఇస్తుండ్రు. నా భార్య లత బీడీలు చేస్తుంది. ఇద్దరం రెక్కల కష్టంతో కొడుకు నితిన్‌ను చదివించుకుంటున్నం. – గద్దం శివ, భవానిపేట, కామారెడ్డి



ఇరుకుల్లలో నీళ్లనుంచి ధాన్యం తొలగిస్తున్న రైతు



వేగురుపల్లిలో...



దుర్శేడ్ సెంటర్‌లో..



జలమయమైన కరీంనగర్‌లోని రోడ్డు





దుర్శేడ్‌లో కూలిన రేకులు ఇరుకుల్లలో ధాన్యం

వీడని వాన.. తీరని కష్టం

కరీంనగర్‌రూరల్:/మానకొండూర్‌రూరల్: వాన వీడడం లేదు. అన్నదాత కష్టం తీరడం లేదు. ఆదివారం కురిసిన అకాల వర్షం రైతాంగానికి మళ్లీ తీరని నష్టం కలిగించింది. సాయంత్రం ఒక్కసారిగా కురిసిన వానకు కరీంనగర్ మండలంలోని మొగ్దుంపూర్, ఇరుకుల్ల, దుర్శేడ్, నల్లగుంటపల్లి, చేగుర్తి, బొమ్మకల్, గోపాల్‌పూర్ గ్రామాల్లోని వరిపంట నేలరాలింది. వడగండ్ల దెబ్బకు వరిగింజలన్ని నేలరాలాయి. కొనుగోలు కేంద్రాల్లోని ధాన్యం తడిసింది. వరదనీటిలో కొట్టుకపోతున్న ధాన్యాన్ని కాపాడుకునేందుకు పలువురు రైతులు పడరానిపాట్లు పడ్డారు. బొమ్మకల్ కేంద్రంలోని ధాన్యం మొలకెత్తింది. దుర్శేడ్‌లో తన్నీరు బాలు, అనవేని మల్లయ్యతోపాటు మరో ఇద్దరి షెడ్లకు చెందిన రేకులు కొట్టుకపోయాయి. దుర్శేడ్ జెడ్పీ పాఠశాల ఎదుటు చెట్టు విరిగిపడింది. మూడు స్తంభాలు విరిగిపోవడంతో విద్యుత్ సరఫరా నిలిచిపోయింది. రాజీవ్ రహదారిలో దుర్శేడ్ 33కేవీ సబ్‌స్టేషన్ ముందు చెట్టు విరిగిపడటంతో వాహనాల రాకపోకలకు కొంత అంతరాయమేర్పడింది. చేగుర్తిలోని నర్సరీపై గ్రీన్‌షెడ్ కూలడంతో మొక్కలన్ని ధ్వంసమయ్యాయి. మానకొండూర్ మండలం పచ్చునూర్, వెల్ది, ఊటూర్, వేగురుపల్లి గ్రామాల్లో వరిపంట నీటిపాలైంది. కొనుగోలు కేంద్రాలలో ఆరబోసిన ధాన్యం నీటిలో మునిగింది. భారీ వర్షానికి కరీంనగర్‌లోని ప్రధాన రోడ్లు జలమయం అయ్యాయి.

సాక్షి ఆధ్వర్యంలో వేసవి శిక్షణ

- చదరంగంలో మూడ్రోజులపాటు ట్రైనింగ్



కరీంనగర్‌స్పోర్ట్స్: మేధస్సుకు పదును పెట్టే చదరంగంలో చిన్నారులకు నైపుణ్యాలు నేర్పేందుకు సాక్షి మీడియా గ్రూప్ శ్రీకారం చుట్టింది. నేటినుంచి ఈనెల 3వరకు నిష్ణాతులైన కోచ్‌ల ఆధ్వర్యంలో శిక్షణ కార్యక్రమం జరగనుంది. చిన్నారులు 14ఏళ్లలోపు ఉండాలి. ఆధార్ కార్డు, చెస్‌బోర్డుతో రావాలి. సీనియర్ క్రీడాకారుడు కంకటి అనూప్ కుమార్ శిక్షణ ఇస్తారు. శిబిరాన్ని అడిషనల్ కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్ లాల్ ప్రారంభించనున్నారు.

వేదిక: జీనియస్ చెస్ అకాడమీ, జ్యోతినగర్ (రెడ్డిగారి వంటిల్లుపైన)
పేర్ల నమోదుకు సంప్రదించాల్సిన నంబర్లు: 91601 60161, 97049 79424, 99498 30494
శిక్షణ సమయం: ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు

కానిస్టేబుల్ పరీక్షకు 98.81శాతం హాజరు



కరీంనగర్‌లోని మహిళా డిగ్రీ కళాశాల వద్ద బారులుతీరిన అభ్యర్థులు

- ప్రశాంతంగా ముగిసిన రాతపరీక్ష
- 14,020 మంది అభ్యర్థులు హాజరు
- పరీక్ష కేంద్రాలను పరిశీలించిన సీపీ సుబ్బారాయుడు



సెంటర్‌ను తనిఖీ చేస్తున్న సీపీ సుబ్బారాయుడు

కరీంనగర్‌క్రైం: పోలీస్‌శాఖలోని వివిధవిభాగాల్లో స్టైఫండరీ క్యాడెట్ ట్రైనీ కానిస్టేబుల్(సివిల్/ఏఆర్/టీఎస్ఎస్పీ/ఎస్పీఎఫ్/ఎస్ఏఆర్/ సీపీఎల్/ఎస్ఎఫ్ఓ) అభ్యర్థుల ఎంపిక ప్రక్రియలో భాగంగా ఆదివారం రాత పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. పరీక్ష కోసం కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల, శ్రీచైతన్య డిగ్రీ,పీజీ కళాశాల, అపూర్వ డిగ్రీ కళాశాల, వివేకానంద డిగ్రీ, పీజీ కళాశాల, ఎస్ఆర్ఆర్ ప్రభుత్వ కళాశాల, తిమ్మాపూర్ మండలం రామకృష్ణకాలనీలోని వాగేశ్వరి, జ్యోతిష్మతి, శ్రీచైతన్య కళాశాలలు, కరీంనగర్‌లోని కిమ్స్ డిగ్రీ,పీజీ కళాశాల, వివేకానంద ఇంజనీరింగ్ కళాశాలల్లో కేంద్రాలు ఏర్పాటు చేశారు. ఉదయం 10గంటల నుంచి మధ్యాహ్నం ఒంటిగంట వరకు పరీక్ష జరిగింది. అభ్యర్థుల బయోమెట్రిక్ వివరాలు నమోదు చేశారు. 14,188మందికి 14,020 మంది పరీక్ష రాశారు. 168మంది గైర్హాజరవడంతో 98.81హాజరు శాతం నమోదైంది. సీపీ ఎల్.సుబ్బారాయుడు పలు పరీక్ష కేంద్రాలను పరిశీలించారు. ట్రాఫిక్‌కు అంతరాయం కలగకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకున్నారు.

క్లుప్తంగా

ఆర్యవైశ్య మహిళా సంఘం అధ్యక్షురాలి నియామకం


అపర్ణ, పద్మ

సుల్తానాబాద్(పెద్దపల్లి): పట్టణానికి చెందిన పల్లా అపర్ణను ఆర్యవైశ్య మహిళా సంఘం జిల్లా అధ్యక్షురాలుగా నియమించినట్లు సంఘం జిల్లా అధ్యక్షుడు కోలేటి రమేశ్ తెలిపారు. ఈ మేరకు ఆదివారం పెద్దపల్లిలో సమావేశం నిర్వహించారు. కార్యదర్శిగా పెద్దపల్లి పట్టణానికి చెందిన పద్మ నియమించారు. జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ వంగల వెంకట్ నారాయణ, సెక్రటరీ లింగమూర్తి, కోశాధికారి సదానందం, ఆర్యవైశ్య మహాసభ రాష్ట్ర ఈసీ మెంబర్ మొగిల్లపల్లి కృష్ణమూర్తి, ఆర్యవైశ్య సంఘం ఎన్నికల కన్వీనర్ కొమురవెల్లి రాజేందర్, జిల్లా యువజన సంఘం అధ్యక్షుడుర పెద్ది వెంకటేశ్ పాల్గొన్నారు. పద్మ మాట్లాడుతూ.. ఆర్యవైశ్య సంఘం పెద్దల సహకారంతో త్వరలోనే పూర్తి కార్యవర్గాన్ని ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఆర్యవైశ్యుల అభివృద్ధికి తనవంతు కృషి చేస్తామని పేర్కొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

పెద్దపల్లిరూరల్: అకాల వర్షాలతో పంటలు నష్టపోయిన రైతులను ప్రభుత్వం ఆదుకోవాలని తెలంగాణ ప్రజాఫ్రంట్ జిల్లా కన్వీనర్ గుమ్మడి కొమురయ్య, కో–కన్వీనర్ గాండ్ల మల్లేశం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. వరి పంట చేతికందే దశలో వర్షాలు కురిసి, తీవ్ర నష్టం వాటిల్లిందన్నారు. మిరప, మామిడి రైతులదీ ఇదే పరిస్థితి అని పేర్కొన్నారు. వ్యవసాయ, రెవెన్యూ అధికారులు సమగ్ర విచారణ జరిపి, పంటల నష్టంపై ప్రభుత్వానికి నివేదిక ఇవ్వాలన్నారు. ఇప్పటికే కోతలు పూర్తయిన ప్రాంతాల్లో కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తూకం వేయాలని కోరారు. తడిసిన, రంగు మారిన ధాన్యాన్ని కొనాలని, రైతులకు ఎకరానికి రూ.50 వేల పరిహారం ఇవ్వాలన్నారు.

ధార్మిక సాహిత్య పురస్కార ప్రదానం


పురస్కారం అందుకుంటున్న లక్ష్మణరావు

కరీంనగర్ కల్చరల్: వికారాబాద్‌లో జరిగిన జాతీయ సాహిత్య పరిషత్ 19వ ప్రాంత మహాసభల్లో 2021 సంవత్సరానికిగాను జిల్లాకు చెందిన సాహితీవేత్త, కవి, అవధాని డాక్టర్ గంగ్ర లక్ష్మణరావుకు ఆదివారం రాష్ట్ర స్థాయి జాతీయ సాహిత్య పరిషత్ ధార్మిక సాహిత్య పురస్కారం అందుకున్నారు. కార్యక్రమంలో సంస్థ రాష్ట్ర అధ్యక్షుడు ఆచార్య కసిరెడ్డి వేంకటరెడ్డి భాస్కరయోగి, కూర జయదేవ్, కొండా లక్ష్మీకాంతరెడ్డి, నాగభూషణం, చేరి సునీతారెడ్డి, గాజుల రవీందర్, స్తంభంకాడి గంగాధర్, తంగెడ నవనీతరావు తదితరులు పాల్గొన్నారు.

6న ఎస్‌టీపీఎఫ్ ఆధ్వర్యంలో సమావేశం

విద్యానగర్(కరీంనగర్): రాష్ట్రంలో జరుగుతున్న భౌగోళిక అన్యాయాలపై సామాజిక తెలంగాణ పొలిటికల్ ఫ్రంట్(ఎస్‌టీపీఎఫ్) ఆధ్వర్యంలో ఈ నెల 6న సమావేశం నిర్వహిస్తున్నట్లు ఫ్రంట్ కో–ఆర్డినేటర్ దేవల్ల సమ్మయ్య తెలిపారు. ఆదివారం కరీంనగర్‌లోని ప్రెస్‌భవన్‌లో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రంలో భౌగోళికంగా అన్యాయం జరుగుతోందన్నారు. దీన్ని అడ్డుకునేందుకు సామాజికవాదులు ముందుకు రావాలని కోరారు. నాయకులు రేవెళ్లి శంకర్, కంటే రామచందర్, డాక్టర్ మనోహర్‌చారి, ప్రసాద్‌రావు, మార్వాడి సుదర్శన్, సుతారి లచ్చన్న, మానుపాటి శ్రీనివాస్, భరత్, కూతాడి శివరాజ్ తదితరులున్నారు.

స్టడీ సర్కిళ్లలో ఉచిత శిక్షణ

- గ్రూప్స్‌తోపాటు ఇతర పోటీ పరీక్షలకు తర్ఫీదు
- దరఖాస్తులు ఆహ్వానిస్తున్న బీసీ, ఎస్సీ, ఎస్టీ సర్కిళ్లు
- ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఫౌండేషన్ కోర్సుకు గత 27న నోటిఫికేషన్
- ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఉద్యోగార్థులకు సదవకాశం


ఎస్సీ స్టడీ సర్కిల్ భవనం

కరీంనగర్: రాష్ట్ర ప్రభుత్వం వరుస ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేస్తున్న నేపథ్యంలో ఎస్సీ, ఎస్టీ, బీసీ స్టడీ సర్కిళ్లు ఉచిత శిక్షణకు సిద్ధమవుతున్నాయి. బీసీ, ఎస్సీ, ఎస్టీ స్టడీ సర్కిల్స్‌లో ఉచిత శిక్షణ తరగతులు కొనసాగుతుండగా తాజాగా ఎస్సీ స్టడీ సర్కిల్‌లో వంద సీట్ల భర్తీ కోసం ఐదు నెలల ఫౌండేషన్ కోర్సు ప్రారంభించేందుకు గత నెల 27న నోటిఫికేషన్ విడుదలైంది. ఆయా స్టడీ సర్కిళ్లు ఇప్పటికే వాట్సాప్, టెలిగ్రాం యాప్‌ల ద్వారా ఉద్యోగార్థులకు శిక్షణ ఇస్తుండగా, ప్రభుత్వ ఆదేశాలతో ప్రత్యక్ష తరగతులు నిర్వహించాలని నిర్ణయించి, నిరుద్యోగుల నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాయి.

ఎస్సీ స్టడీ సర్కిల్ పరిధిలో..

అంబేడ్కర్ స్టడీ మెమోరియల్ ద్వారా ఎస్సీ నిరుద్యోగ అభ్యర్థులకు ఎస్సీ అభివృద్ధి శాఖ ఉచిత శిక్షణనిస్తోంది. కలెక్టరేట్ రోడ్‌లో గల అంబేడ్కర్ భవన్‌లోని ఎస్సీ స్టడీ సర్కిల్‌లో ఇప్పటికే గ్రూప్–1, 2, 3, 4, బ్యాంకింగ్, ఆర్‌ఆర్‌బీ(రైల్వే), స్టాఫ్ సెలక్షన్ కమిషన్ ఇతర పరీక్షల కోసం రెసిడెన్షియల్ విధానంలో 5 నెలలపాటు శిక్షణనిస్తున్నట్లు ఎస్సీ సంక్షేమ శాఖ అధికారి పి.నేతానియల్, స్టడీ సర్కిల్ డైరెక్టర్ బండ శ్రీనివాస్‌లు తెలిపారు. ఏదైనా డిగ్రీ ఉత్తీర్ణులై, టీఎస్‌పీఎస్సీ నియమ నిబంధనల ప్రకారం అర్హులైన ఉమ్మడి కరీంనగర్ జిల్లాలోని ఎస్సీ అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. కుటుంబ వార్షిక ఆదాయం రూ.3 లక్షలకు మించరాదు. తహసీల్దార్ ధ్రువీకరించిన కులం, ఆదాయ సర్టిఫికెట్లు ఉండాలి. www.tsstudycircle.co.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. రూ.1,500 విలువైన స్టడీ మెటీరియల్ ఇవ్వడంతోపాటు భోజన ఖర్చుల కింద రోజుకు రూ.75 చొప్పున బ్యాంకు ఖాతాల్లో జమ చేస్తారు. మే 14వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలి. 21న ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు. వివరాలకు 98852 18053 ,94943 38550 ఫోన్ నంబర్లలో సంప్రదించవచ్చు.

బీసీ స్టడీ సర్కిల్ పరిధిలో..

రాష్ట్ర ప్రభుత్వం వెనుకబడిన తరగతుల అభివద్ధి శాఖ ఆధ్వర్యంలో నిర్వహించే బీసీ స్టడీ సర్కిల్‌ను ఉజ్వల పార్కులో గతేడాది ప్రారంభించారు. ఇప్పుడు గ్రూప్–1, 2, 3, 4తోపాటు బ్యాంకింగ్, స్టాఫ్ సెలక్షన్ కమిషన్ పరీక్షలకు హాజరయ్యే నిరుద్యోగ అభ్యర్థులకు ఉపకార వేతనంతో కూడిన ఉచిత శిక్షణ ఇస్తున్నట్లు స్టడీ సర్కిల్ డైరెక్టర్ మంతెన రవికుమార్ తెలిపారు. అభ్యర్థులకు టీ, స్నాక్స్ కోసం రూ.75 చొప్పున ఇస్తున్నారు. ఉచిత శిక్షణకు నిరుద్యోగులు 0878–2268686 ఫోన్ నంబర్‌లో గానీ, పని వేళల్లో బీసీ స్టడీ సర్కిల్ కార్యాలయంలో గానీ సంప్రదించాలని కోరారు.

ఎస్టీ సంక్షేమశాఖ ఆధ్వర్యంలో..

ఎస్టీ అభ్యర్థులకు గిరిజన సంక్షేమశాఖ ఆధ్వర్యంలో గతంలో ప్రవేశ పరీక్ష నిర్వహించి, వంద మంది అభ్యర్థులకు శిక్షణనిచ్చారు. రాష్ట్ర ప్రభుత్వ అనుమతి రాగానే మరో వంద మందిని ఎంపిక చేసి, శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్లు ఎస్టీ సంక్షేమ శాఖ అధికారి గంగారాం తెలిపారు.

169 మందికి ఉద్యోగాలు..



ఎస్టీ స్టడీ సర్కిల్‌లో ఉచిత తరగతులు 2016 నుంచి ప్రారంభమై, పది బ్యాచ్‌లు పూర్తయ్యాయి. రెండు బ్యాచ్‌లు నాన్ రెసిడెన్షియల్‌లో, ఎనిమిది బ్యాచ్‌లు రెసిడెన్షియల్‌లో తరగతులు కొనసాగాయి. ప్రస్తుతం స్టడీ సర్కిల్ నుంచి కోచింగ్ తీసుకున్న వారిలో 169 మందికి వివిధ రకాల ఉద్యోగాలు వచ్చాయి. ప్రస్తుతం ఉమ్మడి జిల్లా పరిధిలోని నిరుద్యోగ అభ్యర్థుల కోసం మళ్లీ నోటిఫికేషన్ విడుదలైంది. నిరుద్యోగులు సద్వినియోగం చేసుకోవాలి.

– బండ శ్రీనివాస్, ఎస్సీ స్టడీ సర్కిల్ డైరెక్టర్

‘కవనం’ కవర్ పేజీ ఆవిష్కరణ


కవర్ పేజీ ఆవిష్కరిస్తున్న మంత్రి కమలాకర్

కరీంనగర్: రాష్ట్ర నూతన సచివాలయంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా మరో ప్రాముఖ్యత దక్కించుకుందని రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ అన్నారు. రాజన్న సిరిసిల్లకు చెందిన ప్రముఖ రచయిత గంగాడి సుధీర్ రాబోయే కవితా సంకలనం ‘కవనం’ కవర్ పేజీని ఆదివారం ఆయన తన కుటుంబసభ్యుల సమక్షంలో తన చాంబర్‌లో ఆవిష్కరించారు. మంచి రచనలు చేసే సుధీర్ త్వరలో విడుదల చేసే నూతన కవితా సంపుటి గత పుస్తకం ఇగురం వలే మంచి విజయం సాధించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా రచయిత మాట్లాడుతూ.. త్వరలో వెలువరించనున్న కవితా సంపుటి ‘కవనం’ కవర్ పేజీని ఆవిష్కరించిన మంత్రి గంగులకు, నూతన సచివాలయంలో ఆవిష్కరణ అవకాశం కల్పించిన సీఎం కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. అతి త్వరలో ఈ సంపుటిని సిరిసిల్లలో ఆత్మీయుల మధ్య ఆవిష్కరించబోతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లా ప్రజాప్రతినిధులు, సాహిత్య అభిమానులు పాల్గొన్నారు.

ఈసీజీపై శిక్షణ వైద్యులకు ఉపయోగకరం

- కరీంనగర్ అదనపు కలెక్టర్ జీవీ శ్యాంప్రసాద్‌లాల్


వైద్యులకు సర్టిఫికెట్లు అందిస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

కరీంనగర్‌టౌన్: ఈసీజీపై శిక్షణ వైద్యులకు ఉపయోగకరమని అదనపు కలెక్టర్ జీవీ.శ్యాంప్రసాద్ లాల్ అన్నారు. ఆదివారం కరీంనగర్‌లోని హోటల్ వి-పార్కులో ఏర్పాటు చేసిన ఈసీజీపై శిక్షణకు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. కార్డియాలజిస్టులతో పాటు అన్ని విభాగాల వైద్యులకు ఈసీజీపై అవగాహన ఉండాలన్న ఉద్దేశంతో మొట్టమొదటిసారిగా మెడికవర్ కార్డియాలజిస్ట్ డాక్టర్ కిరణ్ ముందుకు వచ్చి, సదస్సు నిర్వహించడం అభినందనీయమన్నారు. అనంతరం డాక్టర్ కిరణ్ వైద్యులకు ఈసీజీపై అవగాహన కల్పించారు. వైద్యులకు పార్టిసిపేషన్ సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో మెడికవర్ ఆసుపత్రి క్రిటికల్ కేర్ హెడ్ డాక్టర్ ఉపేందర్ రెడ్డి, అడ్మినిస్ట్రేటర్ గుర్రం కిరణ్, మార్కెటింగ్ హెడ్ ప్రసాద్, మార్కెటింగ్ సిబ్బంది, సుమారు 150 మంది డాక్టర్లు పాల్గొన్నారు.

ఎలక్ట్రికల్ వైండింగ్ వర్కర్స్ అసోసియేషన్ కార్యవర్గం


పవన్‌కుమార్


రవీందర్


విద్యానగర్(కరీంనగర్): ఎలక్ట్రికల్ వైండింగ్ వర్కర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఉమ్మడి కరీంనగర్ జిల్లా ఎన్నికలు ఆదివారం కరీంనగర్‌లోని సంఘం కార్యాలయంలో నిర్వహించారు. ఉమ్మడి జిల్లా అధ్యక్షుడిగా కాయితోజు పవన్‌కుమార్, కరీంనగర్ జిల్లా అధ్యక్షుడిగా దొంత రవీందర్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడిగా బి.శ్రీనివాస్, జగిత్యాల జిల్లా అధ్యక్షుడిగా సాజిద్, పెద్దపెల్లి జిల్లా అధ్యక్షుడిగా ఖలీల్ పాషాలను సభ్యులు ఎన్నుకున్నారు. సంఘం వ్యవస్థాపక అధ్యక్షుడు కంది కృష్ణారెడ్డి మాట్లాడుతూ.. ఎలక్ట్రికల్ వైండింగ్ వర్కర్స్ సమస్యలపై ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని అన్నారు. వాటిని పరిష్కరించేందుకు కొత్తగా ఎన్నికైన కార్యవర్గం కృషి చేయాలన్నారు. వైండింగ్ పని చేస్తున్నప్పుడు కరెంట్ షాక్ వల్ల చాలా మంది కార్మికులు చనిపోతున్నారని, ఎంతోమంది అంగవైకల్యం పొందుతున్నారని తెలిపారు. అలాంటి వారిని ప్రభుత్వం ఆర్థికంగా ఆదుకోవాలని కోరారు. అసోసియేషన్ బాధ్యులు వై.గంగాధర్, పి.కార్తీక్ తదితరులు పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించకుంటే సమ్మెకు దిగుతాం

- తెలంగాణ రేషన్ డీలర్ల జేఏసీ ఛైర్మన్ రాజు

కరీంనగర్ అర్బన్: రేషన్ డీలర్ల సమస్యలు పరిష్కరించకుంటే మే నెలలో సమ్మెకు దిగుతామని తెలంగాణ రేషన్ డీలర్ల జేఏసీ ఛైర్మన్ నాయకోటి రాజు ప్రభుత్వాన్ని హెచ్చరించారు. ఆదివారం కరీంనగర్‌లో ఉమ్మడి జిల్లా రేషన్ డీలర్ల గౌరవ వేతనం సాధన సభ సమావేశం నిర్వహించారు. రేషన్ డీలర్లకు గౌరవ వేతనం రూ.30 వేలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. మూడు నెలల కమీషన్ రావాల్సి ఉందన్నారు. రేషన్ దుకాణంలో 3–4కిలోల బియ్యం తక్కువగా వుంటే 6ఏ కేసులు చేస్తున్నారని, రాష్ట్రంలో ప్రతి డీలరుకు 3,4 కిలోల బియ్యం గోదాం నుంచి తక్కువగా వస్తున్నాయని అన్నారు. రేషన్ డీలర్ చనిపోతే కుటుంబానికి దహన సంస్కారాలకు రూ.30 వేలు, డీలర్‌తోపాటు కుటుంబ సభ్యులకు హెల్త్‌కార్డులు ఇవ్వాలని అన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో 800, పట్టణ ప్రాంతాల్లో 1200 కార్డులకు పైబడి ఉన్న రేషన్ షాపులను మాత్రమే విభజించాలన్నారు. సెంట్రల్ గవర్నమెంట్ పెంచిన కమీషన్ ఇవ్వటం లేదని వాపోయారు. కారుణ్య నియామకం ద్వారా నియమితులయ్యే వారసుల వయోపరిమితి 40 నుంచి 50 ఏళ్లకు పెంచాలన్నారు. వైస్ ఛైర్మన్ బత్తుల రమేశ్‌బాబు, కన్వీనర్ దొమ్మాటి రవీందర్, రేషన్ డీలర్ల సంక్షేమ సంఘం కరీంనగర్ జిల్లా అధ్యక్షుడు రొడ్డ శ్రీనివాస్, రాజన్న సిరిసిల్ల జిల్లా అధ్యక్షుడు రెడ్డిమల్ల హన్మాండ్లు, పెద్దపల్లి జిల్లా అధక్షుడు వెంకటేశ్వర్లు, జగిత్యాల జిల్లా అధ్యక్షుడు పొలాస నందం తదితరులు పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడికి గాయాలు


చికిత్స పొందుతున్న సదయ్య

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లి మండలంలోని రాఘవాపూర్ గ్రామానికి చెందిన బూషనవేని సదయ్య అనే గీత కార్మికుడు ఆదివారం తాటిచెట్టు పైనుంచి పడి గాయపడ్డాడు. స్థానికులు గమనించి, పెద్దపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, ప్రథమ చికిత్స చేయించారు. మెరుగైన వైద్యం కోసం కరీంనగర్ తీసుకెళ్లారు. నిరుపేద కుటుంబానికి చెందిన సదయ్యను ప్రభుత్వం ఆదుకోవాలని గీత కార్మిక సంఘం నాయకులు కోరారు.

ఒకరి బలవన్మరణం

గోదావరిఖని(రామగుండం): గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఇందిరానగర్‌కు చెందిన భూతల కిశోర్‌రెడ్డి(50) ఆదివారం ఆత్మహత్య చేసుకున్నాడు. ఆర్థిక ఇబ్బందులతోనే అఘాయిత్యానికి పాల్పడినట్లు పోలీసులు తెలిపారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసుకొని, దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై కమలాకర్ పేర్కొన్నారు. మృతుడికి ఇద్దరు భార్యలు, నలుగురు పిల్లలున్నారు.

వేణుగోపాల్‌రావు ఆశయాలు కొనసాగిద్దాం


నివాళి అర్పిస్తున్న సీఐటీయూ నాయకులు

కరీంనగర్: ఎస్‌సీజెడ్‌ఐఈఎఫ్ మాజీ అధ్యక్షుడు, ఏఐఐఈఏ మాజీ ఉపాధ్యక్షుడు కె.వేణుగోపాల్‌రావు ఆశయాలను కొనసాగిద్దామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఎడ్ల రమేశ్ అన్నారు. వేణుగోపాల్‌రావు వర్ధంతి సందర్భంగా కరీంనగర్‌లోని ముకుందలాల్ మిత్రాభవన్‌లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి, నివాళి అర్పించారు. వేణుగోపాల్‌రావు క్రమశిక్షణ గల నాయకుడని అన్నారు. అతను శ్రామికవర్గ రాజకీయతత్వాన్ని సంపూర్ణంగా విశ్వసించారని తెలిపారు. ఎల్ఐసీ ఉద్యోగ సంఘం ఏఐఐఈఏ తెలుగు మాసపత్రిక కార్మిక వాహిని సంపాదకునిగా కొత్త రచయితలను, కాలమిస్టులను ప్రోత్సహించారని పేర్కొన్నారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి పున్నం రవి, జిల్లా కమిటీ సభ్యుడు ముల్కల శ్రీనివాస్, నాయకులు జంభుకం వెంకన్న, రుద్రారపు అజయ్,పల్లె సంతోష్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి వేసవి క్రీడా శిబిరాలు

- గ్రామీణ ప్రాంతాల్లో ఈ నెల 31 వరకు నిర్వహణ
- కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా 10 కేంద్రాల్లో 6 క్రీడాంశాల్లో శిక్షణ


వాలీబాల్ శిక్షణ పొందుతున్న క్రీడాకారులు (ఫైల్)

కరీంనగర్ స్పోర్ట్స్: తెలంగాణ రాష్ట్ర క్రీడాప్రాధికార సంస్థ ఆధ్వర్యంలో ఏటా వేసవిలో కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఎంపిక చేసిన గ్రామీణ ప్రాంతాల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలను నిర్వహిస్తున్న విషయం విదితమే. ఇందులో భాగంగా ఈ ఏడాది 10 కేంద్రాల్లో 6 క్రీడాంశాల్లో సోమవారం నుంచి ఈ నెల 31 వరకు శిక్షణ ఇవ్వనున్నారు.

కోచ్‌లకు గౌరవ వేతనం..

కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా ఆదరణ ఉన్న ఆరు క్రీడల్లో శిక్షణ శిబిరాలు జరగనున్నాయి. డీవైఎస్‌వో ఆధ్వర్యంలో క్రీడలను ఎంపిక చేసి, జాబితా ప్రకటించారు. గ్రామీణ ప్రాంతంలోని సీనియర్ క్రీడాకారుడు, పీఈటీలు శిక్షణనిచ్చేందుకు అర్హులు. వాలీబాల్, హాకీ, కబడ్డీ, హ్యాండ్‌బాల్, అథ్లెటిక్స్, జూడో క్రీడల్లో శిక్షణనివ్వనున్నారు. కోచ్‌లకు జిల్లా క్రీడాశాఖ గౌరవ వేతనం కింద రూ.4 వేలు ఇవ్వనుంది.

క్రీడలు, వేదికలు, కోచ్‌ల వివరాలు

క్రీడ	వేదిక	కోచ్ పేరు	ఫోన్ నంబర్
వాలీబాల్	రామడుగు	ఆశాలు	9908528205
వాలీబాల్	తాడికల్	సంతోష్ కుమార్	9177887636
వాలీబాల్	ఆకునూర్	రాజ్‌కుమార్	9704142324
వాలీబాల్	మల్లారెడ్డిపల్లి	నర్సయ్య	9989139012
హాకీ	గుమ్లాపూర్	చంద్రశేఖర్	9490530300
హాకీ	హుజూరాబాద్	పరబ్రహ్మం	9010821899
కబడ్డీ	గన్నేరువరం	మల్లేశ్	9846508649
హ్యాండ్‌బాల్	రామడుగు	అమరేందర్	8790672293
అథ్లెటిక్స్	వీణవంక	సంగీత	9154569215
జూడో	మానకొండూర్	అజయ్	9848077252

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



గన్నేరువరం: గుండ్లపల్లి స్టేజీలోని శ్రీ సాయిగార్డెన్‌లో ఆదిత్యస్కూల్ 1996–97 బ్యాచ్ 10వ తరగతి పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. నాటి ఉపాధ్యాయులతో పాటు విద్యార్థులు హాజరయ్యారు. రోజంతా ఉల్లాసంగా గడిపారు. ముఖ్య అతిథిగా ఆదిత్య స్కూల్ మాజీ కరస్పాండెంట్ చాడ రత్నాకర్‌రెడ్డి హాజరయ్యారు. 25ఏళ్ల తరువాత విద్యార్థులంతా ఆత్మీయ సమ్మేళనం నిర్వహించడం అభినందనీయమన్నారు. గురువులకు పూర్వ విద్యార్థులు సన్మానించారు. ఉపాధ్యాయులు రామకృష్ణ, చంద్రకళ, రిటైర్డ్ టీచర్ రాజిరెడ్డి, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతి


నివాస్‌రెడ్డి (ఫైల్)

గన్నేరువరం : హైదరాబాద్‌లో జరిగిన రోడ్డు ప్రమాదంలో బీటెక్ విద్యార్థి మృతిచెందాడు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం... మండలంలోని సాంబయ్యపల్లె గ్రామానికి చెందిన గడ్డం రాజిరెడ్డి – మంజుల దంపతులకు ఇద్దరు కుమారులు గడ్డం ప్రభాస్ రెడ్డి, గడ్డం నివాస్ రెడ్డి ఉన్నారు. పెద్ద కుమారుడిది బీటెక్ పూర్తికాగా విదేశాలకు వెళ్లే ప్రయత్నంలో ఉన్నాడు. రెండో కుమారుడు నివాస్‌రెడ్డి (20) హైదరాబాద్‌లోని ఉప్పల్‌లో బీటెక్ మూడో సంవత్సరం చదువుతున్నాడు. ఏప్రిల్ 28న జన్మదిన వేడుకలు జరుపుకున్నాడు. శనివారం రాత్రి స్నేహితుడి జన్మదిన వేడుకల్లో పాల్గొనేందుకు ఉప్పల్‌కు చేరుకున్నాడు. వేడుకల మధ్యలో నిజామాబాద్ జిల్లాకు చెందిన మరో స్నేహితుడిని గదిలో వదిలిపెట్టేందుకు నివాస్‌రెడ్డి అతనితో కలిసి ద్విచక్రవాహనంపై బయలుదేరాడు. మార్గమధ్యలో ద్విచక్రవాహనం అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొనగా ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ ప్రమాదంలో అక్కడికక్కడే మృతిచెందారు. స్నేహితులు గదిలో ఉన్న సతీశ్‌కు ఫోన్‌చేయగా రాలేదని చెప్పడంతో పోలీసులు ద్వారా మరణవార్తను తెలుసుకొని సంఘటనా స్థలానికి చేరుకున్నారు.

సాంబయ్యపల్లెలో విషాదం..

గడ్డం రాజిరెడ్డిది రైతు కుటుంబం. కూరగాయలు, ఇతర పంటలు సాగు చేస్తూ ఇద్దరు కుమారులను ఉన్నత చదువులు చదివిస్తున్నాడు. కొడుకు మృతిచెందాడని ఆదివారం ఉదయం ఫోన్ ద్వారా సమాచారం అందడంతో వారు బోరున విలపించారు. నివాస్‌రెడ్డి మృతితో గ్రామంలో విషాదం నెలకొంది. మృతదేహాన్ని గ్రామానికి తరలించి అంత్యక్రియలు నిర్వహించారు.

మానవ హక్కులపై అవగాహన ఉండాలి


మాట్లాడుతున్న శంకర్

గోదావరిఖనిటౌన్(రామగుండం): వ్యక్తి గౌరవం కూడా మానవ హక్కేనని, మానవ హక్కులపై అందరికీ అవగాహన ఉండాలని తెలంగాణ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ పెద్దపల్లి జిల్లా కన్వీనర్ ఈదునూరి శంకర్ అన్నారు. గోదావరిఖనిలోని పవర్‌హౌస్ కాలనీలో గల ప్రభుత్వ శాఖ గ్రంథాలయంలో ఆదివారం మానవ హక్కుల పరిరక్షణ అనే అంశంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఒక వ్యక్తి గౌరవంగా, హుందాగా, ఆరోగ్యంగా, నిర్భయంగా, స్వేచ్ఛ, సంతోషంతో జీవించడమే మానవ హక్కులన్నారు. ఒక వ్యక్తిని తిట్టినా, అతనిని అగౌరవపరిచినా అది మానవ హక్కుల ఉల్లంఘనే అవుతుందని తెలిపారు. ఒకవేళ ప్రభుత్వ శాఖల అధికారులే ఇలా చేస్తే హెచ్‌ఆర్సీలో ఫిర్యాదు చేయవచ్చన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ నాయకులు ఉప్పుల శ్రీధర్, హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ జిల్లా నాయకుడు దేశబోయిన శ్రీనివాస్, గ్రంథాలయ లైబ్రేరియన్ ఎం.భారతి, టీయూడబ్ల్యూజే జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ కేఎస్.వాసు, నాయకులు పాల్గొన్నారు.

ఎన్‌హెచ్‌ఎం పోస్టుల్లో గోల్‌మాల్?

- నిబంధనలు తుంగలో తొక్కారని ఆరోపణ
- రూ.లక్షలు చేతులు మారినట్లు ప్రచారం

కరీంనగర్‌టౌన్: జిల్లా ప్రభుత్వ ప్రధాన ఆసుపత్రి టీ–హబ్‌లో పని చేసేందుకు నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద ఇటీవల భర్తీ చేసిన రేడియోగ్రాఫర్ పోస్టుల్లో గోల్‌మాల్ జరిగిందన్న ఆరోపణలున్నాయి. పైరవీలకు పెద్దపీట వేయడంతో లక్షల రూపాయలు చేతులు మారాయని ప్రచారం జరుగుతోంది. ఈ ఏడాది ఫిబ్రవరి 22న ఎన్‌హెచ్‌ఎం కింద ఒక రేడియాలజిస్టు, 2 రేడియోగ్రాఫర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేశారు. రేడియోగ్రాఫర్ పోస్టులో ఒక మెమోగ్రఫీ శిక్షణ పొందిన ఫిమేల్‌తోపాటు కంప్యూటర్ రేడియోగ్రఫీ అర్హత ఉన్న ఒక మెరిట్ అభ్యర్థిని ఎంపిక చేయాల్సి ఉంది. రెండు రేడియోగ్రాఫర్ పోస్టులకు 30 దరఖాస్తులు రాగా, మెరిట్, అర్హతల ప్రకారం ఇద్దరిని ఎంపిక చేశారు. మార్చి 10న వారి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేశారు. 11న ఉద్యోగంలో జాయిన్ కావాల్సి ఉండగా.. తెల్లవారేసరికి నిబంధనలు తుంగలో తొక్కి, మెరిట్ అభ్యర్థికి మొండి చేయి చూపారన్న చర్చ జరుగుతోంది. 76.5 శాతం మెరిట్‌తో ఉద్యోగానికి ఎంపికైన గంగాధర శేఖర్ స్థానంలో 68.7 శాతం మెరిట్ ఉన్న మరొకరిని ఎంపిక చేశారని సమాచారం. గోల్‌మాల్ బయటపడుతుందనే ఉద్దేశంతో మెరిట్ లిస్టును ప్రదర్శించలేదని తెలిసింది. కేవలం డబ్బులే ప్రామాణికంగా భావించి, మెరిట్ అభ్యర్థులకు అన్యాయం చేశారని ఆరోపణలు వస్తున్నాయి. గతంలో ఐసీయూ విభాగంలో కాంట్రాక్టు పద్ధతిన భర్తీ చేసిన స్టాఫ్‌నర్సు పోస్టులను కూడా అమ్ముకున్నారని తెలిసింది. ఇలా మెరిట్ అభ్యర్థులకు అన్యాయం చేస్తూ పోస్టుల అమ్మకాలకు పెద్దపీట వేస్తూ అందినకాడికి దండుకుంటున్నారన్న విమర్శలున్నాయి. ఇలా చేయడం వల్ల అర్హులకు తీవ్ర అన్యాయం జరుగుతోందని అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కాగా గంగాధర శేఖర్ తనకు అన్యాయం జరిగిందంటూ జిల్లా కలెక్టర్‌కు, ఆసుపత్రి మెడికల్ సూపరింటెండెంట్‌కు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశాడు. తన ఫిర్యాదును ఎవరూ పట్టించుకోవడం లేదని వాపోయాడు. ఇప్పటికైనా న్యాయం చేయాలని కోరుతున్నాడు.

ఆధ్యాత్మికం

ఘనంగా పోచమ్మ బోనాలు



కరీంనగర్ మండలం చెర్లభూత్కూర్‌లో రేణుకా ఎల్లమ్మ పట్నాల్లో భాగంగా ఆదివారం గౌడ సంఘం ఆధ్వర్యంలో పోచమ్మ బోనాలు నిర్వహించారు. బైండ్లపూజారుల డప్పుచప్పుళ్ల నడుమ మహిళలు బోనాలతో ఊరేగింపుగా పోచమ్మ గుడికి వెళ్లారు. బోనం చెల్లించి మొక్కులు సమర్పించారు. కార్యక్రమంలో ఎంపీటీసీ బుర్ర తిరుపతిగౌడ్, గౌడ సంఘం అధ్యక్షుడు మూల లక్ష్మిరాజం, ఉపాధ్యక్షుడు బుర్ర లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు. అలాగే కరీంనగర్ మండలం మొగ్దుంపూర్‌లో ఆదివారం చిరుతల రామాయణం కళాకారులు పోచమ్మకు బోనం చేశారు. పాటలను పాడుతూ గ్రామంలోని ప్రధాన వీధుల నుంచి ఊరేగింపుగా పోచమ్మ గుడికి తరలివెళ్లారు. పోచమ్మకు బోనం సమర్పించి మొక్కులు చెల్లించారు. – కరీంనగర్‌రూరల్

ఆదివారం ఉదయం



ఆదివారం రాత్రి



ప్రమాదకరంగా మ్యాన్‌హోల్స్

కరీంనగర్‌లోని రాంనగర్ ప్రధాన రహదారికి ఇరుపక్కల ఉన్న డ్రెయినేజీ మ్యాన్‌హోల్స్ ప్రమాదకరంగా ఉన్నాయి. గత వర్షాకాలంతో పాటు ఆదివారం కురిసిన వర్షానికి ఈ మ్యాన్‌హోల్స్ నిండి పైనుంచి నీరు ప్రవహించింది. నిర్మించి రెండేళ్లు అయినా వీటిపై పైకప్పులు వేయలేదు. హైదరాబాద్‌లో శనివారం మ్యాన్‌హోల్స్‌లో పడి బాలిక మృతి చెందిన సంఘటనను దృష్టిలో ఉంచుకొనైనా ఇక్కడి మ్యాన్‌హోల్స్‌పై కప్పులు వేయాలని స్థానికులు కోరుతున్నారు. – సాక్షి ఫొటోగ్రాఫర్, కరీంనగర్

క్లుప్తంగా

కొనుగోలు కేంద్రం ప్రారంభం



ధాన్యం తూకం వేస్తున్న సింగిల్‌విండో చైర్మన్ శ్యాంసుందర్‌రెడ్డి తదితరులు

కరీంనగర్‌రూరల్: బొమ్మకల్ గ్రామంలో కరీంనగర్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని సింగిల్ విండో చైర్మన్ పెండ్యాల శ్యాంసుందర్‌రెడ్డి ఆదివారం ప్రారంభించారు. కొనుగోలు కేంద్రాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సింగిల్‌విండో వైస్ చైర్మన్ బీరం ఆంజనేయులు, సర్పంచ్ పురుమల్ల శ్రీనివాస్, వార్డు సభ్యులు జకినపల్లి శంకర్, తోట కిరణ్‌కుమార్, భాస్కర్‌రెడ్డి, సీఈవో రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

దుబ్బపల్లిలో పౌరహక్కులపై సమావేశం



మాట్లాడుతున్న ఎంపీపీ లక్ష్మయ్య

కరీంనగర్‌రూరల్: పౌర హక్కుల దినోత్సవం పురస్కరించుకుని కరీంనగర్ మండలం దుబ్బపల్లిలో ఆదివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలందరూ కులమతాలకతీతంగా కలిసిమెలిసి జీవించాలన్నారు. ఐక్యంగా ఉండి గ్రామాభివృద్ధికి కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ సిరిగిరి దుర్గా రమేశ్, ఆర్‌ఐ రజనీకాంత్, ఏవో సత్యం తదితరులు పాల్గొన్నారు.

పైల్స్ అధునాతన చికిత్సపై వర్క్‌షాప్



కరీంనగర్‌టౌన్: పైల్స్ ట్రీట్‌మెంట్ విధానంలో అధునాతన చికిత్సపై ఆదివారం కరీంనగర్‌లోని సన్‌షైన్ ఆస్పత్రిలో వర్క్‌షాప్ నిర్వహించారు. రాష్ట్రంలోని వివిధ ప్రదేశాల నుంచి వచ్చిన సర్జన్లు, వైద్య విద్యార్థులకు హ్యాండ్స్ ఆన్ ట్రెయినింగ్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ప్రతిమ ఆస్పత్రి సర్జరీ విభాగం హెచ్‌వోడీ సీహెచ్.రవీందర్‌రావు, వరంగల్ జనరల్ ఆస్పత్రి అసోసియేట్ ప్రొఫెసర్ కూరపాటి రమేశ్, యశోద ఆస్పత్రి కన్సల్టెంట్ సర్జన్ శాంతివర్ధిని, సన్‌షైన్ ఆస్పత్రి చీఫ్ సర్జన్ డాక్టర్ సురేశ్‌కుమార్, డాక్టర్ కమలాకర్, ఆస్పత్రి సిబ్బంది పాల్గొన్నారు.

విరాళం అందజేత



కరీంనగర్‌కల్చరల్: సాయినగర్ విజయగణపతి సాయిబాబా ఆలయంలోని అన్నదాన భవన సముదాయంలో గ్రౌండ్ ఫ్లోర్ స్లాబ్ సిమెంట్ కాంక్రీట్‌కు అయ్యే ఖర్చు రూ.1,08,000 చెక్కును ఆలయ వ్యవస్థాపక ధర్మకర్త ఆయిందాల లక్ష్మయ్య ఆదివారం ఆలయంలో ఈవో ఎండపెల్లి మారుతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయిందాల వినయ్–సంధ్యారాణి, వాణి–సురేశ్‌శాస్త్రీ, వీణా–కృష్ణమూర్తి, రాసూరి నర్సయ్య, దండు అంజయ్య, విశ్వనాథుల శ్రీనివాస్, ముప్ప సత్యనారాయణ, గుడికాడి శ్రీనివాస్, పిట్టల అంజయ్య, రెడీమిక్స్ మార్కెటింగ్ మేనేజర్ సతీశ్ తదితరులు పాల్గొన్నారు.

యువ సైన్యం.. సేవా మార్గం

- సమాజసేవకు నడుం బిగిస్తున్న విద్యార్థినులు
- ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల లియో క్లబ్ ద్వారా సేవలు



లియో క్లబ్ ఆధ్వర్యంలో 2కే వాక్ నిర్వహిస్తున్న విద్యార్థులు

శాతవాహనయూనివర్సిటీ: నిత్యం చదువుల్లో మునిగితేలుతూ తరగతి గదుల్లో బిజీగా గడిపే విద్యార్థులు సేవామార్గంలో పయనిస్తున్నారు. ఉన్నత చదువులు చదివే వారు సమాజసేవలో తరిస్తూ అసమానతలను నిర్మూలిస్తూ దేశాన్ని పునర్నిర్మిస్తున్నామంటున్నారు. సమాజ సేవలకు నడుం బిగిస్తూ ప్రజలకు వివిధ అంశాలపై అవగాహన కల్పిస్తున్నారు. కరీంనగర్‌లోని ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాలలో లియోక్లబ్ ఏర్పాటు చేయగా క్లబ్ ద్వారా వివిధ సేవలు అందిస్తున్నారు.

సమాజసేవకై నడుం బిగిస్తూ..

ప్రభుత్వ మహిళా డిగ్రీ, పీజీ కళాశాల విద్యార్థులు లియో క్లబ్ ఏర్పాటు చేసిన తర్వాత ఇతరులకు ఉపయోగపడే వివిధ పనులు నిర్వహించారు. తీగలగుట్టపల్లి హైస్కూల్లో కంటి పరీక్ష శిబిరం ఏర్పాటు చేశారు. పాఠశాల విద్యార్థులకు పలు పాఠశాలల్లో పరీక్షలపై ఉన్న భయం తొలగేందుకు అవగాహన కార్యక్రమాలు చేపట్టారు. పుల్వామా ఘటనలో మరణించిన వీర జవాన్లకు సహాయ నిధి అందించారు. పిల్లల్లో దేశభక్తిని పెంపొందించే విధంగా చెట్లకు రంగులు వేసి భారత దేశ గొప్పతనాన్ని వారికి వివరించారు. మానసిక వికలాంగుల పాఠశాలలోని పిల్లలకు కూల్ వాటర్ ట్యాంకును అందించారు. కరీంనగర్‌లోని వివిధ గోశాలల్లో ఆవులకు ఆహారాన్ని పండ్లు, కూరగయాలు, గడ్డి అందించారు. సమాజంలోని వివిధ అసమానతలు తొలగించాలని 2కే వాక్ కార్యక్రమాన్ని నిర్వహించి సమాజసేవలు చేస్తున్నారు. లయన్స్‌క్లబ్ డిస్ట్రిక్ చైర్‌పర్సన్ ఫర్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ రాగి వందన ఆధ్వర్యంలో ప్రభుత్వ కళాశాల లియోక్లబ్ విద్యార్థులు వివిధ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

సంతృప్తినిస్తుంది



కేవలం చదువుకుంటూ డిగ్రీలు పొందడం కాదు సమాజానికి మన వంతు సహాయం చేయాలని లియో క్లబ్‌లో జాయిన్ అయ్యా. లియోక్లబ్ ద్వారా మా వంతుగా సేవలు చేయడం సంతృప్తినిస్తుంది.

– జనని, విద్యార్థిని

చదువుకుంటూనే సేవలు



లియోక్లబ్ ముఖ్య ఉద్దేశం మా వంతుగా ఇతరులకు చేతనైనంత సహాయం చేయడం. మా కళాశాలలో లియోక్లబ్ ఏర్పాటు చేసిన తర్వాత అనేక సేవా కార్యక్రమాలు చేపట్టాం. చదువుకునే సమయాల్లో కాకుండా ఖాళీ సమయాల్లో లియోక్లబ్ కార్యక్రమాల్లో పాల్గొని పలు సేవలు చేస్తున్నాం.

– సునందిని, విద్యార్థిని

నిస్వార్థంగా సేవలు



విద్యార్థి దశ నుంచే సేవాభావం పెరగాలని ఉద్దేశ్యంతో ప్రభుత్వ కళాశాలలో లియోక్లబ్‌ను ఏర్పాటు చేసి ద్వారా సేవాకార్యక్రమాలు కొనసాగిస్తున్నాం. ఇప్పటి వరకు విద్యార్థులు చాలా సేవా కార్యక్రమాలు చేపట్టారు. దానికి కావాల్సిన నిధులను సమకూర్చుతున్నాం. భవిష్యత్‌లో మరిన్ని సేవలు చేయడానికి సిద్ధం చేస్తున్నాం.

– రాగి వందన, లయన్స్‌క్లబ్ ఉమెన్ ఎంపవర్‌మెంట్ డిస్ట్రిక్ చైర్‌పర్సన్

ఇతరులకు సహాయం



లియోక్లబ్ ఏర్పాటుతో విద్యార్థుల్లో సేవాభావం పెరుగుతుంది. తమ స్వార్థం కోసం ఇతరులకు ఏదైన సహాయం చేయాలనే ఆలోచన విద్యార్థి దశ నుండే రావడంతో భవిష్యత్‌లో సమాజం గురించి ఆలోచిస్తుంటారు.

– డాక్టర్ సంగీతారాణి, లియోక్లబ్ కోఆర్డినేటర్

సేవాభావం పెరుగుతుంది



కళాశాలలో లియో క్లబ్ ఏర్పాటు చేసి వివిధ సమాజ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నాం. దీని ద్వారా చదువుకోవడమే కాకుండా సమాజానికి ఉపయోగపడాలనే సేవాభావం విద్యార్థుల్లో పెరుగుతుంది.

– డాక్టర్ టి.శ్రీలక్ష్మి, ప్రభుత్వ మహిళా కళాశాల ప్రిన్సిపాల్

వైభవంగా వాసవీమాత జయంతోత్సవం



హోమం నిర్వహిస్తున్న అర్చకుడు



అభయాంజనేయస్వామి ఆలయంలో..

కరీంనగర్‌కల్చరల్: కరీంనగర్ అశోక్‌నగర్‌లో శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆదివారం శ్రీవాసవీ కన్యకాపరమేశ్వరి దేవి జయంతి ఉత్సవం వైభవంగా జరిగింది. బ్రహ్మశ్రీ పారువెళ్ల ఫణిశర్మ ఆధ్వర్యంలో పుష్కరగంగా జలాలతో అభిషేకం, వాసవీ హోమం, డోలోత్సవం, ప్రత్యేక పూజలు నిర్వహించారు. వాసవీ వనిత క్లబ్ ఆధ్వర్యంలో 102 మంది మహిళలు వాసవీయ పారాయణం చేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ చిటుమల్ల శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి కాచం రాజేశ్వర్, కోశాధికారి బొల్లం శ్రీనివాస్, సంకష్ట కన్వీనర్,డైరెక్టర్ రాచమల్ల భద్రయ్య, ఉపాధ్యక్షులు పెద్ది సుధీర్, గంప శంకరయ్య, కార్యదర్శులు నార్ల శ్రీనివాస్ (స్వస్తిక్), తొడుపునూరి దశరథం, తదితరులు పాల్గొన్నారు.


కట్టరాంపూర్ అభయాంజనేయ ఆలయంలో..

కట్టరాంపూర్ అభయాంజనేయస్వామి ఆలయంలో ఫల పంచామృత అభిషేకం నిర్వహించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాద వితరణ గావించారు. కార్యక్రమంలో జంధ్యం మధూకర్. పాస్ట్ రీజియన్ చైర్‌పర్సన్, సూర గీత క్యాబినెట్ జాయింట్ సెక్రెటరీ, అధ్యక్షుడు గంప సంతోశ్, ప్రధాన కార్యదర్శి బొడ్ల శ్రవణ్‌కుమార్, కోశాధికారి జిల్లా శేఖర్, వాసవీ క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

మంత్రి 'గంగుల'కు శుభాకాంక్షల వెల్లువ



మంత్రికి అభినందనలు తెలుపుతున్న కలెక్టర్ కర్ణన్



శుభాకాంక్షలు తెలుపుతున్న కనుమల్ల విజయ

కరీంనగర్: హైదరాబాద్‌లో ఆదివారం జరిగిన బీఆర్ అంబేడ్కర్ నూతన సచివాలయ ప్రారంభోత్సవంలో భాగంగా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్ ఛాంబర్‌లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం మంత్రి గంగుల కమలాకర్‌ను తన చాంబర్‌లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కనుమల్ల విజయ, కలెక్టర్ ఆర్వీ కర్ణన్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్యేలు రసమయి బాలకిషన్, సుంకె రవిశంకర్, టూరిజం కార్పొరేషన్ చైర్మన్ గెల్లు శ్రీనివాస్, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ రవీందర్ సింగ్, ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ కుర్మచలం అనిల్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ పొన్నం అనిల్ కుమార్ గౌడ్, నగర మేయర్ సునీల్‌రావు తదితరులు మర్యాదపూర్వకంగా కలిసి పూల బొకేలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రధానమంత్రి మన్ కీ బాత్ వీక్షణ



మన్‌కీ బాత్ వీక్షిస్తున్న బీజేపీ నాయకులు

కరీంనగర్‌టౌన్: ప్రధాన మంత్రి నరేంద్రమోదీ 100వ ఎపిసోడ్ మన్‌కీ బాత్ కార్యక్రమాన్ని ఆదివారం రేకుర్తిలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి ఆధ్వర్యంలో వీక్షించారు. ఈ కార్యక్రమంలో నాయకులు రాగి సత్యనారాయణ, లాల మురళీ, బండ రమణారెడ్డి, దుర్గం ఆంజనేయులు, ఎం.లక్ష్మీరాజం, ప్రతాపరెడ్డి, నరసింహారెడ్డి, శంకర్, కాల్వ పూర్ణచంద్రరెడ్డి తదితరులు పాల్గొన్నారు. అలాగే బీజేపీ పశ్చిమ జోన్‌లో జోన్ అధ్యక్షుడు నరహరి లక్ష్మారెడ్డి ఆధ్వర్యంలో మన్‌కీ బాత్‌ను వీక్షించారు. కార్యక్రమంలో బాస సత్యనారాయణ, బోయినపల్లి ప్రవీణ్ రావు, బండ రమణారెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బొమ్మకల్, మొగ్దుంపూర్‌లలో..

కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం బొమ్మకల్, మొగ్దుంపూర్ గ్రామాల్లో ఆదివారం ప్రధాన మంత్రి నరేంద్రమోదీ మన్ కీ బాత్ 100వ ఎపిసోడ్‌ను బీజేపీ కార్యకర్తలు వీక్షించారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు టి.శ్రీనివాస్, కె. తిరుపతి, రమేశ్, సతీశ్, అంజన్‌రెడ్డి, కిట్టు, పి.తిరుపతి, సదానందం, ఏ.తిరుపతి, నందకుమార్, అశోక్, శ్రీధర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న బీరప్ప మహంకాళమ్మ బోనాల జాతర



సుంకు పడుతున్న పూజారులు

కరీంనగర్‌కల్చరల్: కురుమ కులస్తుల కుల దైవం బీరప్ప మహంకాళమ్మ బోనాల జాతరలో భాగంగా ఆదివారం ఆలయ సేవా కమిటీ ఆధ్వర్యంలో ఉదయం సుంకు పట్టారు. విద్యానగర్, నవీన కురుమవాడ, సంతోశ్‌నగర్, రాంనగర్‌లోని కురుమ కులస్తుల ఇళ్లలో సురుగు వేశారు. కార్యక్రమంలో ఆలయ సేవా కమిటీ బాధ్యులు కర్రె అనిల్‌కుమార్, కర్రె ప్రవీణ్‌కుమార్, బీర్ల నర్సయ్య, కర్రె రాజు, దయ్యాల రాజయ్య, ఎగుర్ల రాజు, కచ్చు రాజు, ఒట్టె రాజు, ఏముండ్ల పోసి, ఎలుకపెల్లి మధు, కర్రె గంగయ్య, దయ్యాల లక్ష్మీపతి, ఎనుగుల బీరయ్య, సాయుల్ల గంగరాజు తదితరులు పాల్గొన్నారు. కాగా సోమవారం ఉదయం రాంనగర్, సంతోశ్‌నగర్, నవీన కురుమవాడ, మల్కాపూర్ రోడ్డు నుంచి బీరప్ప కమాన్ ద్వారా కురుమ కులస్తుల ఇళ్ల నుంచి లగ్నం బోనాలతో విద్యానగర్‌లోని బీరప్ప మహంకాళమ్మ ఆలయానికి తరలనున్నారు. అనంతరం బీరప్పస్వామి కల్యాణం వైభవంగా జరుగనుంది.

మూడో రోజుకు కార్యదర్శుల సమ్మె



దీక్షలో పాల్గొన్న పంచాయతీ కార్యదర్శులు

కరీంనగర్‌రూరల్: డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ జూనియర్ పంచాయతీ కార్యదర్శులు చేపట్టిన సమ్మె ఆదివారం మూడో రోజుకు చేరింది. కరీంనగర్ మండల పరిషత్ కార్యాలయంలో కరీంనగర్, కొత్తపల్లి మండలాల జేపీఎస్‌లు చేపట్టిన నిరసన దీక్షకు మద్దతుగా రామడుగు, గంగాధర, తిమ్మాపూర్, శంకరపట్నం, మానకొండూరు, చొప్పదండి, గన్నేరువరం మండలాలకు చెందిన పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. జేపీఎస్‌ను వెంటనే రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు.

'ఆ ఎమ్మెల్యేలను సస్పెండ్ చేయాలి'



నిరసన తెలుపుతున్న ఎమ్మార్పీఎస్ నాయకులు

కరీంనగర్: దళిత బంధు పథకంలో లబ్ధిదారుల వద్ద రూ.3 లక్షల వరకు తీసుకున్న ఎమ్మెల్యేల చిట్టాను సీఎం కేసీఆర్ వెంటనే ప్రజల ముందు ఉంచాలని ఎమ్మార్పీఎస్ జిల్లా కన్వీనర్ బెజ్జంకి అనిల్ మాదిగ డిమాండ్ చేశారు. కరీంనగర్‌లోని కోర్టు చౌరస్తాలో గల అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఎంఎస్‌పీ, ఎమ్మార్పీఎస్, ఎంఎస్‌ఎఫ్, ఎంఎంఎస్‌ల ఆధ్వర్యంలో ఆదివారం నిరసన తెలిపారు. రాష్ట్రంలో అవినీతిలేని పాలన అందిస్తామని, కన్న కొడుకు తప్పు చేసినా సహించేది లేదని మాట్లాడిన కేసీఆర్ బీఆర్‌ఎస్ ఎమ్మెల్యేలు దళితుల నుంచి రూ.3 లక్షలు లంచం తీసుకుంటుంటే ఎందుకు చర్యలు తీసుకోవడం లేదని ప్రశ్నించారు. వారిని వెంటనే పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని డిమాండ్ చేశారు. గవర్నర్ తక్షణమే స్పందించి, సీఎం కార్యాలయం నుంచి ఎమ్మెల్యేల చిట్టా తెప్పించుకోవాలన్నారు. దళిత బంధులో ఎమ్మెల్యేలు తీసుకున్న డబ్బులను తిరిగి లబ్ధిదారులకు ఇప్పించాలని కోరారు. ఎమ్మెల్యేల చిట్టా బయటపెట్టేంత వరకు పోరాటం ఆగదని, మంగళవారం నుంచి ఈ నెల 9 వరకు అన్ని నియోజకవర్గాల్లో నిరాహారదీక్షలు చేపడుతామని, 10న వేలాది మందితో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని కలెక్టరేట్లను దిగ్బంధం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో వివిధ సంఘాల నాయకులు ఇంజం వెంకటస్వామి, దండు అంజయ్య, సౌమ్య, ఆంజనేయులు, రాజన్న, శంకర్, అశోక్, అక్షయ్, రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

కరపత్రాలు ఆవిష్కరణ

కరీంనగర్: కరీంనగర్‌లోని రెవెన్యూగార్డెన్‌లో ఈనెల 13న నిర్వహించనున్న తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం, ప్రజా సంఘాల జేఏసీ జిల్లా సమావేశానికి సంబంధించిన కరపత్రాలను ఆదివారం నగరంలోని అంబేడ్కర్ విగ్రహం ఎదుట ఆవిష్కరించారు. ఈ సందర్భంగా అంబేడ్కర్ యువజన సంఘం జిల్లా అధ్యక్షుడు సముద్రాల అజయ్ మాట్లాడుతూ జిల్లాలోని తెలంగాణ అంబేడ్కర్ యువజన సంఘం, ప్రజా సంఘాల జేఏసీ నాయకులు, కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొని అంబేడ్కర్ చూపిన బాటలో నడిచేందుకు యువతీ యువకులు ముందుకు రావాలని అన్నారు.

వరదనీరు రాకుండా చర్యలు చేపట్టాలి

కరీంనగర్: వర్షం పడిన ప్రతీసారి బీట్ మార్కెట్ నుంచి వచ్చే వరద నీరంతా కిసాన్‌నగర్ రోడ్లపై ప్రవహించి ఇళ్లలోకి వెళ్లి ప్రమాదంగా తయారైందని కార్పొరేటర్ కంసాల శ్రీనివాస్ అన్నారు. ఆదివారం కురిసిన వర్షంతో ఇళ్లలోకి భారీ ఎత్తున నీరు చేరి ప్రజలు తీవ్ర ఆందోళనకు గురికాగా వెంటనే మున్సిపల్ కార్మికులను తీసుకొచ్చి తొలగించే చర్యలు చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అకస్మాత్తుగా కురిసిన భారీ వర్షానికి బీట్ మార్కెట్ నుంచి వర్షపు నీటితోపాటు దాదాపు రెండు లారీ లోడ్ల మామిడికాయలు కొట్టుకవచ్చి కిసాన్ నగర్ రోడ్లపై, ఇళ్లలోకి చేరాయన్నారు. గతంలో కూడా ఒకసారి రాత్రి బీరువా మునిగే ఎత్తుతో ఒక ఇంటిలోకి వరద నీరు రావడంతో తృటిలో ప్రాణాపాయం నుంచి తప్పించుకున్నారని తెలిపారు. ఇప్పటికైనా రాష్ట్ర బీసీ సంక్షేమ శాఖ మంత్రి గంగుల కమలాకర్, కలెక్టర్ కర్ణన్‌లు స్పందించి బీట్ మార్కెట్‌లో నుంచి వచ్చే వరద నీరు కిసాన్‌నగర్‌కు రాకుండా ప్రత్యామ్నాయ చర్యలు తీసుకోవాలని కోరారు.

పవర్ కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: కరీంనగర్‌లో 33/11కేవీ ఉజ్వల పార్క్, 33/11కేవీ భగత్‌నగర్ లైన్ల మరమ్మతుల కారణంగా సోమవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్–2 ఏడీఈ ఎం.సుధీర్‌కుమార్ తెలిపారు. అలాగే తీగల బ్రిడ్జి పనుల కారణంగా ఉదయం 9 గంటల నుంచి 2 గంటల వరకు 11కేవీ ఎల్లమ్మ ఫీడర్, కమాన్ ఫీడర్, హౌసింగ్ బోర్డు ఫీడర్, మానకొండూర్ ఫీడర్‌లలోని ఆటోనగర్, ఆంధ్రజ్యోతి పేపర్ ఏరియా, పోచమ్మవాడ, లక్ష్మీనగర్, కమాన్‌ఏరియా, రాఘవేంద్రనగర్, షాషామహల్, మధుగార్డెన్ ఏరియా, మరాఠీ అగర్ ఎక్స్ రోడ్డు, హౌసింగ్ బోర్డ్ కాలనీ, వీఐటీఎస్ కాలేజీ ఏరియా, సదాశివపల్లి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏడీఈ సాయినేని నరేందర్ తెలిపారు. అలాగే 11కేవీ ప్రతిమ ఫీడర్‌లో ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 1 గంటలవరకు హనుమాన్ నగర్, ఆర్టీసీ కాలనీ, శ్రీనివాస నగర్, చంద్రపురి కాలనీ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ ఏడీఈ తెలిపారు. వినియోగదారులు సహకరించాలని కోరారు.

పూర్వ విద్యార్థుల సమ్మేళనం



కరీంనగర్‌రూరల్: కరీంనగర్ మండలం నగునూరు జెడ్పీ పాఠశాలలో 1997–98 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు ఆదివారం సమ్మేళనం నిర్వహించుకున్నారు. 25 ఏళ్ల తర్వాత కలుసుకున్న విద్యార్థులు అప్పటి తీపి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. అప్పుడు చదువు చెప్పిన ఉపాధ్యాయులను ఘనంగా సన్మానించారు. పాఠశాలకు వాటర్‌ట్యాంకును అందించారు. ఈ కార్యక్రమంలో పలువురు పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



ఇంటర్నేషనల్ డ్యాన్స్ డే సందర్భంగా సజ్జప్ప కళాక్షేత్రం ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం ఎలగందులలో ఆదివారం నాట్య సంబరాలు నిర్వహించారు. కార్యక్రమానికి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ రెడ్డివేణి మధు ముఖ్య అతిథిగా హాజరు కాగా.. సర్పంచ్ ఎద్దండి షర్మిల ప్రకాశ్, వార్డు మెంబర్లు, కోఆప్షన్‌సభ్యులు, నాట్య మండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు. – కొత్తపల్లి


వెంచర్లలో గుమికూడిన టీడీపీ నాయకులు

టీడీపీ నేతల వీరంగం

పులివెందుల నియోజకవర్గంలో వెంచర్‌ను దున్నేసిన బీటెక్ రవి, ఆయన అనుచరులు


టీడీపీ నేతలు దున్నిన వెంచర్

చక్రాయపేట: వైఎస్సార్ జిల్లా పులివెందుల నియోజకవర్గం చక్రాయపేట మండలం సురభి గ్రామం నాగలగుట్టపల్లె సినిమా హాల్ సమీపంలో కొందరు వ్యాపారులు వేసిన రియల్ ఎస్టేట్ వెంచర్‌ను టీడీపీకి చెందిన మాజీ ఎమ్మెల్సీ బీటెక్ రవి, ఆయన అనుచరులు ఆదివారం ట్రాక్టర్లతో దున్నేశారు. బీటెక్ రవి, సుమారు 200 మంది నాయకులు, కార్యకర్తలు కలిసి వెంచర్ వద్దకు వచ్చి మారణాయుధాలు పట్టుకుని కేకలు వేస్తూ స్థానికులను భయభ్రాంతులకు గురిచేశారు. బాధితులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... సురభి గ్రామం నాగలగుట్టపల్లె సినిమా హాల్ సమీపంలో గోవిందు రామయ్య అనే వ్యక్తికి చెందిన 1.05 ఎకరాల భూమిని రమణ, సుబ్బయ్య అనే వ్యాపారులు కొను గోలు చేసి రెండు రోజుల కిందట వెంచర్ వేశా రు. దీంతో స్థానిక టీడీపీ నేతలు తాళ్లపల్లె మహేశ్వరరెడ్డి, రామాంజులరెడ్డిలు బీటెక్ రవిని పిలిపించుకుని వెంచర్‌ను ట్రాక్టర్‌తో దున్నేశారు. ఈ సందర్భంగా సుమారు రెండు వందల మంది టీడీపీ కార్యకర్తలు మారణా యుధాలతో బీభత్సం సృష్టించారు. ఈ విష యం తెలుసుకున్న రామయ్య, రమణ, సుబ్బ య్య వెంచర్ వద్దకు వచ్చేసరికి అందరూ వెళ్లిపోయారు. దీంతో వారు చక్రాయపేట పో లీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. ఆర్కే వ్యాలీ, వేంపల్లె, పులివెందుల రూరల్, అర్బన్ సీఐలు గోవిందరెడ్డి, వెంకటేశ్వర్లు, బాలమద్దిలేటి, రాజు, చక్రాయపేట ఎస్‌ఐ మల్లికార్జునరెడ్డి వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని పరిశీలించారు.

ఎస్సీ సబ్‌ప్లాన్ అమలులో.. ఏపీది అగ్రస్థానం

దేశంలోకెల్లా ఇక్కడే ఎస్సీ కుటుంబాలకు అతిపెద్ద సాయం.. కేంద్రం కితాబు

సాక్షి, అమరావతి : ఎస్సీ ఉప ప్రణాళిక అమలుతో పాటు ఎస్సీ కుటుంబాలకు సహాయం చేయడంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రస్థానంలో నిలిచింది. దేశంలోని మరే ఇతర రాష్ట్రం అమలుచేయని విధంగా ఎస్సీ ఉప ప్రణాళికను గత ఆర్థిక ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు ఏపీ అమలుచేసినట్లు కేంద్ర గణాంకాలు, కార్యక్రమాలు అమలు మంత్రిత్వ శాఖ నివేదిక వెల్లడించింది. 2022–23 మూడో త్రైమాసికం వరకు (అంటే ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు) దేశంలోని రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో వివిధ పథకాల అమలు పురోగతిపై నివేదికను ఆ శాఖ శనివారం విడుదల చేసింది. ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా ఆ కుటుంబాలకు సాయం అందించడం, రైతుల వ్యవసాయ పంపుసెట్లకు విద్యుత్ కనెక్షన్లు ఇవ్వడం, పట్టణ పేదలకు సాయం అందించడంలోనూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 'చాలామంచి' పనితీరు కనబరించిందని ఆ నివేదిక కితాబిచ్చింది. లక్ష్యాల్లో 90 శాతానికి పైగా అమలుచేసిన రాష్ట్రాలను చాలామంచి పనితీరు కనబరిచినట్లు, 80–90 శాతం మేర



అమలుచేసిన రాష్ట్రాలు 'మంచి పనితీరు' కనబరిచినట్లు.. 80 శాతం లోపల అమలుచేసిన రాష్ట్రాల పనితీరు బాగోలేని రాష్ట్రాలుగా నివేదిక వర్గీకరించింది.

ఏపీలో 33.57 లక్షల కుటుంబాలకు సాయం..

ఎస్సీ ఉప ప్రణాళిక కింద దేశంలోని ఆయా రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లో గత ఆర్థిక ఏడాది ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు మొత్తం 34,68,986 ఎస్సీ కుటుంబాలకు సాయం అందించినట్లు ఆ నివేదిక పేర్కొంది. అయితే.. అందులో ఒక్క ఏపీలోనే ఏకంగా 33,57,052 కుటుంబాలకు సహాయం అందించారు. అలాగే, గతంలో కేంద్ర గణాంకాలు, కార్యక్రమాల మంత్రిత్వ శాఖ ఏప్రిల్ నుంచి సెప్టెంబరు వరకు విడుదల చేసిన నివేదికలో ఆంధ్రప్రదేశ్‌లో ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా 29,10,944 కుటుంబాలకు సాయం అందించగా.. అదే ఇప్పుడు ఏప్రిల్ నుంచి డిసెంబర్ వరకు విడుదల చేసిన నివేదికలో ఆ సంఖ్య 33,57,052కు పెరిగింది. అంటే.. మూడునెలల వ్యవధిలో అదనంగా 4,46,108 ఎస్సీ కుటుంబాలకు సాయం అందించింది. మిగతా మరే ఇతర రాష్ట్రాలు, కేంద్రపాలిత ప్రాంతాల్లోనూ లక్ష మంది ఎస్సీ కుటుంబాలకు కూడా సహాయం చేయలేదని నివేదిక స్పష్టంచేసింది. ఒక్క కర్ణాటకలో మాత్రమే 22,884 కుటుంబాలకు ఎస్సీ ఉప ప్రణాళిక ద్వారా సాయం అందించగా మిగతా రాష్ట్రాలు అంతకన్నా తక్కువగా వేల, వందల సంఖ్యలోనే సహాయం అందించాయి.

బాధితులు 22 వేల మంది..

కొల్లగొట్టింది రూ. 10 కోట్లు

వెలుగులోకి వస్తున్న చక్రధర్ మోసాలు

సాక్షి, సిటీబ్యూరో: చిన్న మొత్తాలను ఎక్కువ మంది నుంచి సేకరించడం వల్ల ఎవరికీ దొరకకుండా తప్పించుకోవచ్చనే ఉద్దేశంతో పథకం ప్రకారం మోసానికి పాల్పడిన సిద్దిపేటకు ఓ రాజకీయ పార్టీ నాయకుడు గడగోని చక్రధర్ వ్యవహారం తాజాగా వెలుగులోకి వచ్చింది. సుమారు 22 వేల మందిని మోసం చేసి రూ.10 కోట్ల వరకు వసూలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు.

కాల్ సెంటర్ ఏర్పాటుతో..

- కాల్ సెంటర్ ఏర్పాటు చేసి వివిధ రాష్ట్రాలకు చెందిన టెలీకాలర్స్ ద్వారా డాటా ఎంట్రీ జాబ్ అంటూ దక్షిణాది రాష్ట్రాల్లోని అమాయకులకు ఫోన్లు చేసి, డాటా ఎంట్రీ ప్రాజెక్ట్ ఇస్తామంటూ నమ్మించి డాటా ఎంట్రీ వర్క్‌తో నెలకు రూ. 20 వేల నుంచి రూ. 25 వేలు సులభంగా సంపాదించుకోవచ్చంటూ బాధితులకు వల వేసేవాడు. ఒప్పుకొన్న వారికి ఇంటర్నెట్ నుంచి సేకరించిన ఇమేజ్‌లను పంపించి డాక్యుమెంట్‌గా కన్వర్ట్ చేయాలంటూ టార్గెట్ ఇచ్చేవాడు. పని పూర్తి చేసి పంపిన వాళ్లకు అడ్వాన్స్‌గా 10 శాతం చెల్లిస్తే, క్వాలిటీ చెక్ చేసి మీ బిల్లులు చెల్లిస్తామంటూ ముందుగా 10 శాతం, ఆ తర్వాత కొన్ని పొరపాట్లున్నాయని వాటిని సెట్ చేయాలని అందుకు మరో 10 శాతం చెల్లించాలంటూ మొత్తం 20 శాతం వసూలు చేసేవాడు.


నిందితుడు చక్రధర్

- ఇలా డబ్బులు వసూలు చేసి, వాళ్ల టార్గెట్ 30 నుంచి 45 రోజులు కాగానే ఆ బ్యాచ్‌ను క్లోజ్ చేసేవాడు. ఒక బ్యాచ్‌లో సుమారు 2 వేల మందిని మోసం చేసేవాడు. ఆ బ్యాచ్‌కు వాడిన సిమ్ కార్డులు, వాళ్లకు ఇచ్చిన డాటా ఎంట్రీ ఇమేజ్‌లను మొత్తం ధ్వంసం చేసేవాడు. ఆ తర్వాత కొన్నాళ్లు విరామం ఇచ్చి తిరిగి మరో బ్యాచ్‌ను ప్రారంభించేవాడు. బాధితులు మోసం జరిగిందని తెలుసుకొని ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ అని వచ్చేది. పోయింది రూ. 5 వేలే కదా అనే ఉద్దేశంతో అంతటితో చాలా మంది వదిలేసేవారు. ఈ క్రమంలో ఇటీవల ఇద్దరు బాధితులు తమకు జరిగిన డాటా ఎంట్రీ మోసాలపై ఫిర్యాదు చేశారు. నగర సైబర్ క్రైం పోలీసులు దర్యాప్తు చేపట్టడంతో భారీ మోసం వెలుగులోకి వచ్చింది.

2018లో స్కెచ్..

చక్రధర్ పలు బ్యాంకుల్లో ఏజెంట్‌గా పని చేస్తూ తన బావమరిదితో కలిసి రియల్ ఎస్టేట్ చేసేవాడు. 2018లో అమీర్‌పేటలో ఉన్న తన బంధువు వినోద్‌తో కలిసి కాల్‌సెంటర్ వద్దకు వెళ్లాడు. అక్కడ డాటా ఎంట్రీ అంటూ ఫోన్లు చేస్తున్న విషయాన్ని గుర్తించి.. తానూ ఇలాగే ఓ కాల్‌సెంటర్ ఏర్పాటు చేసి మోసాలు చేయాలని అతని బంధువుతో ఆలోచన చేశాడు. దీంతో 2018లోనే అమీర్‌పేట్‌లో ఒక కాల్‌సెంటర్ ఏర్పాటు చేశారు. 2021లో తన అడ్డాను పంజాగుట్టకు మార్చాడు.

11 బ్యాచ్‌లు..

అనంతపురం నుంచి రూ.వెయ్యికి ఒక సిమ్ కార్డు కొనడం, నిరుద్యోగుల డాటాను వివిధ మార్గాలలో సేకరించి టెలీ కాలర్స్‌కు అప్పగించే వాడు. తెలుగు, ఇంగ్లిష్, హిందీ, తమిళం, మలయాళం, కన్నడం తెలిసిన వారిని కాల్‌సెంటర్ ఉద్యోగులుగా నియమించుకున్నాడు. వీళ్లకు నెలకు రూ. 15 వేల జీతం, ఉచిత భోజనం, వసతి కల్పిస్తూ, మోసాలు ఎక్కువగా చేసేవారికి ఎక్కువగా ఇన్సెంటివ్‌లు ఇచ్చేవాడు. కేవలం రూ. 2500 నుంచి రూ. 5000 వరకు వారి అమాయకత్వ బట్టి మోసం చేసేవాడు. ఇలా 2021 నుంచి 11 దఫాలుగా సుమారు 22 వేల మందిని చక్రధర్ మోసం చేసి రూ. 10 కోట్ల వరకు వసూలు చేసినట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ డబ్బుతో బాచుపల్లి ప్రాంతంలో ప్లాట్లు, హైఎండ్ కార్లు కొనుగోలు చేశాడు. దీంతో పాటు సామాజిక సేవ చేస్తున్నట్లుగా రైతులకు, ఇతరులకు చెక్కులు ఇచ్చి ప్రచారం చేసుకునేవాడు.

రాజమహేంద్రవరంలో మరో 'మార్గదర్శి'

- టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ కుటుంబీకుల 'జగజ్జనని చిట్‌ఫండ్స్'లో భారీగా అక్రమాలు
- ఆమె మామ ఆదిరెడ్డి అప్పారావు, అతని కుమారుడు అరెస్టు
- 1982 చిట్‌ఫండ్ చట్టాన్ని ఉల్లంఘించి అక్రమాలు
- చందాదారుల సొమ్ము దారిమళ్లింపు

సాక్షి, అమరావతి/సాక్షి, రాజమహేంద్రవరం : మార్గదర్శి తరహాలో మరో భారీ మోసం వెలుగుచూసింది. తూర్పు గోదావరి జిల్లా రాజమహేంద్రవరంలో జగజ్జనని చిట్స్ పేరుతో టీడీపీ నేతలు ఆర్థిక నేరానికి పాల్పడిన విషయం బట్టబయలైంది. 1982 చిట్‌ఫండ్స్ చట్టం నిబంధనలు ఉల్లంఘించి, ఇష్టానుసారం డిపాజిట్లు సేకరించి, వాటిని ఇతర వ్యాపారాలకు, వడ్డీలకు మళ్లించి అక్రమాలకు తెరతీసిన విషయం సీఐడీ దర్యాప్తులో నిర్ధారణ అయ్యింది. దీంతో ఆ చిట్‌ఫండ్ కంపెనీ మేనేజింగ్ డైరెక్టర్, టీడీపీ నేత, మాజీ ఎమ్మెల్సీ ఆదిరెడ్డి అప్పారావు-ఏ1, డైరెక్టర్‌గా ఉన్న ఆయన కుమారుడు ఆదిరెడ్డి శ్రీనివాస్-ఏ2 (రాజమహేంద్రవరం సిటీ టీడీపీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవాని భర్త)లను సీఐడీ అధికారులు రాజమహేంద్రవరంలో ఆదివారం అరెస్టుచేశారు. వీరితోపాటు మరో డైరెక్టర్ అయిన ఆదిరెడ్డి అప్పారావు కుమార్తె ఆదిరెడ్డి వెంకట జ్యోత్సలపై ఐపీసీ సెక్షన్లు 420, 409, 120బి, 477 (ఎ) రెడ్‌విత్ 34, రాష్ట్ర డిపాజిట్‌దారుల హక్కుల పరిరక్షణ చట్టం సెక్షన్-5, కేంద్ర చిట్‌ఫండ్ చట్టం-1982 కింద ఎఫ్ఐఆర్ నమోదు చేశారు. జగజ్జనని చిట్‌ఫండ్స్ అక్రమాలకు పాల్పడుతున్నట్టు సీఐడీ విభాగానికి కొన్నినెలల క్రితమే ఫిర్యాదులొచ్చాయి. అక్రమాలు వాస్తవమేనని నిర్ధారణ కావడంతో చిట్ రిజిస్ట్రార్ ఈ విషయంపై సీఐడీకి ఫిర్యాదు చేశారు. దాంతో సీఐడీ అధికారులు ఈ ఏడాది మార్చిలో జగజ్జనని చిట్‌ఫండ్స్ కార్యాలయాల్లో తనిఖీలు నిర్వహించారు. ఆ తనిఖీల్లో భారీగా ఆర్థిక అక్రమాలు వెలుగుచూశాయి. వీటిపై సంస్థ బ్రాంచి మేనేజర్లు (ఫోర్‌మెన్) సరైన వివరణ కూడా ఇవ్వలేకపోవడంతో సీఐడీ అధికారులు కేసును మరింత లోతుగా విచారించి అవకతవకలను నిర్ధారించారు.


సీఐడీ కార్యాలయం వద్ద టీడీపీ ఎమ్మెల్యే భవానీ

యథేచ్ఛగా ఆర్థిక అక్రమాలు..

జగజ్జనని చిట్ ఫండ్స్ కంపెనీ కొన్నేళ్లుగా ఇష్టారాజ్యంగా అక్రమాలకు పాల్పడుతున్నట్లు సీఐడీ తనిఖీల్లో బట్టబయలైంది. ఆ కంపెనీ ఎండీ, డైరెక్టర్లు నిబంధనలకు విరుద్ధంగా చందాదారుల సొమ్మును మళ్లించి సొంత ఆస్తులు భారీగా కూడబెట్టుకున్నట్లుగా ఆధారాలను గుర్తించారు.

- చిట్‌ఫండ్స్ కంపెనీలు ఇతర వ్యాపారాలు చేయడం చిట్‌ఫండ్ చట్టానికి విరుద్ధం. కానీ, జగజ్జనని సంస్థ మాత్రం నిబంధనలకు విరుద్ధంగా అక్రమ డిపాజిట్ల సేకరణ, అక్రమంగా రుణాలు మంజూరు చేస్తూ వడ్డీ వ్యాపారం నిర్వహిస్తోంది. 2018 నుంచి 2023 వరకు భారీగా అక్రమ డిపాజిట్లు వసూలు చేసినట్లు.. వాటిపై వడ్డీలు చెల్లించినట్లు గణాంకాలతో సహా వెల్లడైంది. అదే రీతిలో చందాదారుల సొమ్ముతో భారీగా వడ్డీ వ్యాపారం చేస్తున్నట్లు గుర్తించారు. తద్వారా భారీ ఆదాయాన్ని ఆర్జించినట్లు వెల్లడైంది.
- చిట్టీల వేలం సొమ్ము చెల్లింపు ముసుగులో జగజ్జనని చిట్‌ఫండ్స్ నల్లధనాన్ని చెలామణిలోకి తెస్తోంది. 49 చిట్టీ పాటల ప్రైజ్‌మనీ మొత్తం రూ.11,76,82,000 చెల్లింపులను పరిశీలించారు. వాటిలో 21 చిట్టీ పాటల ప్రైజ్‌మనీ రూ.4,68,45,753ను బ్యాంకు ఖాతాల్లో జమచేశారు. మిగిలిన 28 చిట్టీల వేలం పాటల ప్రైజ్‌మనీ రూ.7,08,36,247ను నగదు రూపంలో చెల్లించినట్లు చెప్పారు. నగదు రూపంలో చెల్లించడం నిబంధనలకు విరుద్ధం. అంటే.. నల్లధనాన్ని చెలామణిలోకి తెచ్చినట్లు వెల్లడైంది.
- చిట్‌ఫండ్ కంపెనీ అన్ని వ్యవహారాలు నగదులోనే నిర్వహిస్తోంది. అంటే చందాల వసూళ్లు, చిట్ పాట మొత్తం చెల్లింపులన్నీ నగదులోనే నిర్వహిస్తోంది. ఇది ఆదాయపన్ను చట్టానికి విరుద్ధం. బ్యాంకు ఖాతాల్లో సంస్థ భారీగా నగదు డిపాజిట్లు కూడా చేస్తోంది. చిట్ వసూళ్లతో ఆ డిపాజిట్లు సరిపోలడంలేదు. ఎక్కువగా బ్యాంకు డిపాజిట్లు నగదు రూపంలోనే చేస్తున్నారు. చందా చెల్లించడంలేదని చెబుతున్న చిట్‌ల కోసం ప్రత్యేకంగా బ్యాంకు ఖాతా నిర్వహించడంలేదు.

పరిహారం కోసం నిర్మాణాలు


గుడిపేటలో జాతీయ రహదారిని ఆనుకుని చేపట్టిన నిర్మాణాలు


గుడిపేటలో జాతీయ రహదారిని ఆనుకుని వేసిన బోర్‌వెల్స్

- జాతీయ రహదారి పక్కనే పనులు
- పట్టించుకోని అధికారులు

మంచిర్యాలరూరల్(హాజీపూర్): మంచిర్యాల నుంచి ఆర్మూర్‌కు నాలుగు వరుసల జాతీయ రహదారి 63 నిర్మాణానికి పనులు మొదలయ్యాయి. గత నెలలో దీనికి సంబంధించి కేంద్ర రోడ్ల, రవాణా శాఖ ద్వారా కోల్పోతున్న సర్వే నంబర్లు, స్థల విస్తీర్ణంపై పూర్తి స్థాయిలో స్పష్టమైన గజిట్ కూడా పత్రిక ప్రకటన ద్వారా తెలియజేసింది. ఇంకా పరిహారం విషయంలోనూ స్పష్టత లేక వచ్చే పరిహారంలో న్యాయం కోసం బాధితులు ఆపసోపాలు పడుతున్నారు. ఈ క్రమంలోనే భూములు, ఇండ్లు కోల్పోతున్న బాధితులు జాతీయ రహదారిని ఆనుకుని తాత్కాలికం అన్న చంద్రంగా చకచకా ఇళ్ల నిర్మాణాలు చేపడుతున్నారు. అంతే కాదు గుంటకో బోరు వేయిస్తున్నారు. గమనిస్తున్న రెవెన్యూ అధికారులు ఖర్చులు పెట్టుకుని ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని తెలియజేస్తున్నా వినకుండా నిర్మాణాలు చేస్తున్నారు. అయితే జాతీయ రహదారి పక్కన నిర్మాణాలు మాత్రం సిత్ర విచిత్రంగా సాగుతుండటంతో అంతా ఔరా ఏంటి ఈ నిర్మాణాలు అంటూ ఆశ్చర్యం వ్యక్తం చేస్తున్నారు.

ఖాళీ జాగాలో పేదల పాగా..


ఖాళీజాగాలో చీరలతో డేరాలు వేస్తున్న మహిళలు

చెన్నూర్: మండలంలోని పద్మానగర్‌లోని ఖాళీజాగాలో ఆదివారం తెల్లవారు జామున వందలాది మంది పాగా వేశారు. కోటపల్లి, చెన్నూర్ మండలాలకు చెందిన పేదలు సీపీఎం ఆధ్వర్యంలో చీరలను డేరాలుగా కట్టారు. ప్రభుత్వం పేదలకు ఇండ్లు ఇస్తామని చెప్పి ఎనిమిది సంవత్సరాలుగా ఎలాంటి ఊసెత్తడం లేదని మండిపడ్డారు. దీంతో కొంతమంది తమ పట్టా భూములను ఆక్రమించుకున్నారని పోలీసులకు ఫిర్యాదు చేయడంతో అక్కడకు పోలీసులు చేరుకోగా మహిళలు వాగ్వాదానికి దిగారు. గతంలో ఇక్కడ నిర్మాణాలు చేపడితే ప్రభుత్వ భూమని కూలగొట్టారని వాదించారు. ఏదీ ఏమైనా ఇక్కడి నుంచి కదిలేది లేదని భీష్మించుకూర్చున్నారు. సీఐలు వాసుదేవరావు, విద్యాసాగర్ సంఘటనా స్థలానికి చేరుకుని వారికి నచ్చజెప్పే ప్రయత్నం చేశారు. పట్టాదారుల ఫిర్యాదు మేరకు పలువురిపై కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కారుమబ్బులు కమ్ముకున్న వేళ


వాతావరణం అనూహ్య మార్పుతో గత మూడు రోజుల నుంచి ఆదిలాబాద్ జిల్లాలో వర్షాలు కురుస్తున్నాయి. అందులో భాగంగానే ఆదివారం ఉదయం ఒక్కసారిగా ఆదిలాబాద్‌లో కారు మబ్బులు కమ్ముకొని అంధకారంలోకి నెట్టేశాయి. - సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

రిజిస్ట్రేషన్లు డౌన్!

- తగ్గుతున్న రిజిస్ట్రేషన్ల సంఖ్య.. మందగించిన ఆదాయం
- మార్చిలో రూ.29.29 కోట్లు.. ఏప్రిల్‌లో రూ.24.01 కోట్లు
- నెల వ్యవధిలో రూ.5 కోట్ల ఆదాయం కోల్పోయిన రిజిస్ట్రేషన్ శాఖ


పెద్దపల్లి బైపాస్ రోడ్డు వద్ద ఓపెన్ ప్లాట్లు

కరీంనగర్‌క్రైం: రిజిస్ట్రేషన్‌ల సంఖ్య రోజురోజుకు పడిపోతోంది. తద్వారా రిజిస్ట్రేషన్ శాఖకు ఆదాయం తగ్గుతూ వస్తుంది. రియల్ ఎస్టేట్ భూం తగ్గడంతో రిజిస్ట్రేషన్‌లు తగ్గుతున్నాయని, ప్రతీ వేసవిలో ఒకట్రెండు నెలలు సీజన్ డల్‌గా ఉంటుందని, కానీ ఈ సారి చాలా వరకు తగ్గిపోయాయని రియల్ ఎస్టేట్ వ్యాపారులు పేర్కొంటున్నారు.

మార్చిలో 8,867.. ఏప్రిల్‌లో 6,841..

కరీంనగర్ ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రిజిస్ట్రేషన్ డాక్యుమెంట్ల సంఖ్యను పరిశీలిస్తే మార్చి మొత్తం 8,867 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ కాగా రూ.29.29 కోట్ల ఆదాయం సమకూరింది. ఏప్రిల్‌లో 6,841 డాక్యుమెంట్లు మాత్రమే రిజిస్ట్రేషన్ కాగా రూ.24.01 కోట్ల ఆదాయం వచ్చింది. గత నెలలో చాలా వరకు డాక్యుమెంట్లు తగ్గడంతో పాటు ఆదాయం సుమారు రూ.5 కోట్ల వరకు తగ్గుముఖం పట్టిందని తెలుస్తోంది. కరీంనగర్, జగిత్యాల, సిరిసిల్ల వంటి జిల్లా కేంద్రాల్లో కూడా గణనీయంగా రిజిస్ట్రేషన్‌ల సంఖ్య పడిపోతూ వస్తుంది. ఇది ఇలా ఉండగా రామగుండంలో కొత్తగా సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం ఏర్పాటు చేశారు. ఏప్రిల్‌లో 705 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యాయి.

రియల్ వ్యాపారం డల్..

గత నెల నుంచి రియల్ వ్యాపారం డల్‌గానే కొనసాగుతుందని రియల్ ఎస్టేట్ వ్యాపారులు చెబుతున్నారు. కరీంనగర్, సిరిసిల్ల, జగిత్యాల, పెద్దపల్లి వంటి జిల్లా కేంద్రాలతో పాటు కరీంనగర్‌రూరల్, కోరుట్ల, మెట్‌పల్లి వంటి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో గతంలో ఎక్కువ రియల్ ఎస్టేట్ వ్యాపారం జరిగి ఆస్తులు చేతులు మారుతూ ఎక్కువ డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ అయ్యేవి. కానీ గత నెల నుంచి సీజన్ డల్‌గా మారిందని చెబుతున్నారు. దీనికి కారణం మంచి రోజులు లేకపోవడం అని కొందరు రియల్ వ్యాపారులు చెబుతున్నారు. ఆస్తులు కొనేటప్పుడు చాలా మంది మంచిరోజులు చూస్తారని, దీంతో ఏప్రిల్‌లో మంచిరోజులు లేకపోవడం కూడా ఒక కారణం కావచ్చని అభిప్రాయపడుతున్నారు.

మార్చి, ఏప్రిల్ నెలల్లో డాక్యుమెంట్ల సంఖ్య

ఎస్ఆర్‌వో	ఏప్రిల్	మార్చి
గంగాధర	682	732
హుజురాబాద్	393	492
జగిత్యాల	644	886
మల్యాల	154	282
మంథని	231	204
మెట్‌పల్లి	322	446
పెద్దపల్లి	459	1,116
సిరిసిల్ల	867	1,057
సుల్తానాబాద్	171	197
వేములవాడ	487	1,180
కరీంనగర్	886	1,213
కరీంనగర్‌రూరల్	510	609
కోరుట్ల	330	453
రామగుండం	705	00
మొత్తం	6,841	8,867

వ్యాపారం తగ్గింది

ప్రతి వేసవిలో రియల్ ఎస్టేట్ వ్యాపారం ఒకట్రెండు నెలలు తగ్గుముఖం పడుతుంది. కానీ ఇప్పుడు మరీ డల్‌గా ఉంది. కనీసం నెలకు రెండుమూడు ప్లాట్లు అమ్మేవాళ్లం. కానీ ఈ సారి నేను, నాకు తెలిసిన వ్యాపారులు ఒక్క ప్లాట్ కూడా అమ్మలేదు. చాలా మంది అగ్రిమెంట్లు చేసుకున్నవారు మంచిరోజులు లేవని వాయిదా వేసుకుంటున్నారు.

– కె.రాజు, రియల్ ఎస్టేట్ వ్యాపారి

రాజన్న సేవలో ప్రముఖులు

వేములవాడ: రాజన్నను కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ దంపతులు, వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి ప్రతీక్ సిహాగ్ దంపతులు ఆదివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ అధికారులు ప్రత్యేక దర్శనం అవకాశం కల్పించారు. అనంతరం వేదోక్త ఆశీర్వచనం గావించారు. ఈవో కృష్ణప్రసాద్, పర్యవేక్షకులు తిరుపతిరావు, శ్రీరాములు పాల్గొన్నారు.


కరీంనగర్ అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ దంపతులను ఆశీర్వదిస్తున్న అర్చకులు


వేములవాడ జూనియర్ సివిల్ జడ్జి ప్రతీక్ సిహాగ్ దంపతులకు ప్రసాదాలు అందజేస్తున్న ఈవో కృష్ణప్రసాద్

సన్నిధి



మంచి మాట

విడదియ్యరాని శ్రమ

శ్రమ నుంచి శ్రామికుల్ని, శ్రామికుల నుంచి శ్రమను ఎలా అయితే విడదియ్యలేమో అలా ప్రపంచం నుంచి శ్రమను, శ్రామికులను విడదియ్యలేం. శ్రమలేందే శ్రామికులు లేరు; శ్రామికులు లేందే శ్రమలేదు; శ్రమ, శ్రామికులు లేందే ప్రపంచం లేదు. మనిషికి ప్రపంచం ఆధారం; ప్రపంచానికి శ్రామికుడు ఆధారం. ప్రతి మనిషికి శ్రామికుడి అవసరం ఉంది; ప్రతిమనిషీ శ్రామికుడు అవ్వాల్సిన అవసరం ఉంది.

మన ఈ ప్రపంచం మనకు ఇవాళ ఇలా ఉందీ అంటే అది శ్రామికులు శ్రమిస్తూనే ఉన్నందువల్ల వచ్చిన ఫలితమే. శ్రమతో శ్రామికులు సృజించిన ఆకృతి ప్రపంచం. శ్రమతో, శ్రమలో శ్రామికుడు జీవనం చేస్తున్నందువల్లే ప్రపంచానికి స్థితి, ద్యుతి ఉన్నాయి. అవి మనకు ఆలవాలమూ అయినాయి. మన మనుగడ సాగేందుకు అవి మనతో, మనకై ఉన్నాయి.

'శ్రమైక జీవన సౌందర్యానికి సమానమైనది లేనేలేదు' అని కవి శ్రీశ్రీ అన్నారు. శ్రమైకజీవనం సౌందర్యమై ప్రపంచం మొత్తానికి సౌందర్యాన్ని తీసుకు వచ్చింది! శ్రమ అన్నదాన్ని లుప్తం చేసి ఊహించుకుంటే ప్రపంచం వికృతంగా ఉంటుంది. శ్రమైక జీవనం అన్నది సౌందర్యం మాత్రమేనా? కాదు. శ్రమైక జీవనం ఈ ప్రపంచానికి లభించిన సౌభాగ్యం కూడా. అనాదిగా ప్రపంచం పొందిన ప్రగతికి కారణం శ్రామికుడు. శ్రామికుడు ప్రపంచానికి సౌందర్యప్రదాత. శ్రామికుడు ప్రపంచానికి సౌభాగ్య ప్రదాత.

అటువంటి శ్రామికుడికి, అతడి శ్రమకు న్యాయం జరుగుతోందా? అనాదిగానే అది లేదు అన్నది క్షేత్ర వాస్తవంగా మనకు ప్రస్ఫుటంగా తెలుస్తూనే ఉంది.'మన ప్రపంచంలో చాలా విషయాలు అన్యాయం; / పత్తిని నాటని వాళ్లు శ్రేష్ఠమైన పత్తి బట్టలు కట్టుకుంటారు. / అంతే కాదు పొలంలో పని చెయ్యని వాళ్లు తెల్లటి బియ్యం తింటారు' అని అంటూ చైనాలోని ఒక అజ్ఞాత యూనాన్ జానపద కవి వందలయేళ్ల క్రితమే ఆవేదనను వ్యక్తపరిచాడు. చిందిన చెమటకు అందిన ఫలం చాలని స్థితి ఎప్పటి నుంచో ఉంది.

> ఏ ఒక్కరోజో శ్రామికుల రోజు అవదు. ప్రతిరోజూ శ్రామికుల రోజే. సూర్యోదయంతో మొదలయ్యే ప్రతి దినమూ శ్రామికుల దినమే! శ్రమ అన్నది చిందే దినమే! శ్రమ చిందనిదే, శ్రామికులు పని చెయ్యనిదే ఏ దినమూ గడవదు కదా? ఆది, సోమ, మంగళ, బుధ, గురు, శుక్ర, శని అంటూ ఒక్కో పేరుతో ఒక్కో దినం ఉంది. ఏ పేరుతో ఉన్న దినమైనా శ్రమ, శ్రామికుల అభినివేశంతోనే అది దినంగా నడుస్తుంది, గడుస్తుంది. ప్రతిదినమూ శ్రామికుల దినమే!

ఈ పరిస్థితి ఇకనైనా మారాలి. శ్రమకు, శ్రామికుడికి తగిన ఫలం దక్కాలి.

'మేఘాలు తియ్యటి నీరును ఇచ్చినట్టుగా, తేనెటీగలు తేనెను ఇచ్చినట్టుగా నువ్వు పశువుల్లో పాలను సృష్టించావు. అదే విధంగా పగలంతా శ్రమించిన శ్రామికుడికి ధాన్యాది రూపంలో సంపదను ఇవ్వు' అంటూ వేదంలో ఒక దైవ ప్రార్థన ఉంది. శ్రామికుడికి న్యాయం జరగాలన్న ఆకాంక్ష కూడా ఎప్పటి నుంచో వస్తూనే ఉంది. ఇకనైనా శ్రమకు, శ్రామికులకు న్యాయం సాకారం కావాలి.

ఏడాదిలో ఏ ఒక్కరోజునో శ్రామికుల రోజు అనీ, ఆ రోజున ఏదో హడావిడి చేసేసి, ఉపన్యాసాలు ఇచ్చేసి ఆ తరువాత శ్రామికుల్ని నిర్లక్ష్యం చెయ్యడం ఇక చాలు. ప్రతి రోజూ శ్రామికులకు, శ్రమకు న్యాయం చేస్తూ మనం మన మనుగడను సౌందర్యవంతమూ, సౌభాగ్యవంతమూ చేసుకుందాం. శ్రామికులకు, శ్రమకు గౌరవాన్ని, మన్నను ఇస్తూ మనల్ని మనం గౌరవించుకుందాం; మనకు మనం మన్ననను కలిగించుకుందాం.

– రోచిష్మాన్

గురువాణి

పాతకొత్తల గొడవ మనకెందుకు!!!

అభ్యుదయం అంటే సమాజానికి మేలు చేయడం. మనుషులలో మంచి గుణాలు ఏర్పడితే అది అభ్యుదయానికి కారణమవుతుంది. మేలు జరగడానికి పాతదా కొత్తదా అని కాదు... పాతదంతా మంచీ కాదు, కొత్తదంతా చెడూ కాదు. అలాగే పాతదంతా చెడూ కాదు, కొత్తవన్నీ మంచివీ కావు. రామాయణ భారతాల్లో అన్నీ ఉన్నాయండీ అని కొత్త వాఙ్మయం దేనికండీ అనడం మంచిదికాదు. కొత్తగా వచ్చిన గ్రంథాలలో ఎన్నో మంచి విషయాలుంటాయి.

''పురాణమిత్యేవ న సాధు సర్వం/ నా చాపి కావ్యం నవమిత్యవద్యమ్/ సంతః పరీక్ష్యాన్యతరత్ భజంతే/ మూఢఃపరప్రత్యయనేబుద్ధిః'' అంటారు మాళవికాగ్నిమిత్రంలో మహాకవి కాళిదాసు. అంటే పాతకాలానికి సంబంధించినది కాబట్టి ఇందులో ఏదీ పనికొచ్చేదీ, మంచిదీ ఉండదు – అనకూడదు. పాతవన్నీ చెడ్డవని ఎలా సిద్ధాంతీకరిస్తారు! ఈ రచన ఇప్పుడు కొత్తగా వచ్చింది, వీటిలో మన మేలు కోరేవి ఏం ఉంటాయి, వీటిని మనం ఆదరించక్కరలేదు... అని చెప్పడమూ కుదరదు. వివేకవంతులు ఏం చేస్తారంటే... అందులో ఏదయినా మంచి చెప్పారా.. అని పరిశీలిస్తారు. జీవితాలకు అభ్యున్నతిని కల్పించే మాటలు ఏవయినా వాటిలో ఉన్నాయా... అని చూస్తారు. కానీ ఎవరో ఏదో చెప్పారని తన స్వంత బుద్ధిని ఉపయోగించకుండా, మంచీ చెడూ విచారణ చెయ్యకుండా వాటినే అనుకరిస్తూ, అనుసరిస్తూ నిర్ణయాలు తీసుకోవడం మూఢుల లక్షణం. ..అంటున్నాడు కాళిదాసు.

> ఎవరో ఏదో చెప్పారని తన స్వంత బుద్ధిని ఉపయోగించకుండా, మంచీ చెడూ విచారణ చెయ్యకుండా వాటినే అనుకరిస్తూ, అనుసరిస్తూ నిర్ణయాలు తీసుకోవడం మూఢుల లక్షణం అంటున్నాడు కాళిదాసు.

మనకు పనికొచ్చే విషయాలు ఎన్ని ప్రతిపాదింపబడ్డాయి.. అన్నదానిని పరిశీలించడం నిజమైన అభ్యుదయం. దాని విషయానికొస్తే అది పాతదా, కొత్తదా అని కాదు ఆలోచించాల్సింది, అందులో మంచి ఏముంది, ఇందులో మంచి ఏముంది? అని అంతకన్నా దాటి ఇక పరిశీలన చేయవలసిన అవసరం నాబోటివాడికి అక్కర లేదు. నా వరకు నాకు కావలసినది – అది ఎవరు రాసింది అయినా పాత కాలపుదయినా, కొత్తకాలపుదయినా, ఇప్పుడు సమాజంలో ఉన్న వ్యక్తులు రాసినది అయినా, పాతకాలంలో ఋషుల వాఙ్మయం అయినా... అందులో అభ్యుదయానికి చెప్పబడిన మంచి విషయాలు ఏమున్నాయి? అనే. వాటిని స్వీకరించి, జీర్ణం చేసుకుని బాగుపడడానికి ప్రయత్నం చేయడం వరకే. పాతకాలంలో కూడా ఆదరణీయం కానివి, అంగీకారయోగ్యం కానివి, సమాజానికి ఉపయుక్తం కానివి ఎన్నో ఉండవచ్చు. అంతమాత్రం చేత పాతకాలంలో ఉన్న వాఙ్మయంలో పనికొచ్చేవి ఏవీ లేవు.. అని చెప్పడం సాధ్యం కాదు.


'పురాణమిత్యేవ న సాధు సర్వం ...' ఇది... ఆకాలంలో కాళిదాసు చెప్పిన మాట. ఈ మాట ఇప్పటికి పనికి రాదా!!! ఇది నేర్చుకుంటే అభ్యుదయం కాదా!!! ఇది నేర్చుకున్నవాడి జీవితం ... చేత దీపం పట్టుకుని నడుస్తున్న వాడిలా ఉండదా? పువ్వు పువ్వు లోంచి తేనెబొట్టు స్వీకరించిన తేనెటీగ కాదా !!! అందువల్ల మంచి విషయాలు స్వీకరించడం ప్రధానం కావాలి. అవి ప్రాచీన వాఙ్మయం నుంచి కావచ్చు, కొత్తగా వెలువడుతున్న గ్రంథాలనుంచి కావచ్చు. వ్యక్తులందరూ అలా స్వీకరించాలి, మంచి గుణాలు అలవర్చుకోవాలి, ఆ వ్యక్తుల సమూహమే సమాజ అభ్యుదయానికి కారణమవుతుంది.



బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు

బౌద్ధవాణి

అజ్ఞానం అరటి ఊచ



వైశాలి నగరానికి దగ్గర్లో మహాకూటాగార శాల ఉంది. అప్పుడు బుద్ధుడు ఆ శాలలో ఉంటున్నాడు. ఆ విషయం ఆ చుట్టుపక్కల ఊళ్ళన్నింటికీ తెలిసింది. ప్రజలు, పండితులు తండోపతండాలుగా వెళ్ళి బుద్ధుని ప్రవచనాలు వింటున్నారు.

వైశాలి నగర శివారు గ్రామంలో సత్యకుడు అనే పండితుడు ఉన్నాడు. అతనికి ఈ విషయం తెలిసింది. 'నేనే మహా పండితుణ్ణి'' అనే అహంభావి. తన పాండిత్యంతో బుద్ధుణ్ణి ఓడిస్తే... మహా గౌరవం తనకే దక్కుతుంది అని అనుకున్నాడు. వెంటనే వైశాలికి వెళ్ళాడు. అక్కడ సత్యకుని అనుయాయులు కొందరున్నారు. వారందర్నీ వెంటబెట్టుకుని దారి పొడవునా గప్పాలు కొట్టుకుంటూ అమితోత్సాహంతో కూటాగార శాలకు వెళ్ళాడు.

''ఓ భిక్షువులారా! మీ గౌతమబుద్ధుడు ఎక్కడ! నేను అతనితో వాదానికి వచ్చాను'' అన్నాడు.

వారు దారి చూపించారు.

సత్యకుడు వెళ్ళే సమయానికి ఒక పున్నాగ చెట్టు కింద కూర్చొని ఉన్నాడు బుద్ధుడు. పున్నాగ పూలు రాలి నేలంతా పరుచుకున్నాయి. వెళ్ళి నమస్కరించాడు. తాను వచ్చిన విషయం చెప్పాడు.

''మిమ్మల్ని ప్రశ్నింపవచ్చా?'' అని అడిగాడు.

బుద్ధుడు కనిపించీ కనిపించని చిరునవ్వుతో సుముఖత తెలిపాడు.

ఆత్మ, జీవుడు, దుఃఖం, సంజ్ఞలు, సంస్కారాలు, రూపం, వేదనలు... ఇలా అనేక విషయాలపై వారిద్దరి మధ్య సంవాదం జరిగింది. మిగిలిన వారంతా మౌనంగా వింటూ ఉన్నారు.

ఇంతలో గాలి వీచింది. పున్నాగ పూలు జల జలా రాలాయి.

చివరగా..

''సత్యకా! రూపమే నా ఆత్మ అన్నావు గదా! నీ రూపం నీ అదుపులో ఉంటుందా? నీవు కోరుకున్నట్లుగా నీ రూపం నీకు మారుతుందా? నా రూపం ఇలా బాగోలేదు. ఇలా ఉంటే బాగుంటుంది అనుకుని నీవు ఎలా అనుకున్నావో అలా మార్చుకోగలవా? ''నా రూపం ఇలా ఉండకూడదు'' అనుకుంటే ఉండకుండా పోతుందా?'' అని అడిగాడు.

సత్యకుడు చెప్పలేక మౌనం వహించాడు.

''ఐతే... రూపం ఎప్పుడూ మారకుండా ఉంటుందా? పరిణామం చెందదా?'' అని అడిగాడు.

సత్యకుడు మరలా మౌనం వహించాడు. అలాగే దుఃఖం, ఆత్మ ఇతర విషయాలూ అడిగాడు. తన మాటల చాతుర్యంతో తిమ్మిని బమ్మిని చేసే సత్యకుడు బుద్ధుని తత్వం ముందు తలదించాడు. తత్వజ్ఞానమే శ్రేష్ఠమైందని గ్రహించాడు.

అతని ఇబ్బందిని బుద్ధుడు అర్థం చేసుకుని...

''సత్యకా! ఒకడు బలమైన చేవగల చెట్టు కోసం అన్వేషిస్తూ వెళ్ళాడు. ఒకచోట ఎత్తుగా, వంకలు లేకుండా, బలమైన కాండం, విశాలమైన ఆకులు ఉన్న చెట్టుని చూశాడు. ''దీని ఆకులు పెద్దవి, పైగా మిసమిసలాడుతూ నునుపుదేలి ఉంది. ఇదే నాకు తగింది'' అనుకున్నాడు. ఆ చెట్టుని పడగొట్టాడు. వేళ్ళు నరికాడు. ఆకులు కోశాడు, మొదలు నరికాడు. దానిపై పొర విప్పాడు. అలా ఒక్కొక్క పొరను విప్పుకుంటూ పోయాడు. చివరికి లోపల ఎలాంటి కాండం లేదు. చేవగల చోటే లేదు. మెత్తగా వీగిపోయే ఊచ మాత్రమే ఉంది. అదే అరటి చెట్టు. మనకు ప్రజ్ఞ లేని పరిజ్ఞానం ఇలాంటిదే! తత్వం ఎరుగని తర్కం కూడా ఇంతే! ఒక్కొక్కటి వీగిపోయాక చివరికి మిగిలేది ఏమీ ఉండదు'' అన్నాడు.

సత్యకునికి అహం వీడింది. మోహం తొలగింది. క్షమాపణలు వేడాడు. శరణు పొందాడు!

– డా. బొర్రా గోవర్ధన్

సినిమా

కొత్త కబురు



● అఖిల్

యువ హీరో అఖిల్ నటించిన 'ఏజెంట్' చిత్రం థియేటర్లలో సందడి చేస్తోంది. కాగా ఆయన నటించనున్న తర్వాతి చిత్రం దాదాపుగా ఖరారైనట్లు తెలుస్తోంది. కొత్త దర్శకుడు అనిల్ ఇటీవల అఖిల్‌కు ఓ కథ చెప్పారు. ఈ స్టోరీ నచ్చడంతో అఖిల్ గ్రీన్ సిగ్నల్ ఇచ్చారట. యూవీ క్రియేషన్స్ సంస్థ ఈ మూవీ నిర్మించనుందని, త్వరలోనే దీనిపై అధికారిక ప్రకటన వెల్లడి కానుందనే టాక్ ఫిల్మ్‌నగర్‌లో వినిపిస్తోంది. అలాగే ఈ సినిమాలో హీరోయిన్ పాత్ర కోసం బాలీవుడ్ బ్యూటీ జాన్వీకపూర్‌ను చిత్ర యూనిట్ సంప్రదించారని భోగట్టా.

క్రైమ్ థ్రిల్లర్

వెంకట్ హీరోగా రాజ్ తాళ్లూరి దర్శకత్వం వహించనున్న చిత్రం షురూ అయింది. రవీందర్ రెడ్డి, శ్రీహరి, ఆదిత్య ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. మైత్రీ ఆర్ట్స్ పతాకంపై ప్రవీణ్ రెడ్డి, వాసుదేవరావ్ నిర్మిస్తున్న ఈ సినిమా పూజా కార్యక్రమాలతో ఆదివారం ప్రారంభమైంది. దర్శకుడు వేణు ఊడుగుల కెమెరా స్విచ్చాన్ చేయగా, 'సుచిరిండియా' (రియల్ ఎస్టేట్) కిరణ్ క్లాప్ ఇచ్చారు. మొదటి సన్నివేశానికి దర్శక–నిర్మాత వైవీఎస్ చౌదరి గౌరవ దర్శకత్వం వహించారు. రాజ్ తాళ్లూరి మాట్లాడుతూ–''క్రైమ్ థ్రిల్లర్ చిత్రమిది. ఈ నెల 10 నుంచి రెగ్యులర్ షూటింగ్‌ను ప్రారంభిస్తాం'' అన్నారు. ''రాజ్ స్క్రిప్ట్ బాగుంది. ఇది అందర్నీ మెప్పించే చిత్రం అవుతుందనే నమ్మకం ఉంది'' అన్నారు ప్రవీణ్ రెడ్డి. ఈ మూవీ ప్రారంభోత్సవంలో నటుడు అలీ, నిర్మాత రామ్ తాళ్లూరి, నటుడు శివబాలాజీ తదితరులు పాల్గొన్నారు.



● వెంకట్, రవీందర్

లవ్ అండ్ యాక్షన్

శేఖర్ అయాన్ వర్మ, వైభవి రావ్ జంటగా ఓ. సాయి దర్శకత్వం వహించిన లవ్ అండ్ యాక్షన్ ఫిల్మ్ 'కళ్యాణమస్తు'. బోయపాటి రఘుబాబు నిర్మించిన ఈ సినిమా ఈ నెల 12న విడుదల కానుంది. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఈ సినిమా ట్రైలర్‌ని నటుడు శివ బాలాజీ విడుదల చేసి, మాట్లాడుతూ– ''కళ్యాణమస్తు' ట్రైలర్ బాగుంది. అందరూ బాగా నటించారనిపిస్తోంది. అలాగే సాంకేతిక నిపుణుల ప్రతిభ ఏంటో తెలుస్తోంది'' అన్నారు. ''ప్రేక్షకులు కోరుకునే ప్రతి ఎమోషన్ ఈ సినిమాలో ఉంది'' అన్నారు శేఖర్ వర్మ. ''కళ్యాణమస్తు' మూవీ ఆడియన్స్‌ను మెప్పిస్తుంది'' అన్నారు ఓ.సాయి. ఈ కార్యక్రమంలో హీరోయిన్ వైభవీరావ్, నటుడు కాశీ విశ్వనాథ్ పాల్గొన్నారు.



● శేఖర్, వైభవి



● అనుష్క

● నవీన్ పొలిశెట్టి

నా కూతురు పెళ్లి చేసుకోదు!

'పుడ్డేం మ్యాజిక్ కాదు.. ఇట్స్ ఎ సైన్స్' అంటూ 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి' సినిమా టీజర్ విడుదలైంది. అనుష్కాశెట్టి, నవీన్ పొలిశెట్టి ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'మిస్‌శెట్టి మిస్టర్ పొలిశెట్టి'. పి.మహేశ్‌బాబు దర్శకత్వంలో యూవీ క్రియేషన్స్ పతాకంపై వంశీ, ప్రమోద్, విక్రమ్ నిర్మించారు. ఈ చిత్రంలో చెఫ్ అన్విత రవళిశెట్టి పాత్రలో అనుష్క, స్టాండప్ కమెడియన్ సిద్ధు పాత్రలో నవీన్ పొలిశెట్టి నటించారు. 'నా కూతురు ఏమన్నా సామాన్యురాలనుకుంటున్నావా.. ఎప్పటికీ పెళ్లి చేసు కోదు.. పోయి ఇంకెవర్నైనా చూసుకోరా...'(జయసుధ), 'హాయ్.. ఐ యామ్ సిద్ధు. ఫుల్లీ ప్రొఫెషనల్ స్టాండప్ కమెడియన్. ఐ కెన్ డు క్రిప్టోకరెన్సీ జోక్స్.. ఆల్దో ఐ హావ్ నో కరెన్సీ..'(నవీన్ పొలిశెట్టి), 'నీ టైమింగ్ ఎప్పుడూ ఇంతేనా..'(అనుష్కా శెట్టి), 'కామెడీ టైమింగ్ మాత్రం పర్ఫెక్ట్‌గా ఉంటుంది మేడమ్' (నవీన్ పొలిశెట్టి)... వంటి డైలాగులు టీజర్‌లో ఉన్నాయి. ఈ మూవీకి సంగీతం: రధన్.

రామబాణం మంచి సినిమా

– గోపీచంద్



● వివేక్ కూచిభొట్ల, గోపీచంద్, డింపుల్ హయతి, శ్రీవాస్

''రామబాణం'లాంటి మంచి కథ ఇచ్చిన భూపతి రాజాగారికి థ్యాంక్స్. మంచి కమర్షియల్ ఫార్మాట్‌లో అద్భుతమైన ఎమోషన్స్‌తో ఈ కథ ఉంటుంది.. దాన్ని అంతే బాగా తీశాడు శ్రీవాస్. మా గత చిత్రాలు 'లక్ష్యం, లౌక్యం' లాగా 'రామబాణం' లోనూ మంచి వినోదం, ఫ్యామిలీ ఎమోషన్స్ ఉంటాయి'' అని హీరో గోపీచంద్ అన్నారు. శ్రీవాస్ దర్శకత్వంలో గోపీచంద్, డింపుల్ హయతి జంటగా నటించిన చిత్రం 'రామబాణం'. పీపుల్స్ మీడియా ఫ్యాక్టరీపై టీజీ విశ్వప్రసాద్, వివేక్ కూచిభొట్ల నిర్మించిన ఈ సినిమా ఈ నెల 5న రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా ఆదివారం నిర్వహించిన ప్రీ రిలీజ్ వేడుకలో గోపీచంద్ మాట్లాడుతూ– ''విశ్వ ప్రసాద్, వివేక్‌గార్లు ఎంత మంచి నిర్మాతలంటే.. ఏది కావాలని అడిగినా.. 'ఇది ఎందుకు?' అని అడగరు.. అలాంటి మంచి మనసున్న వారికి మంచి జరగాలి. 'రామబాణం' చాలా మంచి సినిమా అవుతుంది. ఈ చిత్రం తర్వాత డింపుల్‌కి మంచి భవిష్యత్ ఉంటుంది. 'లక్ష్యం' తర్వాత జగపతి బాబుగారు, నేను మళ్లీ ఈ చిత్రంలో అన్నదమ్ముల్లా చేశాం.. ఆయనతో చేస్తుంటే యాక్టర్ అని కాకుండా సొంత బ్రదర్‌లా అనిపిస్తారు.. అందుకే మా ఇద్దరి మధ్య సన్నివేశాలు, ఎమోషన్స్ బాగా పండాయి. నాది, అలీగారి కాంబినేషన్ చాలా బాగుంటుంది. 5న వస్తున్న 'రామబాణం' మీ అందరికీ (ఫ్యాన్స్, ఆడియన్స్) నచ్చుతుంది'' అన్నారు.


డైరెక్టర్ శ్రీవాస్ మాట్లాడుతూ – ''రామబాణం' నిర్మాతలు విశ్వప్రసాద్, వివేక్‌గార్లు, నా లక్కీ హీరో గోపీచంద్‌గారు.. ఎలాంటి వివాదాలు లేకుండా పాజిటివ్‌గా ఉంటారు. అలా మా అందరి కాంబినేషన్‌లో సినిమా అనగానే ఓ పాజిటివ్ వైబ్రేషన్. హ్యాట్రిక్ కాంబినేషన్ అంటూ మా మనసులో ఓ ఆలోచన తిరుగుతూ ఉండేది.. అది మాకు మరింత నమ్మకాన్ని, సంకల్పాన్ని ఇచ్చింది. 'రామబాణం' ఫస్ట్‌కాపీ చూసిన తర్వాత నా అసిస్టెంట్ డైరెక్టర్స్.. 'టెక్నీషియన్స్ అని మరచిపోయి సినిమా చూశాం' అన్నారు.. అంటే సినిమాలో అంత లీనమయ్యారు.. ప్రేక్షకులు కూడా ఇదే అనుభూతికి లోనవుతారు. మా 'లక్ష్యం, లౌక్యం'లకు మించి 'రామబాణం' పెద్ద హిట్ కావాలి. ఈ సినిమా ఎట్టి పరిస్థితిల్లోనూ గోపీచంద్‌గారి అభిమానుల అంచనాలకు తగ్గదు'' అన్నారు.

సహ నిర్మాత వివేక్ కూచిభొట్ల మాట్లాడుతూ–''రామబాణం' లాంటి మంచి సినిమా తీశాం. ఈ చిత్రానికి మీరు(ప్రేక్షకులు) మంచి విజయాన్ని అందిస్తారని ఆశిస్తున్నాం'' అన్నారు. ''గోపీచంద్ 30 సినిమాలు చేస్తే దాదాపు 25 సినిమాల్లో తనతో కలిసి నేను నటించాను''అన్నారు **నటుడు అలీ.** ఈ వేడుకలో నిర్మాత కేకే రాధా మోహన్, డైరెక్టర్స్ మారుతి, సంపత్ నంది, కార్తీక్ దండు, హర్ష, రచయిత కోనా వెంకట్, నటులు సోనియా చౌదరి, కాశీ విశ్వనాథ్, సప్తగిరి, తరుణ్ అరోరా తదితరులు పాల్గొన్నారు.

విరూపాక్షని మించిన హిట్ తీయాలి

– 'దిల్' రాజు

''సాయిధరమ్‌తో నేను మూడు సినిమాలు తీశాను. తన కెరీర్‌లో 'విరూపాక్ష' హయ్యస్ట్ గ్రాసర్‌గా నిలిచింది. ఇది నాకు సవాల్‌లాంటిదే. తనతో నేను సినిమా చేస్తే 'విరూపాక్ష' కంటే ఇంకా పెద్ద సినిమాను, దాన్ని మించి హిట్ కొట్టే మూవీ తీయాలి'' అని నిర్మాత 'దిల్' రాజు అన్నారు. సాయిధరమ్ తేజ్, సంయుక్తా మీనన్ జంటగా కార్తీక్ దండు దర్శకత్వంలో తెరకెక్కిన చిత్రం 'విరూపాక్ష'. బాపినీడు బి.సమర్పణలో శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర, సుకుమార్ రైటింగ్స్ బ్యానర్స్‌పై బీవీఎస్ఎన్ ప్రసాద్ నిర్మించిన ఈ సినిమా ఏప్రిల్ 21న విడుదలై, హిట్‌గా నిలిచింది. ఈ సందర్భంగా నిర్వహించిన థ్యాంక్స్ మీట్‌లో సాయిధరమ్ తేజ్ మాట్లాడుతూ– ''విరూపాక్ష'ని హిట్ చేసిన ప్రేక్షకులకు థ్యాంక్స్. ఆ మాట చెప్పడంలో ఆనందం ఉంది. మా సినిమాని ఈ నెల 5న హిందీ, తమిళ్, మలయాళ భాషల్లో రిలీజ్ చేస్తున్నాం. అలాగే మే 12న కన్నడలో విడుదల చేస్తున్నాం'' అన్నారు. ''మా బ్యానర్‌కి 'విరూపాక్ష' లాంటి పెద్ద సక్సెస్ ఇచ్చిన మా టీమ్‌కి, ప్రేక్షకులకు థ్యాంక్స్'' అన్నారు బీవీఎస్ఎన్ ప్రసాద్, బాపినీడు.బి. ''విరూపాక్ష' ని మళ్లీ మళ్లీ చూసి మమ్మల్ని ప్రోత్సహిస్తున్న ప్రేక్షకులకు కృతజ్ఞతలు'' అన్నారు కార్తీక్ దండు. ''విరూపాక్ష' ఇతర భాషల్లోనూ అద్భుతాలు సృష్టిస్తుందని భావిస్తున్నాం'' అని సంయుక్తా మీనన్ అన్నారు. ఈ కార్యక్రమంలో సినిమాటోగ్రాఫర్ శ్యామ్ దత్, చిత్ర నటీనటులు, సాంకేతిక నిపుణులు, 'విరూపాక్ష' మూవీ పంపిణీదారులు పాల్గొన్నారు.



● బీవీఎస్ఎన్ ప్రసాద్, 'దిల్'రాజు, సాయిధరమ్ తేజ్, కార్తీక్, సంయుక్త, బాపినీడు

వారికి సమాధానమే నరకాసుర

– రక్షిత్ అట్లూరి

''ఒక టీజర్ ఇంపాక్ట్ ఏంటో 'పలాస' సినిమా టైమ్‌లో చూశాను. ఆ మూవీ తర్వాత నాకు గ్యాప్ రావడంతో అందరూ హేళనగా మాట్లాడారు.. అలాంటి వారికి సమాధానమే 'నరకాసుర'' అని హీరో రక్షిత్ అట్లూరి అన్నారు. సెబాస్టియన్ దర్శకత్వంలో రక్షిత్ అట్లూరి హీరోగా, అపర్ణ జనార్థన్, సంకీర్తన విపిన్ హీరోయిన్లుగా తెరకెక్కిన చిత్రం 'నరకాసుర'. సుముఖ క్రియేషన్స్, ఐడియల్ ఫిల్మ్ మేకర్స్‌పై అజ్జా శ్రీనివాస్ నిర్మించిన ఈ సినిమా టీజర్‌ని విడుదల చేశారు. ముఖ్య అతిథిగా హాజరైన దర్శక–నిర్మాత వైవీఎస్ చౌదరి మాట్లాడుతూ– ''రక్షిత్‌ని కలిసినప్పుడు యంగ్ డేస్‌లో జగపతి బాబు ఎలా ఉన్నాడో అలాగే ఉన్నాడనిపించింది. 'నరకాసుర' అతన్ని మంచి స్థాయికి తీసుకువెళుతుంది'' అన్నారు. ''నరకాసుర' టీజర్ చూస్తే 'కాంతారా' రేంజ్‌లో ఉందనిస్తోంది'' అన్నారు కెమెరామేన్ సెంథిల్ కుమార్. ''తెలుగుతో పాటు హిందీ, తమిళ్, మళయాల, కన్నడ భాషల్లో మా చిత్రాన్ని త్వరలోనే విడుదల చేయనున్నాం'' అన్నారు అజ్జా శ్రీనివాస్. ''ఈ చిత్రంతో కచ్చితంగా సక్సెస్ అందుకుంటాం'' అన్నారు సెబాస్టియన్. ఈ కార్యక్రమంలో నిర్మాత దామోదర ప్రసాద్, అపర్ణ జనార్థన్, సంకీర్తన విపిన్ తదితరులు పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరా: నాని చమిడిశెట్టి, సంగీతం: ఏఐఎస్ నాఫాల్ రాజా.



● సంకీర్తన విపిన్, రక్షిత్, అపర్ణ జనార్థన్



సెర్జియో పెరెజ్‌కు టైటిల్

ఫార్ములావన్ సీజన్‌లో భాగంగా ఆదివారం జరిగిన అజర్‌బైజాన్ గ్రాండ్‌ప్రిలో రెడ్‌బుల్ జట్టు డ్రైవర్ సెర్జియో పెరెజ్ విజేతగా నిలిచాడు. నిర్ణీత 51 ల్యాప్‌లను పెరెజ్ అందరికంటే వేగంగా ఒక గంటా 32 నిమిషాల 42.436 సెకన్లలో పూర్తి చేసి అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. రెడ్‌బుల్‌కే చెందిన వెర్‌స్టాపెన్‌కు రెండో స్థానం, చార్లెస్ లెక్‌లెర్క్ (ఫెరారీ)కు మూడో స్థానం లభించాయి. ఈ సీజన్‌లో నాలుగు రేసులు జరగ్గా... పెరెజ్‌కిది రెండో విజయం. మిగతా రెండు రేసుల్లో వెర్‌స్టాపెన్ విజేతగా నిలిచాడు. ఐదో రేసు మయామి గ్రాండ్‌ప్రి ఈనెల 7న జరుగుతుంది.

మేరాజ్-గనీమత్ జోడీకి స్వర్ణం



షాట్‌గన్ షూటింగ్ ప్రపంచకప్ టోర్నీ స్కీట్ ఈవెంట్ మిక్స్‌డ్ టీమ్ విభాగంలో మేరాజ్ అహ్మద్ ఖాన్-గనీమత్ సెఖో (భారత్) జోడీ విజేతగా నిలిచింది. కైరోలో జరిగిన ఫైనల్లో మేరాజ్-గనీమత్ ద్వయం 6-0తో లూయిస్ రౌల్-గాబ్రియేలా రోడ్రిగ్వెజ్ (మెక్సికో) జంటను ఓడించి పసిడి పతకాన్ని సొంతం చేసుకుంది.

పంజాబ్ బల్లే బల్లే...

- ఆఖరి బంతికి చెన్నైపై గెలుపు
- రాణించిన ప్రభ్‌సిమ్రన్, లివింగ్‌స్టోన్
- కాన్వే పోరాటం వృథా


సికందర్ రజా సంబరం

చెన్నై: సొంత మైదానంలో చెన్నై సూపర్ కింగ్స్ (సీఎస్‌కే) చేసిన స్కోరు 200. లక్ష్యం అంత పెద్దగా ఉంటే ఛేదించే బ్యాటర్స్‌కు ఆద్యంతం ఒత్తిడే ఉంటుంది. భారీ షాట్లు, మెరుపు ఫిఫ్టీలు ఉండాల్సిందే. కానీ పంజాబ్ కింగ్స్ మాత్రం ఒక్క అర్ధశతకం, ఏ ఒక్కరి విధ్వంసం లేకపోయినా... సమష్టి వీరవిహారంతో కొండంత లక్ష్యాన్ని కరిగించి నాలుగుసార్లు చాంపియన్ చెన్నైకు చెక్ పెట్టింది. ఆదివారం జరిగిన ఈ మ్యాచ్‌లో పంజాబ్ నాలుగు వికెట్ల తేడాతో నెగ్గి తమ ఖాతాలో ఐదో విజయం నమోదు చేసుకుంది. మొదట చెన్నై 20 ఓవర్లలో 4 వికెట్లకు 200 పరుగులు చేసింది. 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' కాన్వే (52 బంతుల్లో 92 నాటౌట్; 16 ఫోర్లు, 1 సిక్స్), రుతురాజ్ (31 బంతుల్లో 37; 4 ఫోర్లు, 1 సిక్స్)తో ఓపెనింగ్ వికెట్‌కు 86 పరుగులు జోడించాడు. తర్వాత శివమ్ దూబే (17 బంతుల్లో 28; 1 ఫోర్, 2 సిక్స్‌లు)తో రెండో వికెట్‌కు 44 పరుగులు జతచేశాడు. అనంతరం క్రీజులో వచ్చిన వారు తక్కువే చేసినా తన జోరుతో కాన్వే భారీస్కోరుకు బాటవేశాడు.

కలిసిమెలిసి ధాటిగా ఆడి...

తర్వాత లక్ష్యానికి తగ్గ దీటైన పోరాటం చేసిన పంజాబ్ 20 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 201 పరుగులు చేసి గెలిచింది. ఇంత పెద్ద లక్ష్యఛేదనలో క్రీజులోకి దిగిన వారంతా భాగస్వాములయ్యారు. ఓపెనర్లు ప్రభ్‌సిమ్రన్ (24 బంతుల్లో 42; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), శిఖర్ ధావన్ (15 బంతుల్లో 15; 4 ఫోర్లు, 1 సిక్స్), లివింగ్‌స్టోన్ (24 బంతుల్లో 40; 1 ఫోర్, 4 సిక్సర్లు), స్యామ్ కరన్ (20 బంతుల్లో 29; 1 ఫోర్, 1 సిక్స్), జితేశ్ శర్మ (10 బంతుల్లో 21; 2 ఫోర్లు, 1 సిక్స్), సికందర్ రజా (7 బంతుల్లో 13 నాటౌట్; 1 ఫోర్) మెరుపులు జత చేయడంతో పంజాబ్ కింగ్స్ గెలిచింది.

ఆఖరి బంతిపై అందరి దృష్టి

ధాటిగా ఆడుతున్న జితేశ్ 19వ ఓవర్లో భారీషాట్ ఆడి పెవిలియన్ చేరాడు. ఇక 8 బంతుల్లో పంజాబ్ విజయానికి 15 పరుగులు కావాలి. సికందర్ రజా బౌండరీ, వైడ్, ఓ పరుగుతో 6 పరుగులొచ్చాయి. సమీకరణం 6 బంతుల్లో 9 పరుగులు. పతిరణ వేసిన ఈ ఓవర్లో తొలి మూడు బంతులకు 2 పరుగులే వచ్చాయి. ఉన్నపళంగా ఉత్కంఠ తారస్థాయికి చేరింది. రజా 4, 5 బంతులకు రెండేసి పరుగుల చొప్పున తీశాడు. ఇక ఆఖరి బంతికి 3 పరుగుల్ని కట్టడి చేసేందుకు ధోని తలమునకలై ఉన్నాడు. కొంత సమయం తర్వాత పడిన ఈ బంతిని రజా స్క్వేర్ లెగ్ దిశగా బాదగా, జడేజా బౌండరీనైతే ఆపాడు. కానీ ఈ లోపే రజా, షారుఖ్‌లు 3 పరుగులు పూర్తి చేయడంతో పంజాబ్ శిబిరం సంబరాలు చేసుకుంది.

ఐపీఎల్ పాయింట్ల పట్టిక

జట్టు	ఆ	గె	ఓ	పా	నె.ర.
గుజరాత్	8	6	2	12	0.638
లక్నో	8	5	3	10	0.841
రాజస్తాన్	9	5	4	10	0.800
చెన్నై	9	5	4	10	0.329
పంజాబ్	9	5	4	10	-0.447
బెంగళూరు	8	4	4	8	-0.139
ముంబై	8	4	4	8	-0.502
కోల్‌కతా	9	3	6	6	-0.147
హైదరాబాద్	8	3	5	6	-0.577
ఢిల్లీ	8	2	6	4	-0.898

నోట్: ఆ-ఆడినవి, గె-గెలిచినవి, ఓ-ఓడినవి, పా-పాయింట్లు, నె.ర.-నెట్ రన్‌రేట్

ఐపీఎల్‌లో నేడు

లక్నో x బెంగళూరు (రాత్రి గం. 7:30 నుంచి)
స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం

స్కోరు వివరాలు

చెన్నై సూపర్ కింగ్స్ ఇన్నింగ్స్: రుతురాజ్ (స్టంప్డ్) జితేశ్ (బి) రజా 37; కాన్వే (నాటౌట్) 92; దూబే (సి)షారుఖ్ (బి) అర్ష్‌దీప్ 28; అలీ (స్టంప్డ్) జితేశ్ (బి) చహర్ 10; జడేజా (సి) లివింగ్‌స్టోన్ (బి) కరన్ 12; ధోని (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 8; **మొత్తం (20 ఓవర్లలో 4 వికెట్లకు) 200. వికెట్ల పతనం:** 1-86, 2-130, 3-158, 4-185. **బౌలింగ్:** అర్ష్‌దీప్ 4-0-37-1, రబడ 4-0-34-0, స్యామ్ కరన్ 4-0-46-1, చహర్ 4-0-35-1, సికందర్ రజా 3-0- 31-1, లివింగ్‌స్టోన్ 1-0-16-0.

పంజాబ్ కింగ్స్ ఇన్నింగ్స్: ప్రభ్‌సిమ్రన్ (స్టంప్డ్) ధోని (బి) జడేజా 42; ధావన్ (సి) పతిరణ (బి) తుషార్ 28; అథర్వ (సి అండ్ బి) జడేజా 13; లివింగ్‌స్టోన్ (సి) రుతురాజ్ (బి) తుషార్ 40; కరన్ (బి) పతిరణ 29; జితేశ్ (సి) సబ్-రషీద్ (బి) తుషార్ 21; షారుఖ్ (నాటౌట్) 2; రజా (నాటౌట్) 13; ఎక్స్‌ట్రాలు 13; **మొత్తం (20 ఓవర్లలో 6 వికెట్లకు) 201. వికెట్ల పతనం** : 1-50, 2-81, 3-94, 4-151, 5- 170, 6-186. **బౌలింగ్:** ఆకాశ్ 3-0-35-0, తుషార్ 4-0-49-3, తీక్షణ 4-0-36-0, జడేజా 4-0-32-2, అలీ 1-0-10-0, పతిరణ 4-0-32-1.

విజేత సుమిత్ నగాల్



రోమ్: రోమా గార్డెన్ ఓపెన్ ఏటీపీ చాలెంజర్ టెన్నిస్ టోర్నీలో భారత అగ్రశ్రేణి క్రీడాకారుడు సుమిత్ నగాల్ చాంపియన్‌గా అవతరించాడు. పురుషుల సింగిల్స్ ఫైనల్లో ప్రపంచ 347వ ర్యాంకర్ సుమిత్ 6-3, 6-2తో ప్రపంచ 234వ ర్యాంకర్ జాస్పర్ డి జాంగ్ (నెదర్లాండ్స్)పై గెలిచాడు. ఈ విజయంతో 25 ఏళ్ల సుమిత్ యూరోప్‌లో క్లే కోర్టులపై ఏటీపీ చాలెంజర్ సింగిల్స్ టైటిల్ నెగ్గిన తొలి భారతీయ క్రీడాకారుడిగా గుర్తింపు పొందాడు. సుమిత్ కెరీర్‌లో ఇది మూడో ఏటీపీ చాలెంజర్ టోర్నీ. గతంలో అతను బెంగళూరు ఓపెన్ (2017లో), బ్యూనస్ ఎయిర్స్ ఓపెన్ (2019లో) టైటిల్స్ సాధించాడు.

చెస్ 'కింగ్' డింగ్ లిరెన్



అస్తానా (కజకిస్తాన్): పురుషుల చెస్‌లో చైనా నుంచి తొలి ప్రపంచ చాంపియన్ అవతరించాడు. ఆదివారం ముగిసిన ప్రపంచ చెస్ చాంపియన్‌షిప్ మ్యాచ్‌లో 30 ఏళ్ల చైనా గ్రాండ్‌మాస్టర్ డింగ్ లిరెన్ ర్యాపిడ్ 'టైబ్రేక్'లో 2.5-1.5తో రష్యా గ్రాండ్ మాస్టర్ ఇయాన్ నెపోమ్‌నిషిపై గెలిచాడు. నిర్ణీత 14 గేమ్‌ల తర్వాత ఇద్దరూ 7-7తో సమంగా నిలువడంతో విజేతను నిర్ణయించడానికి ర్యాపిడ్ ఫార్మాట్‌లో నాలుగు గేమ్‌లను నిర్వహించారు. తొలి మూడు గేమ్‌లు 'డ్రా' కాగా, నాలుగో గేమ్‌లో డింగ్ లిరెన్ 68 ఎత్తుల్లో నిపోమ్‌నిషిని ఓడించాడు.

సాత్విక్-చిరాగ్ జోడీ కొత్త చరిత్ర

- ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పురుషుల డబుల్స్‌లో స్వర్ణం నెగ్గిన భారత జోడీగా రికార్డు
- 58 ఏళ్ల తర్వాత ఈ మెగా ఈవెంట్‌లో భారత్‌కు పసిడి పతకం


స్వర్ణ పతకాలతో సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి

దుబాయ్: సుదీర్ఘ నిరీక్షణ ముగిసింది. ఎట్టకేలకు ఆసియా బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత్ ఖాతాలో రెండో స్వర్ణ పతకం చేరింది. 1965లో పురుషుల సింగిల్స్‌లో దినేశ్ ఖన్నా విజేతగా నిలిచి భారత్‌కు తొలిసారి పసిడి పతకం అందించాడు. 58 ఏళ్ల తర్వాత మళ్లీ సాత్విక్ సాయిరాజ్-చిరాగ్ శెట్టి జోడీ భారత్ పసిడి లోటు తీర్చింది. ఆదివారం జరిగిన పురుషుల డబుల్స్ ఫైనల్లో ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సాత్విక్ సాయిరాజ్, మహారాష్ట్రకు చెందిన చిరాగ్ శెట్టి అద్భుత ఆటతీరుతో అదరగొట్టారు. 67 నిమిషాలపాటు జరిగిన హోరాహోరీ ఫైనల్లో ప్రపంచ ఆరో ర్యాంక్ సాత్విక్-చిరాగ్ ద్వయం 16-21, 21-17, 21-19తో ప్రపంచ ఎనిమిదో ర్యాంక్ ఒంగ్ యె సిన్-తియో ఈ యి (చైనీస్ తైపీ) జోడీని ఓడించి చాంపియన్‌గా అవతరించింది. తద్వారా ఈ మెగా ఈవెంట్ చరిత్రలో పురుషుల డబుల్స్ విభాగంలో స్వర్ణ పతకం నెగ్గిన తొలి భారతీయ జోడీగా చరిత్ర సృష్టించింది. 1971లో దీపూ ఘోష్-రమణ్ ఘోష్ ద్వయం భారత్‌కు కాంస్య పతకం అందించింది.

> తొలిసారి ఆసియా చాంపియన్‌షిప్‌లో విజేతగా నిలిచినందుకు చాలా ఆనందంగా ఉంది. భవిష్యత్‌లో మరిన్ని టైటిల్స్ సాధిస్తాం. ముున్ముందు మరింత శ్రమించి దేశానికి పేరు ప్రతిష్టలు తెస్తాం. మేమిద్దరం ఈ పతకం కోసం ఎంతో కష్టపడ్డాం. ఎట్టకేలకు మేము ఈ టైటిల్ సాధించాం. మేమీ స్థాయికి చేరుకోవడానికి కృషి చేసిన వారందరికీ ధన్యవాదాలు.
> –సాత్విక్ సాయిరాజ్, చిరాగ్ శెట్టి

'థౌజండ్'వాలాలో ముంబై మిలమిల

- మెరిపించిన సూర్య, గ్రీన్, టిమ్ డేవిడ్
- యశస్వి విధ్వంసం వృథా
- 6 వికెట్లతో రాజస్తాన్‌పై ముంబై గెలుపు

ముంబై: ఐపీఎల్ 'థౌజండ్' వాలా (1000వ మ్యాచ్)లో యశస్వి జైస్వాల్ విధ్వంసాన్ని ముంబై మెరుపులు ముంచెత్తాయి. దీంతో ముంబై 6 వికెట్ల తేడాతో రాజస్తాన్‌పై గెలిచింది. తొలుత రాజస్తాన్ రాయల్స్ 20 ఓవర్లలో 7 వికెట్ల నష్టానికి 212 పరుగుల భారీస్కోరు చేసింది. యశస్వి జైస్వాల్ (62 బంతుల్లో 124; 16 ఫోర్లు, 8 సిక్సర్లు) శతక్కొట్టాడు. తర్వాత కష్టమైన లక్ష్యాన్ని ముంబై ఇండియన్స్ 3 బంతులు మిగిలుండగానే 19.3 ఓవర్లలో 4 వికెట్లు కోల్పోయి 214 పరుగులు చేసి ఛేదించింది. గ్రీన్ (26 బంతుల్లో 44; 4 ఫోర్లు, 2 సిక్స్‌లు), సూర్యకుమార్ (29 బంతుల్లో 55; 8 ఫోర్లు, 2 సిక్స్‌లు), డేవిడ్ (14 బంతుల్లో 45 నాటౌట్; 2 ఫోర్లు, 5 సిక్స్‌లు) కీలకపాత్ర పోషించారు. చివరి ఓవర్లో ముంబై విజయానికి 17 పరుగులు అవసరం కాగా ... హోల్డర్ వేసిన ఈ ఓవర్లో తొలి మూడు బంతులను టిమ్ డేవిడ్ సిక్సర్లుగా మలిచి గెలిపించాడు.


టిమ్ డేవిడ్


యశస్వి

స్కోరు వివరాలు

రాజస్తాన్ రాయల్స్ ఇన్నింగ్స్: యశస్వి (సి అండ్ బి) అర్షద్ 124; బట్లర్ (సి) సబ్-రమణ్‌దీప్ (బి) చావ్లా 18; సామ్సన్ (సి) తిలక్ (బి) అర్షద్ 14; పడిక్కల్ (బి) చావ్లా 2; హోల్డర్ (సి) డేవిడ్ (బి) ఆర్చర్ 11; హెట్‌మైర్ (సి) సూర్య (బి) అర్షద్ 8; ధ్రువ్ (సి) తిలక్ (బి) మెరిడిత్ 2; అశ్విన్ (నాటౌట్) 8; బౌల్ట్ (నాటౌట్) 0; ఎక్స్‌ట్రాలు 25; **మొత్తం (20 ఓవర్లలో 7 వికెట్లకు) 212. వికెట్ల పతనం:** 1-72, 2-95, 3-103, 4-143, 5-159, 6-168, 7-205. **బౌలింగ్:** గ్రీన్ 3-0-31-0, ఆర్చర్ 4-0-35-1, మెరిడిత్ 4-0-51-1, చావ్లా 4-0-34-2, కార్తికేయ 2-0-14-0, అర్షద్ 3-0-39-3. **ముంబై ఇండియన్స్ ఇన్నింగ్స్:** రోహిత్ (బి) సందీప్ 3; ఇషాన్ (సి) బౌల్ట్ (బి) అశ్విన్ 28; గ్రీన్ (సి) బౌల్ట్ (బి) అశ్విన్ 44; సూర్య (సి) సందీప్ (బి) బౌల్ట్ 55; తిలక్ వర్మ (నాటౌట్) 29; డేవిడ్ (నాటౌట్) 45; ఎక్స్‌ట్రాలు 10; **మొత్తం (19.3 ఓవర్లలో 4 వికెట్లకు) 214. వికెట్ల పతనం:** 1-14, 2-76, 3-101, 4-152. **బౌలింగ్:** బౌల్ట్ 4-0-43-1, సందీప్ 4-0-35-1, అశ్విన్ 4-0-27-2, చహల్ 3-0-32-0, హోల్డర్ 3.3-0-55-0, కుల్దీప్ సేన్ 1-0-20-0.

విద్య, ఉద్యోగ సమాచారం

టీఎస్ డీఈఈసెట్-2023

తెలంగాణ స్టేట్ డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్.. 2023-25 విద్యా సంవత్సరానికి సంబంధించి రెండేళ్ల డీఈఎల్ఈడీ, డీపీఎస్ఈ కోర్సుల్లో ప్రవేశాలకు డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్ కామన్ ఎంట్రన్స్ టెస్ట్(డీఈఈసెట్)-2023 నోటిఫికేషన్‌ను విడుదల చేసింది. డీఈఈసెట్ ర్యాంకు ద్వారా తెలంగాణ రాష్ట్రంలోని ప్రభుత్వ డైట్‌లు/ప్రైవేట్ అన్ ఎయిడెడ్ ఎలిమెంటరీ టీచర్ ఎడ్యుకేషన్ ఇన్‌స్టిట్యూషన్స్ (మైనారిటీ, నాన్ మైనారిటీతో సహా)లో ప్రవేశాలు కల్పిస్తారు.

కోర్సులు

- » డీఈఎల్ఈడీ(డిప్లొమా ఇన్ ఎలిమెంటరీ ఎడ్యుకేషన్); డీపీఎస్ఈ(డిప్లొమా ఇన్ ప్రీ-స్కూల్ ఎడ్యుకేషన్).
- » **అర్హత:** కనీసం 50 శాతం మార్కులతో ఇంటర్మీడియట్ లేదా దానికి సమానమైన పరీక్షలో ఉత్తీర్ణులై ఉండాలి.
- » **వయసు:** కనిష్ఠంగా సెప్టెంబర్ 1నాటికి 17 ఏళ్లు నిండి ఉండాలి. గరిష్ఠ వయోపరిమితి లేదు.
- » **ఎంపిక విధానం:** డీఈఈ సెట్‌లో సాధించిన ర్యాంకు, రూల్ ఆఫ్ రిజర్వేషన్ ఆధారంగా సీటు కేటాయిస్తారు.
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**22.05.2023
- » **హాల్‌టిక్కెట్ల జారీ తేది:** 27.05.2023.
- » **ప్రవేశ పరీక్ష తేది:** 01.06.2023.
- » **వెబ్‌సైట్:** www.deecet.cdse.telangana.gov.in

ఎన్ఎఫ్‌డీసీ, ముంబైలో 35 ఉద్యోగాలు

ముంబైలోని నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్(ఎన్ఎఫ్‌డీసీ).. వివిధ పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 35
- » **పోస్టుల వివరాలు:** గార్డెనింగ్ సూపర్‌వైజర్, సీనియర్ కోఆర్డినేటర్, అసిస్టెంట్ మేనేజర్, గ్రాఫిక్ డిజైనర్, ఆఫీస్ అసిస్టెంట్, కంటెంట్ రైటర్ తదితరాలు.
- » **అర్హత:** పోస్టును అనుసరించి ఎస్ఎస్‌సీ/గ్రాడ్యుయేట్ డిగ్రీ/డిప్లొమా/సీఏ /ఐసీడబ్ల్యూఏ/డీఓపీ/పోస్టు గ్రాడ్యుయేషన్/బీకాం/బీఎస్సీ/ఎంఎస్సీ/ఎంఏ/ఎంబీఏ ఉత్తీర్ణులవ్వాలి. 1 నుంచి 5 ఏళ్ల పని అనుభవం ఉండాలి.
- » **వయసు:** 30 నుంచి 50 ఏళ్ల వయసు ఉండాలి
- » **వేతనం:** నెలకు రూ.20,000 నుంచి రూ.85,000 వరకు చెల్లిస్తారు.
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. దరఖాస్తును నేషనల్ ఫిల్మ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ లిమిటెడ్, ఐదో ఫ్లోర్, ఎన్ఎంఐసీ బిల్డింగ్, ఎన్ఎఫ్‌డీసీ-ఎఫ్‌డీ కాంప్లెక్స్, 24, పెడర్ రోడ్, కుంబల్లా హిల్, ముంబై-400026 చిరునామకు పంపించాలి.
- » **దరఖాస్తులకు చివరితేది:** 01.05.2023.
- » **వెబ్‌సైట్:** www.nfdcindia.com

తెలంగాణ జ్యుడిషియల్ సర్వీసులో డిస్ట్రిక్ట్ జడ్జి (ఎంట్రీ లెవల్) పోస్టులు

హైదరాబాద్‌లోని తెలంగాణ స్టేట్ హైకోర్టు.. తెలంగాణ స్టేట్ జ్యుడిషియల్ సర్వీసులో డిస్ట్రిక్ట్ జడ్జి(ఎంట్రీ లెవల్) ఉద్యోగాల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 11
- » **అర్హత:** హైకోర్టు లేదా హైకోర్టు పరిధిలోని న్యాయస్థానాల్లో అడ్వకేట్‌గా కనీసం ఏడేళ్ల పని అనుభవంతోపాటు ఇతర విద్యార్హతలు కలిగి ఉండాలి.
- » **వయసు:** 35 నుంచి 48 ఏళ్ల మధ్య ఉండాలి.
- » **వేతనం:** నెలకు రూ.1,44,840 నుంచి రూ.1,94,660 చెల్లిస్తారు.
- » **ఎంపిక విధానం:** స్క్రీనింగ్ టెస్ట్, రాతపరీక్ష, వైవా-వాయిస్ టెస్ట్ ఆధారంగా ఎంపికచేస్తారు
- » **దరఖాస్తు విధానం:** ఆఫ్‌లైన్ ద్వారా.
- » **ఆఫ్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**01.05.2023
- » **ఎంపిక పరీక్ష తేదీలు:**24.06.2023, 25.06.2023
- » **వెబ్‌సైట్:** www.tshc.gov.in

ఆర్‌బీఐ, ముంబైలో 291 ఆఫీసర్ గ్రేడ్-బి పోస్టులు

ముంబైలోని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా(ఆర్‌బీఐ) సర్వీస్ బోర్డు.. దేశవ్యాప్తంగా ఉన్న ఆర్‌బీఐ శాఖల్లో గ్రేడ్-బి పోస్టుల భర్తీకి దరఖాస్తులు కోరుతోంది.

- » **మొత్తం పోస్టుల సంఖ్య:** 291
- » **పోస్టుల వివరాలు:** ఆఫీసర్ గ్రేడ్-బి(డీఆర్)-జనరల్-222, ఆఫీసర్ ఇన్ గ్రేడ్-బి(డీఆర్)-డీఈపీఆర్-38, ఆఫీసర్ ఇన్ గ్రేడ్-బి(డీఆర్)-డీఎస్ఐఎం-31.
- » **అర్హత:** సంబంధిత విభాగంలో డిగ్రీ, పీజీ ఉత్తీర్ణులై ఉండాలి.
- » **ఎంపిక విధానం:** ఆన్‌లైన్ పరీక్ష(ఫేజ్1, 2),ఇంటర్వ్యూ, డాక్యుమెంట్ వెరిఫికేషన్, మెడికల్ ఎగ్జామినేషన్ తదితరాల ఆధారంగా ఎంపికచేస్తారు.
- » **ఆన్‌లైన్ దరఖాస్తు ప్రారంభతేది:**09.05.2023
- » **ఆన్‌లైన్ దరఖాస్తులకు చివరితేది:**09.06.2023
- » **ఆఫీసర్ గ్రేడ్‌బి(డీఆర్) జనరల్-ఫేజ్1 ఆన్‌లైన్ పరీక్ష తేది:** 09.07.2023, **ఫేజ్2 ఆన్‌లైన్ పరీక్ష తేది:** 30.07.2023.
- » **ఆఫీసర్ గ్రేడ్-బి(డీఆర్) డీఈపీఆర్-ఫేజ్1 ఆన్‌లైన్ పరీక్షతేది:** 16.07.2023, **ఫేజ్2 -ఆన్‌లైన్ పరీక్ష తేది:** 02.09.2023.
- » **ఆఫీసర్ గ్రేడ్‌బి(డీఆర్)-డీఎస్ఐఎం-ఫేజ్1 ఆన్‌లైన్ పరీక్ష తేది:** 16.07.2023, **ఫేజ్2 -ఆన్‌లైన్ పరీక్షతేది:** 19.08.2023.
- » **వెబ్‌సైట్:** www.rbi.org.in

ఫార్మా రంగం.. కెరీర్ షైనింగ్

- » నైపర్-జేఈఈ-2023 ప్రక్రియ ప్రారంభం
- » నైపర్ క్యాంపస్‌లలో పీజీ, పీహెచ్‌డీ, ఐపీహెచ్‌డీ కోర్సులు
- » నైపర్ సర్టిఫికెట్లతో ఫార్మా రంగంలో ఉజ్వల కెరీర్

ఫార్మా రంగంలో ఉజ్వల కెరీర్ స్వాగతం పలుకుతోంది! అందుకు మార్గం.. నైపర్ -జేఈఈ! నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఫార్మాస్యుటికల్ ఎడ్యుకేషన్ అండ్ రీసెర్చ్(నైపర్) నిర్వహించే ఈ పరీక్షలో ర్యాంకుతో ప్రముఖ నైపర్ క్యాంపస్‌లలో అడుగు పెట్టొచ్చు! ఇవి అందించే పీజీ, పీహెచ్‌డీ, ఐపీహెచ్‌డీ కోర్సుల ద్వారా ఫార్మా రంగంలో అద్భుత అవకాశాలు అందుకోవచ్చు. తాజాగా నెపర్-జేఈఈ-2023 నోటిఫికేషన్ వెలువడింది. ఈ నేపథ్యంలో.. నైపర్ క్యాంపస్‌లు, అందించే కోర్సులు, ప్రవేశ పరీక్ష విధానం, ఎంట్రన్స్‌లో విజయానికి మార్గాలు తదితర వివరాలు..

దేశంలో ఫార్మా రంగంలో నిపుణులను తీర్చిదిద్దేందుకు కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో ఏర్పాటైన ఇన్‌స్టిట్యూట్.. నైపర్. దేశవ్యాప్తంగా ఏడు నైపర్ క్యాంపస్‌లు ఉన్నాయి. వీటిలో పీజీ, పీహెచ్‌డీ, ఐపీహెచ్‌డీ వంటి అకడమిక్ ప్రోగ్రామ్‌లతోపాటు నిరంతరం పరిశోధనలు జరుగుతున్నాయి. ఫార్మా విద్యను అందించడంలో పేరు గడించిన నైపర్ క్యాంపస్‌ల్లో ప్రవేశానికి నిర్వహించే పరీక్ష నైపర్-జేఈఈ.

అర్హతలు

బీఫార్మసీ/సంబంధిత కోర్సులు చదువుతూ గేట్, జీప్యాట్, నెట్ వంటి పరీక్షల్లో అర్హత పొందిన వారు ఈ ఎంట్రన్స్‌కు అర్హులుగా పేర్కొన్నారు. బీఫార్మసీ తత్సమాన కోర్సులో 6.75 సీజీపీఏ లేదా అంతకుసమానమైన పర్సంటేజీతో ఉత్తీర్ణత ఉండాలి. జీప్యాట్/గేట్/నెట్‌ల్లో అర్హత సాధించాలి. రిజర్వ్‌డ్ కేటగిరీ అభ్యర్థులు 50% మార్కులు లేదా 5.75 సీజీపీఏ సాధిస్తే సరిపోతుంది. ఈ ఏడాది చివరి సంవత్సరం చదువుతున్న విద్యార్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.

ఏడు క్యాంపస్‌లు

ప్రస్తుతం దేశ వ్యాప్తంగా ఏడు నైపర్ క్యాంపస్‌లు అకడమిక్ బోధన సాగిస్తున్నాయి. వీటిలో 15 పీజీ స్పెషలైజేషన్లలో 1158 సీట్లు అందుబాటులో ఉన్నాయి. అహ్మదాబాద్-ఎంఎస్ ఫార్మసీ-145 సీట్లు, ఎంబీఏ(ఫార్మసీ)-30 సీట్లు; గువహటి-ఎంఎస్ ఫార్మ సీ-108 సీట్లు, ఎంఫార్మసీ-38 సీట్లు, ఎంటెక్-29 సీట్లు; హాజీపూర్-ఎంఎస్ ఫార్మసీ-82, ఎంఫార్మసీ-18, ఎంటెక్(ఫార్మసీ)-10 సీట్లు; హైదరాబాద్-ఎంఎస్ ఫార్మసీ-109 సీట్లు, ఎంటెక్(ఫార్మసీ)-36 సీట్లు, ఎంబీఏ (ఫార్మా)-42 సీట్లు; కోల్‌కత-ఎంఎస్ ఫార్మసీ-89 సీట్లు,ఎంటెక్(ఫార్మా)-21 సీట్లు; రాయ్‌బరేలీ-ఎంఎస్ ఫార్మసీ-110 సీట్లు; మొహాలీ-ఎంఎస్ ఫార్మసీ-171, ఎంఫార్మసీ-25, ఎంటెక్(ఫార్మసీ)-48సీట్లు, ఎంబీఏ(ఫార్మా)-47 సీట్లు.

పీజీ స్పెషలైజేషన్లు

- ఎంఎస్-ఫార్మసీ: మెడిసినల్ కెమిస్ట్రీ, నేచురల్ ప్రొడక్ట్స్, ట్రెడిషనల్ మెడిసిన్, ఫార్మాస్యుటికల్ అనాలిసిస్, ఫార్మకాలజీ అండ్ టాక్సికాలజీ, రెగ్యులేటరీ టాక్సికాలజీ, ఫార్మాస్యుటిక్స్, బయోటెక్నాలజీ, ఫార్మకో ఇన్ఫర్మాటిక్స్, మెడికల్ డివైజెస్, రెగ్యులేటరీ అఫైర్స్.
- **ఎంఫార్మసీ:** ఫార్మాస్యుటికల్ టెక్నాలజీ(ఫార్ములేషన్స్), ఫార్మసీ ప్రాక్టీస్, క్లినికల్ రీసెర్చ్.
- **ఎంటెక్ ఫార్మసీ:**ఫార్మాస్యుటికల్ టెక్నాలజీ(ప్రాసెస్ కెమిస్ట్రీ); ఫార్మాస్యుటికల్ టెక్నాలజీ(బయో టెక్నాలజీ);ఎంబీఏ(ఫార్మాస్యుటికల్ మేనేజ్‌మెంట్).

ప్రవేశాలు ఇలా

- ఈ కోర్సుల్లో ప్రవేశానికి నైపర్-జేఈఈను నిర్వహిస్తారు.
- అభ్యర్థులు జీప్యాట్ లేదా గేట్ లేదా సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ స్కోర్‌లు సొంతం చేసుకుని ఉండాలి.
- 2023 సంవత్సరానికి ఈ స్కోర్స్ కోసం వేచి చూస్తున్న అభ్యర్థులు కూడా దరఖాస్తు చేసుకోవచ్చు.
- నైపర్-జేఈఈ తర్వాత దశలో సీట్ల కేటాయింపునకు ఆన్‌లైన్ కౌన్సెలింగ్ విధానాన్ని అమలు చేస్తారు. నైపర్-జేఈఈలో నిర్దేశిత కటాఫ్ మార్కులు పొందిన అభ్యర్థులకు ఉమ్మడి కౌన్సెలింగ్ నిర్వహిస్తారు.

200 ప్రశ్నలు-200 మార్కులు

- నైపర్ జేఈఈ పరీక్షను మొత్తం 200 ప్రశ్నలు-200 మార్కులకు నిర్వహిస్తారు. పూర్తిగా ఆన్‌లైన్ విధానంలో ఆబ్జెక్టివ్ తరహాలో పరీక్ష జరుగుతుంది.
- నైపర్-జేఈఈలో మెరుగైన ర్యాంకు సాధించాలంటే.. అభ్యర్థులు బీఫార్మసీ స్థాయిలోని అకడమిక్స్‌పై పట్టు సాధించాలి. కెమిస్ట్రీ, ఫార్మకాలజీ, బయోటెక్నాలజీ, ఫార్మాస్యుటికల్ అనాలిసిస్ విభాగాలపై ఎక్కువ దృష్టి పెట్టాలి. మొత్తం 200 ప్రశ్నల్లో 70 శాతం మేర ప్రశ్నలు ఈ విభాగాల నుంచే అడుగుతారు. కొన్ని ప్రశ్నలు జనరల్ ఆప్టిట్యూడ్‌కు సంబంధించినవి ఉంటున్నాయి. కోర్ సబ్జెక్ట్‌లకు సంబంధించి బీఫార్మసీలో పొందిన నైపుణ్యం, జీప్యాట్‌కు పొందిన సన్నద్ధతతో రాణించేందుకు వీలుంది.
- ఫార్మకాలజీలో రిసెప్టర్స్ వాటి రకాలు, మెకానిజమ్ ఆఫ్ యాక్షన్, ఔషధాల వర్గీకరణ, క్లినికల్ ట్రయల్స్‌పై అవగాహన, ప్రీ-క్లినికల్ ట్రయల్స్ అంశాలపై ప్రత్యేక దృష్టి సారించాలి. డ్రగ్ డిస్కవరీకి సంబంధించి ముఖ్యంగా వాటి ప్రాముఖ్యతలు, దాంతోపాటు రియాక్షన్స్‌పై అవగాహన ఏర్పరచుకోవాలి.

స్టయిఫండ్ సదుపాయం

నైపర్-జేఈఈ ప్రవేశ ప్రక్రియలో ప్రతిభ చూపి తుది విజేతలుగా నిలిచి.. ప్రవేశం ఖరారు చేసుకున్న అభ్యర్థులకు ఆర్థిక ప్రోత్సాహకాలను కూడా నైపర్ క్యాంపస్‌లు అందిస్తున్నాయి. ప్రతి విద్యార్థికి నెలకు రూ. 12,400 స్టయిఫండ్ లభిస్తుంది. ఈ స్టయిఫండ్ కొనసాగాలంటే.. ప్రతి సెమిస్టర్‌లోనూ తప్పనిసరిగా జీపీఏ ఆరు పాయింట్లు ట్రాక్ రికార్డ్‌ను కొనసాగించాలి.


నైపర్-జేఈఈ 2023

నైపర్-జేఈఈ 2023 సమాచారం

- దరఖాస్తు విధానం: ఆన్‌లైన్ ద్వారా.
- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: మే 16, 2023
- నైపర్ జేఈఈ ఆన్‌లైన్ టెస్ట్ తేదీ:జూన్ 23, 2023
- వెబ్‌సైట్: www.niperguwahati.ac.in

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లకు ఇలా

నైపర్ క్యాంపస్‌లు పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లు కూడా అందిస్తున్నాయి. వీటిలో ప్రవేశానికి ప్రత్యేకంగా ఎంట్రన్స్ టెస్ట్ నిర్వహిస్తారు. అభ్యర్థులు నెపర్-జేఈఈ ఆన్‌లైన్ దరఖాస్తును పూర్తి చేసేటప్పుడే పీహెచ్‌డీ ప్రోగ్రామ్ ఆప్షన్‌ను ఎంపిక చేసుకోవాలి.

అర్హతలు

అభ్యర్థులు తాము ఎంపిక చేసుకున్న విభాగాలకు సంబంధించి.. ఎంఎస్, ఎంఫార్మసీ, ఎంటెక్ కోర్సులను సదరు స్పెషలైజేషన్లతో 6.5 సీజీపీఏతో ఉత్తీర్ణత సాధించాలి. ఎస్సీ, ఎస్టీ కేటగిరీ అభ్యర్థులు 6.25 సీజీపీఏ లేదా 55 శాతం మార్కులతో ఉత్తీర్ణత సాధిస్తే సరిపోతుంది. జీప్యాట్/గేట్/సీఎస్ఐఆర్-యూజీసీ నెట్ ఉత్తీర్ణత ఉండాలి. ఎండీ, ఎంవీఎస్సీ, ఎండీఎస్, ఫార్మ్-డి ఉత్తీర్ణులకు జీప్యాట్ /నెట్/గేట్ నిబంధన నుంచి మినహాయింపు లభిస్తుంది.

పీహెచ్‌డీ ఎంట్రన్స్

పీహెచ్‌డీ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నిర్వహించే నైపర్-జేఈఈ 170 ప్రశ్నలకు ఆన్‌లైన్ విధానంలో ఉంటుంది. మొత్తం మార్కులు 85. కెమికల్ సైన్సెస్, బయలాజికల్ సైన్సెస్, ఫార్మాస్యుటికల్ సైన్సెస్ విభాగాల నుంచి ప్రశ్నలు అడుగుతారు. పరీక్ష వ్యవధి రెండు గంటలు.

మలిదశలో ఇంటర్వ్యూ

పీహెచ్‌డీ అభ్యర్థులు ఎంట్రన్స్‌లో పొందిన స్కోర్ ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఇంటర్వ్యూకు కేటాయించిన మార్కులు 15. ఇందులోనూ విజయం సాధిస్తే పీహెచ్‌డీ ప్రవేశం లభిస్తుంది.

ఆర్థిక ప్రోత్సాహకం

పీహెచ్‌డీలో ప్రవేశాలు ఖరారు చేసుకున్న విద్యార్థులకు మొదటి రెండేళ్లు నెలకు రూ.31వేలు చొప్పున; మూడు, నాలుగు సంవత్సరాలు నెలకు రూ.35 వేలు చొప్పున ఆర్థిక ప్రోత్సాహకం అందుతుంది. దీంతోపాటు హెచ్ఆర్ఏ కూడా లభిస్తుంది.

ముఖ్య సమాచారం

- ఆన్‌లైన్ దరఖాస్తు తేదీ: మే 16, 2023
- నైపర్ జేఈఈ ఆన్‌లైన్ టెస్ట్ తేదీ: జూన్ 23
- వెబ్‌సైట్: www.niperguwahati.ac.in

ఐపీహెచ్‌డీ

నైపర్ క్యాంపస్‌లలో ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సులు సైతం అందుబాటులో ఉన్నాయి. మొత్తం ఆరేళ్ల వ్యవధిలో ఉండే ఈ ప్రోగ్రామ్‌లకు ప్రత్యేకంగా ప్రవేశ పరీక్ష నిర్వహిస్తారు.

అర్హత

ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ స్పెషలైజేషన్ సబ్జెక్ట్‌ను అనుసరించి బీఫార్మసీ, ఎమ్మెస్సీ (ఆర్గానిక్ కెమిస్ట్రీ/అనలిటికల్ కెమిస్ట్రీ), బీవీఎస్సీ, ఎంబీబీఎస్, ఎమ్మెస్సీ (ఫార్మకాలజీ/టాక్సికాలజీ/లైఫ్ సైన్సెస్/బయె కెమిస్ట్రీ/మెడిసినల్ బయో కెమిస్ట్రీ/ జువాలజీ/బయలాజికల్ సైన్సెస్), బీటెక్(బయో ఇన్ఫర్మాటిక్స్), ఎమ్మెస్సీ (ఫార్మాస్యుటికల్ కెమిస్ట్రీ/ఫిజికల్ కెమిస్ట్రీ/మాలిక్యులర్ బయాలజీ/బయో ఇన్ఫర్మాటిక్స్/మైక్రో బయాలజీ), బీటెక్(కెమికల్ ఇంజనీరింగ్/ఫార్మాస్యుటికల్ ఇంజనీరింగ్) తదితర కోర్సుల్లో 6.75 సీజీపీఏతో ఉత్తీర్ణత ఉండాలి. దీంతోపాటు జీప్యాట్/గేట్/నెట్‌లో అర్హత సాధించాలి.

ప్రవేశం ఇలా

ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ కోర్సుల్లో ప్రవేశానికి నిర్వహించే నైపర్ జేఈఈ 200 ప్రశ్నలతో ఉంటుంది. ఈ పరీక్షలో పొందిన మార్కుల ఆధారంగా మెరిట్ జాబితా రూపొందించి, ఎంపికైన వారికి ఇంటర్వ్యూ నిర్వహిస్తారు. ఈ రెండింటిలోనూ పొందిన మార్కుల ఆధారంగా ఫైనల్ మెరిట్ లిస్ట్ రూపొందిస్తారు. వారికి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ ద్వారా సీట్ల కేటాయింపు చేస్తారు.

ముఖ్య తేదీలు

- ఆన్‌లైన్ దరఖాస్తు చివరి తేదీ: మే 16, 2023
- హాల్ టికెట్ డౌన్‌లోడ్ సదుపాయం: జూన్ 10
- ఇంటిగ్రేటెడ్ పీహెచ్‌డీ నైపర్ జేఈఈ పరీక్ష తేదీ: జూన్ 23
- వెబ్‌సైట్: www.nipertuwahati.ac.in

స్టాక్ మార్కెట్లు (శుక్రవారం ముగింపు)

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	463	61,112
నిఫ్టీ ▲	150	18,065

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు			
నాస్‌డాక్	12,227	▲	84
డోజోన్స్	34,098	▲	272
ఎఫ్‌టీఎస్ఈ 100	7,871	▲	39
డాక్స్	15,922	▲	122
షాంఘై	3,323	▲	37
నికాయ్	28,856	▲	399

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

హెల్త్ ప్లాన్.. ఇవి తెలిస్తే నో టెన్షన్?

- బ్లాక్ లిస్ట్ హాస్పిటల్స్ కూడా ఉంటాయ్
- వాటిల్లో చికిత్స పొందితే పరిహారం రాదు
- కొన్ని చికిత్సలకు 24 నెలల వెయిటింగ్
- ముందస్తు వ్యాధులకూ వేచి ఉండాల్సిందే
- లేదంటే అదనపు ప్రీమియం చెల్లించుకోవాలి
- మొదటి 30 రోజుల్లో ప్రమాదానికే పరిహారం

హెల్త్ ఇన్సూరెన్స్ పట్ల అవగాహన పెరుగుతోంది. ఒకవైపు జీవనశైలి వ్యాధులతో ఆస్పత్రుల్లో చేరాల్సిన అవసరాలు ఏర్పడుతున్నాయి. మరోవైపు మధ్యతరగతి వాసులకు ఆరోగ్యపరమైన సామాజిక రక్షణ ఏదీ ఉండడం లేదు. ఈ పరిస్థితుల్లో అనారోగ్యం పాలైతే ఆర్థికంగా గుల్ల కాకుండా ఉండాలంటే, హెల్త్ ఇన్సూరెన్స్ కవరేజీ ప్రతి ఒక్కరికీ కచ్చితంగా ఉండాల్సిందే. కరోనా ముందు నాటితో పోలిస్తే హెల్త్ ఇన్సూరెన్స్ ప్రాధాన్యాన్ని ఎక్కువ మంది నేడు అర్థం చేసుకుంటున్నారు. దీంతో దీన్ని కొనుగోలు చేసే వారి సంఖ్యలో స్పష్టమైన **వృద్ధి** కనిపిస్తోంది. అయితే ఎవరో చెప్పారనో, ఏదైనా ప్రకటన చూసో హెల్త్ ప్లాన్ తీసుకో**వడం కాదు.** ఎంపిక చేసుకునే ప్లాన్‌లో రక్షణ ఏ మేరకు? ఏ ఏ వ్యాధులకు కవరేజీ ఉంది? ఉప పరి**మితులు** ఉన్నాయా? పాలసీ తీసుకున్న వెంటనే క్లెయిమ్ చేసుకోవచ్చా? ఆస్పత్రిలో అన్ని రకాల **చికిత్స**లకు కవరేజీ లభిస్తుందా? ఇలాంటి ముఖ్యమైన అన్నింటి గురించి పాలసీదారులు **తెలుసుకుని** ఉండాల్సిందే. లేదంటే క్లెయిమ్ చేసుకోవాల్సి వచ్చినప్పుడు చికిత్సకు అయిన బిల్లు **మొత్తంలో** కోతపడుతుంది. పాలసీదారుడు తనవంతు చెల్లించాల్సి వచ్చినప్పుడు విచారిస్తే వచ్చే**దేమీ** ఉండదు. ఇటువంటి కీలక అంశాలను వివరించే కథనమిది...



మన దేశంలో ఎక్కువ మంది హెల్త్ ఇన్సూరెన్స్‌ను పన్ను ఆదా కోణంలో తీసుకుంటూ ఉంటారు. పాలసీదారులకు సాధారణంగా కొన్ని ఫీచర్లపై అవగాహన ఉంటుంది. హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీని జీవితాంతం రెన్యువల్ చేసుకోవచ్చు. హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీలో మేటర్నిటీ ప్రయోజనాలు ఉంటాయి. నో క్లెయిమ్ బోనస్ ఉంటుందనే విషయాలపై సాధారణంగా అవగాహన ఉంటుంది. కానీ, ఎక్కువ మందికి తెలియని విషయం బ్లాక్ లిస్టెడ్ హాస్పిటల్స్ గురించి. మీరు కొనుగోలు చేయబోయే హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ ఎక్కువ ఆస్పత్రుల్లో చికిత్సలకు కవరేజీ ఇచ్చే విధంగా ఉండాలి. ఇంటి సమీపంలోని ఆస్పత్రిలో చికిత్స పొందినా కవరేజీ వస్తుందని కొందరు భావిస్తుంటారు. కానీ, ఇంటి సమీపంలోని హాస్పిటల్ బ్లాక్ లిస్ట్‌లో ఉంటే, అందులో నగదు రహిత చికిత్స కాదు కదా, ముందే డబ్బులు చెల్లించి తీసుకున్న చికిత్సకు సైతం రీయింబర్స్‌మెంట్ రాదు. ఎందుకంటే సదరు ఆస్పత్రిని బీమా సంస్థ బ్లాక్ లిస్ట్‌లో పెట్టడం వల్లేనని తెలుసుకోవాలి. అందుకనే హెల్త్ పాలసీ కొనుగోలు చేసే ప్రతి ఒక్కరూ ముందుగా బ్లాక్ లిస్టెడ్ హాస్పిటల్స్ జాబితా చూడాలి. అలాగే, మీరు నివాసం ఉండే ప్రాంతంలో నగదు రహిత చికిత్సలను అనుమతి ఉన్న ఎన్ని ఆస్పత్రులు బీమా సంస్థ నెట్‌వర్క్ హాస్పిటల్స్ జాబితాలో ఉన్నదీ చూడాలి. కొన్ని చిన్న ఆస్పత్రులు లేదా వ్యక్తులు చట్టవిరుద్ధమైన కార్యకలాపాలు నిర్వహిస్తుంటారు. మోసపూరిత క్లెయిమ్‌లు చేస్తుంటారు. అందుకని అన్ని బీమా సంస్థల పరిధిలో సొంతంగా ఓ ఇన్వెస్టిగేషన్ డెస్క్ ఉంటుంది. ఏదైనా ఒక ఆస్పత్రి నుంచి క్లెయిమ్‌లు భారీగా వస్తుంటే అప్పుడు సదరు ఆస్పత్రిపై ఓ కన్నేసి ఉంచాలని బీమా సంస్థ తన ఇన్వెస్టిగేషన్ డెస్క్‌ను కోరుతుంది. అప్పుడు సంబంధిత విభాగం క్లెయిమ్‌లు ఎక్కువగా వస్తున్న లేదా అనుమానాస్పద క్లెయిమ్‌లు ఎక్కువగా వస్తున్న ఆస్పత్రికి వెళ్లి **విచా**రణ నిర్వహిస్తుంది. తమ విచారణలో **వెలుగు** చూసిన అంశాల ఆధారంగా బీమా సంస్థ **తదుప**రి చర్యలు తీసుకుంటుంది. క్లెయిమ్‌ల వి**షయంలో** చట్టవిరుద్ధమైన చర్యలు లేదా నిబంధనల**కు వ్యతిరే**కంగా, మోసపూరితంగా వ్యవహరిస్తున్న**ట్టు తేలితే** ఆయా ఆస్పత్రిని నిషేధిత జాబితాలోకి **మారుస్తుం**ది. ఇలా బీమా సంస్థలు తాము నిషేధించిన, బ్లాక్ లిస్ట్‌లో పెట్టిన హాస్పిటల్స్ వివరాలను పాలసీదారులతో ఎప్పటికప్పుడు పంచుకుంటాయి.

వెయిటింగ్ పీరియడ్

హెల్త్ ఇన్సూరెన్స్ తీసుకున్న వెంటనే ఏ సమస్య వచ్చినా క్లెయిమ్ చేసుకుంటామంటే నిబంధనలు అంగీకరించవు. కొన్ని రకాల వ్యాధులకు వెయిటింగ్ పీరియడ్ వేర్వేరుగా ఉంటుంది. ఈ వివరాలు పాలసీ డాక్యుమెంట్‌లో వివరంగా ఉంటాయి. ఉదాహరణకు మెటర్నిటీ (ప్రసవం కోసం ఆస్పత్రిలో చేరడం) కవరేజీ అనేది చాలా పాలసీల్లో ఉన్నా, మొదటి రోజు నుంచే కవరేజీ వస్తుందనుకోవద్దు. ఇందుకోసం కనీసం 12 నెలలు అంతకుమించి వేచి ఉండే కాలం నిబంధన ఉంటుంది. ఆ తర్వాతే మెటర్నిటీ కవరేజీ క్లెయిమ్ చేసుకోగలరు. మరికొన్ని రకాల వ్యాధులకు 24 నెలల వెయిటింగ్ పీరియడ్ అమల్లో ఉంటుంది. పాలసీ తీసుకునే నాటికే వ్యాధులు కలిగి ఉంటే, వాటిని పాలసీ ప్రపోజల్‌లో వెల్లడించి ఉంటే, కవరేజీ పొందేందుకు 3–4 ఏళ్ల పాటు వేచి ఉండాల్సి వస్తుంది. ఔట్ పేషెంట్ డిపార్ట్‌మెంట్ (ఓపీడీ) సేవలకు అన్ని ప్లాన్లలో కవరేజీ ఉండదు. ఇది యాడాన్ కవరేజీగా వస్తుంది. హాస్పిటల్‌లో కనీసం 24 గంటల పాటు చేరి చికిత్స తీసుకుంటేనే ఇండెమ్నిటీ ప్లాన్‌లో క్లెయిమ్ చేసుకోవడానికి అర్హత లభిస్తుంది. డే కేర్ చికిత్సల కోసం అయితే ఆస్పత్రిలో ఇన్ని గంటల పాటు చేరాల్సిన అవసరం ఉండదు. అలా కాకుండా ఆస్పత్రిలో చేరి చికిత్స తీసుకునే వాటికి కనీసం 24 గంటల నిబంధన అమలవుతుంది. కనుక పాలసీదారులు మొదట బ్లాక్ లిస్ట్ హాస్పిటళ్లు, తర్వాత ఏ వ్యాధికి కవరేజీ కోసం ఎంత కాలం పాటు వేచి ఉండాలి, క్లెయిమ్ కోసం ఎంత సమయం పాటు ఆస్పత్రిలో చేరాలనే విషయాలను తెలుసుకోవాలి.

ఫీచర్లపై అవగాహన అవసరం

బీమా సంస్థ ఏదైనా హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీల్లో సాధారణ నిబంధనలు అన్నీ ఒకే విధంగా ఉంటాయి. కానీ, ఒక్కో బీమా సంస్థ తమ ఉత్పత్తిని ఆకర్షణీయంగా మార్చేందుకు కొన్ని అదనపు ఫీచర్లు, కవరేజీలను పాలసీల్లో భాగం చేస్తుంటాయి. ఉదాహరణకు రీస్టోరేషన్ ఫీచర్. దీన్ని చాలా సంస్థలు అందిస్తున్నాయి. ఒక ఏడాదిలో కుటుంబంలో ఒకరు ఆస్పత్రిలో చేరడం వల్ల బీమా మొత్తం ఖర్చయిపోయిందని అనుకోండి. అప్పుడు అదే ఏడాది మరో వ్యక్తి లేదా అదే వ్యక్తి మళ్లీ ఆసుపత్రిలో చేరాల్సి వస్తే? అలాంటి సందర్భాల్లో ఆదుకునేదే రీస్టోరేషన్ ఫీచర్. ఏదైనా క్లెయిమ్ కారణంగా బీమా కవరేజీ ఖర్చయిన సందర్భాల్లో బీమా సంస్థలు తిరిగి అంతే మొత్తాన్ని రీస్టోరేషన్ కింద పునరుద్ధరిస్తాయి. దీంతో అదే ఏడాది మరోసారి ఆస్పత్రిలో చేరాల్సి వచ్చినప్పుడు అది ఆదుకుంటుంది. కొన్ని బీమా సంస్థలు అయితే ఒక ఏడాదిలో ఎన్నిసార్లు ఇలా క్లెయిమ్‌లు వచ్చినా, అన్నిసార్లు రీస్టోరేషన్ ఫీచర్‌ను అందిస్తున్నాయి. సాధారణంగా ఒక వ్యక్తి ఒక వ్యాధి కారణంగా ఆసుపత్రిలో చేరి పూర్తి బీమా కవరేజీని క్లెయిమ్ పొందాడనుకుందాం. అప్పుడు అదే వ్యక్తి అదే వ్యాధితో హాస్పిటల్‌లో చేరితే రీస్టోరేషన్ కవరేజీని చాలా ప్లాన్లు ఇవ్వడం లేదు. కొన్ని మాత్రం ఒక వ్యక్తి ఒక వ్యాధి కారణంగా ఎన్ని సందర్భాలు ఆస్పత్రిలో చేరి చికిత్స పొందినా లేక మరో సమస్యతో చేరాల్సి వచ్చినా రీస్టోరేషన్ కింద కవరేజీని పునరుద్ధరిస్తున్నాయి. కనుక ఈ ఫీచర్ గురించి వివరంగా తెలుసుకున్న తర్వాతే ప్లాన్‌ను ఎంపిక చేసుకోవాలి.

తప్పక తెలిసి ఉండాలి..

ముందు నుంచి ఉన్న వ్యాధులు: అధిక రక్తపోటు, కేన్సర్, మధుమేహం, ఆస్తమా, డిప్రెషన్, స్లీప్ ఆప్నియా, గుండె జబ్బులు, మూత్ర పిండాల సమస్యలు, శ్వాసకోశ వ్యాధులు (సీవోపీడీ), స్థూలకాయం, లూపస్, అథెరోస్కెలరోసిస్, థైరాయిడ్ తదితర ఆరోగ్య సమస్య ఏదైనా కావచ్చు. పాలసీ కొనుగోలు చేసే నాటికి నాలుగేళ్ల ముందు వైద్యులు నిర్ధారించి, చికిత్స తీసుకున్నవి ముందస్తు వ్యాధుల జాబితాలోకి వస్తాయి. ముందస్తు వ్యాధుల సమాచారం కావాలని వెల్లడించకపోతే.. తర్వాత క్లెయిమ్ సమయంలో బీమా సంస్థ దీన్ని గుర్తిస్తే పరిహారాన్ని నిరాకరిస్తుంది. పాలసీ తీసుకుని ఎనిమిదేళ్లు ముగిసిన తర్వాత క్లెయిమ్ వస్తే అది ముందుగా వెల్లడించని వ్యాధి అయినా సరే తిరస్కరించడం కుదరదు. కనుక పాలసీ దరఖాస్తులో అంతకుముందుగా ఏదైనా ఆరోగ్య సమస్యలు ఎదుర్కొన్నా, చికిత్స తీసుకున్నా ఆ వివరాలను తప్పకుండా వెల్లడించడం మంచిది.

30 రోజుల వెయిటింగ్: పాలసీ విడుదల చేసిన తేదీ నుంచి మొదటి 30 రోజుల్లో ప్రమాదం లేదా ప్రమాదం కారణంగా తలెత్తే సమస్యలకే క్లెయిమ్ చేసుకోవచ్చు మరే విధమైన చికిత్సకూ క్లెయిమ్‌ను బీమా సంస్థలు అనుమతించవు.

స్పెసిఫిక్ వెయిటింగ్: ముందు నుంచి ఉన్న వ్యాధులు కాకుండా పాలసీ తీసుకున్న తర్వాత 24 నెలల వరకు క్లెయిమ్ చేసుకోలేని ఆరోగ్య సమస్యలు కొన్ని ఉన్నాయి. ఆర్థరైటిస్, గౌట్, రుమటాయిజం, జాయింట్ రీప్లేస్‌మెంట్, ఆర్థోస్కోపిక్ మోకాలు సర్జరీ, చెవి, ముక్కు, గొంతు సమస్యలు లేదా సర్జరీలు (సైనసైటిస్, అడెనాయిడ్స్), ప్రొస్టేటిక్ హైపర్‌ట్రోఫీ, క్యాటరాక్ట్, ఫిస్టులా, హెమరాయిడ్స్, గ్యాస్ట్రిక్ డుయోడినల్ అల్సర్లు, అన్ని రకాల హెర్నియా, హిస్టరెక్టమీ, ఫైబ్రోమయోమా, ట్యూమర్లు, కిడ్నీలో రాళ్లు, యూరెటెరిక్ స్టోన్స్, గ్లాల్ బ్లాడర్‌లో రాళ్లు, వారికోస్ వెయిన్స్, పార్కిసన్స్/అల్జీమర్స్/డిమెన్షియా తదితర వాటితో బీమా కంపెనీ డాక్యుమెంట్‌లో 24 నెలల వెయిటింగ్ జాబితా ఉంటుంది. వీటికి రెండేళ్ల తర్వాతే క్లెయిమ్ వస్తుంది.

శాశ్వత మినహాయింపులు: హెల్త్ ఇన్సూరెన్స్ ఉంది కదా, దేనికైనా పరిహారం వస్తుందిలేనని అనుకోవద్దు. కొన్నింటికి శాశ్వతంగా క్లెయిమ్ రాదు. వీటి జాబితా బీమా నియమ, నిబంధనల డాక్యుమెంట్‌లో ఉంటుంది. ఏదైనా వ్యాధి నిర్ధారణ కోసం ఆస్పత్రిలో చేరితే క్లెయిమ్ రాదు. వైద్యుల సిఫారసు లేకుండా బరువు తగ్గేందుకు సొంతంగా తీసుకునే చికిత్సలు, లింగమార్పిడి చికిత్సలు, కాస్మెటిక్ లేదా ప్లాస్టిక్ సర్జరీలకు (ప్రమాదం కారణంగా చేసుకోవాల్సిన వాటికి మినహాయింపు) క్లెయిమ్ రాదు.

మెటర్నిటీ వెయిటింగ్: సాధారణంగా మెటర్నిటీ కవరేజీ కోసం బీమా సంస్థలు ఏడాది నుంచి మూడేళ్ల పాటు వేచి చూడాలనే నిబంధన అమలు చేస్తున్నాయి.



వెయిటింగ్‌ను తగ్గించుకోవచ్చా..?

వేచి ఉండే కాలాన్ని తగ్గించుకునేందుకు చాలా బీమా సంస్థలు ప్రత్యేక రైడర్‌తో అవకాశం కల్పిస్తున్నాయి. ఇందుకు అదనపు ప్రీమియం చెల్లించాల్సి వస్తుంది. కొంత అదనపు ప్రీమియం చెల్లించడం ద్వారా ముందస్తు వ్యాధులకు కవరేజీని 2 ఏళ్లకు తగ్గిస్తున్నాయి. పాలసీ తీసుకున్న నాటి నుంచే ముందస్తు వ్యాధులకూ కవరేజీనిచ్చే కంపెనీలు కూడా ఉన్నాయి. గ్రూప్ హెల్త్ ప్లాన్‌లో దాదాపుగా వెయిటింగ్ పీరియడ్ ఉండడం లేదు. వేచి ఉండే కాలంలో కొత్తగా నిర్ధారణయ్యే వ్యాధులను ముందు నుంచి ఉన్నవిగా పరిగణించరు.

సమీప బంధువులకు షేర్ చేయాలి..

ఆస్పత్రిలో చేరిన వెంటనే బీమా సదుపాయం ఉందా? అని అక్కడ సిబ్బంది ప్రశ్నించడం వినే ఉంటారు. తమకు హెల్త్ ఇన్సూరెన్స్ ఉందని చెబితే, అందులో చికిత్స వ్యయాలకు ఎంత మేర కవరేజీ వస్తుంది? రాదనే విషయాలను వారు చెబుతారు. ముందుగా నిర్ణయించుకుని తీసుకునే చికిత్సల విషయంలో కవరేజీ గురించి పూర్తిగా తెలుసుకోవాలి. లేదంటే డిశ్చార్జ్ సమయంలో ఇబ్బందులు ఎదుర్కోవాల్సి రావచ్చు. ఎందుకంటే సాధారణంగా పాలసీదారులు చికిత్స తీసుకోవాల్సి వచ్చినప్పుడు వారు ఆస్పత్రిలో చేరగా, వారి సంబంధీకులు బీమా తదితర వ్యవహారాలు చూస్తుంటారు. వారికి కవరేజీ విషయమై అవగాహన ఉండదు. అందుకని పాలసీదారులు తమ బీమా క్లెయిమ్‌కు సంబంధించి తమ కుటుంబ సభ్యులు, సమీప బంధువులకు కొన్ని ఫీచర్లు, ముఖ్యమైన అంశాల గురించి తప్పకుండా చెప్పాలి. అందులో ముఖ్యమైనది రూమ్‌రెంట్ కవరేజీ. రూమ్ రెంట్‌కు ఎలాంటి పరిమితులు లేనట్టయితే అది చెప్పాల్సిన అవసరం లేదు. ఒకవేళ షేర్డ్ రూమ్, సింగిల్ రూమ్ అని నిబంధన ఉంటే మిమ్మల్ని ఆస్పత్రిలో ఆయా వసతుల్లోనే చేర్చాలని సూచించాలి. పాలసీలో చెప్పినదానికంటే ఖరీదైన వసతి తీసుకుంటే బిల్లు ఎక్కువ వస్తుంది. దాంతో ఆ మేరకు బీమా సంస్థ క్లెయిమ్ మొత్తాన్ని తగ్గిస్తుంది. అప్పుడు మిగిలినది పాలసీదారు చెల్లించాల్సి వస్తుంది. ముందు నుంచి వ్యాధులు ఉండి, వాటిని పాలసీ దరఖాస్తులో వెల్లడించి ఉంటే వాటి గురించి వివరంగా చెప్పాలి. లేదంటే లిఖితపూర్వకంగా ఈ విషయాలను ఒక పేపర్‌పై రాసి ఇవ్వడం మంచి నిర్ణయం అవుతుంది. హాస్పిటల్ క్యాష్ ఫీచర్ ఉంటే అది కూడా తప్పకుండా చెప్పాలి. హాస్పిటల్ క్యాష్ అనేది.. చికిత్స కోసం ఆసుపత్రిలో పాలసీదారు చేరినప్పుడు, వారికి సహాయంగా ఉండే వారికి రోజువారీ చెల్లింపులు చేస్తుంది. ఇది రోజువారీ రూ.500 నుంచి రూ.2,000 మధ్య ఉంటుంది. రీస్టోరేషన్ గురించి కూడా చెప్పాలి. హాస్పిటల్ క్యాష్ బెనిఫిట్ అనేది కొన్ని ప్లాన్లలో ఇన్‌బిల్ట్‌గా ఉంటే, కొన్నింటిలో యాడాన్ కవర్‌గా వస్తోంది.



వృద్ధులకు బీవోఐ ప్రత్యేక డిపాజిట్ స్కీమ్

ముంబై: వృద్ధులకు ఆర్థికంగా మరింత రక్షణ అవసరం కావడంతో, దీన్ని దృష్టిలో పెట్టుకుని 'శుభ్ ఆరంభ్ డిపాజిట్' స్కీమ్‌ను బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది. 60 ఏళ్లు నిండిన వృద్ధుల కోసం తీసుకొచ్చిన ఈ డిపాజిట్ పథకంలో అదనంగా 0.50 శాతం రేటును ఆఫర్ చేస్తున్నట్టు తెలిపింది. 80 ఏళ్లు నిండిన వారికి 0.65 శాతం అదనంగా ఇస్తున్నట్టు ప్రకటించింది. 501 రోజుల ఈ డిపాజిట్ స్కీమ్‌లో 60 ఏళ్లు నిండిన వారికి వడ్డీ రేటు 7.65 శాతం, 80 ఏళ్లు నిండిన వారికి 7.80 శాతం లభిస్తుంది. ఇక 7-10 ఏళ్ల కాల వ్యవధుల డిపాజిట్లపైనా ఆకర్షణీయమైన వడ్డీ రేటును ఆఫర్ చేస్తున్నట్టు బ్యాంక్ ఆఫ్ ఇండియా ప్రకటించింది.

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)	
1-5-2023	
విశాఖ	425-00
చిత్తూరు	463-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	420-00
విజయవాడ	420-00
రిటైల్ ధర (డజను)	66.00
30-4-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	400-00
వరంగల్	402-00
రిటైల్ ధర	4.60

స్టాక్స్ వ్యూ

ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ | ఐసీఐసీఐ సెక్యూరిటీస్ | **కొనొచ్చు**

ప్రస్తుత ధర: రూ. 2,022 **టార్గెట్:** రూ. 2,415

ఎందుకంటే: గత ఆర్థిక సంవత్సరం చివరి త్రైమాసికం(జనవరి–మార్చి)లో రూ. 300 కోట్ల పన్నుకు ముందు లాభం(పీబీటీ) ఆర్జించే వీలుంది. ఇక పూర్తి ఏడాది(2022–23)కి ఫారెక్స్ ప్రభావం తదుపరి రూ. 2,300 కోట్ల పీబీటీ సాధించవచ్చని అంచనా. విమానయాన రంగంలో ప్రత్యర్థి సంస్థలతో పోటీలో ముందంజలో ఉండటమేకాకుండా పటిష్ట వ్యవస్థాగత డిమాండు నుంచి కంపెనీ లబ్ధి పొందనుంది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరం(2023–24)లో 15 శాతంపైగా ఏఎస్‌కే(అవైలబుల్ సీట్ కిలోమీటర్) వృద్ధిపై కంపెనీ దృష్టి పెట్టింది. 2030కల్లా విమానాల సంఖ్యను రెట్టింపునకు పెంచుకునే ప్రణాళికల ద్వారా వృద్ధిని అందుకోవాలని చూస్తోంది. విమానం ప్రయాణించే కిలోమీటర్లతో అందుబాటులోని సీట్ల సంఖ్యతో గుణిస్తారు. తద్వారా ప్రయాణికుల రవాణా సామర్థ్యం ఏఎస్‌కేని మదింపు చేస్తారు. వీటికితోడు అంతర్జాతీయ సంస్థలతో చేతులు కలపడం(ఇంటర్నేషనలైజేషన్) ద్వారా రానున్న రెండేళ్లలో ఏఎస్‌కే వృద్ధిని 30 శాతానికి పెంచుకునే ప్రణాళికలు వేసింది. చౌక ధరలు, అవాంతరాలు లేని సర్వీసులు, సమయానుగుణ నిర్వహణ వంటి అంశాల ద్వారా తాజా లక్ష్యాలను చేరుకోవాలని భావిస్తోంది. సీజనల్‌గా క్యూ4లో మెరుగైన పనితీరును చూపనుంది. 2022–23లో 11,300 ఏఎస్‌కే సాధించవచ్చని అంచనా.

అహ్లువాలియా కాంట్రాక్ట్స్ | యాక్సిస్ సెక్యూరిటీస్ | **కొనొచ్చు**


ప్రస్తుత ధర: రూ. 516 **టార్గెట్:** రూ. 610

ఎందుకంటే: ప్రస్తుతం సర్దుబాటు చేయని ఆర్డర్ బుక్ విలువ రూ. 9,500 కోట్లకు చేరింది. అయితే దీనిలో కంపెనీ ఇటీవల ఎల్1 పొందిన సీఎస్‌ఎంటీ స్టేషన్ పునరాభివృద్ధి ప్రాజెక్టు(విలువ రూ. 2,450 కోట్లు)ను పరిగణనలోకి తీసుకోలేదు. అయినప్పటికీ ఆర్డర్‌బుక్ విలువ కంపెనీ చరిత్రలోనే గరిష్ట స్థాయికి చేరుకుంది! వెరసి రానున్న మూడేళ్ల కాలంలో కంపెనీ ఆదాయ ఆర్జనను ఇది ప్రతిబింబిస్తోంది. ప్రాంతాలవారీగా చూస్తే ఆర్డర్లలో తూర్పు నుంచి 42 శాతం, ఉత్తరాది నుంచి 36 శాతం చొప్పున లభించాయి. ఈ బాటలో పశ్చిమ ప్రాంతాల నుంచి 12 శాతం, దక్షిణాది నుంచి 5 శాతం, విదేశాల నుంచి మరో 5 శాతం చొప్పున ఆర్డర్లు పొందింది. ప్రభుత్వ రంగం నుంచి ప్రాజెక్టులు ఆర్డర్‌బుక్‌లో 82 శాతం వాటాను ఆక్రమిస్తుండగా.. మిగిలిన 18 శాతం వాటాను ప్రయివేట్ రంగం నుంచి అందుకుంది. ప్రోత్సాహకర ఆర్డర్లబుక్‌కుతోడు, పటిష్ట లిక్విడిటీ పొజిషన్, నైపుణ్యం కలిగిన యాజమాన్య బలిమి వంటి అంశాలు కంపెనీ భవిష్యత్ వృద్ధికి దోహదం చేయనున్నాయి. 2022–25 మధ్యకాలంలో వార్షికంగా కంపెనీ ఆదాయం 15 శాతం, నిర్వహణ లాభం(ఇబిటా) 20 శాతం, నికర లాభం 23 శాతం చొప్పున పురోగతిని సాధించగలవని అంచనా.

గమనిక: ఈ కాలమ్‌లో షేర్లపై ఇచ్చిన సలహాలు, సూచనలు, వివిధ బ్రోకరేజీ సంస్థలు వ్యక్తం చేసిన అభిప్రాయాలు మాత్రమే

పెట్టుబడులపై గరిష్ట రాబడులు ఎలా?

Q & A



ధీరేంద్ర కుమార్
సీఈవో, వ్యాల్యూ రీసెర్చ్

నా వయసు 38 ఏళ్లు. కార్పొరేట్ రంగంలో పనిచేస్తున్నాను. 40 ఏళ్లకే రిటైర్మెంట్ తీసుకోవాలన్నది నా ప్రణాళిక. కనుక రిటైర్మెంట్ కోసం ఎంత ఫండ్ కావాలో తెలుసుకుందామంటే ఆన్‌లైన్‌లో ఎన్నో రిటైర్మెంట్ కాలిక్యులేటర్లు ఉన్నాయి. వీటిల్లో కచ్చితమైన నంబర్లు చూపించేది ఏదైనా ఉందా?

– విష్ణు నివాస్

ద్రవ్యోల్బణాన్ని విస్మరించడానికి లేదు. ద్రవ్యోల్బణం మీ జీవన వ్యయాలను పెంచుతుంది. రిటైర్మెంట్‌కు ఎంత కావాలనే విషయాన్ని ఇదే క్లిష్టంగా మార్చేస్తుంది. ఇందుకోసం ఓ ఆచరణాత్మక సూత్రాన్ని అనుసరించొచ్చు. ప్రస్తుతం వార్షిక వ్యయాలు ఎంత? ఈ మొత్తానికి ఏటా 6 శాతం ద్రవ్యోల్బణాన్ని రిటైర్మెట్ పీరియడ్ వరకు కలపాలి. రిటైర్మెంట్ తర్వాత జీవించి ఉండే కాలంతో (అంచనా) దీన్ని హెచ్చించాలి. ఉదాహరణకు ప్రస్తుతం మీకు నెలవారీ ఖర్చులు రూ.50వేలు ఉన్నాయనుకుంటే, ఏడాదికి రూ.6 లక్షలు అవుతుంది. పదేళ్లలో రిటైర్ అవుతారు. ఈ పదేళ్ల కాలానికి 6 శాతం ద్రవ్యోల్బణం కలిపి చూస్తే ప్రస్తుతం ఉన్న వార్షిక జీవన వ్యయం రూ.6 లక్షలు కాస్తా, పదేళ్ల తర్వాత 10.74 లక్షలకు పెరుగుతుంది. మీరు 48 ఏళ్లకు రిటైర్మెంట్ తీసుకుని, 80 ఏళ్ల వరకు జీవించి ఉంటారని అనుకుంటే, అప్పుడు రిటైర్మెంట్ తర్వాత 32 ఏళ్ల జీవన కాలం ఉంటుంది. 32 ఏళ్లను వార్షిక జీవన వ్యయం 10.74 లక్షలతో లెక్కిస్తే అప్పుడు రూ.3.44 కోట్లు అవుతుంది. ఈ మొత్తం రిటైర్మెంట్ ఫండ్‌గా కావాల్సి ఉంటుంది. క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేస్తూ వెళితే ఈ మొత్తం సమకూరుతుంది. దీర్ఘకాలం లక్ష్యాలకు ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయాల్సి ఉంటుంది. డెట్ ఆధారిత సాధనాలైన ప్రావిడెంట్ ఫండ్, ఫిక్స్‌డ్ డిపాజిట్లు తగినవి కావు.

నేను రూ.30 లక్షలు ఇన్వెస్ట్ చేద్దామని అనుకుంటున్నాను. గరిష్ట రాబడులు రాబట్టుకోవడం ఎలా?

– కేశవ్ జాదవ్

సంపద వృద్ధి చెందడానికి పెట్టుబడి ఒక మార్గం. ఒక ఇన్వెస్టర్‌గా మీ లక్ష్యం గరిష్ట రాబడి ఒక్కటే కాకూడదు. దీనికి బదులు మెరుగైన రాబడుల కోసం పెట్టుబడుల విషయంలో కొన్ని టిప్స్ అనుసరించొచ్చు. ముందుగా సరైన పెట్టుబడి సాధనాన్ని ఎంపిక చేసుకోవాలి. కేవలం రాబడి కోణంలోనే పెట్టుబడి సాధనాన్ని ఎంపిక చేసుకుంటే అది నష్టానికి దారితీయవచ్చు. అందుకుని ప్రతీ పెట్టుబడి ఆప్షన్‌కు ముందు సానుకూల, ప్రతికూలతలను చూడాలి. ఈక్విటీ పథకాలు స్వల్పకాలంలో అధిక రాబడులు ఇవ్వగలవు. కానీ అది కచ్చితం అని చెప్పలేం. పైగా అస్థిరతలు ఎక్కువ. మార్కెట్ ఏ సమయంలో అయినా దిద్దుబాటుకు గురికావచ్చు. అత్యవసర పరిస్థితుల్లో మార్కెట్లు కరెక్షన్‌కు లోనై ఉంటే అప్పుడు నష్టానికి అమ్ముకోవాల్సి వస్తుంది. అందుకుని స్వల్పకాలానికి ఈ తరహా రిస్క్‌ను అధిగమించేందుకు డెట్ సాధనాలను ఎంపిక చేసుకోవాలి. ఈక్విటీ పెట్టుబడులు ఐదేళ్లు, అంతకుమించిన కాలానికి ఉండాలి. ఇక మీ పెట్టుబడులను వివిధ రకాల మ్యూచువల్ ఫండ్స్‌లో పెట్టుకోవడం ద్వారా వైవిధ్యం ఉండేలా చూసుకోవాలి. ఒకవేళ ఏదైనా ఫండ్ బలహీన పనితీరు చూపిస్తే, మరో ఫండ్ మంచి పనితీరుతో రాబడుల్లో స్థిరత్వం ఉంటుంది. క్రమం తప్పకుండా ఇన్వెస్ట్ చేసుకోవడం మరో మార్గం. ఇందుకు సిప్‌ను ఎంపిక చేసుకోవచ్చు. దీనివల్ల స్వల్ప కాలంలో పెట్టుబడులపై మార్కెట్ కరెక్షన్ల ప్రభావాన్ని అధిగమించొచ్చు. చివరిగా అస్సెట్ అలోకేషన్‌ను పాటించాలి. డెట్, ఈక్విటీల్లో ఇన్వెస్ట్ చేయడంతోపాటు, వాటిని ఏడాదికోసారి సమీక్షించుకోవాలి. మీ లక్ష్యాలు, రిస్క్ సామర్థ్యానికి అనుగుణంగా డెట్, ఈక్విటీ కేటాయింపుల్లో మార్పులు చేసుకోవాలి.



క్లుప్తంగా...

'సమాచార' స్పెషల్ కమిషనర్‌గా అశోక్ రెడ్డి బాధ్యతలు



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర సమాచార, పౌర సంబంధాల శాఖ ప్రత్యేక కమిషనర్‌గా కోరం అశోక్ రెడ్డి ఆదివారం డా.బి.ఆర్.అంబేడ్కర్ తెలంగాణ సచివాలయం రెండవ అంతస్తులోని తన సాధారణ పరిపాలన శాఖ కార్యదర్శి కార్యాలయంలో బాధ్యతలు స్వీకరించారు. ప్రారంభోత్సవం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం శాఖ స్పెషల్ కమిషనర్‌గా, రాష్ట్ర చలనచిత్ర అభివృద్ధి సంస్థ మేనేజింగ్ డైరెక్టర్‌గా, ఈఓట కార్యదర్శిగా బాధ్యతలు చేపట్టారు. ఆయనకు శాఖ డైరెక్టర్ రాజమౌళి, అడిషనల్ డైరెక్టర్ నాగయ్య కాంబ్లే, జాయింట్ డైరెక్టర్లు జగన్, శ్రీనివాస్, కె.వెంకట రమణ, డిప్యూటీ డైరెక్టర్లు మధుసూదన్, హష్మీ అభినందించారు.


కరాటేను సి నుంచి ఏ-కేటగిరీకి మార్చాలి

టీఎస్‌కేడీఏ అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్



సాక్షి, హైదరాబాద్: ప్రాచుర్యంతో పాటు క్రేజ్ ఉన్న కరాటే క్రీడకు రాష్ట్ర ప్రభుత్వం తగినంత ప్రోత్సాహం ఇవ్వాలని తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ అధ్యక్షుడు బి.మహేశ్‌కుమార్‌గౌడ్ కోరారు. ప్రస్తుతం సీ-కేటగిరీలో ఉన్న ఈ క్రీడను ఏ-కేటగిరీలోకి మార్చాలని విజ్ఞప్తి చేశారు. తెలంగాణ స్పోర్ట్స్ కరాటే డో అసోసియేషన్ ఆధ్వర్యంలో రిఫరీ సెమినార్-2023 గాంధీభవన్‌లో ఆదివారం జరిగింది. కరాటే క్రీడలో మారిన నిబంధనలపై ఈ సెమినార్‌లో అవగాహన కల్పించారు. అనంతరం మహేశ్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. కరాటే శారీరకంగా దృఢంగా ఉంచడంతో పాటు తెలివిని కూడా పెంచుతుందన్నారు. అలాంటి క్రీడ పట్ల లక్షలాది మంది బాలబాలికలకు ఆసక్తి ఉందని, అయితే ప్రభుత్వం తగినంత ప్రోత్సాహమిస్తే ఈ క్రీడ ముందుకెళుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఏషియన్ కరాటే ఫెడరేషన్ రిఫరీ విజయ్‌కుమార్, సీనియర్ కరాటే మాస్టర్లు శ్రీనివాసన్, సుదర్శన్, రామస్వామి, కనకరాజ్, జహంగీర్ తదితరులు పాల్గొన్నారు.

అడ్వాన్స్‌డ్ ఆషామాషీ కాదు



జూన్ 4న జేఈఈ అడ్వాన్స్‌డ్ పరీక్ష
- కష్టపడకపోతే గట్టెక్కడం తేలిక కాదంటున్న నిపుణులు
- మంచి ర్యాంకు వస్తేనే ప్రతిష్టాత్మక ఐఐటీల్లో సీటు
- సబ్జెక్టుల్లో పూర్తి స్థాయి పట్టు అవసరమని సూచన

సాక్షి, హైదరాబాద్: జేఈఈ మెయిన్స్ ఫలితాల తర్వాత ఇప్పుడు అందరి దృష్టీ అడ్వాన్స్‌డ్‌పై ఉంది. దేశవ్యాప్తంగా 2.5 లక్షల మంది అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించారు. ఈ పరీక్ష జూన్ 4వ తేదీన జరగనుంది. దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమయ్యింది. అయితే కష్టపడకపోతే అడ్వాన్స్‌డ్‌లో గట్టెక్కడం అంత తేలికైన విషయమేమీ కాదని నిపుణులు అంటున్నారు. మంచి ర్యాంకు సాధిస్తేనే ప్రతిష్టాత్మక ఐఐటీల్లో ఇంజనీరింగ్ చేసే అవకాశం దక్కుతుందని, ఇందుకోసం పూర్తిస్థాయిలో సబ్జెక్టులపై పట్టు సాధించాల్సి ఉంటుందని చెబుతున్నారు. 99 పర్సంటైల్ వచ్చిన వాళ్ళ సంఖ్య ఈసారి వేలల్లో ఉంది కాబట్టి అడ్వాన్స్‌డ్‌లో నెట్టుకురావాలంటే ప్రిపరేషన్ గట్టిగా ఉండాలని స్పష్టం చేస్తున్నారు.

గణితంపై దృష్టి పెట్టాల్సిందే

జేఈఈ మెయిన్స్‌లో గణితం పేపర్ ప్రతి ఏటా కఠినంగానే ఉంటోంది. అడ్వాన్స్‌డ్‌లో ఇది మరింత కష్టంగా ఉంటోంది. ప్రతి సబ్జెక్టుకూ 120 మార్కులుంటాయి. అయితే గణితంలో 20 మార్కులు సాధించడం గగనమవుతోంది. గత సంవత్సరం అడ్వాన్స్‌డ్ రాసిన వాళ్ళల్లో ఈ మేరకు సాధించినవారు కేవలం 1,200 మంది మాత్రమే ఉన్నారు. ఇక రసాయన శాస్త్రంలో 20 మార్కులు దాటిన వాళ్ళు 2 వేలు, భౌతిక శాస్త్రంలో 4 వేల మంది ఉన్నారు. అడ్వాన్స్‌డ్‌కు అర్హత సాధించిన 2.5 లక్షల మందిలో ఐఐటీ సీట్లకు కేవలం 55 వేల మందినే ఎంపిక చేస్తారు. అందువల్ల వడపోత కఠినంగానే ఉంటుంది. ఈసారి ఎక్కువమంది జేఈఈ మెయిన్స్ రాయడంతో కటాఫ్ కూడా పెరిగింది. కాబట్టి వడపోతకు వీలుగా అడ్వాన్స్‌డ్ పేపర్లు కాస్త కఠినంగానే ఉండే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు.

బోంబేదే హవా

ఐఐటీల్లో బోంబేకే విద్యార్థులు ఎక్కువ ప్రాధాన్యమిస్తారు. ఇందులో సీటు కోసం పోటీ పడుతుంటారు. తొలి 50 ర్యాంకుల్లో 46 మంది బోంబేలోనే చేరడం గమనార్హం. మొదటి వెయ్యి ర్యాంకుల్లో 246 మంది ఇక్కడ ప్రవేశం పొందారు. గత ఏడాది 3,310 మంది బాలికలకు ఇందులో సీట్లు దక్కాయి. ఇక అత్యధికంగా తిరుపతి ఐఐటీలో 20.7 శాతం మంది సీట్లు పొందారు. అతి తక్కువగా ఐఐటీ ఖరగ్‌పూర్‌లో 17.7 మంది సీట్లు పొందారు. విదేశీ విద్యార్థులు 145 మంది అడ్వాన్స్‌డ్‌లో ఉత్తీర్ణులైతే 66 మంది మాత్రమే ప్రవేశాలు పొందారు. కాగా తొలి వెయ్యి ర్యాంకుల్లో ఢిల్లీలో 210, మద్రాసులో 110, కాన్పూర్‌లో 107, ఖరగ్‌పూర్‌లో 93, గువాహటిలో 66, రూర్కీలో 60, హైదరాబాద్‌లో 40, వారణాసిలో 31, ఇండోర్‌లో ఏడుగురు, రోవర్‌లో ఒకరు చేరారు.

జేఈఈ అడ్వాన్స్‌డ్‌కు అర్హత మార్కుల తీరు 2017 నుంచి ఈ విధంగా ఉంది..

కేటగిరీ	2023	2022	2021	2020	2019	2018	2017
జనరల్	90	55	63	69	93	90	128
ఈడబ్ల్యూఎస్	75	50	56	62	83	81	115
ఓబీసీ	73	50	56	62	83	45	64
ఎస్సీ	51	28	31	34	46	45	64
ఎస్టీ	37	28	31	34	46	45	64
పీడబ్ల్యూడీ	75	28	31	34	46	45	64

నకిలీ వెబ్‌సైట్లు తొలగింపు

యాప్‌లు, కాల్ సెంటర్లు కూడా గుర్తింపు
- మన దేశంతో పాటు విదేశాల నుంచి నిర్వహణ
- ఎక్కడికక్కడ కట్టడి చేస్తున్న సైబరాబాద్ సీఓఈ
- ఇప్పటివరకు వందకు పైగా వెబ్‌సైట్లు రద్దు



సాక్షి, హైదరాబాద్: సైబర్ నేరాలకు ప్రధాన వేదిక నకిలీ వెబ్‌సైట్లు, మొబైల్ అప్లికేషన్లే (యాప్స్). దీంతో వాటిని కూకటివేళ్లతో సహా తొలగించి తద్వారా సైబర్ నేరాలను పెకిలించేందుకు సైబరాబాద్ పోలీసులు పక్కా వ్యూహాన్ని అమలు చేస్తున్నారు. సైబరాబాద్‌లోని సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ (సీఓఈ) ద్వారా నకిలీ వెబ్‌సైట్లు, యాప్‌లను గుర్తించి, ఎక్కడికక్కడే కట్టడి చేస్తున్నారు. ఇప్పటివరకు సీఓఈ ద్వారా వందకు పైగా ఫేక్ సైట్లను తొలగించారు.

విదేశాల నుంచి కూడా..

విదేశాలతో పాటు మహారాష్ట్ర, ఢిల్లీ, బీహార్, ఉత్తరాఖండ్, కర్ణాటక, జార్ఖండ్ వంటి రాష్ట్రాల నుంచి ఎక్కువగా సైబర్ నేరస్తులు నకిలీ వెబ్‌సైట్లు, కాల్ సెంటర్లు నిర్వహిస్తున్నట్లు పోలీసులు గుర్తించారు. నేరస్తులు నకిలీ యాప్‌లను అభివృద్ధి చేసి, ప్లే స్టోర్లలో అందుబాటులో ఉంచుతున్నారు. అవి నకిలీవని తెలియక చాలా మంది కస్టమర్లు వాటిని డౌన్‌లోడ్ చేసుకొని మోసపోతున్నారు. అందుకే పక్కా ఆధారాలతో నకిలీ సైట్లు, యాప్‌లను తయారు చేసే వారిని గుర్తించి, శిక్షలు పడేలా చేస్తున్నారు.

ప్రతీ స్టేషన్‌లో సైబర్ వారియర్లు..

ప్రస్తుతం సైబర్ పోలీసు స్టేషన్‌తో పాటు ప్రతి శాంతి భద్రతల ఠాణాలోనూ ఇద్దరు సైబర్ వారియర్లు ఉన్నారు. వీరికి ఎస్ఐ నేతృత్వం వహిస్తారు. వీరికి సైబర్ నేరాల నియంత్రణపై శిక్షణ ఇప్పిస్తున్నారు. ప్రజలు తమ వ్యక్తిగత సమాచారాన్ని సామాజిక మాధ్యమాలలో పెట్టడం కూడా సైబర్ నేరస్తులకు అవకాశంగా మారుతోంది. అవగాహనే సైబర్ నేరాలకు నియంత్రణకు ప్రధాన అస్త్రం. అందుకే కమిషనరేట్ పరిధిలో నివాసిత సంఘాలు, కంపెనీలు, పరిశ్రమలు, విద్యా సంస్థలలో విస్తృత స్థాయిలో అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఫేస్‌బుక్, ట్విట్టర్ వంటి సామాజిక మాధ్యమాలలోనూ సైబర్ నేరాలపై షార్ట్ వీడియో, పోస్టులు చిత్రీకరించి ప్రచారం చేస్తున్నారు.

ఎయిమ్స్‌లో చేరిన కిషన్‌రెడ్డి

న్యూఢిల్లీ: కేంద్ర పర్యాటక, సాంస్కృతిక శాఖ మంత్రి జి.కిషన్‌రెడ్డి ఆదివారం ఎయిమ్స్‌లో చేరారు. ఛాతీలో ఇబ్బంది కారణంగా రాత్రి 10.30 గంటల సమయంలో ఆయన్ను ఆస్పత్రిలో చేర్చినట్లు తెలుస్తోంది. కార్డియో న్యూరో సెంటర్‌లోని కార్డియాక్ కేర్ యూనిట్‌లో కిషన్‌రెడ్డి చికిత్స పొందుతున్నట్లు ఎయిమ్స్ వర్గాలు వెల్లడించాయి.

లీకేజీకి బాధ్యతగా సీఎం తప్పుకోవాలి

ఉస్మానియా యూనివర్సిటీ (హైదరాబాద్): రాష్ట్రంలో ప్రభుత్వోద్యోగాలను భర్తీ చేసే ఉద్దేశం సీఎం కేసీఆర్‌కు లేదని ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షుడు మందకృష్ణ మాదిగ విమర్శించారు. టీఎస్‌పీఎస్సీ పేపర్ లీకేజీకి సీఎం నైతిక బాధ్యత వహించి పదవి నుంచి తప్పుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఓయూ జేఏసీ ఆధ్వర్యంలో మే 3 నుంచి చేపట్టనున్న తెలంగాణ రాష్ట్ర వర్సిటీల విద్యార్థి నిరుద్యోగ భరోసా యాత్ర వాల్‌పోస్టర్‌ను మందకృష్ణ మాదిగ ఆదివారం ఆవిష్కరించి మద్దతు ప్రకటించారు.

జన్‌కీ బాత్‌గా ప్రజల గుండెల్లో..

మన్ కీ బాత్‌పై కిషన్ రెడ్డి

సాక్షి, న్యూఢిల్లీ: పీఎం నరేంద్రమోదీ మన్ కీ బాత్ కార్యక్రమం.. జన్ కీ బాత్ (ప్రజావాణి), దేశ్ కీ బాత్ (దేశ వాణి)గా ప్రజల గుండెల్లో చోటు దక్కించుకుందని కేంద్ర సాంస్కృతిక, పర్యాటక, ఈశాన్య రాష్ట్రాల అభివృద్ధి శాఖ మంత్రి జి.కిషన్ రెడ్డి అన్నారు. మన్ కీ బాత్ వందో ఎపిసోడ్‌ను పురస్కరించుకుని ఢిల్లీలోని నేషనల్ గ్యాలరీ ఆఫ్ మోడ్రన్ ఆర్ట్ ప్రాంగణంలో మన్ కీ బాత్ కార్యక్రమంలో మోదీ ప్రస్తావించిన పలు అంశాల ఆధారంగా ఆర్ట్ ఎగ్జిబిషన్‌ను ఏర్పాటు చేశారు. ఆదివారం సాయంత్రం కేంద్ర సాంస్కృతిక శాఖ సహాయ మంత్రి మీనాక్షి లేఖితో కలిసి మంత్రి కిషన్ రెడ్డి ఈ గ్యాలరీని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన సంక్షేమ పథకాల గురించి ప్రజలకు సమర్థవంతంగా తెలియజేయడంలో మన్ కీ బాత్ ఎంతో సానుకూల ప్రభావాన్ని చూపించిందన్నారు. అనంతరం, దేశంలోని వివిధ ప్రాంతాలకు చెందిన ప్రముఖ కళాకారుల.. కళారూపాలతో రూపొందించిన గ్యాలరీని కిషన్‌రెడ్డి ప్రారంభించారు. కార్యక్రమంలో ప్రముఖ కళాకారిణి పద్మశ్రీ అంజోలీ ఇలా మీనన్, అంబాసిడర్లు పాల్గొన్నారు.

అప్పుడే పుట్టిన శిశువుకు సీపీఆర్

పసికందుకు ప్రాణం పోసిన 108 వాహన సిబ్బంది

కీసర: నెలలు పూర్తిగా నిండకుండా.. గుండె చప్పుడు లేకుండా అప్పుడే పుట్టిన మగబిడ్డకు సీపీఆర్ చేసి కీసర 108 సిబ్బంది ప్రాణాలు కాపాడారు. వివరాలివి. కుందన్‌పల్లిలోని కోళ్లఫాంలో పనిచేసే ఆర్తికుమారి పురిటినొప్పులతో కీసరలోని ఒక ప్రైవేటు ఆసుపత్రిలో చేరింది. ఆమెను పరీక్షించిన వైద్యులు నెలలు పూర్తిగా నిండకపోవడం.. పుట్టబోయే బిడ్డ ఎదుగుదల సరిగ్గా లేనందున గాంధీ ఆసుపత్రికి తీసుకెళ్లాలని సూచించారు. గర్భిణిని 108 వాహనంలో తరలిస్తుండగా మార్గమధ్యలో నొప్పులు ఎక్కువయ్యాయి. వెంటనే ఈఎంటీ చిత్రం రవి వాహనంలోనే ఆమె సుఖప్రసవం చేశారు. పుట్టిన మగబిడ్డ బరువు తక్కువగా ఉండి నాడి, శ్వాస గుండెచప్పుడు లేకపోవడం గమనించి ఈఆర్‌సీపీ వైద్యుడు మహీద్‌ను ఫోన్లో సంప్రదించారు.



సీపీఆర్ చేసిన అనంతరం బిడ్డను కుటుంబసభ్యులకు అప్పగిస్తున్న సిబ్బంది

ఆయన సూచన మేరకు బిడ్డకు సీపీఆర్ చేసి అంబు బ్యాగ్‌తో శ్వాస అందిస్తూ గాంధీ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అక్కడి వైద్యులు పరీక్షించి సకాలంలో సీపీఆర్ చేయడం వల్ల బిడ్డకు ప్రాణాపాయం తప్పింది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.